I 3-40

కళ్యాణీ ప్రచురణ 8

సాలీడు సందేశం

(చిన్న పిల్లల నవల)

గ్రంథాలయం

ఆంగ్లమూలం :

శ్రీ ఇ. బి. వైట్

అనువాదం :

శ్రీమాన్ బి. వి. సింగరాచార్య

చిత్రాలు :

1. శ్రీ గార్త్ విలియమ్స్
2. శ్రీ కొత్తపల్లి సుబ్రహ్మణ్యం

కళ్యాణీ ప్రచురణలు

విశాఖపట్టణం—3

ప్రథమ ముద్రణ 1958
ప్రతులు 3,000

సర్వస్వామ్య సంకలితము

వెల రు. **1=50**

Copyright, 1952, by E. B. White

Sri Ranga Printing Works (Power Printers) visakha

స్వవిషయం

కళ్యాణీ ప్రచురణలలో ఇది మూడవది. మా తొలి ప్రచురణలైన "ప్రపంచ కథావళి" (జానపద కథల సంపుటి) ని, "ఎర్ర గుర్రపు పిల్ల" (జాన్ స్టైన్ బెక్ నవల) ను హర్షించి అభినందించిన మా పాఠకులు ఈ "సాలీడు సందేశాన్ని" అంతకన్న ఉత్సాహంతో అందుకుంటారని మాకు తెలుసు.

తెలుగులో బాల సాహిత్యం పుష్కలంగా వెలువడుతున్న రోజులివి. అయినా విజ్ఞానాన్నీ, వినోదాన్నీ మేళవించగల మనోహర శిల్ప చాతురిని కైవసంచేసుకున్న శ్రీ ఇ. బి. వైట్ వంటి సిద్ధహస్తుల రచనల అనుకృతులు మన బాల సాహిత్యానికి రూపురేకలు దిద్దుకొనడానికి విశేషంగా ఉపకరించగలవని మా ఆశయం. బాల, బాలికల చిత్తవృత్తులతోపాటు సాలీడు, పందికూన, ఎలుక, గొర్రె, బాతుల మనః ప్రవృత్తులనుకూడా సహజంగా, పిల్లలకు పెద్దలకు కూడా మనోరంజకంగా చిత్రింపగల కౌశలం ఈ గ్రంథంలో అడుగడుగునా కనిపిస్తుంది.

ఆంధ్రానువాద ప్రచురణకు అనుమతినొసగిన మూలగ్రంథకర్తకు, పాత్రోచితమైన సరళ భాషలో సరసంగా అనువదించి ఇచ్చిన అనువాదకులకు, కథానుగుణమైన మనోజ్ఞ చిత్రాలను, ముఖచిత్రములను రచించియిచ్చిన చిత్రకారులకు, ముద్రాపకులకు మేము బహుధా కృతజ్ఞులం.

జూలై 1, 1958,
విశాఖపట్టణం-8.

ప్రకాశకులు.

ప్రకరణ వివరణ

		పుట
1	పొద్దుటి కథ	1
2	విల్బర్	8
3	గండం తప్పింది	1[illegible]
4	ఒంటరితనం	27
5	షార్లెట్	33
6	వేసవి రోజులు	43
7	దుర్వార్త	55
8.	ఇంట్లో సంభాషణ	60
9.	విల్బర్ ప్రగల్భాలు	64
10	దుర్భరమైన పేలుడు	78
11	అద్భుతం	91
12	మహాసభ	100
13	గొప్ప అభివృద్ధి	107
14	డాక్టర్ డోరియన్	112
15	చిమ్మెటలు	122
16	తిరునాళ్ల ప్రయాణం	131
17	మామయ్య	147
18	చల్లని సాయంకాలం	158
19	గుడ్ల సంచీ	165
20	విజయ సంరంభం	175
21	చివరి రోజు	184
22	వసంతవాయువులు	193

3 పొద్దుటి కథ:

"ఫెన్! ఏమిటిది? పంది పిల్లల గొడవ నీకు తెలియదు. పో! నాసిరకం పిల్లలతో చాలా తంటాలు పడాలి. ఇంట్లోకి పో," అన్నాడు ఆరబుల్.

"వద్దు నాన్నా! ఆ పిల్లని చంపెయ్యకు. పాపం అది సన్నగా పుడితే దాని తప్పేమిటి నాన్నా? లావుగా పుట్టాలని అనుకుంటే మాత్రం దానిచేత అవుతుందా? పోనీ నువ్వేచెప్పు... నేను బక్కగా, నీరసంగా పుడితే నన్నుకూడా ఈ గొడ్డలిపెట్టి చంపేసేవాడివేనా?"

"ఛీ! అవేం మాటలమ్మా! పిచ్చితల్లీ!" చిరునవ్వుతూ, ప్రేమతో అన్నాడు ఆరబుల్. "నిన్ను చంపడమేమిటి? నీ మొహం? నీలాంటి చిట్టితల్లికీ, ఆ చిన్న పందిపిల్లకీ పోలికేమిటమ్మా?"

"ఏం? తేడా ఏముంది నాన్నా?" అలా ఆ గొడ్డలి పట్టుకని వేళ్ళాడుతూనే అంది ఫెర్న్. "ఇంతకంటె చెడ్డపని ఇంకేముంటుంది నాన్నా! వద్దు. పాపం! ఇది చాలా పాపం! చంపకు."

జాన్ ఆరబుల్ చూపులో చిత్రమైన మార్పువచ్చింది. గట్టిగా అరచి, గదమాయించేలా కనిపించాడు. వెంటనే మళ్ళీ తమాయించు కున్నాడు.

"సరే! నువ్వ ... ను ఆ పందికూ

ఇంటికి పట్టుకో

పెంచినట్లు

తో, కాఫీ పరిమళంతో, పొయిలోంచి వచ్చే పొగతో రకరకాల వాసనలు కొడుతోంది.

"దాన్ని కుర్చీలోనే పెట్టండి." అంది ఆరబుల్ సతి. జాన్ ఆరబుల్ ఆ పెట్టెతెచ్చి ఫెన్ కూచునే కుర్చీలో పెట్టాడు. తరువాత పంపుదగ్గరికి వెళ్ళి, చేతులు కడుక్కుని టర్కీ తుండు గుడ్డమీద తిరగేసి మరగేసి చేతుల తడి అద్దుకున్నాడు.

ఫెన్ మెల్లగా మేడమెట్లు దిగివచ్చింది. ఏడవటం వల్లనేమో కళ్ళు ఎర్రగా వున్నాయి. ఆమె కుర్చీదగ్గిరికి వచ్చేసరికి అట్టపెట్టె కదిలి కదిలి పక్కకి ఒరిగింది. దానిలోంచి సన్నని జీరగొంతు వినిపించింది. ఫెన్ తండ్రివంక చూసింది. తరువాత అట్టపెట్టె మూతతీసింది. తనవేపే చూస్తున్న ఆ కొత్తగా పుట్టిన పందికూన అందులో వుంది. తెల్లని చిన్న పందిపిల్ల! ఉదయకాంతి దాని లేత చెవుల్లోంచి దూసుకుపోతూండడంతో అవి ఎర్రగా మెరుస్తున్నాయి.

"ఆ పందికూన నీదే" అన్నాడు ఆరబుల్. "దాన్ని నిష్కారణంగా ఈ పాటికి చంపేసేవాణ్ణే. భగవంతుడు నీ ద్వారా దానికి నా చేతుల్లో బలవంతపు చావు తప్పించాడు."

ఫెన్ ఆ పందిపిల్ల [illegible] రెప్ప వాల్చకుండా చూస్తూంది.

[illegible]ళ్ళు! ఎంత బావుం[illegible]ది.

[illegible]సింది. ముందు

[illegible]శ్రిమగా

5

పొద్దుటి కథ

"ఏమిటదో? ఫెన్‌కి ఏదో ఇచ్చారే?" ఘాటుగా సూటిగా ప్రశ్నించాడు.

"ఉదయప్పు ఫలహారానికి ఫెన్‌కి చిన్న అతిథిలే! నువ్వు వెళ్ళి గబ గబా చేతులూ ముఖం కడుక్కురా!"

"అదేమిటో చూణ్ణియ్ ముందు!" అంటూ చంకలో తుపాకీ కింద పెట్టి, "ఆ చచ్చుముండని పంది అంటారా? ఖలే పందే!- అదే మిటి? సరీస్‌గా ఎలకపిల్లంత కూడాలేదే!"

"అవెరీ! నువ్వు పోయి ముఖం కడుక్కుని, తిండికి రా. ఇంకో అరగంటలో స్కూలు బస్సు వచ్చేస్తుంది."

"నాన్నా! నాక్కూడా ఓ చిన్న పందిని ఇస్తావా?" అవెరీ అడిగాడు.

"ఉహుఁ! పెందరాడే నిద్రలేచే వాళ్ళకే అది! ఫెన్ తెల్లారగా ఐదింటికి లేచింది. ప్రపంచంలో జరగబోతూన్న ఒక అన్యా ఆపు చేసింది. అందుకోసం దానికి ఆ పందిపిల్ల బహు కొంచెం నాసి పిల్లయినా పందిపిల్లేలే! పొద్దున లాభమో ఇప్పటికైనా తెలిసిందా నీకు? రా, ద్దాం," అన్నా ... రబుల్.

"అదుగో, విన్నావా? లే! పరుగెత్తు!" అవెరీని తల్లి హెచ్చరించింది. ఇలా అంటూనే ఆమె ఫెన్ చేతులోంచి పందిపిల్లను తీసుకొని, ఆ పిల్ల చేతులో ఒక పిస్తా పప్పు పెట్టింది. అవెరీ తుపాకీ చేత బట్టుకొని ఇంకో పిస్తాపప్పు తనూ తీసుకున్నాడు.

పిల్లలిద్దరూ రోడ్డుమీదకు పరుగెత్తి బస్సెక్కారు.

ఫెన్ బస్‌లోవున్న వాళ్ళవళ్ళ వంకా చూడలేదు. గప్‌చిప్‌గా కూర్చుని కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఈ ప్రపంచకం ఎంతో మంచిది. ఆ చిట్టి పందిపిల్లని అచ్చంగా తనకి ఇచ్చెయ్యడం - అబ్బ! ఎంత అదురుష్టం! బస్సు బడికి చేరుకునేసరికి, ఫెన్ తన బిడ్డకి ఓ మాంఛి,అన్నిటిలోకి చాలా ఇంచక్కగా వున్న పేరుకూడా పెట్టేసింది.

"విల్బర్! ఔను అదే దాని పేరు," తనలో తనే గొణుక్కుంది.

స్కూల్లో, "ఫెన్! పెన్సిలే[illegible] రాజధాని నగరం పేరేమిటి?" [illegible] ఇంకా ఆ పందిపిల్లని

౨. విల్బర్

ఫెన్‌కి ఈ ప్రపంచంలో విల్బర్ కన్న ప్రియమైనది ఇంకేమీ కనిపించడంలేదు. దాన్ని చేతుల్లో ఎత్తుకుని మెల్లగా వేళ్ళతో తడుతున్నపుడూ, తన చేతులతో దానికి పాలు పడుతున్నపుడూ, మెత్తగా పక్కేసి పడుకోబెట్టి నిద్ర బుచ్చుతున్నప్పుడూ ఫెన్‌కి చెప్పలేనంత సంతోషం. రోజూ పొద్దున్నే నిద్రలేవగానే దానికి వేరే పాలు వెచ్చబెట్టేది. ఆ పాలు సీసాలో పోసి, పీక బిగించి దానికి కుడిపేది. సాయంకాలం స్కూలు బస్సు ఇంటిముందు ఆగగానే గమ్మున దిగేసి, మళ్ళీ దానికి పాలు పట్టడానికి ఇంట్లోకి పరిగెత్తేది. అలాగే చీకటిపడిన తరువాత ఒకసారీ, రాత్రి పడుకోబోయే ముందు ఇంకోసారీ కూడా శ్రద్ధగా పాలు పట్టేది. మధ్యాహ్నం ఫెన్ బళ్ళో వున్నప్పుడు ఒక్కసారి మాత్రం వాళ్ళమ్మ ఆరబుల్ సతి పట్టేది. విల [illegible] బల్లే రుచిగా [illegible]. ఫెన్ తనకోసం పాల [illegible]

9 విల్బర్

చెట్టుకిం[illegible] చుట్టూ కంచె వేసిన చిన్న దొడ్డి ఒకటి ఏర్పా[illegible] [illegible]లు దానికోసం పెద్ద పెట్టె ఒకటి తయారు చేశ[illegible] విల్బర్ స్వేచ్ఛగా దాంట్లోకి పోవడానికి వీలుగా ఒక చిన్న [illegible] పెట్టాడు. దానిలోపల మెత్తగా వుండేందుకు ఒత్తుగా ఎండు[illegible] పరిచించాడు.

"రాత్రిపూట దానికి చలెయ్యదూ?" ఫెన్ తండ్రిని అడిగి[illegible].

"[illegible]. అది ఏం చేస్తూంటుందో నువ్వు [illegible] చూస్తూ ఉండు, నీకే తెలుస్తుంది." అన్నాడు వాళ్ళనాన్న.

చేతిలో పాలబుడ్డి పట్టుకుని ఆపిల్ చెట్టు[illegible] విల్బర్[illegible] [illegible] మనిపుంది ఫెన్. విల్బర్ ఫెన్ దగ్గరికి పరు[illegible]త్తుంది. ఫెన్ [illegible] [illegible]ని నోట[illegible]దించి, పాలుకుడిపించి. సీసాలో పాలు [illegible] [illegible] తర్వాత ఒక్క-సారి గుర్రుర ధ్వనిచేసి, ము[illegible] [illegible] [illegible] [illegible]డిపిపోయింది విల్బర్. ఫెన్ వంగి ఆ [illegible] [illegible] [illegible]. విల్బర్ ము[illegible]టితో ఆ గడ్డిని కుళ్ళగి[illegible]. [illegible]

సాలీడు సందేశం

ఆ ఎండు గడ్డిలో చిన్న సొరంగంచేసి అందులో దూరి, కండా మాయమైంది. ఎత్తుగాలేచిన గడ్డితప్ప ఏమీకనిపించటం ఫెన్‌కి ఇదంతా తమాషాగా వుంది. తన పెంపుడుబిడ్డ రాత్రికి గడ్డిలోదూరి వెచ్చగా నిద్రపోతుందనే ఆలోచన ఆమెకు సంతృప్తి కలిగించింది.

రోజూ ఉదయపు ఫలహారాలు కాగానే ఫెన్ వెంట విల్బర్ రోడ్డుమీదకు వెళ్ళి, స్కూలు బస్సు వచ్చేదాకా అక్కడే వుండేది. ఫెన్ బస్సులో ఎక్కి విల్బర్‌కి టాటా చెప్పేది. బస్ ఆ వీథి చివర మలుపు తిరిగే వరకూ విల్బర్ ఆ బస్సువంక చూస్తూ అలాగే నిలబడి వుండేది.

ఫెన్ బళ్ళో చదువుకుంటున్నప్పుడు విల్బర్‌ని దాని దొడ్లో బంధించేసేవాళ్ళు. ఫెన్ ఇంటికి రాగానే, ముందుగా దాన్ని బయటికి తీసేది. ఇంక విల్బర్ ఫెన్‌వెంటబడి కూడా కూడా తిరుగుతుండేది. ఫెన్ ఇంట్లోకిపోతే అదీ వెళ్ళేది. మేడమీదికి పోతే, మళ్ళీ తిరిగి వచ్చే వరకూ కింది మెట్టు దగ్గిరే కనిపెట్టుకుని ఉండేది. ఫెన్ తన బొమ్మని బొమ్మబండిలో పడుకోబెట్టి, దాన్ని తోసుకుంటూ వీథి షికార్లు బయలుదేరితే ఆమె వెనకే విల్బరుకూడా సిద్ధం. అలా షికారు వెళ్ళినప్పుడు మధ్యలో ఎప్పుడైనా విల్బర్ అలిసిపోతే, ఫెన్ దాన్ని ఎత్తుకుని ఆ బండిలో బొమ్మ పక్కన పడుకోబెడుతూ వుండేది. అప్పుడు విల్బర్‌కి హాయిగా సుఖంగా వుండేది. మరీ అలసిపోయి ఉన్నప్పుడు విల్బర్ కళ్ళుమూసుకుని, ఆ బొమ్మల దుప్పటి ముసుగులో వెచ్చగా పడుకుని నిద్రపోయేది. విల్బర్ కనురెప్పల వెంట్రుకలు పొడుగు అవటంవల్ల, కళ్ళుమూసుకున్నప్పుడు చిత్రంగా కనిపించేది. పక్కనున్న బొమ్మకూడా కళ్ళుమూసుకునేది. తన పాపలకి నిద్రాభంగంకాకుండా బండిని మెల్లగా తోసుకుంటూ ఇంటికి వచ్చేది ఫెన్.

హాయిగావున్న ఒక సాయంకాలం ఫెర్నా, ఎవరీ స్నానం చేసేబట్టలు వేసుకొని ఏటిలో ఈతలాడడానికి బయలుదేరారు. ఫెర్ను వెంటనే విల్బర్ కూడా తయారయింది. ఫెర్న్ ఏట్లోకి దిగింది. విల్బరు కూడా దిగింది. ఆ నీళ్లు చల్లగా హిమవంతంలా వున్నాయి. అంత చల్లదనం అది సహించ లేకపోయింది. అందేత వెంటనే బయటకి వచ్చి, ఆ పిల్లలిద్దరూ నీళ్ళలో ఈదుతూ, ఆడుతూ, ఒకళ్ళ మీద

ళ్ళ నీళ్ళు చిమ్ముతూ కేరింతాలు కొడుతూంటే, విల్బర్ ఒడ్డున ప అంచు దగ్గర చిక్కగా జిగటలు సాగుతూన్న వెచ్చని బురదలో పడి హాయిగా దొర్లుతూంది.

ప్రతిరోజూ ఆనందంగా గడిచిపోతూంది. ప్రతి రాత్రీ ప్రశాంతంగా అంతమవుతూంది.

విల్బర్‌లాంటి పందుల్ని రైతులంతా 'వసంతకాలపు పంది' [illegible]. అనగా, ఆ పంది వసంతంలో పుట్టిన పందని అర్థం. విల్బర్ [illegible] వారాలు ఎదిగిన తర్వాత, ఓరోజున ఆరబుల్ "ఇక దీన్ని అమ్మే[illegible]చ్చు, అమ్మేస్తాను." అన్నాడు. ఈ మాట వినగానే ఫెర్న్ [illegible] మొదలు పెట్టింది. వాళ్ల నాన్న మాత్రం అమ్మక తప్పదం[illegible]న్నాడు. విల్బర్‌కి ఆకలి హెచ్చింది. పాలతోపాటు, చిన్న ముక్కలుగా కోసి పెట్టిన [illegible] కూడా తింటూంది. ఇక దాన్ని మేపడం జాన్ ఆరబుల్‌కి కష్టం[illegible]. దానితో పుట్టిన పది పంది పిల్లల్నీ అప్పటికే [illegible].

"దీన్ని కూడా వదిలించెయ్యాలి. - అయిందిగా పంది పిల్లని పెంచే సరదా తీరిందిగా! నీ విల్బర్ ఇంకా పసిపాప [illegible]! దాన్ని అమ్మెయ్యక తప్పదు" అన్నాడు.

" [illegible] జుకర్‌మన్‌గారి యింట్లో మీ హోమర్ బాబాయిని పిల్చుకురావే. ఆయనకి పందుల్ని పెంచడం సరదా. విల్బర్‌ని వాళ్ళు కొంటే, నువ్వు రోజూ నీయిష్టమొచ్చినన్నిసార్లు వాళ్ళింటికెళ్ళి దాన్ని చూస్తూ ఉండొచ్చు" అంది వాళ్ళమ్మ.

"దాన్ని ఇచ్చేస్తే నాకు ఎంత ధర యిస్తారు?" తెలుసుకోవాలని ఫెర్న్ అడిగింది.

"అది వట్టి నాసిరకం పిల్ల. అయినా ఆరు డాలర్లకి అయితే ఇచ్చేస్తామని మీ హోమర్ బాబాయికి నువ్వే చెప్పు. ఏమంటాడో చూద్దాం."

ఆ వేళ ఆ తంతంతా జరిగిపోయింది. ఫెన్ వాళ్ళ ఎడిత్ పిన్నికి ఫోన్ చేసింది. ఎడిత్ పిన్ని వెళ్ళి హోమర్ బాబాయిని కేకేసింది. హోమర్ బాబాయి గాదె దగ్గర్నించి గబగబా వచ్చి ఫెన్ తో ఫోన్ లో మాట్లాడాడు. ఆ పంది ఖరీదు ఆరు డాలర్లే అని చెప్పేసరికి అట్లాగే కొంటానని ఒప్పేసుకున్నాడు. మర్నాడు విల్బర్ ని ఆపి[illegible] చెట్టు కింద వున్న దాని చెక్కల ఇల్లోంచి తీసుకుపోయారు. జు[illegible]ర్మన్ల పెరట్లో గాదె పక్కనున్న చిన్న పెంట కుప్పమీద దాని[illegible] నివాసం ఏర్పాటు చేశారు.

3. గండం తప్పింది!

జుం కర్మన్‌గాదె బాగాపెద్దది. చాలాకాలం నాటిది. దాని చుట్టూ ఎక్కడచూసినా పాత గడ్డివాసన, మాగిన పెంటవాసన, అలసిపోయిన గుర్రాలచెమటవాసన, సాధుపులైన ఆవుల ‌మ్మని నిశ్వాసాల వాసన, ఒకచోట విడివిడిగా,ఒకచోట కలేగలుపుగా దురవుతాయి. మొత్తంమీద అది ఒక సుప్రశాంత వాతావరణపు ంసన. ప్రపంచానికి ఎన్నడూ ఏవిధమైన ప్రమాదం లేదు అనిపించే వాతావరణం. ధాన్యపు వాసనలు, గుర్రాల జీనులవాసన, బండి చక్రాలకు వేసే గ్రీసువాసన, మట్టిపని చేసేటప్పుడు తొడుక్కునే రబ్బరు బూడ్సుల వాసన, కొత్తగా వేసిన తాళ్ళవాసన వాతావరణాన్ని పరిమళితం చేస్తున్నాయి. ఎలకల్ని పట్టడానికి బోనులో చేపముక్కను కట్టినప్పుడు అక్కడ చేపలవాసనకూడా వేస్తుంది. కాని, ఆ పాక పొడుగునా కర్రల అటకనిండా కూరికూరి పెట్టివున్న ఎండుగడ్డివాసన ఈవాసన లన్నింటిలో బలమైనది. పైగా, ఆవులు, గుర్రాలు, గొర్రెలు మేయడంకోసం వేసిన ఎండుగడ్డి, పచ్చగడ్డి వాసనలు కూడా దానికి తోడవుతాయి. శీతాకాలంలో పశువులన్నీ పొద్దస్తమానం అక్కడే కట్టివేసి వుండేటప్పుడు, ఆ గాదెదగ్గర వెచ్చగా హాయిగా వుంటుంది. అలాగే వేసవిలో పూర్తిగా తెరచివేసిన పెద్ద దర్వాజాలోంచి దక్షిణపుగాలి వీస్తూ చల్లగా హాయిగా వుంటుంది. గాదెపక్కన వసారాలో నాగళ్ళూ, బళ్ళూ లాగే గుర్రాలను కట్టే ... గదులు గదులుగా కట్టారు. వాటిపక్కన వరసగా ...లు వున్నాయి. ఆరుబయట కర్రికంచె వే... ...కా దిగువను విల్బరుకోసం చిన్నదొడ్డి కట్టా...

13 [illegible]ండం [illegible]ప్పంది

[illegible]మాన్యంగా ఇలాంటి పెరట్లో కనిపించే అన్నిరకా[illegible] [illegible]లు, రోళ్ళు, తిరగటిరాళ్ళు, పంగలపట్టులు, [illegible]ంపీలు, [illegible]డ్డకో[illegible] కొడవళ్ళు, మంచుఎత్తిపోసే నిలువుపారలు, [illegible] పాలపిపరాలు, నీళ్ళబాల్చీలు, కుడితి తొట్టెలు, [illegible], [illegible]పట్టిన ఎలుక బోనులు వగైరా సర్వం వున్నా[illegible]. [illegible] పెట్ట[illegible]నికి గువ్వలు, [illegible]లు [illegible]రి వచ్చే [illegible] [illegible]ప్రయోజన అస్తవ్యాసం ఆడుకోటానికి [illegible] పిల్లల[illegible] [illegible] పెరడు అది. అదంతా ఫెన్ పినతండ్రి హోమర్ జకర్మన్‌[illegible].



విల్బర్ నివాసం ఆ పెరట్లో కొంచెం దిగువగా [illegible] [illegible]టికి పక్కగావుంది. పెంటపోగు [illegible] [illegible]దని [illegible] [illegible]దానికి పసందైన ప్రదేశమని జుకర్మన్‌కి తెలుసు. [illegible] [illegible]కం కావాలి. గాదెకి దక్షిణపు వేపున ఆ పెంటకుప్ప[illegible] [illegible] [illegible]చ్చగా వుంటుంది.

విల్బర్‌ని చూడడానికి ఫెన్ ఇంచుమించు [illegible] వచ్చేది. [illegible]బుపిల్లికి వాళ్ళు కూచునే పనికిరాని పాత [illegible]ట సంపాదించింది. దాన్ని పట్టుకొచ్చి విల్బర్ [illegible]గా

తో వేసింది. సాయంకాలమప్పుడుగంటలకొద్దీ సేపు విల్బర్ ని చూస్తూ, వింటూ, ఆలోచిస్తూ ఆపీటమీద అలాగే కూచుని వుండేది. కొద్దికాలంలోనే ఆగొర్రెలతో కూడా ఆమెకు స్నేహం కలిసింది. వాటికి ఆమెదగ్గర చనువు ఏర్పడింది. అలాగే, ఆగొర్రెలతో పాటే వుంటూన్న బాతులుకూడా ఆమెకు మచ్చిక అయినయి. అన్ని జంతువులకీ ఫెన్ అంటే తగనినమ్మకం. ఆమె వాటితో అంత సావాసం చేస్తోంది. విల్బర్ ని బయటికి తీసుకువెళ్ళడానికి గాని,

ఫెన్ కంచె దాటి విల్బర్ దొడ్లోకి దిగడానికిగాని ఏర్పడని అంతు పెద్ద [illegible] ఎక్కర్లేస్ జాబాయి. ఆపీటమీద కూచొని ఫెన్ గమనిస్తూ ముచ్చ [illegible]

సేపు విల్బర్ ని చూస్తూ వుండవచ్చు నన్నాడు. అసలా ప[illegible] వుండటమే ఆమెకు ఎంతైనా సంతృప్తి కలిగిస్తూంది. అక్కడ తన ఆవరణపక్కన పీటమీద కూచోటం విల్బర్ కి తగని సంతోషం. అయితే షికారువెళ్లడం, స్వారీచేయడం, ఈతలుకొట్టటం లాంటి ఆమె ఇతర సరదాలన్నీ కట్టుబడిపోయినయి.

జూన్ నెలలో ఒకసాయంకాలం. విల్బర్ కి రెండునెలలు నిండొస్తున్నాయి. ఆ గాదెపక్కనవున్న తన చిన్న ఆవరణలోకివచ్చి హుషారుగా పచారులు చేస్తూంది. ఫెన్ ఎంచేతో ఇంకా రాలేదు. వెచ్చని ఎండలో నిలబడివున్న విల్బర్ కి ఆ ఏకాంతవాసం విసుగ్గా ఉంది.

“చేద్దామన్నా ఇక్కడ ఎప్పుడూ ఏమీ పని కనిపించడంలేదు”; అనుకుంది. మెల్లగా నడుస్తూ తనకు మేతపెట్టే ఆకొయ్యతొట్టె దగ్గిరికి వెళ్లింది. మధ్యాహ్నం మేతసమయంలో సరిగా చూ[illegible] మిగిలిపోయిన బాపతేమైనా ఉన్నాయేమోనని ముట్టెతో [illegible] కొడుతూ వెతికింది. బంగాళదుంప తోలుముక్కొకటి కనిపిస్తే తినేసింది. వీపు దురదపెట్టిందేమో— ఆ కట్టకంచెకి అనుకుని అ[illegible]ట్టలకి వేసి రాస్తూంది. దాంతో విసుగొచ్చిన తర్వాత, మళ్ళీ తన స్థానానికి వెళ్ళి పెంటకుప్పపైకెక్కి, అక్కడ తిష్ఠవేసింది. నిద్దర రావడం లేదు. పెంటకుప్ప కుళ్ళగించడానికి కూడా మనస్కరించడంలేదు. గంటలకొద్దీ అలా నిలబడివుండటం తగని విసుగ్గావుంది. అస్తమానం పడుకుంటున్నా అలాగే పడుస్తూంది. “నేనుపుట్టి పట్టుమని రెన్నెల్లు కాలేదు. అప్పుడే నాకి బతుకంటే విసుగు పుట్టిపోతుంది,” అనుకుంది. మళ్ళీ బయట పెరట్లోకి నడిచిపోయింది.

“నేను ఇలాకాస్త బయటికివస్తే, మళ్ళీ లోపలికి పోవలసిందే! [illegible]లకితప్ప ఎక్కడికి వెళ్ళడానికీ వీల్లేదు. లోపలుంటే మళ్ళీ ఈ

కే తప్ప ఇంకెక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు," అని గురగుర
ంది.

"అ-అ-అ-అదే నీ పొ-పొ-పొ-పొరపాటు!" అన్నమాటలు
వినిపించినయి.

విల్బర్ తన కంచెమీంచి అటుచూసింది. అక్కడ నిలబడివున్న
బాతు కనిపించింది.

"ను-ను-ను-నువ్వెప్పుడూ ఆ పె-పె-పె-పెంటకుప్పమీదే, కు-కు-కు-కూచోక్కర్లేదు," అంది మళ్ళీ బాతు- తొందర తొందరగా మా ట్లాడుతూ. "ని-ని-ని-నీకర్ర కంచెల్లో వొ-వొ-వొ-వొకకర్ర వదులుగా వుంది. ద-ద-ద-దాన్ని తొయ్యి; బ-బ-బ-బయటికి వచ్చెయ్యి."

"ఏమిటీ? కొంచెం నెమ్మదిగాచెప్పు!" అంది విల్బర్. "మ-మ-మ-మళ్ళీ చెపుతున్నా. బ-బ-బ-బయటికి వచ్చెయ్. ఇ-ఇ-ఇ-ఇక్కడ ంతో బ-బ-బ-బావుంది". "కంచెలో ఏదోకర్ర వదులుగాఉంది, అన్నావుకదూ?" "అ-అ-అ-అన్నాను," అంది బాతు.

విల్బర్ కంచెదగ్గిరికి వెళ్ళిచూసింది. బాతు చెప్పిన మాట నిజం. ఒకకర్ర వదులుగా వుంది. విల్బర్ తలవంచింది. కళ్ళు మూసుకుంది. ఒక్కతోపు తోసింది. ఆకర్ర ఊడిపడిపోయింది. మరుక్షణంలో విల్బర్ ఆ కంచె సందులోంచిదూరి తన ఆవరణ అవతల ఉన్న ఎత్తైన గడ్డిలో వుంది. బాతు సంతోషంతో కేరింతాలు కొట్టింది.

"హా-హా-హా-హాయిగా బయటికి వచ్చేస్తే ఎ-ఎ-ఎ-ఎల్లాఉంది వి-వి-వి-విల్బర్!"

"చాలాబాగుంది. ఏమిటో, బాగున్నట్టుగానే వుంది." జాని కి విల్బర్ కి తనకంచె బయటికిరాగానే ఏమిటో కొత్తగా వింతగా వుంది. మిగిలినపెద్ద ప్రపంచానికి తనకీ, మధ్య ఏమీ అడ్డం లే వ టంతో కంగారుగా ఉంది.

19 గండం తప్పింది

"ఇంతకీ నేను ఎక్కడికి పోతే బాగుంటుందంటావ్?" సలహా అడిగింది విల్బర్.

"ని-ని-ని-నీయిష్టం వచ్చినచోటికి," అంది బాతు. "అ-అ-అ-ఆ తోటలోంచి అలాపడిపో! అ-అ-అ-అక్కడ రాడిష్ దుంపలు కు-కు-కు-కుళ్ళగించుకుని తిను. అ-అ-అ-ఆ తోటలో దుంపలన్నీ పె-పె-పె-పెళ్ళగించేసెయ్యి. గ-గ-గ-గడ్డీ గాదం ఉంటుందిపో. గి-గి-గి-గింజలు కూడా దొరుకుతయి చూడు. ఒ-ఒ-ఒ-ఓట్లు ఉంటయి వెదుకు. హా-హా-హా-హాయిగా ఆ కోట అంతటా వి-వి-వి-విచ్చల విడిగా తిరుగు. గ-గ-గ-గంతులెయ్యి. ఆడుతూ, ప-ప-ప-పాడుతూ తిరుగు. ప-ప-ప-పళ్ల తోటలోంచి పారిపో! ఆ అ-అ-అడవుల్లో ఇటూఅటూ పరిగెత్తు. ని-ని-ని నీలాంటి చిన్నపిల్లలకి ఇ-ఇ-ఇ-ఈ ప్రపంచం అ-అ-అ-అత్యద్భుత మైన ఆటలకొడ్డి."

"ఔను, అలాగేవుంది" అంది విల్బర్. అంటూ గాదెలోకి ఒ సారి ఎగిరి పల్టీకొట్టింది. నాలుగడుగులుసాగి, మళ్ళీ నిలబడిం చుట్టూచూసింది. గాలి గట్టిగాపీల్చి అక్కడి సాయంకాలపు వాసన పరికిలించింది. తరవాత ఆతోటలోపడి నడిచిపోతూంది. ఒక ఆపిల్ చెట్టు నీడలో నడుస్తూ, గట్టిపడిన తనముట్టె నేలలోకి దూర్చి తవ్వడం, పెల్లగించడం, భూమిలో దుంపల్ని కుళ్ళగించడం మొదలుపెట్టింది. ఆపని దానికి ఎంతో సంతోషంగావుంది. ఆవిధంగా బాగా కొంతమేర కుళ్ళగించి పెట్టేటంతవరకు దాన్ని ఎవరూ చూడలేదు. ఈ స్థితిలో దాన్ని మొదటచూసింది జుకర్మన్ భార్య. వంటింటి కిటికీలోంచి ఆమెకీ దృశ్యం కంటబడింది. వెంటనే కేకలుపెట్టింది.

"ఏమండోయ్! ఆ పందిపిల్ల తప్పించుకుపోయింది. ఒరే లర్కీ! చూడరా ఆపందిపిల్ల తప్పించుకుపోయి, ఆ ఆపిల్ చెట్టుకిందంతా తవ్వి గుంటలు పెడుతూంది."

"అయింది. ఇక నా జాతర అవుతుంది. అయినా తేలిగ్గా దొరకనులే!" అనుకుంది విల్బర్.

బాతుకూడా ఈకేకలన్నీ వింది. అదికూడా అరవడం మొదలు పెట్టింది. "ప-ప-ప-పరిగెత్తుకుపో. కొ-కొ-కొ-కొండ కిందికిపారిపో. అడివిలోకి ప-ప-ప-పారిపో. అడవిలోవాళ్లు నిన్ను ప-ప-ప-పట్టుకోలేరు." గాదెలోపల గొర్రెలుకాసే కుక్క ఈ గందరగోళమంతా విని పరిగెత్తుకొచ్చి, తానుకూడా విల్బర్ వెంట పడింది.

హోమర్ జుకర్మన్ కూడా ఈ విషయంతెలిసి యంత్రశాలలో పని మరమ్మతుచేస్తున్నవాడల్లా గబగబాపరుగెత్తుకొచ్చేశాడు. పాలేరు లర్వీ చిలగడం మడిలో కలుపుతీస్తూ, ఈ గోలవినివచ్చి, విల్బర్ వెంట పడ్డాడు. అంతా విల్బర్ వేపే వస్తున్నారు. విల్బర్‌కి ఏంచేయడానికీ పాలుపోవడం లేదు. అడవి ఇంకా చాలాదూరం వున్నట్టు కనిపిస్తూంది. అయినా, తానెన్నడూ అడవిని చూడనైనా చూడలేదు. తీరా అక్కడికి పోతే అక్కడ తనకి బావుంటుందో బావుండదో!

"పోరా లర్వీ! చూస్తావేం దానికి అడ్డం తగులు. వెనక్కి తోలుకురా; నిమ్మళం. దాన్ని బెదరగొట్టబోకు. నేను వెళ్ళి ఒక బాల్చీడు గంజి పట్టుకొస్తాను." అన్నాడు జుకర్మన్.

విల్బర్ తప్పించుకు పోయిందన్నవార్త వెంటనే ఆ ఆవరణలో వున్న పశువులన్నింటికీ తెలిసిపోయింది. జుకర్మన్ పెరట్లోంచి ఎప్పుడే జంతువు తప్పించుకు పోయినా, తక్కిన జంతువు లన్నింటికీ అది పెద్ద హడావిడి. విల్బర్ తప్పించుకు బయట పడిందన్న వార్త ముందుగా బాతు తన దగ్గరగా వున్న ఆవుకి అందించింది. దీంతో ఆవులన్నింటికీ ఆ విషయం తెలిసిపోయింది. అందులో ఒక ఆవు ఒక గొర్రెకు చెప్పింది. దాంతో గొర్రెలమంద అంతటికీ తెలిసిపోయింది. గొర్రెపిల్లలకి కూడా తల్లులు ఈ విషయం చెప్పేశాయి.

గుఱ్ఱాల శాలలోవున్న ఒక గుఱ్ఱం బాతు అరుస్తున్నప్పుడే, చెవుల టొప్పలు ముందరికి తిప్పి విషయమంతా విన్నది. దాంతో అక్కడి గుర్రాలన్నింటికీ తెలిసిపోయింది. విల్బర్ పారిపోయింగంటే విల్బర్ పారిపోయిందంటూ ఆ పెరట్లోవున్న జంతువులన్నీ తమ తోటిజంతువుల్లో ఒకటి కట్లుతెంచుకుని బయటపడి, స్వేచ్ఛగా తిరుగుతున్న ... సంతోషంతో, మెడలు పైకెత్తి అలాగే నిలబడి చూస్తున్నయి.

అప్పుడేం చెయ్యడానికీ విల్బర్‌కి ఏమీ తోచలేదు. అంతా తనకోసమే పరిగెత్తుకొస్తున్నట్టు కనిపిస్తూంది. "స్వేచ్ఛ అంటే ... అయితే, బాబోయ్ ఈ స్వేచ్ఛ నాకొద్దు. ఆ చిన్న ... ఉండడమే హాయి," అనుకుంది.

ఒక వేపునుంచి మందకుక్క తనవేపు తరుము కొస్తూంది. మ... వేపునుంచి పాలేరు లర్వీ తనని పట్టుకుంటానికి వస్తున్నాడు. ... తోటలోకి పరుగెత్తబోతే పట్టుకుంటానికి సిద్ధంగా అక్కడ జ... భార్య నిలబడి ఉంది. గంజి బాల్చీ ఒకటి పట్టుకని జుకర్మన్ ... వస్తున్నాడు. "ఛీ! ఛీ! ఇదంతా చాలా అసహ్యంగా వుంది. ... వచ్చినా ఫెన్ రాలేదు" అనుకుంటూ విల్బర్ ఏడవట... పెట్టింది.

బాతు పెద్దగా అరుస్తూ విల్బర్‌కి మళ్ళీ ఉపాయ ... ది.

"మొ-మొ-మొ-మొద్దులాగ అక్కడే, ని-ని- ... త-త-త- తప్పించుకు పారి పో! ఇ ఇ-ఇ- ఇటూ ... కరగా పరిగెత్తు! అ-అ-అ- అప్పుడు అందర్నీ ... వచ్చు. ప-ప-ప- పరిగెత్తు. ప-ప-ప- పారిపో ..."

మందకుక్క విల్బర్ వెంటపడి, ... పోయింది. విల్బర్ ఒక దూకు ...

భార్య లర్వీగాణ్ణి హెచ్చరించింది. బాతు విల్బర్‌ని ఇంకా హుషారు చేసింది. విల్బర్ లర్వీగాడి కాళ్ళ సందునుంచి దూసుకుని పరిగెత్తింది. దాన్ని పట్టుకోబోయిన లర్వీ దాని వెనకాల వస్తున్న కుక్కని పట్టుకున్నాడు.

"బ-బ-బ- బలే! బలే! బ్రహ్మాండంగా పని జరిగింది. మ-మ-మ- మంచి పని జరిగింది. ఇంకా బ-బ-బ- బాగా పరిగెత్తు! పరిగెత్తు!" అని అరిచింది బాతు.

"కొండ కిందికి పారిపో!" అని అరిచాయి ఆవులన్నీ.

"మా దగ్గిరి కొచ్చేసెయ్!" అని అరిచినయి పొట్టి బాతులు.

"కొండ మీదికి పరిగెత్తు" అని అరిచినయి గొర్రెలన్నీ.

"గి-గి-గి- గిరగిర తిరుగు. వ-వ-వ- వంకర టింకరగా పరిగెత్తు" అని ఆదేశించింది మళ్ళీ బాతు.

"ఎగురు! దూకు" అంది కోడిపుంజు.

"లర్వ్ వస్తున్నాడు. జాగ్రత్త" అని అరిచాయి ఆవులు.

"అడుగో జకర్మన్! పరిగెత్తు" అన్నాయి పొట్టి బాతులు.

"కుక్క! కుక్క! జాగ్రత్త!" అన్నాయి గొర్రెలు.

"న-న-న- నా మాట విను!" అని కేక పెట్టింది మళ్ళీ బాతు.

పాపం విల్బర్‌కి భయంతో తల తిరిగిపోతూంది. ఈ గందరగోళమంతా తనమూలంగా జరుగుతూంది. తానిది భరించలేకపోయినా స్నేహితులంతా ఇస్తున్న సలహాలను అనుసరించడానికి ప్రయత్నించింది. కాని ఎలా? కొండ కిందికీ, కొండపైకీ కూడా ఒక్కసారే ఎట్లా పరిగెత్తడం? దూకుతూ, గంతులు పెడుతూ గిరగిర తిరగడం ఎల్లాగు? గట్టిగా అరవడం మొదలు పెట్టింది. ఆ అరుపులో ఆ పైన అసలు ఏం జరుగుతున్నదీ కూడా దానికి తెలియలేదు. పాపం విల్బర్ అప్పటికి బాగా చిన్నపంది. నిజానికి అది ఇంకా పందిపిల్లే. అప్పుడు ఫెర్న్ వచ్చి తనని ఎత్తుకుని గట్టిగా కౌగిలించుకుంటే ఎంత బాగుండును అనుకుంది. పైకి చూసేసరికి, జుకర్మన్ తన దగ్గిరే చేతిలో వెచ్చని గంజి బాల్చీ పట్టుకుని నిలబడి వుండటం చూసేసరికి విల్బర్‌కి ప్రాణం లేచి వచ్చినట్టయింది. ముట్టెపైకెత్తి వాసన చూసింది. ఆ గంజి మంచి కమ్మని వాసన కొడుతూంది. కొంచెం పాలు, ఉడికిన బంగాళా దుంప తొక్కలు, గోధుమతొక్కు, మొక్కజొన్న అప్పడాల ముక్కలు, జుకర్మన్ ఇంట్లో ఉదయపు ఫలహారాల వేళ వాళ్ళంతా వదిలేసిన పదార్థాలూ అన్నీ అందులో కలిసి ఉన్నయి.

"రా విల్బర్! రా!" అన్నాడు జుకర్మన్, ఆ బాల్చీని చేత్తో తడుతూ.

విల్బర్ ఒక్క అడుగు ముందుకి వేసింది.

"వ-వ-వ- వద్దు వద్దు వద్దు" అని అరిచింది బాతు. "ఇదంతా నిన్ను మళ్ళీ బంధించడానికి ఎ-ఎ-ఎ- ఎరపెడుతున్నారు. వ-వ-వ- వాళ్ళ వలలో పడబోకు. క—క—క— కమ్మని గంజి అని క—క— క్కుర్తి పడకు. ఆశపడితే మొ—మొ—మొ— మోసపోతావ్!"

విల్బర్ వినిపించుకోనేలేదు. ఒక పక్కన తనకి కడుపులో ఆకలి మండిపోతూంది. ఆ బాల్చీవేపు మరో అడుగు వేసింది.

విల్బర్! దా! దామ్మా! దా!" అంటూ జుకర్మన్ దయామైన స్వరంతో ప్రేమగా పిలుస్తూ, తెల్లని ఆ చిట్టి పంది తన వెనక నడిచి వస్తున్న సంగతి కూడా గమనించనట్టు అమాయికంగా అటూ ఇటూ చూస్తూ, మెల్లగా గాదెవేపు నడుస్తున్నాడు.

"వి-వి-వి-విల్బర్! తరవాత ఎ-ఎ-ఎ- ఏడుస్తావ్!" అని హెచ్చరించింది బాతు.

"విల్బర్ లెక్కచెయ్యలేదు. ఆ బాల్చీవేపు నడిచిపోతూనేవుంది.

"ని-ని-ని- నీ స్వేచ్ఛ కాస్తా ని-ని-ని-నిష్ప్రయోజనమై పోతుంది ఆ-ఆ-ఆ- ఆలోచించుకో. పి-పి-పి- పీపాడు గంజికంటె ఒ-ఒ-ఒ- ఒక గంట స్వేచ్ఛ ఎ-ఎ-ఎ- ఎంతో సుఖం." అని మళ్ళీ అరిచింది బాతు.

విల్బర్ లక్ష్యం చెయ్యలేదు.

జుకర్మన్ పంది ఆవరణ దగ్గరికి వెళ్ళి కర్రకంచె దాటి, లోపల ప్రవేశించి, తన చేతిలో వున్న బాల్చీలో గంజంతా విల్బర్ కొయ్య తొట్టెలో పోశాడు. మళ్ళీ వెనక్కివచ్చి, కర్రకంచెలో వదులుగా వేళ్ళాడుతూన్న చెక్కను పూర్తిగా ఊడదీసి, విల్బర్ సరాసరి లోపలికి నడిచి వెళ్ళడానికి వీలుచేశాడు.

"అ-అ-అ-ఆలోచించుకో! మ-మ-మ- మళ్ళీఒక్కసారి అ-అ-అ- ఆలోచించుకో!" అని హెచ్చరించింది బాతు.

విల్బర్ వినిపించుకోలేదు. కంచెలో దారిగుండా తన ఆవరణలో ప్రవేశించింది. మెల్లగా తన తొట్టె దగ్గరికి నడిచివెళ్ళి, ఆ గంజిని గబగబా పీల్చివేసింది. మిగిలిన బంగాళ దుంప తొక్కలు, రొట్టె ముక్కలు వగైరా నెమ్మదిగా నములుతోంది. తిరిగి ఏదోవిధంగా ఇంటికి చేరడమే మంచి పని అయింది.

విల్బర్ అవి తింటూ వుండగా లర్వీ ఒక సుత్తి, రెండు తెగ మేకులు తీసుకువచ్చి ఆ కర్రకంచెలో ఊడి పోయిన చెక్క మళ్ళీ గట్టిగా బిగగొట్టాడు. తర్వాత లర్వీ, జుకర్మన్ యథాలాపంగా ఆ కంచె మీదికి వంగి నిలబడ్డారు. జుకర్మన్ ఒక కర్రతో విల్బర్ వెన్నుమీద మెల్లగా గోకాడు.

"ఇది మంచి పంది మాదిరే వుసారుగా ఎగురుతా వుంది" అన్నాడు లర్వీ.

"ఔను! మంచి పందే అయ్యేట్టుంది" అన్నాడు జుకర్మన్ సాలోచనగా.

వాళ్ళు తనను మెచ్చుకుంటూ ఉండటం విల్బర్ వింది. తన కడుపులోని కమ్మని గంజి దానికి తేనుపు వచ్చింది. వీపు దురద పుట్టినప్పుడు ఆ కర్రకంచెకు వేసి రాస్తూన్నప్పటి సుఖం గుర్తుకి వచ్చింది. మనస్సు తృప్తిగా, హాయిగా నిద్ర వస్తూన్నట్టుంది. ఆ రోజు సాయంకాలం జరిగిన వ్యవహారం అంతా చాలా అలసట కలిగించింది. అప్పటికి ఇంకా సాయంత్రం నాలుగు గంటలయినా కాలేదు. అప్పుడే విల్బర్‌కి నిద్ర ముంచుకు వొచ్చేస్తూంది.

"నేనింకా చిన్నదాన్ని. ఒంటరిగా ప్రపంచంలోకి వెళ్ళడానికి నాకు ధైర్యం చాలలేదు" అనుకుంటూ కన్ను మూసింది విల్బర్.

4. ఒంటరితనం

మరునాడంతా మబ్బులు మబ్బులుగా, మధ్య మధ్య జల్లులు పడుతూ, మసక మసకగా ఉంది. గాదె కప్పుపైన కురిసిన వర్షపు నీరు చూరులనుంచి ధారలు కడుతూంది. పెరట్లో కురిసిన వర్షం వంకలు వంకలుగా ప్రవహిస్తూ, చివరికి పెద్ద తూములోంచి బయటి సందులోకి పోయి అక్కడ వున్న జిల్లేళ్లు, ఉమ్మెత్త మొక్కల్లోకి ప్రవహిస్తూంది. జుకర్మన్ భార్య పని చేసుకుంటూన్న వంటింటి కిటికీలలోంచి ఉండి ఉండి గప్పున గాలీ, జల్లూ లోపలికి వచ్చి పడుతున్నయి. మైదానంలో నిశ్చలంగా మేస్తూన్న గొర్రెల వీపులమీద దబదబా చినుకులు పడుతున్నయి. ఆ వానలో నిలబడివుండి వుండి అలిసిపోయిన గొర్రెలు మెల్లగా సందు ఎగువకు తమ మంద మధ్యకి నడిచి పోతున్నయి.

పాడు వాన! విల్బర్ వేసుకున్న కార్యక్రమం అంతటినీ తారుమారు చేసేసింది. ఆవేళ తన ఆవరణలో ఇంకో కన్నం తవ్వాలని విల్బర్ నిశ్చయించుకుంది. ఇంకా ఇతర కార్యక్రమాలు కూడా తయారు చేసుకుంది. ఆ రోజున విల్బర్ వేసుకున్న కార్యక్రమాల పట్టిక ఇది:

ఉదయం ఆరున్నర గంటలకు ఉదయ ఫలహారం: పాలు కలిపిన వేడి గంజి, కూరల చెక్కులు, బంగాళ దుంపల తొక్కులు, గోధుమ పిండి, మిఠాయికొమ్ములు, తియ్యని పండ్లరసం రాసిన నాన్ రొట్టెముక్కలు, గోధుమ జావ.

మొత్తంమీద ఏడు గంటలకల్లా ఉదయ ఫలహారం పూర్తిచేసెయ్యాలి.

ఏడు గంటలు మొదలు ఎనిమిది గంటలవరకు తన గంజితొట్టె కింద కన్నంలో ఉండే ఎలుక టెంపుల్టన్‌తో పిచ్చాపాటీ కబుర్లు.

నిజానికి టెంపుల్టన్‌తో బాతాఖానీ అంత సరదా అయిన పనేం కాదు. కాని, పనిలేకుండా ఒంటరిగా కూచోటంకంటె నయం."

తరువాత ఎనిమిది నుంచి తొమ్మిదివరకూ అలా ఆరుబయట వెచ్చని ఎండలో హాయిగా ఒక కునుకు తీయడం.

తొమ్మిది నుంచి పదకొండుదాకా ఒక కొత్త కలుగుగాని, కాల్వగాని తవ్వడం, ఆ తవ్వడంలో బహుశః బయటపడగల రుచికరమైన వస్తువుల్ని ఆరగించడం.

పదకొండు నుంచి పన్నెండు దాకా కర్రకంచెమీద గంతులేసే ఈగలను, బంతి మొక్కలమీద ఎగిరే తేనెటీగలను, గాలిలో పల్టీలు కొట్టే పావురాలను చూస్తూ కదలకుండా నిలబడటం.

పన్నెండు గంటలకి భోజనం: గోధుమపొట్టు, వేడి గంజి, ఆపిల్ పళ్ల తొక్కలు, మాంసరసం, కారట్ ముక్కలు, మాంసపు ముక్కలు, నిలవవున్న మొక్కజొన్న గంజి, వెన్న పొట్లం కట్టిన కాగితాలు వగైరా. ఒంటిగంటల్లా భోజనం పూర్తి అయిపోవాలి.

ఒంటిగంట నుంచి రెండింటి వరకు మధ్యాహ్నం నిద్రకు కేటాయించడమయింది.

రెండునించి మూడు వరకు దురదగా వున్నచోట వొళ్లు కంచెకేసి రాయడం.

మూడు నుంచి నాలుగు వరకు కదలకుండా నిలబడి ఈ జీవితాన్ని గురించి ఆలోచించటం, ఫెన్ కోసం ఎదురు చూడటం.

నాలుగు గంటలకు మళ్ళీ ఫలహారం: పాలగంజి కసవు, లర్వీగాడు గిండి తిని వదిలివేసిన నంజుడు ముక్కలు, కారల తొక్కలు, ఇదో ముక్క అదో చెక్క, ఓవేపుడు ముక్క, పళ్ళతాండ్ర ముక్కలు, ఒకటో రెండో పేయించిన ఆపిల్ వరుగులు, కొంచెం మాడిన రొట్టె పై పొర.

ఈ ప్రణాళిక అంతటిని గురించీ ఆలోచించుకుంటూ వుండగా విల్బర్ కి నిద్ర వచ్చేసింది. తీరా ఆరు గంటలకి మెలుకువవచ్చి చూసేసరికి వర్షం కురుస్తూంది. విల్బర్ కి పట్టరాని కోపం వచ్చేసింది.

"నేనంతా చక్కగా లెక్క ప్రకారం కార్యక్రమమంతా ఏర్పాటు చేసుకుంటే, మధ్యలో ఈ వెధవ్వాన వొచ్చిపడితే ఎల్లా?" అనుకుంది:

కొంతసేపు విచారంగా లోపలే కూచుంది. తర్వాత ద్వారం దగ్గరికి వచ్చి చూసింది. ఐదారు వాన చినుకులు ముఖంమీద పడినయి. తన దొడ్డి అంతా తడిసిపోయింది. గంప తొట్టెలో ఒక అంగుళం లోతున్న వాన నీళ్ళు చేరినయి. టెంపుల్టన్ ఎక్కడా కనిపించడంలేదు.

"టెంపుల్టన్! ఎక్కడున్నావ్?" అని అరిచింది విల్బర్. జవాబు లేదు. స్నేహితులెవ్వరూ లేకుండా, మాట్లాడటానికైనా ఎవరూ సాయం లేకుండా తాను ఒంటరిదై పోవడం విల్బర్ కి ఆందోళన కలిగించింది.

"ఏ రోజు చూసినా ఒకేలాగుంది. నేనా చిన్నదాన్ని. ఇక్కడ సావాసం ఎవ్వరూ లేరు. పైగా ఈ వేళ పొద్దుటినించి మధ్యా

హ్నాందాకా, మధ్యాహ్నం నుంచి సాయంకాలందాకా వర్షం కురిసే స్తూంటే ఎల్లా?

ఇల్లాంటి వెధవరోజున ఫెన్ ఎల్లా వస్తుంది? ఛీ! దిక్కు మాలిన రోజు!" అంటూ విల్బర్ ఏడవటం మొదలు పెట్టింది. గడచిన రెండు రోజుల్లో విల్బర్ ఏడవటం ఇది రెండవసారి.

ఆరున్నరకి విల్బర్ కి బాల్చీ చప్పుడు వినిపించింది. లర్వీ బైట వానలో నిలబడి తన తొట్టెలో గంజి కలుపుతున్నాడు.

"రా! దయచెయ్యండి సార్!" అని పిలిచాడు లర్వీ.

విల్బర్ కదలలేదు. లర్వీ ఆ తెచ్చిన మేత సామగ్రి అంతా ఆ తొట్టెలో పోసి, బాగా కలిపి లేచిపోయాడు. పందికి మళ్ళీ ఏదో తిక్కరోగం పుట్టింది అనుకున్నాడు.

విల్బర్ కి కావలసింది తిండికాదు. తనతో ఆడుకునే స్నేహితుడు ఒక్కడైనా కావాలి. గొర్రెల దొడ్డిలో ఒక మూలగా కదలకుండా కూచుని వున్న బాతుతో ఈ విషయం చెప్పింది.

"పోనీ, నువ్వు నాతో ఆడుకుంటానికి వస్తావా?" అని అడిగింది.

"అ-అ-అ-అయ్యో పాపం! పాపం! నె-నె-నె-నేను రాలేను విల్బర్! నేను గు-గ్గ-గ్గు- గ్గుడ్లు పొదుక్కుంటున్నాను. య్-య్-య్-యెనిమిది గుడ్లు మొత్తం. వాటికి వె వె వె- వెచ్చగా ఉండేటట్టు చు-చు-చు- చూడొద్దూ? అందుకోసం యి యి-యి- యిక్కణ్ణించి కదలటానికి వీల్లేదు. నాకు వి-వి-వి- వీల్లేదు విల్బర్. పొ-పొ-పొ- పొ-గాల్సిన గుడ్లు వున్నప్పుడు న-న న- నాకు ఆటాలేదు; పాటాలేదు నేను వి-వి-వి- వీటిని పిల్లల్ని చెయ్యాలి!" అంది బాతు.

‘‘ఔనులే. పాపం! నువ్వెంత రాజ హంసల్లాంటి పిల్లల్ని చెయ్య పోతున్నావో?’’ అంది కోపంగా విల్బర్.

తర్వాత విల్బర్ ఒక మేకపిల్లని అడిగి చూసింది.

‘‘మనమిద్దరం ఆడుకుందాం వస్తావా? మేకపిల్లా!’’

‘‘బలే! బలే! ఎల్లా రానూ? అసలు నేను కంచెదాటి నీ ఆవరణ లోకి రాలేనుగా! నిదామించి దూకగలంత పెద్ద దాన్ని అయిన ప్పుడుగదా! అయినా నాకు పందులంటే అసహ్యం! ఛీ! పందుల తోటి ఆట అసల్లేకపోయిం దానికంటె అసయ్యం,’’ అంటూ తిప్పు కుంటూ లేచిపోతూంది మేకపిల్ల.

‘‘ఏమిటీ? అసల్లేక పోయిందా [illegible] అసయ్యమా? అసలే లేక [illegible] ఇంకా [illegible] యిం దేంటి

"నాతో ఆడుకోటానికి వస్తావా టెంపుల్‌టన్?" విల్బర్ అ
గింది.



పెడుతూ అవసరమైతే ఎవరికీ కనబడకుండా మాయమైపోతూ కాల క్షేపంచెయ్యడం నాకు ఇష్టం. నేను తిండిపోతును గాని ఆట పోతును గాను. నే నిప్పుడెక్కడికి వెళుతున్నానో తెలుసా? అదుగో నీ మేత తొట్టెనిండా మంచి భోజనం వుంది- చూశావా? హాయిగా దాన్ని ఆరగించడానికి వెళుతున్నాను. బుద్ధి లేక పొద్దుటినించీ నువ్వు తినకుండా వదిలేసిన ఆ అప్పచ్చులన్నీ నేను సొమ్ము చేసేస్తాలే," అంది ఎలక. అంటూనే టెంపుల్టన్ గోడపక్కనుంచి మెల్లగా ద లాగ నడుస్తూ ఆ తలుపు వెనకనించి సరాసరి విల్బరు గంజి కిందికి తవ్విన సొరంగంలో జొరబడింది. టెంపుల్టన్ మంచి మారి ఎలక. తనకు అవసరమైన పనులు ఉపాయంగా, శ్రద్ధగా చేసుకుంటుంది. ఆ సొరంగం దాని తెలివితేటలకు, ప నికి నిదర్శనం. ఆ కన్నంగుండా అది గాదెలోంచి తలచుకొన్నప్పు డల్లా ఏమీ ప్రమాదం లేకుండా రెండో కంట బడకుండా క్షణంలో పోయి, విల్బర్ కొయ్య తొట్టె కింద తన విశ్రాంతి స్థలానికి చేరుకో గలదు. అసలు జుకర్మన్ల ఇల్లు, పెరడు అంతటికీ అది కన్నాలు తవ్వు కుంది. ఎవరికీ కనబడకుండా అది ఎక్కడికిబడితే అక్కడికి వెళ్ళ గలదు. సాధారణంగా అది పగలంతా నిద్రపోయి, చీకటి పడిన తర్వాత సంచారానికి బయలుదేరుతూ ఉండడం మామూలు.

టెంపుల్టను కన్నంలోకి పోవడం విల్బరు చూసింది. మరు క్షణంలో తన కర్రతొట్టె కింది సందులోంచి దాని ముట్టె బయటికి వచ్చింది. ఆ ఎలక జాగ్రత్తగా తొట్టె అంచు పక్కనించి పనస తొ రాన్ని బయటికి లాగుకుంది. విల్బర్ ఇక సహించలేకపోయింది. అసలే విసుగ్గా, విచారంగా ఉన్న ఆ పెధవ ముసురు రోజున తన పొద్దటి ఫలహారం అంతా తాను చూస్తూవుండగా ఇంకెవరో తినడం భరించలేకపోయింది. ధారాపాతంగా కురుస్తున్న ఆ వానలో

ఊంపుల్లను తడిసి ముద్దవుతుందని తెలుసు. కాని, అంత మాత్రాన విల్బర్ కోపం చల్లారలేదు. మరో మాట్లాడే దిక్కు లేక, దీనంగా, కడుపులో ఆకలి మండిపోతున్నా విల్బర్ పోయి పెంటకుప్పమీద పడి పడవడం మొదలు పెట్టింది.

ఆరోజు సాయంకాలం లర్వీ వెళ్ళి జుకర్మన్‌తో చెప్పాడు. "మన పందికేదో తెగులు తగిలినట్టుండది అయ్యగారూ! పొద్దుటేలనుంచి సేతో మేతే ముట్టుకోలేదు."

"రెండు చెంచాల గంధకం, కాస్త బెల్లప్పానకం కలిపి ," అన్నాడు జుకర్మన్.

లర్వీ వచ్చి విల్బర్‌ని గట్టిగా పట్టుకొని బలవంతాన ఆ మందు గొంతులో పోస్తూ ఉంటే, అసలు ఏమి జరుగుతున్నదీ కూడా విల్బర్‌కి అర్థం కాలేదు. తన జీవితంలో అంత దుష్టపు రోజు మరోటి లేదనుకుంది. భయంకరమైన ఆ ఏకాంతవాసం తాను ఇంక ఎంత కాలం భరించగలదో దానికి తెలియదు.



చీకటి సర్వాన్నీ చుట్టబెట్టింది. కొంచెం సేపటికి అంతటా నీడలు. గొర్రెలు నెమరువేస్తున్న చప్పుడూ, అప్పుడప్పుడు ఏదో ఒక ఆవు పలగొలుసును కదిలించిన చప్పుడూ తప్ప రోడ్డంతా సద్దుమణిగింది. ఆ చిక్కని చీకటిలో తానదివరకెన్నడూ విని ఎరుగని ఒక సన్నని

కంఠస్వరం వినిపించేసరికి విల్బర్ సంభ్రమానికి మేరలేదు. ఆ స్వరం సన్నగా ఉన్నా మనోహరంగా వుంది. "విల్బర్! నీ కిప్పుడు స్నేహితులు కావాలి, అంతేకదూ! నేను నీతో స్నేహంగా వుంటాలే పాపం! నిన్ను ఈవేళ పొద్దుట్నించీ చూస్తున్నాను. నువ్వు నాకు నచ్చావు," అని వినిపించింది ఆ స్వరంలోనే.

"కాని నువ్వెక్కడా కనపడవేం?" అంది విల్బర్ లేచి నుంచొని. "ఎక్కడ వున్నావు నువ్వు? ఎవరు నువ్వు?"

"నీకు పైగా ఇక్కడ వున్నాలే! పొద్దుపోయింది హాయిగా నిద్రపో! రేపు పొద్దున్నే చూద్దువు గానిలే!"

5. షాలట్

ఆ రాత్రికి అంతూ పంతూ లేదేమో అన్నట్టు గడిచింది. విల్బర్ కడుపు ఖాళీగావుంది. మనస్సుమాత్రం అనేక ఆలోచనలతో బరువుగా వుంది. కడుపు ఖాలీగా వుండి, మనస్సు బరువుగా వున్నప్పుడు నిద్ర పట్టడం కల్ల.

ఆ రాత్రి విల్బర్ మొత్తం ఒక డజను సార్లయినా లేచి నిలబడి, ఆ నల్లని చీకటిలోకి చూస్తూ, ఏవో అస్పష్టమైన ధ్వనులు వింటూ, అప్పుడు టైమెంతయి ఉంటుందో ఊహించడానికి ప్రయత్నించింది. రైతుల పెరడు ఎప్పుడూ నిశ్శబ్దంగా వుండదు. అర్ధరాత్రి కూడా ఎక్కడో ఏవో కదలిన చప్పుళ్ళు వినిపిస్తూనే ఉంటయి.

మొదటిసారి మెలకువ వచ్చి లేచి చూసినప్పుడు టెంపుల్టను ధాన్యపు గరిసెలో కన్నంవేస్తూన్న చప్పుడు వినిపించింది. టెంపుల్టన్ పళ్లు రంపపు పళ్లలాగ ఆ కొయ్యను కొంచెం కొంచెంగా కోస్తూ కావలసినంత చప్పుడు చేస్తున్నయి. "ఆ దొంగ ఎలక గావుల్ను!" అనుకుంది విల్బర్. "పళ్లతో పటపటలాడిస్తూ, అందరి ఆస్తి పాస్తులను నాశనంచేస్తూ, ఎందుకో అట్లా తెల్లవార్లూ మేలుకునే వుంటుంది! మర్యాదగా మిగిలిన జంతువు లన్నింటిలాగే తనుకూడా పడుకుని హాయిగా నిద్రపోకూడదూ?"

రెండోసారి విల్బర్ లేచేసరికి బాతు తన గూట్లో పక్కకు ఒత్తిగిలి తనలో తానే ఏదో గొణుగుకుంటోంది.

"టైమెంతయి వుంటుందిప్పుడు?" విల్బర్ మెల్లగా అడిగింది.

"బ-బ-బ- బహుశా ప-వ-ప- పదకొండున్నర అయివుంటుంది. ఏం? ను-ను-ను-నువ్వింకా నిద్రపోనేలేదా వ్-వ్-వ్- విల్బర్?"

"నా మనస్సు ఏవేవో ఊహలతో ఉక్కిరి బిక్కిరిగా ఉంది" అంది విల్బర్.

"వ్-వ్- వోహో! నాబాధ అదికాదు. న-న-న- నాకు మనస్సు తేలికగానే ఉంది. క-క-క- కాని, ఇక్కడ నా పొట్టకింద మ-మ-మ- మాత్రం నాగుడ్లు ఉన్నాయి. య్-య్-య్- ఏనిమిది గుడ్లపైన కూచొని నిద్రపోవటానికి ఎప్పుడైనా ను-ను-ను- నువ్వు ప్రయత్నించి చూశావా?"

"లేదు. చాలా కష్టంగా వుండివుంటుంది. పాపం! నీకు గుడ్డును పొదిగి పిల్లను చెయ్యడానికి మొత్తం ఎంత కాలం పడుతుంది?"

"మొ-మొ-మొ- మొత్తం అన్నీ కలసి ము-ము-ము-ముప్పయి రోజులు పడుతుంది. క-క-క- కాని మధ్యలో బాగా విసుగొస్తే నప్పుడు నే-నే-నే- నేనూ కొంచెం కొంటెతనం చేస్తూంటాలే కాళ్లతో కాస్త ఎండుగడ్డి ఆ గుడ్ల మి-మి-మి- మీదికి లాగి, కాసేపు పోయి అల్లా అల్లా తి-తి-తి- తిరిగి వస్తూంటాను."

విల్బర్ రెండుసార్లు ఆవలించి పడుకొని నిద్రపోయింది. రోజున అది కన్న కలల్లో మళ్ళీ ఆ సన్నని కంఠస్వరమే వినిపించింది:
"నేను నీతో స్నేహంగా ఉంటాలే నిద్రపో! రేపు పొద్దున చూస్తావు గానిలే నన్ను!"

ఇంకో గంటకి తెల్లవారుతుందనగా, విల్బర్ లేచి విన్నది. గాదె లోపల ఇంకా చీకటిగానే ఉంది. గొర్రెలన్నీ ఇంకా కదలకుండా పడుకున్నాయి. బాతు కూడా పలుకుతున్నట్టు లేదు. ఎరటి హాల్లో కూడా ఏమీ కదలిక లేదు. ఆవులు పడుకుని విశ్రాం

తీసుకుంటున్నాయి. గుఱ్ఱాలు కునికిపాట్లు పడుతున్నాయి. టెంపుల్టన్ ఆ పనిమాని, ఇంకేదో పనిమీద ఎక్కడికో పోయినట్టుంది. పై కప్పు దగ్గిర్నుంచి మాత్రం మెల్లగా ఏదో గీసినట్లు సన్నని ధ్వని వినిపిస్తూంది. అంతటా ఇలా ప్రశాంతంగాఉండి, వేకువ తెలితెలి రేకలకోసం నిరీక్షిస్తూన్న సమయమంటే విల్బర్‌కి ఇష్టం.

"తెల్లవార వచ్చేసింది!" అనుకుంది.

చిన్న కిటికీలోంచి కొంచెం మసక వెలుగు గాదె లోపలికి వస్తూంది. చుక్కలు ఒక్కొక్కటే మాయమైపోతున్నాయి. విల్బర్‌కి కొన్ని అడుగుల దూరంలో ఉన్న బాతు ఇప్పుడు కనబడుతూంది. ఆ బాతుతల ఎడమ రెక్కలోదూర్చి అలాగే కదలికా మెదలికా లేకుండా కూచుని ఉంది. క్రమంగా గొఱ్ఱెలు, గొఱ్ఱె పిల్లలు అన్నీ కనిపిస్తున్నాయి. ఆకాశం అంతా తెలివెలుగు అలముకుంది.

"అమ్మయ్య! చివరికి హాయిగా మళ్ళీ తెల్లవారింది. ఎంత మంచి రోజు! ఇవాళ నా కొత్త స్నేహితురాలు కనిపిస్తుంది!"

ఆమెకోసం చుట్టూ తిరిగి అంతటా వెతికింది విల్బర్. తన దొడ్డి అంతటా జాగ్రత్తగా చూసివచ్చింది. కిటికీ సందుల్లో కూడా వదిలిపెట్టలేదు. పైన కప్పుకేసి చూసింది. ఎక్కడా తన కొత్త స్నేహితురాలి జాడ కనిపించలేదు. చివరికి మాట్లాడితే జవాబు రావచ్చు ననుకుంది. నిజానికి తాను గొంతు విప్పి ఆ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించటం విల్బర్‌కి ఇష్టంలేదు. కాని, తన వింత స్నేహితురాలు ఎక్కడున్నదో తెలుసుకోడానికి అంతకన్న మరో దారి లేకపోయింది. అందుచేత విల్బర్ గొంతు సవరించుకుంది.

"వింటున్నావా!" అంది ముందుగా గంభీరమైన స్వరంతో గట్టిగా. "రాత్రి నిద్రపోయే సమయంలో నాతో మాట్లాడిన స్నేహితు

రాలా! నీవెవరో నామీద దయవుంచి ఏదైనా గుర్తు చెప్పో, సైగ చేసో నాకు కనపడేసెయ్యి. నీకు పున్నెం ఉంటుంది."

ఈ మాట అని కొంతసేపు నిశ్శబ్దంగా ఊరుకుంది విల్బర్. మిగిలిన జంతువులన్నీ తలలెత్తి విల్బర్ కేసి చూస్తున్నయి. విల్బర్ సిగ్గుపడింది. కాని, ఆ కొత్తస్నేహితురాల్ని చూసితీరాలి.

"వింటున్నావా? మళ్లీ ఒకసారి చెపుతున్నాను. నిన్నరాత్రి నిద్రపోయే సమయంలో నాతోమాట్లాడిన స్నేహితురాలెవరో దయచేసి జవాబు చెప్పగోర్తాను. నాకు నువ్వు స్నేహితురాలివి కాదలచుకుంటే, మరి నువ్వెక్కడున్నావో చెప్పకపోతే ఎల్లా?

గొఱ్ఱెలు చిరాకుతో ఒకదాని ముఖం ఒకటి చూసుకుంటున్నయి.

"విల్బర్! నీపిచ్చికేకలు కట్టిపెట్టు!" అంది గొఱ్ఱెలలో పెద్ద గొఱ్ఱె. "నీకు కొత్తస్నేహితురాలెవరైనా ఇక్కడ ఉంటే, నువ్వా స్నేహితురాలి విశ్రాంతికి భంగం కలిగిస్తున్నా వన్నమాట. స్నేహితుల్ని చే చెడగొట్టుకొనడానికి సులభ మార్గాలలో పొద్దున్నే వాళ్లు నిద్ర లేవకముందే వెళ్లి లెమ్మని దుంపతెంచడం అమోఘమైన ఉపాయం. నీకొత్త స్నేహితురాలు తెల్లవారు ఝామునే లేచేదీ లేనిదీ నీకు తెలుసా?"

"అయితే మీరంతా నన్ను క్షమించండి. నేను ఎవరికీ చికాకు కలిగించ దలచుకోలేదు." అని క్షమాపణ చెప్పుకుంది విల్బర్.

ద్వారానికి ఎదురుగా పెంటలోకి పోయి కిక్కురుమనకుండా పడుకుంది. పాపం! విల్బర్ కి తెలియలేదు, ఆస్నేహితురాలు అక్క

డికి సమీపంలోనే ఉంది. ఆముసలి గొఱ్ఱె చెప్పినమాట నిజమే. విల్బర్ స్నేహితురాలు ఇంకా నిద్ర లేవలేదు.

కాసేపటికి విల్బర్ కి ఉదయపు మేత పట్టుకొని లర్వీ వచ్చాడు. విల్బర్ ఆత్రంగా పరుగెత్తి ముక్కునా నోటా అంతా తినేసింది. తొట్టెలో ఏమీ మిగలకుండా శుభ్రంగా నాకిపెట్టింది. గొఱ్ఱెలు ఆ సందువెంట పడిపోతున్నయి. మగబాతులు వాటివెనక మెల్లగా అడుగులు పెట్టుకుంటూ, పక్కనున్న గడ్డిరేకుల్ని ముక్కుతో పట్టి లాగుతూ పోతున్నయి. కొంతసేపటికి విల్బర్ తీరా ఉదయపు కునుకు తీయడానికి సన్నద్ధం అవుతున్నప్పుడు, క్రితంరాత్రి తనను పలకరించిన సన్నని కంఠస్వరం మళ్లీ వినిపించింది.

"గుడ్ మానింగ్!" అంది ఆ కంఠస్వరం.

విల్బర్ ఒక్క గంతేసి లేచి నిలబడింది. "ఏమిటి? గుడ్ మానింగా! అంటె?" అని అరచింది.

"గుడ మానింగ్!" అంటూ మళ్లీ వినిపించింది.

"అంటే ఏమిటది? అసలు నువ్వెక్కడ ఉన్నావు?" విల్బర్ ఆదుర్దాగా అడిగింది. "దయచేసి నువ్వెక్కడున్నావో ముందుచెప్పు. తర్వాత 'గుడ్ మోనింగ్' అంటే ఏమిటో చెప్పు."

"గుడ్ మోనింగ్! అంటే నీకు ఈఉదయం శుభంకలగాలని, కోరుతున్నాను. అని అర్థం," అని వివరించింది ఆ కంఠస్వ ర్వరం. 'అనగా 'నమస్తే' అంటారే-దానికి బదులు నేను ఇలా అన్నాను. అంతకన్న దానికి పెద్దఅర్థం ఏమీలేదు. నిజానికి నేనామాట ప్రయోగించటం నాకే ఆశ్చర్యం వేస్తూంది. ఇక నేనెక్కడ ఉనా

చెపుతా విను. నువ్వు తేలికగానే గుర్తుపట్టొచ్చు. తల పైకెత్తి ఈ దర్వాజాపైన మూలగా చూడు, ఇక్కడే నా గూడు అల్లుకుంటున్నాను."

చివరకి, విల్బర్‌కి తన కొత్త స్నేహితురాలి దర్శన మయింది. తనతో ఎంతో దయతో మాట్లాడిన కొత్త స్నేహితురాలు కనిపించింది. ఆ ద్వారబంధంపైన మూలగా పెద్ద సాలెగూడు కనిపించింది



సాలీడు సందేశం

ఒ సాలెగూడుపైనించి తల కిందులుగా వేళ్లాడుతూన్న ఆ బూడిద రంగు సాలీడు కనిపించింది. ఇంతా చేస్తే అది చిన్న తుమ్మజిగురు బిందువంత వుంది. దానికి పొడుగైన ఎనిమిది కాళ్లున్నయి. అందులో ఒక కాలు ఎత్తి విల్బర్‌కి అభివందన సూచకంగా ఊపుతూ, "చూశావా నన్ను?" అంది.

"చూశాను. చూశాను. నమస్కారం. గుడ్ మోనింగ్! కులాసాగా ఉన్నావా? నువ్వు కనపడడం నాకు ఎంతో సంతోషంగాఉంది. నీపేరు ఏమిటి? దయచేసి నీపేరు చెప్పు," అంది విల్బర్ పట్టలేని ఆనందంతో.

"నాఫేరు షాలట్" అంది సాలీడు.

"షాలట్! వట్టి షాలట్ అనేనా?" ఆదుర్దాగా అడిగింది విల్బర్.

"షాలట్-ఏ-కవాటికా! నువ్వు ఊరికే షాలట్ అనిపిలు."

"నువ్వు చాలా అందమైన దానిపిలాగున్నావే" అంది విల్బర్.

"అవును. నేను నాజూకుగా, అందంగా ఉండేమాట నిజమే. సందేహంలేదు. నేనేకాదు; ఇంచుమించు మాసాలీడు జాతి అంతా ఇలాగే ఉంటుంది. అందులో కొందరు నాకంటె ఎంతో తెలివి తేటలు కలవాళ్లు కూడా వున్నారు. కాని, విల్బర్! నువ్వు నన్ను చూడగలిగినంత స్పష్టంగా నేను నిన్ను చూడగలిగితే బాగుండేది," అంది షాలట్.

"ఏం? నీకు చూపు సరిగ్గా ఆనటంలేదా? ఇక్కడ నీకు ఎగానే నేను ఉన్నాను."

"కాని నాకు దూరపు వస్తువులు కనిపించవు. దగ్గిర వస్తువులు మాత్రం అద్భుతంగా కనిపిస్తయి. కొన్ని విధాల ఇది మంచిదే. కొన్ని విధాల మంచిదికాదు. చూడు, ఈ ఈగను నేను ఎలా పట్టేస్తానో చూస్తూవుండు."

అంతకుముందు విల్బర్ తొట్టె అంచుమీద పాకుతూ ఉండిన ఒక ఈగ పైకెగిరి, షాలట్ గూడులోకి పోయి తగుల్కొని, ఆ జిగురు దారాల్లో చిక్కుపడింది. ఎల్లాగైనా ప్రాణాలతో బైట పడాలనే ఆందోళనతో రెక్కలు రెపరెపరెప కొట్టుకుంటూంది.

"చూస్తూ ఉండు. ముందుగా నేను దానిమీదికి వెళ్లి పడతాను," అంటూ ఒక్కసారిగా తలకిందులుగా దానిమీదికి వెళ్లి దూకింది. పడుతూనే, దాని వెనక కొననించి సన్నని పట్టుదారాలు బయటికి వస్తూన్నయి,



"తర్వాత ఈ దారాలతో దీన్నిచుట్టి పారేస్తాను," అంటూ ఆ ఈగను పట్టుకొని దానిచుట్టూ గబా గబా బోలెడు పేటల దారా లతో బిగించి చుట్టేసి, కదలడానికి వీలులేకుండా చేసింది. విల్బర్ ఇదంతా అమిత భయంతో చూస్తూంది. తన కళ్లతో తాను ప్రత్య క్షంగా చూస్తున్నా అదృశ్యాన్ని విల్బర్ నమ్మలేకుండా ఉంది. నిజా నికి ఈ ఈగంటే తనకి అసహ్యమే అయినా, ఈ ఘోరహత్య తనకు చాలా బాధ కలిగిస్తూంది.

"ఇకచూడు. దీన్ని చంపేస్తాను. అప్పుడిక దీనికికష్టం ఉండదు," అంటూ ఆ ఈగను కరుస్తూ అంది., "ఇక దానికి బాధ అంటూ ఏమీ ఉండదు. నాకిది ఈపూటకి మధ్యాహ్న భోజనానికి సరిపోతుంది."

"అంటే నువ్వు ఈగల్ని చంపి తింటావన్నమాట. అంతేనా?" అంటూ నిట్టూర్చింది విల్బర్.

"ఔను. ఒక్క ఈగలనే ఏమిటి? నల్లులు, గొల్లభామలు కొన్నిరకాల చిమ్మటలు, తూనీగలు, సీతాకోక చిలుకలు, బొద్దిం కలు, దోమలు - వీటిలాగే చూసుకోకుండా ఎగిరివచ్చి నాగూటిలో చిక్కుకునే ఇంకా చాలా రకరకాల ఎగిరే పురుగులు కూడ నాకు ఆహారంగా పనికివస్తాయి. ఏదో ఒకటి తిని బతకాలిగదా!"

"ఔను. ఔననుకో. కాని, అవి అంతరుచిగా సీకు?" అంది

...యి. నిజానికి నేను వాటిని తినను. తాగే ...ను," అంది షాలట్. సన్నగా నాజూ

కుగా వున్న దాని కంఠస్వరం ఇంకా ఇంకా నాజూగ్గా శ్రావ్యంగా మారింది.

"చెప్పకు. దయవేసి ఇంకా ఆవిషయం నాకు చెప్పకు" అంటూ మూల్గింది విల్బర్.

"ఏం? ఏముంది ఇందులో? నేను నిజంగా జరుగుతున్న విషయం చెప్పాను. ఈ ఈగల్ని, దోమల్ని తింటూ కూచోటం నాకూ ఇష్టంలేదు. అయితే నాకు అదే ఆహారం మరి. సాలీళ్లుకూడా ఏదో విధంగా పొట్టపోసుకోని బతకాలిగద. నేను వలల్లే సాలీడుగా పుట్టాను. అందుచేత, మాజాతిలో అందరిలాగే వలలాంటి గూడు అల్లి, దాంట్లో చిక్కుకున్న ఈగల్ని, దోమల్ని పట్టి తింటున్నాను. నాతల్లి ఇదేపని చేసింది. నాముత్తవతల్లి ఈ పనేచేసింది. మాజాతే వల లల్లేజాతి. ఈ వేలకు వేల సంవత్సరాలనుంచి మాసాలీడు జాతి ఈ విధంగా ఈగల్ని, దోమల్ని తింటూనే బతుకుతూంది;" అని ఉపన్యసించింది షాలట్.

"ఏమో! ఇది చాలా చెడ్డ అలవాటు" అంది విల్బర్ విచారంగా. తన కొత్తస్నేహితురాలు పచ్చినెత్తురు తాగేది అవటం విల్బర్ కి చాలా విచారం కల్గించింది.

"కాను నిజమే" అంది షాలట్. "కాని, నే నేంచెయ్యను? అంతకన్న గత్యంతరంలేదు. అసలు మొట్టమొదటిసారి పుట్టిన సాలీడు ఈవిధంగా సాలెగూడు అల్లటం, దాంట్లో చిక్కుకున్న ఈగలను, దోమలను తినటం ఎలా ప్రారంభించిందో తెలియదు. చాలా తెలివిగానే ఈ పద్ధతి కనిపెట్టింది అనుకో! అప్పటినించి మాజాతి అంతటికీ ఇదే బతుకు తెరువు అయింది. అయినా ఇదేమంత చెడ్డపని కాదు విల్బర్!"

సాలీడు సందేశం

"చాలా క్రూరమైన పని," అంది విల్బర్, ఇలాంటి మాటలు విని అభిప్రాయాన్ని మార్చుకునే దాన్ని కాదు నేను అన్నట్టు.

"ఈ విషయంలో నీ అభిప్రాయం సరి అయిందికాదు విల్బర్! నీకు ఆహారం చక్కగా అన్నీ అమర్చి నీదగ్గిరికి వస్తుంది. ఆవిధంగా నాకు మేత పెట్టేవారు ఎవ్వరూ లేరు. నా ఆహారం నేను స్వయంగా సంపాదించుకోవాలి. నా తెలివితేటలమీదే నేను ఆధారపడాలి. ఎప్పటి కప్పుడు జాగ్రత్తగా, తెలివిగా వ్యవహరించాలి. లేకపోతే ఆకలితో మాడి చావవలసి వస్తుంది. అన్ని విషయాలూ నాకు నేనే ఆలోచించుకొని నిశ్చయించుకోవాలి. నాకు చేతనైన దాన్ని పట్టుకుని తిని, దానితో తృప్తిపడాలి. దైవికంగా ఈగలూ, దోమలూ ఇలాంటివే ఇంకాకొన్ని రెక్కల పురుగులూ తప్ప నాకింకేమీ దొరకవు. పైగా ఇంకొకమాట కూడా ఆలోచించు, విల్బర్! ఈగల్ని, దోమల్ని మేము పట్టి తినకపోతే, ఈ ప్రపంచాన్నంతా నాశనంచేసేటంత అపరిమితంగా వాటిసంఖ్య పెరిగి పోతుందని ఒప్పుకుంటావా?"

"నిజమే! అలాంటి పని జరగడం నాకూ ఇష్టంలేదనుకో! కాని, ఒకవిధంగా నీగూడు మంచిదేనేమో!" అంది విల్బర్.

బాతు ఈ సంభాషణ అంతావిని తనలో తాను నవ్వుకుంది. 'జీ-జీ-జీ-జీవితంలో పాపం! విల్బర్ కి తెలీని సంగతులు బో-బో-బో-బోలెడన్ని ఉన్నాయి.' అనుకుంది. "ని ని ని-నిజానికి విల్బర్ అభం శుభం ఎరగని అమాయకపు ప-ప-ప పందిపిల్ల. వ-వ వ-వచ్చే క్రిస్మస్ పండగప్పుడు త-త-త-తన గతి ఏమికాబోతుందో పాపం దానికి తెలియదు. జుకర్మన్, లర్వీ పండక్కి తనని చ-చ-చ-చంపడానికి ఆలోచిస్తున్న సంగతే ఎరగదు." అంటూ బాతు ఒక్కసారి

లేచి తన పొట్టకిందనున్న గుడ్లను వెచ్చదనం కలిగించటంకోసం రెక్కలతో ఇంకా కొంచం దగ్గరికి తీసుకుంది.

షాలట్ ఆ ఈగదగ్గరే కదలకుండా నిలబడి, దాన్ని ఆరగించడానికి చూస్తూంది. విల్బర్ పడుకొని కళ్లుమూసుకుంది, రాత్రంతా నిద్రలేక పోవడంవల్లా, కొత్త స్నేహితురాలు దొరకడం వల్ల కలిగిన సంభ్రమంతోనూ బాగా అలసిపోయింది. తన ఆవరణ వెలుపలి పరిమళ ప్రపంచంలోంచి వచ్చిన ఒక పిల్లగాలి క్లోవర్ మొక్కల వాసనలు తీసుకువచ్చింది. "నాకో కొత్త స్నేహితురాలు దొరకడం బాగానేవుంది. కాని, స్నేహంకూడా జూదంలాంటిదె లాగుంది! ఈ షాలట్ భయంకర, క్రూర, కుటిల, రక్త తృష్ణామయ ప్రవర్తన బలేదారుణంగావుంది. ఇందులో ఒక్కటీ నాకునచ్చిన గుణంకాదు. ఇలాంటి స్నేహితురాలిపై నాకు ఎప్పటికైనా ఇష్టం ఏర్పడుతుందా? ఎంత అందమైనదీ, తెలివైనదీ అయితే మాత్రం ఏం లాభం?"

కొత్త స్నేహితులు తటస్థపడినప్పుడు సామాన్యంగా అందరినీ ఆరాటపెట్టే భయాలూ, సందేహాలూ - అన్నీ విల్బర్ కీ ఏర్పడినయి. కాని, షాలట్ ని గురించి తాను చాలా దురభిప్రాయ పడినట్లు త్వరలోనే విల్బర్ గ్రహించింది. పైకి దౌర్జన్యంగా, క్రూరంగా కనిపించినా ఆమెది ఎంతో జాలిగుండె. ఆమె స్నేహం సాటిలేని అండగా, శాశ్వతంగా నిలబడి ఉండేస్నేహం!

౬. వేసవిరోజులు

వేసవికాలం మొదట్లో కొన్నిరోజులు అక్కడ సంవత్సరం మొత్తంమీద అతి సుఖకరమైన కాలం. విలాక్ పుష్పాలు వికసించి గాలిలో సుగంధంనించి, వాడిపోతాయి. ఆపిల్ పళ్లతోటల నిండా తుమ్మెదలు ఝుమ్మని సంగీతాలు పాడుతూ ఉంటయి. చలి కాలం వెనకబట్టి వాతావరణం వెచ్చ వెచ్చగా మారుతూ ఉంటుంది. రోజులు మృదువుగా సుఖంగా గడిచిపోతూ ఉంటయి. స్కూళ్లకి సెలవలిచ్చేస్తారు. ఆడుకునేందుకూ, గాలాలు పట్టుకుని ఏటికి పోయి సరదాగా చేపలు పట్టడానికి పిల్లలకు కావలసినంత పొద్దు వుంటుంది. అవెరీ సామాన్యంగా రోజూ ఒకటో రెండో పచ్చి చేపల్ని పట్టి జేబులో వేసుకొచ్చేవాడు.

బడికి వెళ్లవలసినపని లేదుగనుక ఫెర్న్ దాదాపు రోజూ విల్బర్ దగ్గిరికివచ్చి చాలాసేపు ఆ ముక్కాలిపీట మీద కూచుంటుంది. అక్కడి జంతువులన్నీ ఆ పిల్లను తమలో ఒకతెగా చూసుకునేవి. గొర్రెలు మెల్లగావచ్చి ఆమె కాళ్లదగ్గిర పడుకునేవి.

జూలై మొదటివారంలో ఒకరోజున దుక్కి గుర్రాలను యంత్రానికికట్టి, జుకర్మన్ తొట్లో ఎక్కికూచుని, చేలోకి తోలుకు [illegible]. ఆ రోజున ఉదయమంతా ఆ చేలో ఎగువకు దిగువకు [illegible] చేసంతాకోసి పెడుతూన్న ఆ యంత్రపు రొదతోటే [illegible] ఆ యంత్రం పోయినంతమేర దాని వెనకాల[illegible]

పాటి కోతకత్తి వెనక పచ్చని క్లోవర్ గడ్డి మోపుల్లు, గుంపులుగా పడుతూంది. దైవం రక్షించి మరునాడు పెద్దవాన రాకపోతే, అక్కడ వ్యవసాయపు పనివాళ్లంతా ఆ గడ్డి కట్టలు కట్టి, గడ్డిబండిమీద ఎత్తుగా వేసి కట్టి తోలుకొస్తారు. ఫెన్, అవెరీ ఆ బండీపైన ఎక్కి కూచుంటారు. ఆపైన ఆ వెచ్చని కమ్మని గడ్డిని పశువులపాక అటక మీద పేరుస్తారు. ఆరోజున ఆ పశువులదొడ్డి ఎక్కడచూసినా పెద్ద పెద్ద గడ్డిమోపులతో దాగుడు మూతలాటకి ఫస్టుగా ఉంటుంది. ఒక్కొక్క రోజున అవెరీకి ఆ గడ్డిలో ఏదో పసిరిక పాము కనబడడం, వాడు దాన్ని చంపి చుట్టచుట్టి జేబులో పెట్టుకుని ఇంటికిరావటం జరుగుతూంటుంది.

తొలి వేసవిరోజులు పశులకు పండగరోజులు. ఇంటిచుట్టు పక్కల పెరటిలోను, చేలలోను, అడవుల్లోను ఎక్కడచూసినా ప్రణయ రాగాలు, ప్రేమగీతాలు, కొత్తగూళ్లు, కొత్తగుడ్లు. అడవుల అంచుల్లోంచి తెల్లగొంతుక పిచ్చుక (ఇది ఎక్కడో బోస్టన్ నుంచి వస్తుంది) "ఓపీబడీ! పీబడీ! పీబడీ!" అని పిలుస్తుంది. ఆపిల్ కొమ్మమీదనుంచి ఆడపిచ్చుక కిలకిలలాడి, తోకాడిస్తూ, "ఫోబీ! ఫోబీ!" అంటుంది. జీవితం ఎంత హ్రస్వమైనదీ, ఎంత మనోహరమైనదీ తెలిసిన సంగీతపు పిచ్చుక "స్వీట్! స్వీట్! స్వీట్! ఇంటర్లూడ" అంటూ విజేతాగానం చేస్తుంది. ఇక పశువులదొడ్డిలోకి వస్తే చూరులలో గూళ్లుకట్టుకుంటున్న ఊరపిచ్చుకలు చర్రున కిందికివచ్చి "చీక్-చీక్" అంటూ గలభా చేస్తూంటాయి.

వేసవి **తొలి** రోజుల్లో చిన్నపిల్లలకు తినడానికి, తాగడానికి, చీకడానికి, బుగ్గన పెట్టుకోవడానికి బోలెడు చిరుతిండ్లు ఉంటాయి. తెల్లగన్నేరు చెట్లకొమ్మలనిండా పాలుప్రవాహాలు కడుతూ ఉంటాయి.

క్లోవర్ మొక్కల చివళ్ళు అమృతం చిప్పిలుతూ ఉంటాయి. ఇంట్లో ఫ్రిజిడర్ పెట్టెలో ఎప్పుడూ బోలెడన్ని ఐస్ ఫ్రూట్‌లు, కూల్ డ్రింకులు, ఐస్ క్రీములు సిద్ధంగా ఉంటయి. ఎటుచూసినా జీవితం సుఖమయంగా కనిపిస్తుంది. ఎండిన రాలిపోబోతున్న కొమ్మని కూడా, మధ్యకి చీల్చిచూస్తే దాని కడుపులో పచ్చనిపురుగు ఉంటుంది. బంగాళదుంప తీగలకు అడుగువేపున సన్నని ఆకుపురుగు చిన్నగుండు కట్టి నారింజపండురంగు గుడ్లు పెడుతుంది.

ఆ వేసవి మొదటి రోజులలో ఒకరోజున బాతుగుడ్లు విచ్చి పిల్లలయినయి. ఆ పశువుల దొడ్డిలో ఇది ఒక గొప్ప సంఘటన. ఫెర్న వచ్చి ఆ స్టూల్ మీద కూచుని ఉన్నసమయంలోనే ఈ సంఘటన జరిగింది.

ఒక్కబాతుకి తప్ప మిగిలిన ఎవ్వరికీ తెలియకముందే షాలట్‌కి ఈ సంగతి తెలిసిపోయింది. బాతుకి ఒకరోజుముందే, మర్నాడు తన పిల్లలు గుడ్లల్లోంచి బయటికి వస్తయ్యని తెలుసు. ఆ గుడ్లల్లో పసిపిల్లల సన్నని కూతలు ఆతల్లి బాతుకి వినిపించేవి. అవి ఎదగడం వల్ల ఆ గుడ్లలో వాటికి ఇరుకుగా ఉందనీ, కనుక త్వరలో ఆ గుడ్ల పైడొలకల్ని పగలకొట్టుకుని బయటికి రావడానికి చూస్తున్నాయనీ ఆబాతుకి ముందుగానే తెలుసు. అందువల్ల ఆ రోజున మరీ అసలే కదలకుండా, మౌనంగా కూచుంది తల్లిబాతు.

అందులో మొట్టమొదటి బాతుపిల్ల బూడిదరంగుగా ఆకు పచ్చగా కనిపించే తన చిన్నతల తల్లిబాతు రెక్కఈకల సందులోంచి బయటపెట్టి తొలిసారి తొంగి చూసినప్పుడే షాలట్ కనిపెట్టి, ఆ సంగతి అందరికీ చెప్పేసింది.

"వినండి. అంతా వినండి! ఈ పశువుల దొడ్డిలో జీవించే జంతువు లన్నిటికీ సంతోషవార్త! మన స్నేహితురాలు పాపం నాలుగు వారాలుగా నిద్రాహారాలు కూడా మాని, నిర్విరామంగా చేసిన నిరీక్షణ ఫలించింది. ఆమె గుడ్లలోంచి పిల్లలు బయటికి వస్తున్నయ్. బాతు అక్కకు నా హృదయ పూర్వకమైన అభివందనాలు."

"న-న-న-నమస్కారం! న-న-న-నమస్కారం!" అంది బాతు. పాలట్‌కి కృతజ్ఞత తెలుపుతూ, త బాసుతూ.

"న-న-న నమస్కారం!" అంది మగబాతు.

"నేను కూడా నిన్ను అభినందిస్తున్నాను," అంది విల్బర్. "మొత్తం ఎన్నిపిల్లలు? నాకు ఒకటే కనిపిస్తూంది."

"మొత్తం ఏడు ఉన్నయి" అంది బాతు.

"భేష్," అంది పాలట్, "ఏడు సంఖ్య బలే అదృష్టపు సంఖ్య."

"దీనికి అదృష్టంతో ఏమీ సంబంధం లేదు. జాగ్రత్తగా కష్ట పడి పొదిగిన ఫలితం ఇది," అంది బాతు.

ఇలా అంటూ ఉండగా, విల్బర్ కొయ్యతొట్టె కింద తన రహస్య స్థలంనుంచి టెంపుల్టన్ తొంగిచూసింది. ముందుగా అది ఫెన్ కేసి చూసింది. తరువాత జాగ్రత్తగా అడుగులో అడుగు పెట్టుకుంటూ గోడపక్కనించి బాతు ఉన్నవేపుకి నడిచి పోతూంది. ఆ చుట్టుపక్కల ఉన్న కళ్ళన్నీ టెంపుల్టనువేపు తిరిగాయి. ఎవరికీ అదంటే ఆట్టే ఇష్టంలేదు. ఎవ్వరూ దాన్ని నమ్మరు.

"చూడు!" అంటూ మొదలుపెట్టింది తన కొంటెస్వరంతో టెంపుల్టన్. "ఏడు పిల్లలే ఉన్నయ్యంటున్నావేం? ఎనిమిది గుడ్లు ఉండేవిగా? ఆ ఎనిమిదో గుడ్డు పిల్ల కాలేదా?"

"అ-అ-అ-అది చెడిపోయింది", అంది బాతు.

"దాన్ని నువ్వేం చేస్తావు?" అంది టెంపుల్టన్- నల్లపూసల్లాంటి కళ్లతో సూటిగా బాతువంక చూస్తూ.

"కావాలా నీకు? పట్టుకుపో! మెల్లగా దొర్లించుకునిపోయి, నీపనికిమాలిన సామగ్రిలో చేర్చుకో." (ఆ వ్యవసాయ క్షేత్రంలో ఎక్కడే విచిత్రమైన వస్తువులు కనిపించినా, తీసుకుపోయి తన కన్నంలో దాచుకుంటూ వుండటం టెంపుల్టన్‌కి మామూలు. దేన్నీ వదిలి పెట్టదు. పనికిమాలిన వస్తువుల్ని కూడా ప్రాణపదంగా దాస్తుంది.)

"అ-అ-అ అవును. తీసుకుపో!"- అంది మొగబాతు. "ఆ గుడ్డు నువ్వు తీసుకుపో. కాని ఒక్క విషయం మాత్రం జ్ఞాపకముంచుకో. నువ్వు మా పిల్లల విషయంలో మాత్రం నీకొంటె కోణంగి చేష్టలేమైనా చేశావా, ప్రపంచంలో ఏ ఎలుకకీ ఎన్నడూ జరగని ప్రాయశ్చిత్తం నీకు జరుగుతుంది." ఈ మాట అంటూ మొగబాతు తన తడాఖా చూపడానికి బలిష్ఠమైన తన రెక్కలు విప్పి ఒకటి రెండుసార్లు గట్టిగా ఝాడించింది. మొగబాతు చాలా బలం, సాహసం గలది అన్నమాట నిజమే. కాని, తల్లిబాతుకి, మొగబాతుకి కూడ టెంపుల్టన్ తమ పిల్లల్ని ఎప్పుడేం చేస్తుందో అనే భయం బాధిస్తోంది. వాటి భయానికి కారణంకూడా లేకపోలేదు. ఆ నీచపు ఎలుకకి నీతి నియమాలు గాని, మంచి చెడ్డల పట్టింపుగాని, యుక్తాయుక్త వివేకంగాని, మర్యాదగాని, దయా దాక్షిణ్యాలుగాని, ఉదారాశయాలు గాని, స్నేహ భావంగాని - ఏమీ లేవు. ఒక బాతుపిల్లని లాక్కుపోవడానికి వీలవుతే, దాన్ని చంపెయ్యడానికి ఎంతమాత్రం వెనకాడదు. ఈ సంగతి బాతుకి తెలుసు. మిగిలిన జంతువులకీ తెలుసు.

పొదిగినా పిల్లకాని ఆగుడ్డును బాగా సన్నపెడల్పాటి ముక్కుతో గూట్లోనుంచి బయటికి దొర్లించింది. ఏదిపడితే అది తినే ఎబ్బర్‌కి కూడా దాన్ని చూస్తే అసహ్యమేసింది. "పుల్లకంపు కొట్టే ఈ పాడుగుడ్డు కూడా నాకి కావాలంటుందేమిటి?" అంటూ గురగుర లాడింది.

"ఎలుకంటే ఏమిటనుకున్నావ్ మరి?" అంటూ సన్నగా నవ్వుతూ అంది షార్లెట్. "కాని, ఖర్మంచాలక ఆ కుళ్ళు గుడ్డు గనక పగిలిందా, ఇక ఈ పశువులదొడ్డి విడిచిపెట్టి లేచిపోవలసిందే!"

"ఏం అలా అంటున్నావ్? ఎందుకు లేచిపోవటం?" అని అడిగింది విల్బర్.

"ఆ దుర్వాసన భరిస్తూ ఎవ్వరూ ఇక ఇక్కడ ఉండలేరన్న మాట! కుళ్లిన గుడ్డంటే ప్రాణాంతకమైన దుర్గంధపు బాంబు అన్నమాట."

"అబ్బే! నేను దీన్ని పగలగొట్టనులే. దాన్ని ఎల్లా దాచుకోవాలో నాకు తెలుసులే. నేను ఎప్పుడూ ఇలాంటివి ఎన్నిటినో దాచి వాటితో గమ్మత్తు చేస్తూ వుంటాను తెలుసా?" అంది టెంపుల్టన్.

అంటూనే ముందుకాళ్లతో ఆ గుడ్డును దొర్లించుకుంటూ మెల్లగా తన కన్నంలోకి తీసుకుపోయింది ఎలక. తోస్తూ, దొర్లిస్తూ నిలువుగా తిప్పి గెంటుతూ, మొత్తంమీద ఎలాగో ఆ గుడ్డుని విల్బర్ కొయ్యతొట్టెకింద ఉన్న తన విచిత్ర వస్తుశాలలోకి చేర్చుకుంది.

ఆ సాయంకాలం గాలి తగ్గిపోయి, పశువులదొడ్డి అంతా నిశ్శబ్దంగా, వెచ్చగా వున్నప్పుడు బాతు తన ఏడు పిల్లల్ని గూటిలోంచి బయటికిపిలిచి ప్రపంచంలోకి వదిలింది. జుకర్మన్ విల్బర్ కి సాయంకాలపు ఆహారం తీసుకొస్తూ ఈ సంగతి కనిపెట్టాడు.

"ఓ. బలే బలే. ఆగండి! మొత్తం ఎన్నో లెక్కపెడదాం!" అని నవ్వుతూ "ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు. ఏడు చిన్నబాతులు. ఇప్పుడు బాగుంది," అనుకున్నాడు జుకర్మన్.

7. దుర్వార్త

రోజు రోజుకీ విల్బర్‌కి షాలట్ అంటే మంచి ఇష్టం ఏర్పడుతూంది. చిన్నపురుగులను హతమార్చడం మంచిపనే అనీ, అవసరమైన పనికూడా అనీ నమ్మకం ఏర్పడింది. ఈగల్ని గురించి జాలిపడినజీవి ఆ పశువులదొడ్డి మొత్తంమీద ఒక్కటి కూడా కనిపించలేదు. ఇతరులకు చిరాకు కలిగించడమే ఈగలు జీవితం పొడుగునా చేసేపని. ఆవులకి ఈగలంటే అసహ్యం. గొర్రెలకు చెప్పనే అక్కర్లేదు. జుకర్మనూ, ఆయన భార్యా అస్తమానం ఈ ఈగలతో బాధపడలేక పోతున్నామని గోలపెడుతూ, వాటిని తరిమివేయడానికి ఏవేవో ప్రయత్నాలు చేస్తూవుంటారు.

షాలట్ వాటిని తుదముట్టించే పద్ధతికూడా విల్బర్‌కి ఇప్పుడు నచ్చింది. ముఖ్యంగా షాలట్ తాను పట్టిన పురుగుల్ని తినడానికి పూర్వం వాటిని నిద్రపుచ్చడం బాగా ఉన్నదనుకుంది.

"అదిమాత్రం చాలా మంచిపనే!" అంది విల్బర్.

"ఔను. వాటికి ఒకరకమైన మత్తుమందు లాంటిది ఇచ్చివేస్తాను. ఆపైన వాటికి ఏబాధా తెలవదు. అదే వాటికి నేను చేసే రవ్వంత ఉపకారం," అంది షాలట్.

రోజులు గడచినకొద్దీ విల్బర్ చురుకుగా ఎదుగుతూంది. రోజుకి మూడుసార్లు దానికి మంచి పుష్టికరమైన మేతతెచ్చి పెడు

తున్నారు. రోజూ గంటల తరబడి పక్కకు ఒరిగి పడుకుని మగత నిద్రలో ఏవేవో తియ్యనికలలు కంటూంటుంది. దాని ఆరోగ్యం చాలా బాగాఉంది. తూకంకూడా బాగా పెరిగింది. ఒకరోజున సాయం కాలం ఫెన్ వచ్చి ఆ పీటమీద కూచునివుండగా ముసలిగొర్రె పశు వులదొడ్డిలోకి గబగబావచ్చి, విల్బర్ దగ్గిర ఆగింది.

"ఏం విల్బర్! నువ్వు బాగా బలిసి దిట్టంగా తూకం పెంచు కుంటున్నావే!" అంది ముసలి గొర్రె.

"ఔను. నా తూకం పెరిగింది. నావయస్సులో ఏపుగా ఎదిగి బలం సంపాదించడం మంచిదేగా?" అంది విల్బర్.

"ఔను, నిజమే. నేను నీమీద అసూయతో మాట్లాడటంలేదు. కాని, వాళ్లు నిన్ను ఇలా బలవ పెడుతున్న దెందుకో నీకు తెలుసా?" అని గొర్రె అడిగింది.

"తెలియదు. ఎందుకు?"

"దుర్వార్తలు తెలపడం నాకు ఇష్టంలేదు. కాని మొత్తం మీద వాళ్ళు నిన్ను బలవ పెడుతున్నది త్వరలో నిన్ను చంపడానికి తెలుసా?"

"త్వరలో నన్ను... చంపేస్తారూ?" అరిచింది విల్బర్. ఫెన్ ఆ బల్లమీద కూచున్నది కూచున్నట్టే బిగుసుకు పోయింది.

"చంపుతారు. చంపి నీమాంసంతో రకరకాల కూరలు, 'హాం' తయారు చేసుకుంటారు," అని వివరించడం మొదలు పెట్టింది ముసలిగొర్రె.

"రైతులు చలికాలం రాగానే నీలాంటి చిన్నపందుల్ని చంపి తింటారు. అందుచేత, క్రిస్మస్ పండుక్కి నిన్ను చంపడానికి ప్రయత్నం జరుగుతూంది. లర్వీ, జుకర్మన్ జాన్ అరబుల్ దేళలు – అంతా ఈ గూడుపుఠాణిలో ఉన్నారు."

"మన ఫెన్ నాన్నగారు జాన్ అరబుల్ కూడ ఇందులో ఉన్నారా?" విల్బర్ ఏడవటం మొదలుపెట్టింది



"నిస్సందేహంగా. ఏ రైతు పందిని చంపబోతున్నా ఇరుగు పొరుగు వారంతా సహాయంచేస్తారు. నేను ముసలి ముండని. ఏటేటా ఈపని జరుగుతూ ఉండటం ఎన్నాళ్లనించో చూస్తున్నాను. అరబుల్ తన 22 అంగుళాల తుపాకీ పట్టుకొచ్చి......"

"ఆగు! ఆగు! ఇక చెప్పద్దు" అరుస్తూంది విల్బర్. "చచ్చిపోవటం నాకు ఇష్టంలేదు. నన్ను కాపాడండి. ఎవరైనాసరే నన్ను కాపాడండి!" ఫెన్ లేచి విల్బర్ దగ్గిరికి పరిగెత్తుదామనుకుంటూండగా ఈ మాటలు వినిపించాయి.

"అరచి హంగామాచెయ్యకు విల్బర్!" అంది, అంతవరకు ఈ దారుణ సంభాషణ అంతా వింటూన్న షాలట్. "నేను ఊరుకోలేను" అంటూ విల్బర్ అటూ ఇటూ పరిగెత్తుతూండి. "నాకు చచ్చిపోవాలని లేదు. ముసలిగొర్రె చెబుతున్న మాట నిజమేనా షాలట్? చెప్పు!"

"ఔను. ఆ పెద్ద గొర్రె ఎన్నాళ్ళుగానో ఈ పశువుల దొడ్లో ఉంటూంది. నీలాంటి క్రిస్మస్ పందులెన్నో రావటం, పోవటం ఆమె చూసి ఉంటుంది. నిన్ను చంపడానికి వాళ్లు ప్రయత్నం చేస్తున్నారని ఆమెచెపితే అది నిజమే అయివుండాలి. కాని, ఇంతక్రూరత్వం, ఇంత దుర్మార్గం నేను కనివిని ఎరగను. కాని, మనుష్యులు మాత్రం ఇది దుర్మార్గం అనుకోరు" అంది షాలట్, సాలోచనగా తన సాలెపట్టను ఒకకాలితో తడుతూ.

విల్బర్ ఏడుపుకి అంతులేదు. "నేను చావను, నాకు చచ్చిపోవటం ఇష్టంలేదు. నాకు బతికి ఉండాలని ఉంది."

"ఇక్కడే ఈ పెంటకుప్ప మీదే మీ అందరితోపాటు నన్నూ బతికి ఉండనీయండి. హాయిగా ఈ కమ్మని గాలి పీలుస్తూ, ఈ వెచ్చని బంగారు ఎండలో నన్ను బతకనియ్యండి."

"నీ యేడుపు కూడా కొంతముద్దుగానే ఉంది." అంది ముసలిగొర్రె.

"నేను చచ్చిపోను, ఏమైనాసరే!" అని అరిచింది విల్బర్ - నేల మీదపడి దొర్లుతూ, ఏడుస్తూ.

"నువ్వు చావవులే!" అంది షార్లెట్ గంభీరంగా.

"ఏమిటీ? నిజంగానా? ఎల్లా? నన్ను ఎవరు బతికిస్తారు?" అంది విల్బర్.

"నేను"

"ఎల్లా?"

"అదే ఆలోచించాలి. నేను నిన్ను కాపాడడం మాత్రం నిజం. నువ్వుమాత్రం వెంటనే ఏడుపు కట్టిపెట్టి గప్‌చిప్‌గా ఉండాలి. నువ్వు వట్టి పసిపిల్లలా ప్రవర్తిస్తున్నావు. మానెయ్ ఏడుపింక. ఈ పిచ్చిగోల ఇంక నేను భరించలేను."

8. ఇంట్లో సంభాషణ

ఆ దివారం ఉదయం జాన్ ఆరబుల్, ఆయన భార్యా కూతురు ఫెన్ ఫలహారాల బల్లముందు కూచుని ఉన్నారు. అవెరీ అప్పటికే ఫలహారం ముగించి మేడమీదికి పోయి వడిసెల కర్రకోసం వెదుకుతున్నాడు.

"హోమర్ బాబాయిగారి బాతుకి పిల్లలు పుట్టినయ్యేవ్? తెలుసా?" అంది ఫెన్ వాళ్లమ్మతో.

"ఎన్ని?" అన్నాడు తండ్రి.

"ఏడు చిట్టిపిల్లలు" అంది ఫెన్. "అసలు ఆ బాతేమో ఎనిమిది గుడ్లుపెట్టింది. అందులో ఒకగుడ్డు పిల్ల కాలేదు. ఇంక ఆ గుడ్డు తనకి వద్దని ఆ బాతు టెంపుల్టన్‌కి చెప్పేసింది తెలుసా? అంచేత టెంపుల్టన్ ఆ గుడ్డుని తీసుకు చక్కా పోయింది."

"ఏమిటీ? బాతు ఏమిచేసిందీ?" అంది తల్లి కంగారుగా ఆ పిల్ల ముఖంకేసి చూస్తూ.

"ఆ గుడ్డు ఇంక నాకు వద్దూ అని టెంపుల్టన్‌కి చెప్పింది." అని మళ్లీ చెప్పింది ఫెన్.

"టెంపుల్టన్ ఎవరే?" తల్లి అడిగింది.

"ఆ ఎలకే! మా కెవ్వరికీ ఆ ఎలకంటే ఇష్టంలేదు తెలుసా?"

"మాకెవ్వరికీ అంటే? మీరంటే ఎవరూ?" తండ్రి అడిగాడు.

"అయ్యో! ఎవ్వరేమిటినాన్నా! ఆ పశువుల దొడ్లో అందరమూను. విల్బరు, గొర్రెపిల్లలు, బాతు, మొగబాతు, బాతుపిల్లలు, షాలట్, నేను, అందరమూ."

"షాలట్టా? ఎవరా షాలట్?" తండ్రి అడిగాడు.

"విల్బర్ కి మంచి స్నేహితురాల్లే! షాలట్ చాలా తెలివైంది తెలుసా?"

"అది ఎలా ఉంటుంది?" అన్నాడు తండ్రి.

"అదా...? దానికి ఎనిమిది కాళ్లుంటయి. సాలీడు లన్నిటికీ అలాగే ఉంటయ్యేమో అసలు."

"షాలట్ అనేది సాలీడు పేరా?" తల్లి అడిగింది.

"ఫెన్ తలడూపింది. తెల్లగా పెద్దసాలీడు. విల్బర్ గొడ్డికొట్టు గేటు లేదూ? దానిపైన అడ్డంగా బలేమంచి సాలెగూడు అల్లిందిలే! ఈగల్ని పట్టుకుని, వాటిరక్తం తాగేస్తుంది. విల్బర్ కి షాలట్ అంటే ప్రాణం తెలుసా?"

"నిజంగానా?" అంది తల్లి ఏదో యథాలాపంగా. ఆమె ముఖంలో ఏదో ఆందోళన కనిపిస్తూంది. ఆమె ఫెన్ వంకే చూస్తూంది.

"నిజం అమ్మా! షాలట్ అంటే విల్బర్ కి ఎంతఇష్టమో అంత ఇష్టం. బాతుపిల్లలు బయటికి వచ్చినప్పుడు షాలట్ ఏమన్నదో తెలుసా?"

"తెలియదమ్మా! నువ్వే చెప్పు." అన్నాడు తండ్రి.

"మరేం! ఆ బాతుపిల్లల్లో ఒకటి ఆ బాతు కిందనుంచి తల ఇవతలికి పెట్టి తొంగిచూసినప్పుడు నేనక్కడే మూలగా ఆ పీటమీద కూచుని చూస్తున్నాగా! షాలట్ ఆ సాలెగూడులో ఉంది. అప్పుడు షాలట్ చక్కగా ఒక ఉపన్యాసం చెప్పేసింది తెలుసా? ఏమందంటే: 'వినండి! వినండి!! ఈ పశువుల దొడ్డిలో జీవించే జంతువులన్నిటికీ సంతోషవార్త! మన స్నేహితురాలు పాపం నాలుగు వారాలుగా నిద్రాహారాలు కూడా మానుకుని నిర్విరామంగా చేసిన నిరీక్షణ ఫలించింది. చూడండి! ఆమె గుడ్లలోంచి పిల్లలు బయటికి వస్తున్నాయి' అంది. ఎంత చక్కగా చెప్పిందో తెలుసా?"

"ఔను. బాగానే చెప్పిందిగాని ఫెన్! నీకు బడికి వేళయింది. అవెరీని కూడా త్వరగా తయారుకమ్మను. హోమర్ బాబాయిగారి పశువుల దొడ్లో జరిగే విశేషాలన్నీ బళ్లోంచి వచ్చిన తర్వాత సాయంకాలం నాకు చెబుదువుగాని. నువ్వు రోజూ అక్కడ చాలాసేపు ఉంటున్నావుకాదూ? రోజూ సాయంత్రం అక్కడికే వెళుతున్నావా?" అనిఅడిగింది తల్లి.

"ఔనమ్మా! రోజూ అక్కడికే మరి వెళ్తున్నాను. అక్కడ ఎంతో బాగుంటుంది తెలుసా!" అంటూ ఫెన్ మూతి తుడుచుకుని, మేడమీదికి వెళ్లింది.

ఫెన్ వెళ్లిపోయిన తరువాత తల్లి అరబుల్‌తో మెల్లగా ఇలా అంది. "దీని వ్యవహారమంతా ఏమిటో గొడవగా ఉంటోందండి. అది ఆ జంతువుల్ని గురించి చెప్పిన మాటలన్నీ విన్నారా? అవన్నీ మాట్లాడుతున్నాయి అంటుందేమిటండీ?"

ఆరబుల్ నవ్వాడు. "అవును - మాట్లాడుతున్న ట్యేమో! ఒక్కొక్కప్పుడు నాకూ అలాగే అనిపిస్తుంది. [illegible] వ్వలేదు. ఫెన్ ని గురించి నువ్వేం ఖంగారుపడకు. దానికి మంచి భా[illegible] నాశక్తివుంది. పిల్లలంతా అలాగే తాము ఏమిటో స్వయంగా [illegible]టున్నట్టు భావించుకుంటారు" అన్నాడు.

"ఔను - అందుకే నా ఆందోళన! ఏమిటో పిచ్చిఊహలు. విషయం అంతా ఒక్కసారి డాక్టర్ డోరియన్‌కి చెప్పి ఆయన సలహా తీసుకుందా మనుకుంటున్నాను. ఆయనకి ఫెన్ అంటే మనసులో ఎక్కువ ముద్దు. ఆ పంది విషయంలోను, అక్కడ తక్కిన జంతువుల విషయంలోను దాని విచిత్ర ప్రవర్తన ఆయనకి చెప్పాలి. దాని ధోరణి మామూలు పిల్లల ధోరణిగా లేదు. జంతువులేమిటి? మాట్లాడడ మేమిటి?"

ఆరబుల్ పక పక నవ్వుతూ అన్నాడు: "ఏం? మన చెవులకు వాటి మాటలు వినేటంత సున్నితమైన శక్తి లేకపోవచ్చు."

విల్బర్ ప్రగల్భాలు

సాలీడు గూడు పైకి కనపడే దానికంటె చాలా గట్టిది. ఎంతో సన్నని దారాలతో అల్లినదే అయినా, తేలికగా తెగిపోదు. అయితే దాంట్లో తగుల్కొని గిజగిజ తన్నుకునే పురుగుల వల్ల దానికి రోజూ కొంతనష్టం కలుగుతూంటుంది. అలా చాలా చోట్ల తెగిపోయినప్పుడు సాలీడు మళ్లీ మరమతు చేసుకుంటుంది. షాలట్ ఈ మరమతుల పని రోజూ సాయంకాలం చేసుకుంటూ ఉంటుంది. అప్పుడు దానికి దగ్గిరగా చూస్తూ కూచోటం ఫెన్‌కి చాలా ఇష్టం. ఒకరోజున ఫెన్ ఒక అద్భుతమైన సంభాషణ వింది. ఎంతో గొప్పపని జరుగుతూండగా చూసింది.

"నీ కాళ్లనిండా ఆ వెండ్రుకలు చాలా అసయ్యంగా ఉన్నాయి షాలట్!" అంది విల్బర్, ఆ సాలీడు గబ గబా పని చేసుకుంటున్నప్పుడు.

"నా కాళ్లనిండా వెంట్రుకలు ఉండటానికి కారణం ఉందిలే. పైగా నా కాళ్లలో ఒక్కొక్క దాంట్లో ఏడు భాగాలు ఉన్నాయి. ఆ ఏడు భాగాలకు ఏడు పేర్లు ఉన్నాయి."

విల్బర్ వెనక కాళ్లమీద లేచి నిటారుగా నిలబడింది. "నువ్వు నాతో ఏదో కోసేస్తున్నావ్" అంది

"లేదు విల్బర్! నీతో నేను అబద్ధం చెప్పను."

"అయితే మరి నాకాలికి ఏమ భాగాలు లేవేం!" అంది విల్బర్ తన లావుపాటి పొట్టి కాళ్లకేసి చూసుకుంటూ.

"నువ్వూ, నేనూ చేసే పనులలో తేడా ఉంది. నువ్వు సాలె గూడు అల్లనక్కరలేదు. దానికి కాళ్లతో చాలా పని పడుతుంది," అంది షాలట్.

"కొంచెం ప్రయత్నంచేస్తే నేనూ అల్లాంటి సాలెగూడు అల్లె య్యగలను. నే నెప్పుడూ ప్రయత్నం చెయ్యలేదు; అంతే!" అంది విల్బర్ డబాయింపుగా, గర్వంగా.

"పోనీ ఇప్పుడు ప్రయత్నం చేసి చూడు. దానికేముంది?" అంది షాలట్. ఫెన్ తనలో తనే మెల్లగా నవ్వుకుంది. ఆ పంది పిల్లమీద మరింత మమకారం ఏర్పడింది.

"ఓ! అల్లాగే! నువ్వు కొన్నాళ్లపాటు నాకు నేర్పంతే! తర్వాత నేనే అల్లేస్తాను. సాలెగూడు అల్లుతున్నప్పుడు మంచి సరదాగా వుంటుందికాదూ! అసలు ఎల్లా మొదలుపెట్టాలో చెప్పు!"

"గట్టిగా ఊపిరి లోపలికి పీల్చు" అంది షాలట్ నవ్వుకుంటూ. విల్బర్ గట్టిగా గాలి పీల్చింది. "ఇప్పుడు ఇలాంటి బాగా ఎత్తుగా ఉన్న ప్రదేశానికి ఇలా ఎక్కు." షాలట్ గబగబా ఆ ద్వారం చిట్ట చివరికి ఎక్కి చూపించింది. విల్బర్ తన పెంటకుప్ప మీదికి ఎక్కింది.

"షేష్! బాగుంది! ఇక ఇప్పుడు నీ దారాలతో ముందుగా రెండుచోట్లను నుడిపెట్టు. నువ్వు ఎగిరి గాలిలో మధ్యగా ఉండాలి నువ్వు కిందికి దిగుతున్నకొద్దీ నీలోంచి దారం వదిలి పెడుతూవుండు."

విల్బర్ కొంచెం సేపు తెల్లబోయి చూసింది. తర్వాత గాలి లోకి ఎగిరింది. కింద పడేటప్పుడు తన వెనకనించి ఏదైనా తాడు లాంటిది వేళ్ళాడు తూందేమో అని వెనక్కి చూసింది. తన వెనక అలాంటిదేమీ కనిపించలేదు. తర్వాత వెంటనే జరిగిన పని : తను దభీమని నేలమీద పడటం. "అబ్బ" అని మూలిగింది విల్బర్.

షాలట్ గట్టిగా నవ్వింది. ఆ నవ్వుతో ఆమె గూడంతా ఊగు లాడింది.

"నేను ఏం పొరపాటు చేశాను?" అని అడిగింది పందిపిల్ల, పడిన దెబ్బ దులిపేసుకుని లేచి వస్తూ.

"అబ్బే ఏమీలేదు. మంచి ప్రియత్నమే చేశావు," అంది షాలట్.

"అయితే మళ్లీ ఒకసారి ప్రయత్నిద్దాం!" అంది విల్బర్ ఉత్సాహంగా. "నాకు ఇక కావలసిందల్లా నేను ఎగిరినప్పుడు నేల మీద పడిపోకుండా ఆపిఉంచే ఒక తెల్లటి పాతతాడు? ఆ వెధవ తాడొక్కటి లేక పోయేటప్పటికి దభీమని కింద పడిపోతున్నాను."

పందిపిల్ల తన తొట్టెదగ్గిరికి వెళ్ళింది. "టెంపుల్టన్! టెంపుల్టన్! ఎక్కడున్నావు? ఇల్లారా!" అంది. టెంపుల్టన్ కొయ్యతొట్టె కిందినుంచి ముట్టె ఇవతలికిపెట్టి తొంగి చూసింది.

"నీదగ్గిర ఏదైనా తెల్లటి తాడుముక్క ఉంటే ఓసారి నాకు ఎరువిస్తావ్ ? నేనో సాలెగూడు అల్లుదా మనుకుంటున్నాలే!" ధీమాగా అడిగింది విల్బర్.

"ఓ! అల్లాగా? అయితే తప్పకుండా ఇస్తాను. నీ కభ్యంతర మేమిటి?" అంది టెంపుల్టన్. అంటూనే మళ్లీ తన కన్నంలోకి దూరింది. దారిలో ఉన్న బాతుగుడ్డుని పక్కకి తోసి, ఏనాటినుంచో మట్టిలో మాగిఉన్న నులకతాడు ముక్కొకటి తీసుకుని మళ్ళీ బయటికి చక్కా వచ్చింది. విల్బర్ ఆ తాటిని పరీక్ష చేసింది.

"బాగుందిలే! ఇదే మనకి కావలసింది. ఈ తాడు ఒకకొన నా తోకకి ముడిపెట్టేసెయ్ టెంపుల్టన్! పెడతావా?" అంది విల్బర్.

విల్బర్ తన మెలిదిరిగినతోక టెంపుల్టన్‌కి దగ్గిరిగా వచ్చేటట్టు తిరిగి కూచుంది. టెంపుల్టను ఆతాడు పట్టుకొచ్చి, విల్బర్ తోకకి రెండుచుట్లు చుట్టి, గట్టిగా రెండు ముళ్లు వేసింది. షాలట్ ఈ తతంగం అంతా వినోదంగా చూస్తూంది. ఫెన్‌లాగే షాలట్‌కి కూడా విల్బర్ అంటే అమితఇష్టం. కంపు కొడుతూ వుండే విల్బర్ ఆవరణ, కుళ్లిపోయిన దాని ఆహారం తనకు ఉపయోగపడే ఈగల్నీ, పురుగుల్నీ విశేషంగా ఆకర్షిస్తున్నయి. విల్బర్ తన ప్రయత్నం విరమించక సాలెగూడు అల్లటానికి మళ్ళీ ప్రయత్నిస్తూ ఉండటం షాలట్‌కి మెచ్చుకోలుగా ఉంది.

ఆ ఎలుక, సాలీడు, ఆ పిల్ల చూస్తూ ఉండగా గంపెడు ఉత్సాహంతో, ఆశతో విల్బర్ మళ్లీ ఆ పెంటకుప్ప పైకి ఎక్కింది.

"అంతా జాగ్రత్తగా చూడండి!" అని అరిచింది. తన ఒంట్లో వున్న శక్తినంతా కూడదీసుకొని, తల ముందుపెట్టి గాలిలోకి ఎగిరింది. ఆ తాడు దానివెనక వేళ్ళాడుతుంది. కాని, దాని రెండో కొసను కూడా దేనికైనా ముడివేయాలన్న సంగతి తెలియక పోవటంవల్ల, ఆ తాడు వుండికూడా ప్రయోజనం లేకపోయింది

విల్బర్ మళ్లీ దభీలుమని నేలమీద పడింది. ఆ దెబ్బతో ఒళ్లంతా చితకగొట్టినట్టు అయింది. టెంపుల్టన్ కిచ కిచ నవ్వింది. షాలట్ చూస్తూ ఊరుకుంది. కొంతసేపటికి షాలట్ కలిపించుకుని అంది.

"సాలెగూడు అల్లడం నీవల్లకాదులే విల్బర్. ఇంక ఆ ప్రయత్నం మానేసెయ్. దానికి కావలసిన రెండు సాధనాలూ నీకు లేవు."

"ఏమిటవ్వి?" అంది విల్బర్ విచారంతో.

"స్వయంగా దారాలు వదిలే గ్రంధులు నీలో లేవు. ఆపైన సాలెగూడును ఏవిధంగా అల్లవలసినదీ కూడా నీకు తెలియదు. కాని, విచారించకు. అసలు ఇలాంటి గూడు నీకు అనవసరం. రోజుకు మూడుసారులు జుకర్మన్ కుటుంబం నీకు హాయిగా పుష్టికరమైన ఆహారం పెడుతూంది. ఇక ఆహారం సంపాదించుకోటానికి ఇలాంటి వల నీకు అనవసరం,"

విల్బర్ నిట్టూర్చింది. "నువ్వెప్పుడూ నాకంటె చాలా తెలివైన దానివి. నేను వట్టి మొద్దుని, షాలట్! నేను నా తెలివి తక్కువతనం బయటపెట్టుకున్నాను. మంచి శాస్తే అయిందిలేనాకు!"

టెంపుల్టన్ గబ గబా తన తాడు విప్పుకుని కన్నంలోకి లాక్కు పోయి దాచుకుంది. షాలట్ తిరిగి తన గూడు అల్లుకోటం మొదలు పెట్టింది.

"నువ్వేమంత చింతించవలసిన పనిలేదు విల్బర్! నీలాగే సాలెగూడు అల్లడం చేతకాని ప్రాణులుచాలాఉన్నాయి.ఈవిషయంలో మనుష్యులకు కూడా సాలీడుకి ఉన్నంత చాకచక్యం లేదు. వాళ్ళు చాలా ప్రజ్ఞావంతులమనే అనుకుంటారు. ఏ పనికైనాసరే, మేమూ ఉన్నామంటూ తయారవుతారు. క్వీన్ బరో వంతెనని గురించి ఎప్పుడైనా విన్నావా?"

విల్బర్ లేదన్నట్టు తల ఊపింది. "ఏం అది కూడా సాలె గూడేనా?"

"అలాంటిదె," అంది షాలట్. "కాని, అది కట్టడానికి వాళ్లకి ఎన్నాళ్ళు పట్టిందో ఎరుగుదువా? ఎనిమిదేళ్లు పట్టింది. నాకే అంతకాలం పడితే ఈలోగా ఎప్పుడో ఆకలితో మాడి చచ్చి పోయి ఉండేదాన్ని. నాగూడు అల్లుకోటానికి నాకు ఒకపూట కూడా పూర్తిగా పట్టదు."

"ఆ క్వీన్సుబరో వంతెనలో వాళ్ళేమి పడతారూ? నల్లుల్నా?" విల్బర్ అడిగింది.

"కాదు" అంది షాలట్. "వాళ్లు దాంట్లో వేటినీ పట్టరు. అస్తమానం ఆ వంతెనమీంచి ఇటునుంచి అటూ, అటునుంచి ఇటూ

తిరుగుతూ ఉంటారు. ఆ వంతెన అవతల ఏదో వుంటుందని ఇవతలి వాళ్లకీ, ఇవతల ఏదో వుందని అవతలవాళ్లకీ భ్రమ. నాలాగ ఆ వంతెనకింద మధ్యగా తలకిందుగా కొంతసేపు వేళ్లాడితే వాళ్లకు ఏమైనా ప్రయోజనం ఉంటుందేమో! కాని, అబ్బే! వాళ్లకి ఒకటే తొందర; ఒకటే హడావిడి. ఒక్క నిమిషం స్థిమితంగా ఆలోచించరు. నేను మామూలు సాలీడుగా పుట్టినందుకు ఎంతో సంతోషిస్తున్నాను."

"మామూలు సాలీడంటే?" విల్బర్ అడిగింది.

"ఎప్పుడు చూసినా హడావిడిగా ప్రపంచమంతటా పరిగెత్తకుండా నాలాగ జీవితంలో చాలా కాలం ఒకచోట స్థిమితంగా కూచుని ఉండే సాలీడు అన్నమాట. గొప్పవస్తువును దేన్ని చూసినా, దాని గొప్పతనం వెంటనే గ్రహించగలను. నా గూడు గొప్పవస్తువని నాకు తెలుసు. ఏ ఈగో, దోమో వచ్చి ఈ గూట్లో తగులుకునేవరకు నేను నిదానంగా ఎదురు చూస్తూ వుంటాను. అందువల్ల నేను ప్రతి విషయం చక్కగా ఆలోచించుకుంటానికి వీలవుతుంది."

'నేనుకూడా నీలాగే అట్టే తిరగకుండా కూచునే మామూలు పందినేగా? నా కిష్టమున్నా లేకపోయినా అసలు నేనిక్కడ నుంచి కదలడానికి వీలుకూడా లేదాయె. ఇలాంటి సాయంకాలమప్పుడు అసలు నాకు ఎక్కడ ఉండాలని ఉంటుందో నీకు తెలుసా?" అంది పందపిల్ల.

"ఎక్కడ ఉండాలని ఉంటుంది?"

"అడవిలో హాయిగా చెట్లకింద రాలిన మంచి మంచి కాయలు, పళ్లూ, టెంకలూ, దుంపలూ తింటూ అందమైన అద్భుతమైన నా

గట్టిముక్కుతో నేలను కుళ్లగిస్తూ, నేలఅంతా వాసనచూసి పసిపిగడుతూ వాసనచూస్తూ, పసికడుతూ, వాసనమూస్తూ......"

“అక్కడికి వెళ్ళినా నీ వెంట వాసనే నీకు కొడుతుంది,” అంది అప్పుడే అక్కడికి వచ్చిన ఒక గొర్రెపిల్ల. “అబ్బ నీకంపు ఇక్కడికి కూడా కొడుతూంది. ఛీ! నీఅంత కంపు కొట్టే మొద్దు ఈ దొడ్డి మొత్తంలో ఇంక ఎవ్వరూ లేరు బాబూ!”

విల్బర్ అవమానంతో ఎల వంచుకుంది. దాని కళ్లల్లోకి నీళ్లు తిరిగినయి. షాలట్ ఇదంతా చూసింది. గొర్రెపిల్లని గట్టిగా మందలించింది.

“నీకెందుకు విల్బర్ సంగతి? అది ఏం వాసన చూస్తే నీకేం నష్టం? ఎవరుండే చోటికి సంబంధించిన వాసన వాళ్లదగ్గర వుంటుంది. నీమట్టుకు నువ్వు మల్లెపూవువేం కాదు. కులాసాగా మాట్లాడు కుంటూంటే పానకంలో పుడకలాగ అడ్డు తగలకు. విల్బర్! ఏమిటీ మనం మాట్లాడు కుంటున్న విషయం?”

“నాకసలే జ్ఞాపక ముండదు.” అంది విల్బర్, ఏదైనా ఒకటే నాకు. కొంచెం సేపు అసలు ఏమీ మాట్లాడకు షాలట్! నాకు నిదరొచ్చేస్తూంది. నువ్వు మాట్లాడకుండా నీగూడు అల్లుకో! నేను ఇక్కడ పడుకొని చూస్తూ నిద్రపోతాను.” విల్బర్ కాళ్లు సాచు కుని పడుకుంది.

జుకర్మన్ దొడ్లోకి మెల్లగా ముసి ముసి చీకటులు ప్రవే శించాయి. వాటితో పాటు ఆ ప్రాంగసమంతా ప్రశాంత వాతా వరణం అలముకుంది. తండివేళయిందని ఫెన్‌కి తెలుసు. కాని

ఇంటికి వెళ్ళటానికి మనస్సు ఒప్పలేదు. పిచ్చుకలు ఇటూ అటూ తొందరలో ఎగురుతూ పిల్లలకు ఆహారం తెచ్చి పెడుతున్నాయి. రోడ్డుకి అవతల వేపునుంచి "విప్పూర్విల్" "విప్పూర్విల్" అంటూ ఒకపిట్ట అరిచింది. ఆపిల్ చెట్టుకింద కూర్చుని లర్వీ తన పొగ గొట్టం ముట్టించాడు. ఘాటయిన ఆ పొగాకు వాసనను అక్కడి జంతువులన్నీ ఘ్రాణించినయి. చెట్టుకప్పల కూత, వంటింటి తలుపుల చప్పుడు కూడా వినిపిస్తున్నయి ఈ ధ్వనులన్నీ విల్బర్‌కి మధురంగా, హాయిగా ఉన్నయి. దానికి జీవితమంటే, అలాటి మనోహరమైన వేసవి సాయంకాల ప్రకృతి దృశ్యంలో తాను కూడా ఒక భాగమై పోవడమంటే నగని సరదా. అలాగే పడుకొని ఉండగా దానకు ముసలిగొర్రె చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. చంపే సంగతి గుర్తుకొచ్చేసరికి లేచి నిలబడి భయంతో నిలువునా వణికి పోవటం మొదలు పెట్టింది

"షార్లట్!" పిలిచింది మెల్లగా.

"ఏం విల్బర్?"

"చచ్చిపోవటం నాకిష్టంలేదు షార్లట్!"

"లేదు...నువ్వు చచ్చిపోవు" అంది షార్లట్ జాలిగా.

"ఇక్కడ ఈ పశువుల దొడ్డిలో ఇలాగే ఎప్పుడూ బతికి ఉండాలని ఉంది షార్లట్! ఇక్కడ ఉన్నవన్నీ నాకు ఎంతో ఇష్టం" అంది విల్బర్.

"నిజమే విల్బర్! నీకే కాదు. ఇక్కడ ఉన్న అందరికీ అలాగే ఉంటుంది." అంది షార్లట్.

ఇంతలో తన ఏడు పిల్లలతో సహా బాతు కనిపించింది. చిన్న చిన్న మెడలు నిక్కబొడుచుకొని ఆపిల్లలు కిల కిలమని సంగీతంలాంటి ధ్వనులు చేస్తున్నయి. ఎంతోమంది పిల్లలు ఒకేసారి బూరాలూ, పిల్లం గోళ్లూ ఊదినట్టుంది. ఆ సంగీతం వింటూంటే విల్బర్ మనస్సులో మళ్ళీ బతుకుమీద ప్రేమ పెల్లుబికి వచ్చింది.

"షాలట్!" పిలిచింది.

"ఆఁ!" సాలీడు పలికింది.

"వాళ్ళు నన్ను చంపకుండా కాపాడతానన్నావుగా! నిజంగా కాపాడతావా? షాలట్!"

"తప్పకుండా కాపాడతాను. ఏమైనా సరే! నిన్ను చంప నివ్వను. సరేనా?"

"ఎలా కాపాడతావు షాలట్?" మళ్ళీ అడిగింది. విల్బర్ ఆతురతకు అంతులేకుండా ఉంది.

"ఏమో! ఎల్లా కాపాడుతానో ఇంతవరకు నాకే తెలియదు. దానికే మంచి ఉపాయం ఒకటి ఆలోచిస్తున్నాను."

"మంచిదానివి షాలట్!" అంది విల్బర్. "ఉపాయం ఎంత వరకు వచ్చింది? బాగా తయారవుతూందా? చాలా వరకు ఆలోచించేశావా? అంతా బాగా కుదురతూందా?" విల్బర్ మళ్లీ వణికిపోతూంది. షాలట్ మాత్రం నిశ్చలంగా నిబ్బరంగా, ఉంది.

"అంతా బాగానే కుదురుతూంది. అయినా ఆలోచన ఇంకా మొదట్లోనే ఉంది. దానికింకా ఒకరూపం ఏర్పడలేదు. దాన్ని గురించే ఇంకా ఆలోచిస్తున్నాను."

దానికోసం నువ్వు ఎల్లాంటప్పుడు ఆలోచిస్తావు షాలట్?" విల్బర్ ప్రార్థిస్తున్న ధోరణిలో అడిగింది.

"నేను నా గూటిలో తల్లకిందులుగా వేళ్ళాడు తున్నప్పుడు. అలాంటప్పుడే నేను ముఖ్యమైన విషయాలన్నీ ఆలోచిస్తూ ఉంటాను. అప్పుడు రక్తమంతా నా తలలోకి దిగుతుంది."

"నేను చెయ్యగలిగిన ఆలోచనకూడా ఏదైనా వుంటే చెప్పు. చేసేస్తాను."

"వద్దు. ఈ పని నేను ఒక్కదాన్నే చెయ్యాలి. ఇలాంటి విష యాల్లో నేను ఒక్కదాన్నే ఒంటరిగా ఆలోచించుకోవాలి." అంది షాలట్.

"సరేలే! అయితే నువ్వు ఆలోచించు. నేను నీకు సాయం చెయ్యగలిగేదేమన్నా ఉంటేమాత్రం నాకుచెప్పు - మరచి పోకుండా."

"ఇప్పుడు నువ్వు చెయ్యగలిగిందల్లా బాగా తిని బలపటం. మన స్సులో ఏమీ ఆందోళన లేకుండా నిశ్చింతంగా నిద్రపోతూ ఉండటం. దేనికీ తొందర పడకూడదు. దిగులు పడకూడదు. తిండి తినేటప్పుడు మెల్లగా బాగా నమిలి మింగాలి. టెంప్లటన్ కోసం ఏదో కాస్త తప్ప ఆట్టే వదిలి పెట్టకు. నీ తూకం బాగా ఎక్కువచేసుకో. అదే నువ్వు నాకు చేయగల సాయం. ఎప్పుడూ హుషారుగా ఉండు. అనవసరపు బెంగతో దేజమొహం పెట్టకు. తెలిసిందా?"

"ఆc! ఆc! తెలిసింది" అంది విల్బర్.

"అయితే ఇక పడుకుని నిద్రపో! కంటినిండా నిద్రపోవటం మాత్రం చాలా అవసరం," అంది షాలట్.

విల్బర్ తన ఆవరణలో బాగా చీకటిగా ఉన్నచోటికి పోయి పడుకుంది. కళ్లు మూసుకుంది. మరునిమిషంలోనే మళ్ళీ పిలిచింది.

"షాలట్?"

"ఏం విల్బర్!"

"నేను లేచి, నా తొట్టెదగ్గిరికి వెళ్లి సాయంకాలం అందులో ఏదైనా విడిచి పెట్టేశానేమో ఒక్కసారి చూసిరానా? ఉడకబెట్టిన బంగాళాదుంప ముక్కలు ఒకటో రెండో విడిచిపెట్టేసినట్టు జ్ఞాపకం."

"వెళ్ళిరా వెంటనే మళ్ళీ వచ్చేసి, పడుకుని నిద్రపో!"

విల్బర్ లేచి తొట్టెదగ్గిరికి పరిగెత్తింది.

"మెల్లగా, మెల్లగా వెళ్ళు!" అంది షాలట్. "దేనికీ తొందర పడకూడదు! గందరగోళపడకూడదు"

విల్బర్ వెంటనే ఆగిపోయి, మెల్లగా నడుస్తూ వెళ్ళింది. చిన్న బంగాళాదుంప ముక్కొకటి కనిపిస్తే కొరుకుచుకొని, మెల్లగా జాగ్రత్తగా నమిలి మింగింది. తర్వాత మళ్ళీ మెల్లగా అడుగులో అడుగు పెట్టుకుంటూ తను నిద్రపోయే చోటికి పోయింది. కళ్ళు మూసుకుని కొంతసేపు మాట్లాడకుండా పడుకుంది.

మళ్ళీ తలెత్తి "షాలట్!" అని పిలిచింది.

"ఏం?" అంది షాలట్.

"నేను కొంచెం పాలు తాగొచ్చా? నా తొట్టెలో కాసినిపాలు మిగిలిపోయినట్టు జ్ఞాపకం."

"వద్దు. ఆ తొట్టెలో పాలుగా లేవు. నీ మొహం లేవు; పొడిగా వుంది. నువ్వు పడుకుని నిద్రపో. ఇక మాట్లాడకు. కళ్ళు గట్టిగా మూసుకుని పడుకుని నిద్రపో."

విల్బర్ కళ్ళుమూసుకుంది. ఫెన్ తనపీటమీంచి లేచి, ఇంటికి బయలుదేరింది. ఆ రోజున చూసిన, విన్న విషయాలతో ఆమె మనస్సు నిండుగా ఉంది.

"అయితే షాలట్! ఇక ఈ వేళకి సెలవు" అంది విల్బర్.

"సరే నిద్రపో ఇంక" అంది షాలట్.

కొంచెంసేపు నిశ్శబ్దం.

"సరే! ఈ వేళకి సెలవు మరి షాలట్!"

"సరే! ఇక నిద్రపో!"

"అల్లాగే! పోయి పడుకోనా?"

"ఆ! పడుకో! నిద్రపో!"

10. దుర్భరమైన ప్రేలుడు

ఆ సాలీడు కొన్నిరోజుల పాటు అల్లా తలకిందులుగా వేలాడుతూ తపస్సు చేసింది, ఏదైనామంచి ఉపాయం కోసం. గంటలకొలధి అలా నిశ్చలంగా వేలాడుతూ చాలాకాలం ఆలోచించింది. విల్బర్ ప్రాణం కాపాడతానని తను మాటిచ్చింది. ఎల్లాగైనా మాట దక్కించుకోవాలి అని షాలట్ తీర్మానించుకుంది.



షాలట్ సహజంగా చాలా ఓర్పు, ఓపిక గలది. ఎంతోసేపు ఎదురు చూడగా ఏదో ఒక ఈగ తన వలలో తగులుకుంటుందనీ

అలాగే విల్బర్ బతుకుని గురించి ఆలోచించగా, ఆలోచించగా చివరికి ఏదో ఒక ఉపాయం తోచకపోదని ఆమెకు తెలుసు.

చిట్టచివరికి జూలై నెల సగం గడిచిన తర్వాత ఒకరోజున ఉదయం ఆ ఉపాయం తోచనే తోచింది. ''ఆహా! ఎంత సులభమైన ఉపాయం!' అనుకుంది పాలెట్; "విల్బర్ ప్రాణం కాపాడాలంటే జకర్మన్‌ని మోసగించాలి. నేను నల్లినే మోసపుచ్చ గలిగినప్పుడు, మనుష్యుల్ని ఇంకా తేలికగా మోసపుచ్చగలను. మనుష్యులకి నల్లుల కున్నన్ని తెలివితేటలు ఎక్కడున్నయి?''

సరిగా ఆసమయంలోనే విల్బర్ తన ఆవరణలోకి వచ్చింది.

''ఏమిటి పాలెట్! అంత గట్టిగా ఆలోచిస్తున్నావ్?'' అడిగింది విల్బర్.

''మనుష్యుల్ని చాలా తేలిగ్గా మభ్యపెట్టొచ్చు'' అని ఇప్పుడే అనుకుంటున్నాను.

''మభ్యపెట్టడం అంటే?''

'తెలివి తక్కువ వాళ్ళనిచేసి ఆడించటం అన్నమాట," అంది పాలెట్.

''అయితే నువ్వు ఇంకా వాళ్ళను దయతలుస్తున్నా వన్న మాట!'' అంటూ విల్బర్ వెళ్ళి తన ఆవరణ గోడనీడలో పడుకుని, వెంటనే గాఢనిద్రలో మునిగిపోయింది. పాలీడు మాత్రం మేలుకుని ఉంది. విల్బర్ వంక జాలిగా, ప్రేమగా చూస్తూ, తన పన్నాగాన్ని నిర్ధారణ చేసుకుంటూంది. అప్పుడే వేసవి కొంత వెనకపడింది. ఇంక ఆట్టే వ్యవధిలేదు అనుకుంది.

ఆరోజు ఉదయం విల్బర్ హాయిగా గుర్రుకొట్టి నిద్రపో తూండగా ఫెన్, అవెరీ వాళ్ళు జుకర్మన్ బాబాయిగారి ముందు దొడ్లోకి వచ్చారు. అవెరీ చేతులో ఒక బతికున్న కప్ప ఉంది. ఫెన్ తలలో డెయిసీ పూలచెండు పెట్టుకుంది. ఉన్నట్టుండి త్వరగా ముందుగా వాళ్ళు జుకర్మన్ బాబాయిగారి వంటింట్లోకి వెళ్ళారు.

"రండి రండి సమయానికి వచ్చారు. ఇదిగో నాలుగు నేరేడు పళ్ళు తినండి" అంది జుకర్మన్ భార్య.

"ఇదుగో పిన్నీ! నా కొత్త స్నేహితుడిని చూశావా?" అంటూ అవెరీ చేతిలో కప్పని ఆబల్లమీద పెట్టి, ఆ కాయలు అందుకున్నాడు.

"అదేమిటిరా? ముందర దాన్ని ఇక్కణ్ణించి తీసెయ్యి" అంది జుకర్మన్ భార్య.

"దానికి అసలే కోపంగా ఉంది. అప్పుడే చచ్చిపోయిందేమో కూడా," అంది ఫెన్.

"ఏంలేదు ; కోపంలేదు. గీపంలేదు. నేను దాని కళ్ళమధ్య గిల్లినా అది ఊరుకుంది. తెలుసా?" అన్నాడు అవెరీ ఇంతలో ఆ కప్ప ఎగిరి, సబ్బునీళ్ళతో వున్న జుకర్మన్‌ల పింగాణీ తొట్టెలో దూకింది.

"నువ్వు చక్కగా పిలిచి నేరేడు పండు పెడితే చూశావా పిన్నీ పిడివెధవ అల్లరి? నేను కోళ్ళదొడ్లోకి వెళ్ళి, గుడ్లు ఏమైనా పెట్టినయ్యేమో చూసినావా?"

"పొండి. ఇద్దరూ బయటికి పోయి ఆడుకోండి. ఆ కోళ్లని మాత్రం మంపతెంచకండి."

"అది అన్నింటి మీదికీ దూకుతూంది. పాపం దానిక్కూడా ఓ నేరేడుపండు పెట్టు తింటుందేమో." అంది ఫెన్.

"దావే కప్పా! కమాన్! దా పోదాం." అంటూ అవెరీ దాన్ని మెల్లగా పట్టుకోబోయాడు. అది ఒక్క ఎగురు ఎగర టంతో ఆ సబ్బునీళ్లన్నీ పైకి చిందె, జుకర్మన్ పిన్ని వంటసామాగ్రి నిండా పడ్డయి.

"చూశావా పిన్నీ దానిపొగరు!" అంది ఫెన్.

"దా పోదాం. కాసేపు ఉయ్యాల ఊగుదాం," అన్నాడు అవెరీ.

దాంతో వాళ్ళు ఇద్దరూ పశువుల దొడ్లోకి పరుగెత్తుకు పోయారు.

జుకర్మన్‌ల ఇంట్లో, ఆ చుట్టుపక్కల ఎక్కడాలేనంత మంచి ఉయ్యాల ఉంది. ఒక్కటే పెద్దలావైన మోకు ఉత్తరంవేపు ద్వార బంధం పైకమ్మికి కట్టి ఉంది. కింద మాత్రం కూచుంటానికి వీలుగా పెద్దముడి వేసి ఉంది. ఇంకొకరెవరూ ఊపక్కరలేకుండా, ఎవరికి వారే ఊగడానికి వీలుగా ఉంది ఆఉయ్యాల. నిచ్చెనమీదనించి మెల్లగా గడ్డిపెట్టే అటకమీదికెక్కాలి. అక్కణ్ణించి ఆమోకు చివరపట్టుకుని అటకఅంచున నుంచుని కిందికి చూసేసరికి తగని భయం వేస్తుంది. తలగిర్రున తిరుగుతుంది. అప్పుడు ఆ తాడు చివరఉన్న ముడి కాళ్ల సందున పెట్టుకుని, ఆ తాడు గట్టిగా పట్టుకుంటం, ధైర్యం తెచ్చు కుంటం, గట్టిగా ఊపిరి పీల్చటం, దూకెయ్యటం. ఒక్కక్షణంపాటు

కింద ఎక్కడో వున్న రాతినేలమీద పడిపోతున్నావని పిస్తుంది; అంత లోనే నువ్వు ఆ తాడు పట్టుకుని వేళ్లాడుతున్న సంగతి తెలుస్తుంది. నువ్వప్పుడు నిమిషానికి ఒక్క మైలు వేగంతో దిగుతూ వుంటావు.

అప్పుడు గాలి నీ కళ్లల్లోను, చెవుల్లోను, ముక్కుల్లోను గుంయ్ మని ధ్వనిచేస్తుంది. జుట్టంతా రేపి, చింపిరిచేస్తుంది. మరుక్షణంలో నువ్వు మళ్లీ ఆ ద్వారం వెలుపలికి పైకి ఆకాశంలోకి లేస్తూ, మబ్బుల దగ్గిరికి వెళ్లిపోతున్నట్టు అనిపిస్తుంది. ఇంతలో ఆ తాడు మెలిదిరుగుతుంది. దాంతోపాటు నువ్వూ గిర్రున తిరుగుతావు. మళ్లీ ఆ మబ్బుల దగ్గిన్నించి కిందికివచ్చి, మళ్లీ పైకి అటకవేపుకి లేస్తావు. మళ్లీ అలాగే బయటికి ఊగుతావు. (ఈ తడవ అంత ఎత్తుకు వెళ్లక పోవచ్చు). మళ్లీ లోపలికి (కొంచెం తక్కువ ఎత్తుకి), మళ్లీ బయటికి, మళ్లీ లోపలికి, బయటికి, లోపలికి - చివరికి కొంతసేపటికి నువ్వు ఊగే తాడు క్రమంగా అసలే ఊగకుండా ఆగిపోతుంది. అప్పుడు నువ్వు దాని మీంచి దూకి, ఇంకోళ్లను ఊగనియ్యాలి.

ఆ చుట్టు పక్కల కొన్ని మైళ్లదూరంలో ఉన్న తల్లులంతా జుకర్మన్‌గారి ఉయ్యాల గురించి చాలా భయపడుతూ ఉంటారు. తమ పిల్లలు దానిమీద ఊగటానికి పోయి, కిందపడి కాలో చెయ్యో విరుచుకుంటారేమో నని వాళ్ల భయం. నిజానికి ఎవ్వరూ ఎన్నడూ దాని మీంచి పడినట్టు లేదు. పిల్లలు దేనైనా పట్టుకుని వేళ్లాడే టప్పుడు చాలా గట్టిగా పట్టుకుంటారు. వాళ్లు తల్లి దండ్రులు భయ పడేటంత తెలివితక్కువ వాళ్లు కారు.

అవెరీ కప్పని జేబులో పెట్టుకొని, గడ్డి అటక ఎక్కాడు. "పోయిన తడవ నేనీ ఉయ్యాల ఊగినప్పుడు పెద్దపిచ్చిక నా ముఖా రికి కొట్టుకునేదయింది, జ్ఞాపకం ఉందా?" అవెరీ అరిచాడు.

"సరేలే! ముందా కప్పను తీసి అవతల పెట్టు." మందలించింది ఫెన్.

అవెరీ ఉయ్యాల తాడు చివర కాళ్లసందున పెట్టుకొని, అటక మీంచి దూకాడు. వెంటనే జేబులో కప్పతోసహా ద్వారంలోంచి బయటికి ఊగాడు. అక్కణ్ణుంచి రంయ్‌మని కప్పతోసహా ఆకాశంలోకి లేచాడు. మళ్లీ వెనక్కి తిరిగి ధాన్యపుకొట్టులోకి ఊగాడు.

"ఒరేయితమ్ముడూ! నీ నాలిక నల్లగా ఉందిరోయ్!" ఫెన్ అంది.

"ఉస్! నీ నాలికా అల్లాగే ఉందిలే మహా!" అరిచాడు అవెరీ, కప్పతోసహా ద్వారం వెలుపలికి ఊగుతూ.

"నా చొక్కాలో ఎక్కడో గడ్డిపరకలు ఇరుక్కున్నట్టున్నయి. నాకు దురద పుడుతూందిరా!" అంది ఫెన్.

"గోక్కో" అని అరిచాడు అవెరీ వెనక్కి ఊగుతూ.

"ఇక నాదీవంతు. నువ్వుదిగు!" అంది ఫెన్.

"అక్కకి వీపూ దురదో దురదా!" పాడాడు అవెరీ.

అవెరీ దిగిపోయి ఆ తాడు కొసను అక్కవేపుకి విసిరాడు. ఆమె ఆ ముడిమీద కూచుని తాడును గట్టిగా పట్టుకుని, కళ్లు మూసుకుని అటకమీంచి దూకింది. అలా కిందపడేటప్పుడు కొంచెంసేపు తల తిరుగుతున్నట్టు అనిపించింది.తరువాత ఆ ఉయ్యాల తాడుమీద ఊగుతూన్న జ్ఞానం కలిగింది. ధైర్యంవచ్చి కళ్లుతెరిచిచూసేసరికి ఫెన్ పైకి నీలాకాశంవేపు లేచిపోతోంది. తర్వాత మళ్లీ వెనక్కి తిరిగి కొట్టులోకి ఊగింది.



అక్కా, తమ్ముడూ పందెం ప్రకారం ఒక గంటసేపు ఆవిధంగా ఊగారు.

ఊగి ఊగి విసుగొచ్చిన తరవాత పక్కన తుప్పలలోకి వెళ్ళి గొలుగుపళ్ళు కోసుకొని తిన్నారు. వాళ్ళ నాలుకలు నల్లరంగునించి ఎర్రరంగుకి తిరిగినయి.

ఫెర్న్ ఆ పళ్ళలో ఒక చేదుపండు నమిలింది. దాంతో వాళ్ళకు ఆపళ్ళంటే అసహ్యం పుట్టింది. వెనక్కి తిరిగారు. అవెరీకి ఖాళీచాక్లెట్ల పెట్టె ఒకటి దొరికింది. వెంటనే కప్పను దాంట్లో పెట్టేశాడు. చాలా సేపు ఉయ్యాల ఊగడంతో ఆ కప్పకూడా బాగా అలిసి పోయి నట్టుంది. వాళ్ళిద్దరూ మెల్లగా మళ్ళీ పశువుల దొడ్డివేపు నడిచారు. వాళ్ళుకూడా బాగా అలిసిపోయారు. నడిచేందుకు కూడా ఓపిక లేదు.

"బొమ్మరిల్లు కడదాంటే అక్కా? మంచి బొమ్మరిల్లు కట్టుకుని నాకప్పా నేనూ అందులో ఉంటే దర్జాగా ఉంటుంది కాదే?" అన్నాడు అవెరీ.

"నేను విల్బర్ దగ్గిరికి పోవాలబ్బా!" అంది ఫెన్.

వాళ్ళిద్దరూ కంచెదాటి సందులో ప్రవేశించి, బద్ధకంగా పంది దొడ్డివేపుకి నడిచారు. వాళ్ళు అంతదూరంలో ఉండగానే విల్బర్ వాళ్ళు వస్తూండటం చూసి, లేచి నిలబడింది.

అవెరీ ఆ సాలెగూడు చూశాడు. ఇంకా దగ్గిరగా వెళ్ళి షార్లట్‌ని కూడా చూశాడు.

"చూశావే అక్కా - ఈ సాలీడు? అబ్బ! ఎంత బాగుందో!" అన్నాడు అవెరీ.

"ఆ సాలీడు జోలికి పోకు. నీకు ఆ కప్ప ఉంది చాల్దూ?" ఫెన్ కసిరింది.

"ఆ సాలీడు చాలా బాగుంది. నే దాన్ని పట్టుకుంటానుండు!" అన్నాడు అవెరీ. చాక్లెట్ పెట్టెమూత తీశాడు. ఒక కట్టెపుల్ల పట్లు

కొచ్చాడు. "ఈ కర్రతో ఆ సాలీణ్ణి సరీగ్గా ఈ పెట్టెలో పడేట్టు రాలగొడతాను" అన్నాడు.

ఇదంతా వింటూన్న విల్బర్‌కి గుండె ఆగిపోయినంత పని అయింది. ఆ కుర్రాడి చేతుల్లో పడితే, దాంతో షాలట్‌కి నూరేళ్ళు నిండినట్టే!

"అవెరీ! నువ్వు ఊరుకుంటావా, ఊరుకోవా?" అరిచింది ఫెన్.

అవెరీ ఒక కాలు పందిదొడ్డి కంచె అడ్డకర్రమీద వేశాడు. షాలట్‌ని కింద పడగొట్టడానికి రెండు చేతులతో కట్టెపుల్ల పైకెత్తే సరికి తూలి తల్లకిందులుగా పడ్డాడు. ఆ పడటంలో విల్బర్ కొయ్యతొట్టె అంచుమీద పడ్డాడు. ఆ తొట్టె ఒకవేపు పైకిలేచి మళ్లీ దభీమని కిందపడింది. ఆ బాతుగుడ్డు సరిగ్గా దానికిందపడి పగిలింది దాంతో దారుణమైన దుర్వాసన బైలుదేరింది.

ఫెన్ సంతోషంగా అరిచింది. అవెరీ పిల్లిమంత్రంవేసి, దుమ్ము దులుపుకుంటూ లేచి నుంచున్నాడు. ఆ కుళ్ళుగుడ్డు కంపు దుర్భరమై ఆ దొడ్డి అంతా వ్యాపించింది. స్వగృహంలో హాయిగా కునుకు తీస్తూన్న టెంపుల్టన్ బయటకివచ్చి ధాన్యపుకొట్లోకి పరిగెత్తింది.

"భలేపని జరిగిందే! భలేపని! అబ్బ! ఏమిటీవాసన? ఇక్కణ్ణించి పారిపోదాం పదవే అక్కా." అన్నాడు అవెరీ.

ఫెన్ ఏడుపు మొదలు పెట్టింది. ఒక చేత్తో ముక్కు గట్టిగా మూసుకుని ఇంటికి పరిగెత్తింది. అవెరీకూడా ముక్కు గట్టిగా బిగించి పట్టుకుని ఫెన్ వెనకే పరిగెత్తాడు.

ఎవెరీ పారిపోడంతో పాలెట్ మనస్సు కుదుటపడింది. దైవ వశాత్తు కొద్దిలో తనకు పెద్ద గండం తప్పిపోయింది.

ఆ రోజు ఉదయం మరికొంత సేపటికి గొర్రెలు, గొర్రెపిల్లలు, మొగబాతు, ఆడబాతు, ఏడు చిన్నబాతులు బీడులో మేసి తిరిగి వచ్చినయి. ఆ దుర్వాసనను గురించిన ప్రశ్నలు బయలుదేరినయి.

విల్బర్ జరిగిన కథంతా పాడిందే పాటగా ఎన్నోసార్లు చెప్ప వలసి వచ్చింది. ఫెన్ తమ్ముడు పాలెట్‌ను పట్టుకోటానికి ప్రయత్నించడం, సరిగ్గా సమయానికి ఆ కుళ్ళిన గుడ్డు పగిలి దుర్వాసన బయలు దేరడంతో వాడు ముక్కు మూసుకుని పారిపోవడం - అందరికీ

చక్కగా పూసగుచ్చినట్టు చెప్పింది విల్బర్. "ఆ కుళ్ళిన బాతుగుడ్డే ఇవాళ షాలట్ ప్రాణం కాపాడింది తెలుసా?" అంది విల్బర్.

ఆ విశిష్ట సంఘటనలో తన పాత్రకూడా కొంత ఉండటం బాతుకి గర్వకారణం అయింది. ఆ గుడ్డు పిల్లకాకుండా చెడిపోవటమే ఎంతో మంచిదయింది" అంది బాతు.

టెంపుల్టన్ మాత్రం తన సొత్తు అయిన ఆ గుడ్డు పగిలిపోయినందుకు లోలోపల ఎంతో ఏడ్చింది. పైకి మాత్రం గొప్పకోసం "చూశారా! ఏ వస్తువునైనా దాచిపెడితే, సమయానికి ఎల్లా ఉపయోగపడుతుందో? ఎలక సామాన్యంగా చూసి చూసి ఏ వస్తువునీ పారెయ్యదు. నేనసలు దేన్నీ పారెయ్యను" అంది, గర్వంగా.

"ఇదంతా ఆ షాలట్‌కి మంచిబాగానే ఉందిగ్గాని, మరి మన గతేమిటి? ఛీ! ఈ కంపుతో ముక్కులు పగిలిపోతున్నయి. కుళ్ళు గుడ్లతో వాసనెత్తిపోయే పశువులదొడ్లో ఎవరు బతకగలరు?" అంది ఒక గొర్రెపిల్ల.

"ఉస్! ఫర్వాలేదు లేవోయ్! కాసేపుంటే అదే అలవాటయిపోతుంది," అంది టెంపుల్టన్, లేచినిలబడి తెలివిగా తన పొడుగుపాటి మీసాలు చూసుకుంటూ. తరువాత ఓసారి తన కన్నంలోకి పోయి చూసివద్దామని మెల్లగా వెళ్ళింది.

మధ్యాహ్న భోజనవేళ లర్వీ పందికి బాల్చీతో గంజి, మేత తీసుకువస్తూ, ఆ పందిదొడ్డికి పది గజాల దూరాన ఆగిపోయాడు. గాలి గట్టిగాపీల్చి వాసనచూసి, ముఖం వికృతంగా పెట్టాడు. ఆ బాల్చీని కిందపెట్టి, "అబ్బ! యెదవకంపు!" అనుకున్నాడు. అవెరీ

అక్కడ పారేసిపోయిన కట్టెపుల్ల తీసుకుని, దాంతో విల్బర్ తొట్టెని లర్వీ మళ్ళీ సరిగ్గా అమర్చాడు. "అబ్బ! పాడు ఎలకలతో సావొచ్చి పోయింది. గంజితొట్టె కిందకూడా ఈ ఎలకలే సిద్ధం!" అనుకున్నాడు.

లర్వీ విల్బర్ తొట్టెని దూరంగా లాగి, అక్కడి ఎలక కన్నం మీదికి కాలితో ఇంత మట్టి తోశాడు. ఆ కుళ్ళు గుడ్డూ, దాంతోపాటు టెంపుల్టన్ దాచుకున్న ఇతర వస్తువులూ-అన్నీ కప్పబడిపోయినయి. అప్పుడు మళ్ళీ బాల్చీ తీసుకున్నాడు. విల్బర్ ఆకలితో ఊగిపోతూ తొట్టె దగ్గిరికివచ్చి నిలబడింది. లర్వీ బాల్చీ ఎత్తి అందులో పోశాడు. ఆ గంజి, కూరతొక్కలు ఆత్రంగా తాగబోయిన విల్బర్ ముట్టె నిండా, కళ్ళనిండా, చెవులనిండా పడినయి. విల్బర్ దులిపేసుకుంది. గబగబా నాలుగు గుక్కలు తాగి, కూరతొక్కలు నమలటం, మళ్ళీ రెండు గుక్కలు తాగటం, మళ్ళీ నమలటం - కంగారుగా అన్నీ ఒక మాటే మింగేద్దామన్నంత ఆదుర్దాతో ఆరగిస్తూంది. పైగా, ఆ పూట తిండి బాగా రుచిగా కూడా వుంది.

విల్బర్ కడుపునిండా తృప్తిదీరా తింది. కాసిని పాలు, చిన్న రొట్టెముక్క మాత్రం టెంపుల్టన్‌కి విడిచిపెడదామనుకుంది మొదట. కాని షాలట్ ప్రాణం కాపాడడానికి పాపం టెంపుల్టన్‌కూడా సాయ పడిందిగదా! షాలట్ తన ప్రాణాన్ని కాపాడడానికి ప్రయత్ని స్తూందిగదా! అనే సంగతులు జ్ఞాపకంవచ్చి, మరికాస్త ఎక్కువే విడిచి పెట్టింది.

ఇప్పుడా పగిలిన గుడ్డుని కప్పిపెట్టివేసిన తర్వాత ఆ దుర్వాసన గాలికి కొట్టుకుపోయింది. గాదెలో మళ్ళీ కమ్మని వాసనలు వేస్తు న్నయి. క్రమంగా పొద్దు జారిపోయి సాయంకాలం వచ్చేసింది. నీడలు పొడుగు సాగుతున్నయి. సాయంసంధ్య చల్లని దయామయ నిశ్వా

సాలు కిటికీలలోంచి, ద్వారాలలోంచి లోపలికి వస్తున్నయి. షాలట్ తన సాలెపట్టులో చిక్కుకున్న ఒక గుఱ్ఱపు ఈగనుపట్టి ఫలహారం చేస్తూ, భవిష్యత్తును గురించి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూంది. కొంత సేపటికి ఒళ్ళు జలదరించింది.

సాలెపట్టు మధ్యకి దిగివచ్చి, కొన్ని దారాలను తెంచివేస్తూంది. తక్కిన ప్రాణులన్నీ నిద్రలో తూగుతున్న సమయంలో షాలట్ మెల్లగా, నిదానంగా పనిచేసుకుంటూంది. బాతుతోసహా మిగిలిన ప్రాణులేవీ షాలట్ పని చేసుకుంటూన్న సంగతి గమనించలేదు. మెత్తని పక్కమీద పడుకుని విల్బర్ గుర్రుకొడుతూంది. ఒక పక్కన బాతు పిల్లలు ఈల పాటలు మొదలు పెట్టినయి.

షాలట్ తన గూడులో సగభాగం చింపివేసి, మధ్యలో కొంత భాగం ఏడం ఉండేటట్టు చేసింది. ఆ పైన తాను తెంచివేసిన దారాల స్థానంలో కొత్త దారాలు అల్లడం మొదలు పెట్టింది. టెంపుల్టన్ అర్ధరాత్రి వేళకు చెత్తా చెదారాల గదినుంచి తిరిగి వచ్చేసరికి షాలట్ ఇంకా పని చేస్తూనే ఉంది.

11. అద్భుతం

ఆ మర్నాడు పొగమంచు బాగా కురుస్తూంది. ఆ వ్యవసాయ క్షేత్రంలో ప్రతి వస్తువూ తడిసి నీళ్ళోడుతూంది. గడ్డి మంచు ముత్యాలతో మాంత్రికుడి తివాచీలాగుంది. తోటకూర మడి యావత్తూ వెండి అడివిలాగుంది.

మంచు కురిసే రోజుల్లో షాలట్ గూడు మరీ అందంగా కనిపిస్తుంది. పోగు పోగు మంచు ముత్యాల తోరణం అయిపోతుంది. ఆ ఉదయ కాంతితో ఆ గూడంతా తళ తళ మెరిసిపోతూ, ఉల్లిపొర తెరలాగ, అందంగా, అద్భుతంగా ఉంది. అందచందాల ధ్యాసలేని లర్వీ కూడా విల్బర్ కి ఉదయపుమేత తీసుకువస్తూ షాలట్ గూడుకేసి ఒక్కక్షణం ఆగి చూసిగాని రాలేకపోయాడు. "అది ఎంత సొట్టంగా, ఎంత పెద్దదిగా, ఎంత శ్రద్ధగా అల్లిందో!" అనుకున్నాడు. ఆ సాలెగూడుకి మధ్యగా పెద్ద పెద్ద అక్షరాల్లో ఈ మాటలు వ్రాసి ఉన్నయి.

"గొప్ప పంది"

లర్వీ కళ్ళు తిరిగి పోయినయి. చేత్తో కళ్ళు గట్టిగా ఒత్తి తుడుచుకుని, మళ్ళీ ఆ సాలెగూడుకేసి చూశాడు. మోకాళ్ళమీద ఒరిగి, కళ్ళు మూసుకుని, చేతులు కట్టుకుని కొంచెంసేపు ప్రార్థన చేశాడు. చేసి లేచి విల్బర్ కి మేత పెట్టడం సంగతి పూర్తిగా మరిచిపోయి గబగబా మళ్ళీ ఇంటికి పోయి జుకర్మన్ ని పిలిచాడు.

"కూత్తంత ఆ పందికాడికి ఓసారి రావాలుండీ!" అన్నాడు.

"ఏం రా? ఏం వచ్చింది? పంది కేమన్నా జబ్బుచేసిందా?" జుకర్మన్ ఆరాతీశాడు.

"ఏం... ఏం... ఏంలేదు గానీండీ! ఓపాలొచ్చి సూడరాదుండీ? మీకే తెలుత్తుంది," అన్నాడు లర్వీ.

ఇద్దరూ నిశ్శబ్దంగా విల్బర్ దొడ్డి దగ్గిరికి నడిచి వెళ్ళారు. లర్వీ సాలీడిగూడు చూపించాడు. "సూడండి. నాక్కనబడ్డాది మీక్కూడా కనబడతా ఉండదా?" అని అడిగాడు.

జుకర్మన్ ఆ సాలె గూడులో అక్షరాలు చూశాడు. '**గొప్ప పంది**' అని చదివాడు. లర్వీవంక చూశాడు. ఇద్దరూ గజ గజ వణకడం మొదలు పెట్టారు. రాత్రి తెల్లవార్లు పిసుక్కా విరా

మం లేకుండా పని చేయడంవల్ల అలిసిపోయివున్న షార్లట్ నిద్రలో తూగిపోతూ ఇదంతా చూసి నవ్వుకుంది. విల్బర్ వచ్చి సరీగ్గా ఆ సాలె గూడు క్రింద నిలబడింది.

"గొప్ప పంది!" అని గొణిగాడు లర్వీ మెల్లగా.

"గొప్ప పంది!" అని గొణిగాడు జుకర్మన్. ఇద్దరూ విల్బర్ కేసి అదేపనిగా చూశారు. తర్వాత షార్లట్ కేసి చూశారు.

"అయితే ఆ సాలీడే ఈ మాటలు... ...?" అన్నాడు జుకర్మన్. అని వాక్యం పూర్తి చేయకుండా తల ఊపాడు. వెనక్కి తిరిగి గబ గబా ఇంటికిపోయి భార్యతో మాట్లాడాడు; "ఎడిత్! చాలా చిత్రం జరిగింది" అన్నాడు, వణుకుతూన్న స్వరంతో. నడవలో గది లోకి వెళ్ళి కూచున్నాడు. జుకర్మన్ సతి కూడా వెళ్ళింది.

"ఎడిత్! అలా కూచో. నేను నీకో విషయం చెప్పాలి," అన్నాడు.

జుకర్మన్ సతి కుర్చీలో కూలబడింది. ఆమె తెల్లబోయి భయం భయంగా చూస్తోంది.

"ఎడిత్!" అన్నాడు మాటలు స్పష్టంగా ఉచ్చరించాలని ప్రయ త్నిస్తూ, "మనకో వింతయిన పంది ప్రాప్తమయింది."

జుకర్మన్ సతి ముఖంలో అమితాందోళన కనిపిస్తూంది. "ఏమి టండీ! ఏమిటో విచిత్రంగా మాట్లాడు తున్నారు. నాకేం బోధపడటం లేదు" అంది.

"అవును చాలా విచిత్రమైన విషయం! మన పంది సామాన్య మ్పందికాదు" అన్నాడు.

"ఆ పందిలో అంత వింత ఏముందండీ?" అంది ఎడిత్, ఆందోళనలోంచి మెల్లగా తేరుకుంటూ.

"ఏమో ఇప్పుడప్పుడే నే నేమీ చెప్పలేను; నాకే తెలియదు. ఒక వింతసూచన మాత్రం కనిపిస్తూంది చాలా విడ్డూరపు సూచన. మన పశువులదొడ్లో పెద్ద చిత్రం జరిగింది. మన గాదె ద్వారబంధం పైన మన పందిదొడ్డిపైగా ఒక సాలీడు పెద్ద గూడు కట్టింది. పొద్దున లర్వీ పందికి మేత పెట్టడానికి వెళ్ళేసరికి, బాగా మంచు కురుస్తూండటంవలన అది వాడి కంటబడింది. మంచు కురిసినప్పుడు సాలెగూడు ఎంతఅందంగా కనిపిస్తుందో తెలుసుగా!ఆసాలెగూడు మధ్యగా తళతళ మెరుస్తూ 'గొప్ప పంది' అనే అక్షరాలు కనిపించినయి. ఆ అక్షరాలను ఆసాలీడు చక్కగా అల్లింది .ఆ అక్షరాలుగూడా చక్కగా ఆ గూడులో ఇమిడిపోయేట్టు అల్లి ఉన్నయి నా కళ్ళతో నేను స్వయంగా చూశాను. 'గొప్ప పంది' అనే అక్షరాలు స్పష్టంగా ఉన్నయి. దాంట్లో పొరపాటేమీ లేదు. ఇదేదో దేవతల మహాత్తు తప్ప మరోటికాదు. ఈ భూమిమీద మన పశువులదొడ్లోనే ఇది జరిగింది. మన పంది మామూలు పందుల్లాంటిది మాత్రం కాదు."

"సరేలెండి! మీరు పొరపాటు పడుతున్నారు. ఆ సాలీడు సామాన్యపు సాలీడు కాదనండి."

"కాదులే! పందిదే ఆ మహాత్తు ఆ సాలీడూ ఆ మాటేగా రాసింది!" అన్నాడు జుకర్మన్.

"కావచ్చు. మొత్తం మీద రెండూ గొప్పవే. ఏమైనా నేనా సాలీడును ఒకసారి చూసిరావాలి."

"మామూలుగా అన్ని సాలీళ్ళలాగే తెల్లగా ఉంది."

ఇద్దరూ లేచారు. గబ గబా నడుస్తూ విల్బర్ దొడ్డి దగ్గిరికి వెళ్ళారు. "చూశావా ఎడిత్! తెల్లగా మెరుపులు సాలీళ్ళన్నిటిలాగే ఉంది చూశావా?"

వాళ్ళలా వచ్చి తనను చూడటం విల్బర్ కి పట్టరానంత సంతోషంగా ఉంది. లర్వీ ఇంకా అక్కడే నిలబడి ఉన్నాడు; జుకర్మన్, జుకర్మన్ భార్య - ముగ్గురూ ఒక గంటసేపు సాలెగూడు మీద కనిపిస్తూన్న అక్షరాలు మళ్ళీ మళ్ళీ చదువుతూ విల్బర్ ని తేరిపార చూస్తూ అక్కడే నిలబడిపోయారు.

బలే! తన పాచిక బలేగా పారుతూందని షాలట్ కి సంతోషంగా ఉంది. కాలు కదపకుండా అలాగే నిలబడి, వాళ్ళు అనుకుంటూన్న మాట లన్నీ వింటూంది.

ఇంతలోనే ఒక ఈగ పొరపాటున ఆ గూటిలో సరిగ్గా పంది అనే అక్షరాల వెనకగా తగులుక్కుంది. షాలట్ గబ గబా కిందికిజారి, ఈగను తన దారాలలో చుట్టబెట్టి అక్కణ్ణించి పక్కకు లాక్కు పోయింది.

కొంతసేపటికి పొగమంచు విడిపోయింది. సాలెగూడు కూడా ఆరిపోయింది. అక్షరాలిప్పుడు అంత స్పష్టంగా కనిపించడం లేదు. జుకర్మన్, ఆయన భార్య, లర్వీ తిరిగి ఇంటివేపు వెళ్ళిపోయారు. వెళ్ళిపోబోయే ముందు జుకర్మన్ మళ్ళీ ఒక్కసారి విల్బర్ కేసి చూసి మరీ వెళ్ళాడు.

"చూశావా? మొదటినించీ ఇది గొప్ప పంది అవుతుందని నే ననుకుంటూనే ఉన్నా. మంచి బలమైన పంది; పోటీకి నిలబడగల పంది. లర్వీ! దాని జబ్బలమీద చూశానా ఎంత కండ ఉందో!"

"ఔనండీ! ఔను! నేను రోజూ సూత్తావున్నాగా? అది సామాన్నెం పందికాదు లెగండి!" అన్నాడు లర్వీ.

"ఎత్తుగా, పొడుగ్గా, బొద్దుగా, బలేగా ఎదిగింది" అన్నాడు జుకర్మన్.

"ఔనౌను. నున్నగా బలేగా ఎదిగింది లెగండి. గొప్ప పందే లెగండి నిజంగా!"

జుకర్మన్ ఇంటికి తిరిగి వెళ్ళిన వెంటనే, పని చేసుకునేటప్పుడు కుట్టుకునే బట్టలు వదిలేసి, తన సూట్లలోకల్లా మంచిదితీసి తొడుక్కున్నాడు. వెంటనే తన కారులో ఎక్కి మతాధిపతి దగ్గరకు వెళ్ళాడు. ఒక గంటసేపు ఆయన దగ్గర కూచుని తన పశువులదొడ్లో వింతను గురించి చెప్పాడు.

"ఇంతవరకు ఈ ప్రపంచంలో నలుగురికి మాత్రమే ఈ సంగతి తెలుసు. నాకు, నా భార్య ఎడిత్‌కీ, మా పాలేరు లర్వీకి, మీకు. ఇంకెవ్వరికీ తెలియదు" అన్నాడు

"ఇంకెవ్వరికీ చెప్పకండి. అసలు దీని అంతరార్థమేమిటో మాకే ఇంకా బోధపడడంలేదు. ఏమైనా ఈలోగా బాగా ఆలోచించి వచ్చే ఆదివారం చర్చిలో మా ప్రార్థన ఉపన్యాసంలో ఈ విషయాన్ని గురించి ప్రసంగిస్తాము. మీ పంది అసాధారణమైనది అనే మాట మాత్రం నిజం. ఈ విషయమే రేపు బోధనోపన్యాసంలో చెపుతాను. మన సీమలో అత్యద్భుత జంతువొకటి అవతరించిందని చెపుతాను సరికాని ఈ పందికి మీరు పేరేమైనా పెట్టారా?"

"ఎందుకు? ఔను పెట్టాము. మావాళ్ళమ్మాయి ఫెన్ దాన్ని విల్బర్ అని పిలుస్తుంది. ఆ పిల్లకూడా చాలా చిత్రమైనది. దాని ఊహాలన్నీ చిత్రంగా ఉంటాయి ఆ పందిని ఆపిల్లే సీసా పాలు పట్టి పెంచింది. ఒక నెలరోజుల పిల్ల అయిన తరువాత వాళ్ళ దగ్గిర నేను దాన్ని కొన్నాను."

ఆయన లేచి ఆ మతాధికారికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

రహస్యాలు దాగటం కష్టం. ఆదివారం రాకపూర్వమే ఈ వార్త దేశమంతటికి తెలిసిపోయింది. జుకర్మన్ దొడ్లో ఒక సాలీడు



గూడు మీద వింత గుర్తులు కనిపించాయన్న సంగతి అందరికీ తెలిసి పోయింది. జుకర్మన్ దొడ్లో అద్భుతమైన పందొకటి వున్నదని ఆనోట ఆనోట అందరికీ తెలిసిపోయింది. చుట్టపక్కల మైళ్ళకొలది దూరాల నించి విల్బర్ని చూసి, ఆ సాలెగూడు మీది దేవతాక్షరాల్ని చదివి

పోతున్నారు. జుకర్మన్‌ల దొడ్డంతా కార్లు, లారీలతో నిండిపోయి ఉంటూంది. ఫోర్డుకార్లు, చెవ్రీలు, బ్యూక్‌రోడ్ మాస్టర్లు, ప్లిమత్‌లు, స్టూడీ బేకర్లు, జీప్‌లు, స్టేషన్ వాగన్లు పొద్దున మొదలుకొని రాత్రి దాకా వచ్చేవి వస్తూంటే పోయేవి పోతున్నయి. ఈ అద్భుతమైన పందిని గురించి పర్వతాల మీది వాళ్ళకు కూడా తెలిసిపోయింది. రైతులంతా గుర్రపు బళ్ళలోను, బగ్గీలలోను వచ్చి విల్బర్ ఆవరణ చుట్టూ గంటల తరబడి నిలబడి దేవతా మహిమగల ఆ పంది దర్శనం చేసుకుని పోతున్నారు. ఎవరిని పలకరించినా, ఇలాంటి పందిని మా జన్మలో చూడలేదనేవారే!

జుకర్మన్ బాబాయి దొడ్లో ఆ సాలీడుని అవెరీ ఒక కర్రతో కొట్టాలని చూశాడని ఫెర్న్ తల్లితో ఫిర్యాదు చేసింది. దాంతో ఆమెకి అమితమైన కోపంవచ్చి అవెరీకి శిక్షగా ఆ రాత్రి అన్నం పెట్టడం మానేసింది.

తర్వాత కొన్ని రోజులదాకా జుకర్మన్ కుటుంబానికి ఎడతెగకుండా వచ్చే అతిథులకు మర్యాదచేసి పంపడమే పని అయింది. ఈ గొడవలో వ్యవసాయం వెనక బడింది. జుకర్మన్ ఇప్పుడు పొద్దస్తమానం తెల్లదుస్తులతోనే ఉండి పోతున్నాడు. ఆయన భార్య విల్బర్ కోసం పూట పూట ప్రత్యేకంగా ఆహారం తయారు చేస్తూంది. లర్వీ క్రాపు కత్తిర వేయించుకుని, గడ్డం చేయించుకుని వచ్చాడు. దూర దూరాల నించి వచ్చిన వాళ్ళంతా చుట్టూ నిలబడి చూస్తూ ఉండగా విల్బర్‌కి వేళ ప్రకారం ఎప్పటికప్పుడు మేత పెడుతూ ఉండటమే ఇప్పుడు లర్వీ ముఖ్యమైన పని. విల్బర్‌కి ఇకర్ణించి రోజుకి వెనకటి లాగ మూడుసార్లు కాకుండా నాలుగుసార్లు మేత పెట్టాలని జుకర్మన్ ఆర్డరు వేశాడు. పొద్దుటినించీ సాయంకాలందాకా ఊపిరి సలపనీయని

ఈ అతిథుల సందడిలో జుకర్మన్, ఆయన భార్య తమ చేలలో పనులన్నీ మరిచి పోయారు. నేరేడు పళ్ళన్నీ రాలి పోతున్నాయి. జుకర్మన్ సతి ఏటా నేరేడు పళ్ళతో జామ్ తయారుచేసి దాచిపెట్టేది. ఇప్పుడామెకు ఆ స్పృహే లేదు. మొక్కజొన్న చేను మళ్ళీ దుక్కి దున్నవలసిన సమయం. లర్వీకి ఎక్కడా తీరుబాటు లేదు.

ఆదివారం చర్చినిండా ఇసకవేస్తే రాలకుండా జనం వచ్చారు. మతాధిపతి ఈ అద్భుత సన్నివేశానికి అర్థం వివరించారు. మానవులంతా ఇంకా ముందు ముందు జరగబోయే ఇలాంటి వింతలకోసం జాగ్రత్తగా ఎదురు చూస్తూ ఉండాలని ఆ సాలెగూడు మీద మాటలు సూచిస్తున్నయ్యన్నడు.

దాంతో జుకర్మన్ పశువులదొడ్డి పెద్ద యాత్రాస్థలమయింది. ఫెన్ ఆనందానికి మేరలేదు. షాలట్ పన్నుగడ పని చేసిందనీ, ఇక విల్బర్ ప్రాణానికి వచ్చిన భయంలేదనీ ఆమెకు అర్థమయిపోయింది. అయితే, ఇప్పుడు జుకర్మన్ బాబాయి దొడ్డి వెకనటిలా, హాయిగా ఉండటంలేదు. ఎప్పుడు చూసినా దాని నిండా బోలెడు మంది మనుష్యులు ఉంటున్నారు. అక్కడ తన స్నేహితుల మధ్య తానొక్కతే ఉండటం ఆమెకు ఎంతో సరదా!

12. మహాసభ

షాలట్ గూడు మీద ఈ వింత సందేశం కనిపించిన తరువాత కొన్నాళ్ళకి, ఒక రోజున షాలట్ ఆ పశువుల దొడ్లో ఉన్న జంతువు లన్నిటినీ పిలిచి పెద్ద సభ చేసింది.

"ముందుగా నేను ఒక్కొక్కళ్ళనే పిలుస్తాను, హాజరుచెప్పండి. విల్బర్?"

"హాజర్ సార్!"

"బాతు?"

"హా-హా-హా-హాజర్...హాజర్ హాజర్...సార్"అంది బాతు.

"నువ్వొక్క దానివే ముగ్గురు బాతమ్మలలాగ హాజరు చెపుతావేం? ఊరికే ఒక్కసారి హాజర్ అని ఊరుకోలేవూ? ఏ మాటయినా మూడుసార్లు అంటే గాని తృప్తి లేదా నీకు?" అని గదమాయించింది షాలట్.

"అ-అ-అ-అది మా బ-బ-బ-బాతులన్నిటికీ అ-అ-అ-అలవాటు" అంది బాతు.

"బాతమ్మా?" అని కేక వేసింది షాలట్.

"హా-హా-హా-హాజర్, హాజర్, హాజర్" అంది బాతమ్మ. షాలట్ ఆ బాతమ్మకేసి గుడ్లురిమి చూసింది.

"బాతుపిల్లలు మొత్తం ఏడు."

"హార్,ఆర్,ఆర్!" "హార్,ఆర్,ఆర్!" "హార్,ఆర్,ఆర్!" "హార్,ఆర్,ఆర్!" "హార్,ఆర్,ఆర్!" "హార్,ఆర్,ఆర్!" "హార్, ఆర్, ఆర్!" అని పలికినయి బాతుపిల్లలు.

"ఇదొక పెద్ద బాతుల సభలాగ కనిపిస్తూంది. ఎవరైనా వింటే ఇక్కడ మూడు బాతమ్మలు, మూడు బాతులు, ఇరవయ్యొక్క బాతుపిల్లలు ఉన్నాయనుకుంటారు," అంది షాలట్.

అని వెంటనే మళ్ళీ "ఇక గొఱ్ఱెలు!" అని పిలిచింది.

"హే - ఆ ఆ - ఆ!" అని గొఱ్ఱెలన్నీ ఒకేసారి పలికినయ్.

"గొఱ్ఱె పిల్లలు?"

"హే - ఆ ఆ - ఆ!" గొఱ్ఱెలన్నీ ఒకేసారి పలికినయ్.

"టెంపుల్టన్!"

జవాబులేదు.

"టెంపుల్టన్న్న్?"

జవాబులేదు.

"ఒక్క ఎలక తప్ప మనమంతా ఇక్కడ ఉన్నాం. కొన్నాళ్ళ నించి ఇక్కడ జరుగుతూన్న కోలహాలం మీరంతా చూస్తూనే ఉన్నారు. విల్బర్ని మెచ్చుకుంటూ నేను నా సాలెగూడు మీద రాసిన సందేశం సంగతి దేశమంతా తెలిసిపోయింది. జకర్మన్ కుటుంబానికి విశ్వాసం

ఏర్పడింది. వాళ్ళే యేమిటి? నా మాట లోకమంతా నమ్ముతూంది. విల్బర్ అసాధారణమైన పంది అనే జుకర్మన్ అనుకుంటున్నాడు, అంచేత, దాన్ని చంపి తినాలనే ప్రయత్నం మానుకున్నాడు. నా ఉపాయం ఫలించిందనీ, విల్బర్‌కి ప్రాణభయం లేదనీ ఇప్పుడు ధైర్యంగా చెప్పవచ్చు."

"బలే! భేష్!" అని అరిచినయి జంతువులన్నీ

షాలట్ మళ్ళీ అందుకుని, "బాగున్నది. మీ అందరికీ నా ధన్య వాదాలు. మీ సలహా తీసుకోటం కోసం ఈ సభ ఏర్పాటు చేశాను. నా గూడుమీద రాయడానికి మళ్ళీ ఏవైనా కొత్త భావాలు కావాలి. ఇక్కడికి వచ్చిన ప్రజలు "గొప్ప పంది" అన్న మాటలు చదివి, చదివి విసిగిపోతున్నారు. మళ్ళీ మరొక మంచి మాటగాని, సందేశంగాని మీలో ఎవరైనా సూచిస్తే దాన్ని మళ్ళీ నా గూటిలో అల్లుతాను. మరో నినాదమేదైనా మీ కెవరికైనా తోస్తే చెప్పండి."

"అద్భుతమైన పంది అంటే ఎలా ఉంటుంది?" ఒక గొర్రెపిల్ల అడిగింది.

"బాగుండదు. ఎడారి వైభవం అన్నట్టుంది."

"భీముడు, భీముడు; భీముడు-అంటే?" అంది బాతమ్మ.

"అల్లా మూడుసార్లు కాకుండా, ఒక్కసారితో కట్టిపెడితే ఇది బాగానే ఉండేట్టుంది. 'భీముడు' అనే మాట జుకర్మన్ కుటుంబానికి మరికొంత కంగారు పుట్టించొచ్చు" అంది షాలట్.

"వద్దు! నాకు బాగుండదు. నేనంత భయం పుట్టేట్టు లేను" అంది విల్బర్.

"మరేం ఫర్వాలేదు నష్టమేంలేదు. మనుష్యులు అచ్చులో ఏది చూసినా తేలికగా నమ్మేస్తారు. భీముడు అన్నమాటకి సరైన వర్ణక్రమం ఇందులో ఎవరికైనా తెలుసా?" అంది షాలట్.

"ఆఁ! తె-తె-తె-తెలుసు. భ్-భ్-భ్-భకార, య్-య్-య్-ఈ గాకారాల భీ; మ-మ-మ-మకార, వ్-వ్-వ్-వుకారాల మ్-మ్-మ్-ము; భీము; డ-డ-డ డకార, వ్-వ్-వ్-వుకారాల డు; భ్-భ్-భ్-భీముడు, అని రాస్తే స-స-స-సరిపోతుంది." అంది బాతు.

"చాల్చాలు, కట్టిపెట్టు" అని కసురుకుంది. "నువ్వు చెప్పే దంతా రాయడానికి నేను జన్మలెత్తాలి."

"పొ-పొ-పొ-పొరపాటు" అంది బాతు.

పెద్ద గొర్రె ముందుకొచ్చి అంది: "విల్బర్ కి ప్రాణ భయం లేకండా చెయ్యాలంటే, మళ్ళీ ఏదో కొత్తమాట రాయడం అవసర మని నేను ఒప్పుకుంటాను. అందుకు తగిన మాట ఎంచుకొనడంలో షాలట్ కి సహాయం కావలసివస్తే మన టెంపుల్టన్ ఉంది. జుకర్మన్ లు చెత్త, చెదారం పడేసే గదిలోకి ఆ ఎలక రోజూ వెళుతుంది. అక్కడ బోలెడన్ని పాత పత్రికలు పడి ఉంటయి. చిన్న చిన్న పత్రికలలోంచి ముక్కలు చింపి ఈ పశువుల దొడ్లోకి పట్టుకువచ్చి షాలట్ కివ్వటం టెంపుల్టన్ కి పెద్ద పనికాదు. వాటిలోంచి ఏదైనా మాట చూసి షాలట్ తన గూట్లో రాయొచ్చు."

"బాగుంది. మంచి ఉపాయమే," అంది షాలట్. "కాని టెంపుల్టన్ మనకు సహాయ పడుతుందా అని నా అనుమానం. అది అమిత స్వార్థ పరురాలనీ, ఎవ్వరికీ రవంత సాయం చేయడానికి ఇష్ట పడదనీ మన కందరికీ తెలుసు కదా!"

"అయినా, అది మనకు సాయం చేసేటట్టు నేను చేయగలను. దాని నీచబుద్ధికి తగిన పద్ధతిలో చెప్తేసరి! అదిగో మాటలోనే వస్తోంది. నేనీ విషయం దాంతో మాట్లాడు తున్నంతసేపూ మీ రెవరూ ఏమీ మాట్లాడొద్దు. తెలిసిందా?"

ఆ ఎలక మామూలుగా అలవాటు ప్రకారం గాదెగోడ పక్కగా పాకుతూ అక్కడికి వచ్చింది.

"ఏమిటిదంతా?" అంది - అక్కడ సభ చేస్తూన్న జంతువు లన్నిటినీ చూసి.

"మేం డైరెక్టర్ల మీటింగు జరుపుకొంటున్నాం." అంది పెద్ద గొర్రె.

"చాల్లెండి. ఇక కట్టి పెట్టండి. మీటింగులంటే నాకు తలకాయ నొప్పి!" అంటూ ఆ ఎలక గోడ మీద నించి వేలాడుతూన్న ఒక తాడు మీంచి పైకి పాకటం మొదలు పెట్టింది.

"టెంపుల్టన్! ఇల్లా చూడు. ఈ సారి నువ్వా పాత సామాను గదిలోకి పోయినప్పుడు ఏదైనా మంచి వార్తపత్రికలోంచి నాలుగు కత్తిరింపులు తీసుకురావాలి. విల్బర్ ప్రాణం కాపాడడానికి షార్లట్ తన గూటి మీద రాయడానికి మంచి మంచి కొత్త మాటలు కావాలి; తెలిసిందా?"

"విల్బర్ చస్తే నాకేం? చావనీ! నాకేం చింతలేదు" అంది టెంపుల్టన్.

"ఇప్పుడు కాదు. వచ్చే శీతాకాలంగాని నీకా సంగతి అర్థం కాదు. రేపు జనవరిలో మంచిరోజున విల్బర్ చచ్చిపోయిన తరువాత వెచ్చ వెచ్చని గంజి, కూర ముక్కలు పట్టుకుని ఈ పంది తొట్టెలో పోసేందుకు ఎవరూ రారు. విల్బర్కి దయతలచి వదిలిపెట్టిన తిండితోనే ముఖ్యంగా నీ కడుపు నిండుతూందనే సంగతి నీకు తెలియడంలేదు. టెంపుల్టన్! నీ బతుకంతా విల్బర్ బతుకుతో ముడి పెట్టుకుని వుంది తెలిందా? విల్బర్ తిండే నీకు తిండి. విల్బర్ బతుకే నీ బతుకు. విల్బర్ చచ్చిపోయి దాని తొట్టెలో ఏమీ పడకపోతే, రోజు రోజుకు నువ్వు నీరసించి, చిక్కి, చివికి చచ్చిపోతావు." అంది పెద్ద గొర్రె

టెంపుల్టన్ మీసాలు వణికినయి.

"అవును. నువ్వు చెప్పింది నిజమే లాగుంది. సరే వెళతాలే! రేపే ఆ సామాను గదిలోకి వెళ్ళొస్తాను. ఏమైనా వార పత్రిక ముక్కలు దొరికితే తప్పకుండా పట్టుకొస్తాలే," అంది టెంపుల్టన్.

"భేష్! సరే. ఇక ఈ మహాసభ వాయిదా వేద్దాం. ఇక ఈ వేళంతా నాకు చాలా పని ఉంటుంది. నా గూటిలో చాలా భాగం తెంపి పారేసి దాంట్లో 'భీముడు' అనే అక్షరాలు రాయాలి" అంది షాలట్.

విల్బర్ పణికింది - "నేను అంత భయం పుట్టేట్టులేను - షాలట్! మామూలు పందుల కంటె కొంచెం బలిసి ఉన్నానేమో! అంతేగాని, అంత మొద్దులాగ ఉన్నానా?"

"కనీసం నాకు నువ్వల్లాగే కనబడుతున్నావులే! అదే ఇప్పుడు ముఖ్యం. నువ్వు నా ప్రాణస్నేహితుడివి. నీకు గాభరా హెచ్చు. ఇక చర్చ కట్టిపెట్టి పోయి కాసేపు హాయిగా నిద్రపో!" అంది షాలట్.

13. గొప్ప అభివృద్ధి

రాత్రి బాగా పొద్దుపోయింది. తక్కిన జంతువులన్నీ నిద్రపోయినా, షాలట్ మాత్రం తన గూడంతా మార్చి మళ్ళీ అల్లుతూ మేలుకొనే ఉంది. ముందుగా గూటి మధ్య చాలా దారాలు తెంపివేసింది. నిలువు దారాలు లేకపోతే అసలు గూడే నిలవదు గనుక, వాటిని మాత్రం ఉంచింది. ఆ అల్లిక పనిలో షాలట్ కాళ్ళు ఎనిమిదీ ఎంతో ఉపయోగ పడుతున్నాయి. ఆమె పళ్లు కూడా అలాగే చాలా ఉపయోగ పడుతున్నాయి. షాలట్‌కి గూడు అల్లటం అంటే అమితమైన సరదా. ఆ పనిలో ఆమెకు అనుపమానమైన కౌశలం ఉంది. మధ్య దారాలను తెంపివేసిన తరువాత ఆ సాలె గూడు ఇంచు మించు ఈ కింది విధంగా ఉంది.

సాలీడు చాలా రకాల దారాలు ఉత్పత్తి చేయగలదు. ముఖ్యమైన నిలువు దారాలుగా గట్టి పొడిదారాలు వాడుతుంది. అడ్డు



దారాలకు జిగురుగా ఉండే బారాలు ఉపయోగిస్తుంది. దోమల్ని, ఈగల్ని పట్టుకుంటానికి ఈ దారాలే చాలా ముఖ్యం. ఈ నూతన సందేశాన్ని రాయడానికి పొడి దారాలను వాడాలని సాలెట్ నిశ్చయించింది.

"ఈ అక్షరాలను జిగురు దారాలతో అల్లితే, దోమలూ, నల్లులూ వాటికి తగుల్కొని అక్షరాల అందాన్ని చెడగొడతయి" అనుకుంది.

"ఇక, మొదలు పెడదాం. మొదటి అక్షరమేమిటి? 'క్షీ' కాదూ?"

సాలెట్ ఎడం చేతి వైపు కొంచెం పైన అడ్డదారం దగ్గర మొదలు పెట్టి మరి కొంచెం పైగా ఉన్న నిలువు దారానికి కలిపింది. తరువాత మళ్ళీ కిందికి దింపి మెల్లగా ఓపికగా పక్క పేజీలో ఉన్న బొమ్మలో మాదిరిగా అల్లివేసింది. అల్లుతూన్నంత సేపూ, "మళ్ళీ పైకి, కొంచెం కిందికి, మళ్ళీ పక్కకి, పైకి, కిందికి" అని తనలో తానే పొచ్చరించుకుంటూ, మధ్య మధ్య అక్షరం పొంకంగా కుదరలేదనుకుంటూ ఆ దారాన్ని తెంపిపారేసి, మళ్లీ కొంచెం పక్కగా అతికిస్తూ, ఉండి ఉండి దూరంగా వెళ్ళి అక్షరాలు వరసగా, తీరుగా వస్తున్నదీ లేనిదీ తేరిపార చూసుకుంటూ, అక్షరాలు ఎగుడు దిగుళ్ళుగా కనిపిస్తే, తెంపేసి, సాధ్యమైనంత వరకు సూటి చెడకుండా మళ్లీ "ఈ తడవ ఫర్వాలేదు - కొంచెం నయం, - ఇప్పుడు బాగుంది - భేష్!" అనుకుంటూ కష్టపడి అక్షరాలన్ని మంచి నదరుగా, స్ఫుటంగా కనిపించేటట్టు అల్లి పూర్తి చేసింది.

పని పూర్తి అయేసరికి సాలెట్‌కి అమితమైన ఆకలి వేసింది. దాచి ఉంచుకున్న ఒక నల్లిని తిని ఆకలి తీర్చుకుంది. తరువాత కొంత సేపటికి అలసటతో సొమ్మసిల్లినట్టు హాయిగా నిద్రపోయింది.



మరునాడు ఉదయం విల్బర్ నిద్రమేల్కొని ఆ సాలెగూడు కింద నిలబడింది. ఉదయపు గాలిని ఊపిరి తిత్తుల నిండా పీల్చింది. సాలెగూడు నిండా మంచుబొట్లు పడి ఆ ఉదయ కాంతిలో మెరుస్తూ,

ఆ సాలెగూడు అందంగా కనిపించేటట్టు చేస్తూంది. లర్వీ ఉదయం మేత తీసుకు వచ్చేసరికి ఆ పంది హుందాగా నిలబడి ఉంది. దానికి పైగా సాలెగూడులో స్ఫుటంగా కనిపించే అక్షరాల్లో "భీముడు" అని రాసి ఉంది. మళ్లీ ఒక విడ్డూరం!

లర్వీ పరిగెత్తుకెళ్ళి తన యజమానిని పిలిచాడు. జుకర్మన్ ఊపుకుంటూ పోయి భార్యను పిలిచాడు. జుకర్మన్‌సతి ఫోను దగ్గిరికి పరిగెత్తి ఆరబుల్‌ని, ఆయన భార్యను పిలిచింది. ఆరబుల్ కుటుంబం వెంటనే తమ ట్రక్కులను ఎక్కి బయల్దేరి వచ్చేశారు.

అంతా విల్బర్ ఆవరణచుట్టూ నిలబడి సాలెగూడు కేసి చూస్తూ, ఆ అక్షరాలు ఒక్కొక్కటే చదువుతున్నారు. చదివిన వాళ్ళు మళ్ళీ చదువుతున్నారు. తాను నిజంగా భీముడులా, భయంకరంగా ఉన్నాననుకుంటూ విల్బర్ గాలి గట్టిగా పీల్చి, రొమ్ము పెద్దది చేసి, ముక్కులింతింత చేసి, సగర్వంగా ముట్టె ఇటూ అటూ ఊపుతూ నిలబడి ఉంది.

"భీముడు" అంటూ విట్టూర్చాడు జుకర్మన్. "ఎడిత్ నువు వెళ్ళి, పత్రికా విలేఖకుణ్ణి పిలిచి, ఈ సంగతంతా చెప్పు. వాళ్ళు ఫొటో తీసే వాళ్ళను కూడా తీసుకు వస్తారేమో! మన పంది నిజంగా భీముడే! అంత బలమైన పంది మన రాష్ట్రంలో లేదు."

ఈ సంగతి మళ్ళీ పాకిపోయింది. వెనక విల్బర్ "గొప్ప పంది" గా ఉన్నప్పుడు వచ్చి చూసిన ప్రజలు, వాళ్ళు చెప్పగా విన్న కొత్త వాళ్ళు మళ్ళీ తండోపతండాలుగా వచ్చి ఇప్పుడు "భీముడు"లాగా బలంగా, భయంకరంగా ఎదిగిన విల్బర్‌ని చూసి పోతున్నారు.

ఆ సాయంకాలం జుకర్మన్ ఆవులకు పాలు తియ్యడానికి వెళ్ళినప్పుడు, ఆయన ఇంకా తన పంది మాహాత్మ్యాన్ని గురించే ఆలోచిస్తున్నాడు.

"లర్వీ!" అని పిలిచాడు. ' ఇకనించి మన ఆవులవెంట ఆ పంది దొడ్లో పడెయ్యకు! మన పంది చాలా బలమైనది. భయంకరమైనది. అది పడుకుంటానికి రోజూ గడ్డి పరిచి మెత్తగా పక్క తయారుచేస్తూ ఉండు. తెలిసిందా?"

"అలాగే లెగండి!" అన్నాడు లర్వీ.

"ఇంకో మాట!..." మళ్ళీ అందుకున్నాడు జుకర్మన్. "మన విల్బర్ కోసం నువ్వొక మంచి బోను తయారు చెయ్యాలి. రేపు సెప్టెంబరు ఆరో తేదీన పట్నంలో జరిగే పశువుల ప్రదర్శనోత్సవానికి విల్బర్ ని తీసికెళదాం. బోనంతటికీ ఆకుపచ్చ రంగు వేయించి, దాని మీద బంగారు గిల్టు అక్షరాలతో పేరు రాయించు."

"ఏమని రాయించేది?' అడిగాడు లర్వీ.

"జుకర్మన్ల పేరు మోసిన పంది అని రాయించు."

గడ్డి తిరగేసే పంగలకట్ట ఒకటి తీసుకుని లర్వీ గడ్డిమేటు వేపు వెళ్ళిపోయాడు. అలాంటి గొప్ప పంది దొడ్లో ఉన్నప్పుడు అదనంగా పనిచేయక తప్పదు. ఆ సంగతి లర్వీకి తెలుసు.

ఆపిల్ చెట్ల తోపుకి దిగువను ఒక కాలిదారి చివర ఉంది-జుకర్మన్ కుటుంబం వారి చెత్తా చెదారాల గది. ఎవ్వరికీ ఎందుకూ పనికిరాని సామాన్లన్నీ వాళ్లు ఆ గదిలో పారేస్తారు. అందులో ఒక పక్కగా పాతసీసాలు, ఖాళీడబ్బాలు, చింకిరిగుడ్డలు, ఇనపముక్కలు, పగిలిపోయిన సీసాలు, విరిగిపోయిన మడతబందులు, చెడిపోయిన స్ప్రింగులు, అయిపోయిన బాటరీలు, ఏనాటివో వార్తాపత్రికలు, మూలపారేసిన బురఖాకోట్లు, తుప్పుపట్టిన మేకులు, చిల్లులుపడిన గిన్నెలు, పొరపాటున పారేసిన కళ్ళల్లో మందు వేసుకునే చిల్లిఖిరడా

సీసా, పగిలిన ఫ్లాస్కులు, ఇంకా ఏవేవో పనికిమాలిన సామానులు గదినిండా చిందర వందరగా పడి ఉన్నాయి.

టెంపుల్టన్‌కి ఆ గదిలో ఎక్కడ ఏమి ఉన్నదీ అంతా తెలుసు. ఆ గది అంటే దానికి చాలా సరదా. అది దాక్కుంటానికి అందులో ఎక్కడ పడితే అక్కడ సందులున్నాయి. ఎలకలకు అంతకన్న అద్భుతమైన విహారస్థలం మరొకటి దొరకదు. సాధారణంగా ఏదో ఆహారపదార్థం 'కొద్దో గొప్పో' పక్కలకి పట్టి ఉన్న డబ్బాలు అక్కడ ఎప్పుడూ ఉంటయి.

టెంపుల్టన్ అక్కడి సామాన్లన్నీ కుళ్ళగించడానికి వచ్చేసింది. గాదె దగ్గిరికి తిరిగి వెళ్ళేటప్పుడు ఒక పాత పత్రికలోంచి చింపిన ఏదో ప్రకటన ఉన్న ఒక కాగితం నోట కరచుకొని వచ్చింది.

ఆ కాగితం ముక్క తెచ్చి షార్లట్‌కి చూపించి "ఇది ఎలా వుంటుందో చూడు!" అంది టెంపుల్టన్. "ఇదుగో ఇలా చూడు, కమ్మనిది! కమ్మనిది! ఎంత బాగుందో చూశావా? ఈ మాట రాసెయ్ నీ గూట్లో!"

"సరిగ్గా ఏ మాట రాయకూడదో అదే తెచ్చావు. ఇంతకంటె పనికిమాలిన మాట ఇంకోటి ఉండబోదు. విల్బర్ మాంసం కమ్మగా ఉంటుందని జుకర్మన్‌కి చెప్పటం కాదు - ఇప్పుడు మనం చేయదలచుకొన్నది. గుమగుమలాడే కమ్మని పంది మాంసం, పంది కొవ్వు జ్ఞాపకంవస్తే జుకర్మన్ మనస్సే మారిపోతుంది. మనం ప్రచారం చేయవలసింది విల్బర్ చాలా గొప్పదని. అంతేగాని దాని మాంసపు రుచిని గురించి కాదు. దయచేసి మళ్లీ వెళ్ళి ఇంకేదైనా మంచి మాట పట్టుకుని రా టెంపుల్టన్!" అంది షార్లట్.

ఎలక ముందుగా ఎందుకొచ్చిందా అన్నట్టు గునుస్తున్నట్టు కనిపించింది. కాని కొంతసేపటికి చల్లగా జారి మళ్లీ ఆ చెత్త గదిలోకి

వెళ్ళి కొంచెం సేపటిలో ఇంకొక కాగితపు ముక్క తీసుకు వచ్చింది. "ఇదెలా ఉందో చూడు ఇంకొక మంచి పత్రికలో ముక్క" అంటూ ఆ పీలిక మీద ఉన్న అక్షరాలను చూపించింది.

షాలట్ పీలికను పరీక్షించి, అక్షరాలు చదివింది. "సానుభూతి" అని రాసి ఉంది.

"అయ్యో! లాభంలేదు. పనికిరాదు టెంప్లట్న్! మనకు కావల సింది విల్బర్ పట్ల జుకర్మన్‌ల సానుభూతికాదు. విల్బర్ అంటే వాళ్ళం దరికీ గౌరవం, భయం కలిగించే మాటలు కావాలి. అంచేత, మళ్ళీ ఒకసారి ప్రయత్నించు" అంది షాలట్.

"ఏమిటి నీ ఉద్దేశం? నేనేం పత్రికల కుర్రాణ్ణి అనుకున్నావా." అని గొణిగింది ఎలక. "పొద్దస్తమానం ఆ చెత్త సామాను గదిలో ప్రకటన కాగితాలు వెతుకుతూ కూచోటంతప్ప నాకేమీ పనిలేదను కున్నావా?"

"లేదు టెంప్లట్న్! దయచేసి ఇంకొక్కసారి ప్రయత్నించు" అంది షాలట్.

"అయితే విను - నేనేం చేయదలచుకుందీ చెప్పేస్తా! వాళ్ళ స్నానాల గదిలో సబ్బు బిళ్ళ మీద చుట్టే కాగితం ఒకటి ఉంది. దాని మీద ఏవో మంచి మంచి మాటలు ఉన్నాయి. అందులో ఏదో ఒకటి చించుకొస్తా. సరేనా?" అంది టెంప్లట్న్. అని తాడు మీంచి పైకి పాకి పోయి కప్పులో ఉన్న కన్నంలో దూరి మాయమయింది.

మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు టెంప్లట్న్ నోట్లో నీలంగా తెల్లగా ఉన్న కాగితం ఉంది. "ఇదిగో ఈసారి చూడు. ఎల్లా ఉంది?" అంది సగర్వంగా.

షాలట్ ఆ కాగితం మీది అక్షరాలు చదివింది. "తెప్పో! ఓజస్వి!" అని రాసి ఉంది.

"అంటే ఏమిటి?" అని అడిగింది, జన్మలో ఎన్నడూ సబ్బు వాడి ఎరుగని షార్లట్.

"ఏమో నాకేం తెలుసు? నువ్వు మంచి మంచి మాటలు కావా లన్నావు. నేను తెచ్చి పెట్టాను. ఇంక వెళ్ళి నిఘంటు వోటి కూడా తీసుకు రమ్మంటావు గావాల్ను!" అంది టెంపుల్టన్.

ఇద్దరూ కలిసి ఆ సబ్బు బిళ్ళ మీది ప్రకటన మళ్ళీ చదివారు. "తేజస్వి! ఓజస్వి!" అని మెల్లగా గొణిగింది షార్లట్. "విల్బర్!" అని పిలిచింది.

మెత్తని గడ్డిలో హాయిగా నిద్రపోతున్న విల్బర్ లేచి, ఒక దూకు దూకింది.

"ఏదీ ఒక్కసారి పరిగెత్తు. నిన్ను పరీక్ష చెయ్యాలి" షార్లట్ ఆదేశించింది.

విల్బర్ తన దొడ్లో ఈ చివరినించి ఆ చివరికి పరిగెత్తింది.

"మళ్ళీ వెనక్కి! ఇంకా వేగంగా పరిగెత్తాలి" అంది షార్లట్.

విల్బర్ దౌడు తీసింది. ఆ ఎండలో దాని శరీరం తళ తళ మెరిసింది. తోక బిగుతుగా రెండు చుట్లు తిరిగింది.

"పైకి ఎగురు!" అంది షార్లట్.

విల్బర్ తన వల్లనైనంత ఎత్తుకి ఎగిరింది.

"కాళ్ళు నిటారుగా తన్ని, తల వంచి, చెవులు నేలకు తగిలే టట్టు అన్చు!"

అలా చేసింది విల్బర్.

"ఎగిరి తలక్రిందుగా పిల్లిమొగ్గ వెయ్యగలవా?" అంది షార్లట్.

"ఓ!" అంటూ విల్బర్ ఒక్క గంతు వేసి, గాలిలో పిల్లిమొగ్గ వేసింది."

"భేష్! సరే, విల్బర్! ఇక నువ్వు వెళ్ళి నిద్రపో. టెంపుల్టన్! నువ్వు తెచ్చినసబ్బు ప్రకటన బాగానే ఉన్నట్టుంది. కానివిల్బర్ 'తేజస్వి, ఓజస్వి'గా కనిపిస్తుందన్న నమ్మకం నాకు కలగలేదు. అయినా ఫర్వాలేదు."

"నీకు నమ్మకం లేదూ! ఇంకా గట్టిగా పరిగెత్తమన్నావా? చెప్పు! పరిగెత్తుతా! ఇంకా పైకి ఎగిరి పిల్లి మొగ్గలు వెయ్యమంటే వేస్తా" అంది విల్బర్ దర్పంగా.

"భేష్! అయితే ఫర్వాలేదు" అంది షాలట్, విల్బర్ వంక ప్రేమతో చూస్తూ. "ఔను. నువ్వు నిజంగా మంచి పందివే విల్బర్! తేజస్వివి, ఓజస్వివి కూడా కాబోతున్నావు. ఈ విషయంలో ఇంత వరకు చేశాక, ఇంక చివరిదాకా చూడటమే మంచిది."



"ఈ కసరత్తుతో అలసిపోయిన విల్బర్ పరిశుభ్రమైన గడ్డి పక్కమీద పడుకొని కళ్ళుమూసుకుంది. ఆ గడ్డి కుడుతూంది. పశువుల పెంట మీద పడుకున్నంత మెత్తగా, హాయిగా లేదు. ముట్టెతో గడ్డిని పక్కకి నెట్టివేసి మెత్తని ఆ పశువుల పెంటలో వెల్లకిలా పడుకుంది. పడుకుని ఒక్కసారి నిట్టూర్చింది. ఆనాడంతా విల్బర్ కి విశ్రాంతిలేదు. అది 'భీముడు'గా కనిపించటానికి అదే మొదటి రోజు. ఆ వేళ సాయం కాలం జట్లు జట్లుగా జనం వచ్చి చూసి పోతున్నారు. వాళ్ళు చూస్తున్నంతసేపు హుందాగా, తన చేతనయినంత భయంకరంగా కనిపించేటట్టు నిలబడి ఉండవలసి వచ్చింది. అందుచేత చాలా అలసి పోయింది. ఫెన్ వచ్చి విల్బర్ దొడ్డి పక్కన ఒక మూలగా ఉన్న బల్ల మీద కూచుని ఉంది.

"నా కొక కథ చెపుతావా? షాలట్! మంచి కథ ఏదైనా చెబుతూ వుండు. నేను నిద్రపోతాను." అని గారాబంగా అడిగింది విల్బర్.

నిజానికి షాలట్ కూడా అలసిపోయి ఉన్నా, విల్బర్ ని కాదన లేక కథ చెప్పడం మొదలు పెట్టింది.

"వెనక నాకో అందమైన అక్క ఉండేది. ఆ అక్క ఒక చిన్న కాలవ మీద అడ్డంగా గూడు అల్లింది. ఒక రోజున చిన్న చేప ఒకటి గభాల్న పైకెగిరి మా అక్క గూట్లో చిక్కు వడింది. అక్కకు ఆశ్చర్యం వేసింది. ఆ చేప గిల గిల తన్నుకోటం మొదలు పెట్టింది. అక్కకి ఏం చెయ్యడానికీ తోచలేదు. ధైర్యం తెచ్చుకుని ఆ చేప దగ్గిరికి వెళ్ళి గబ గబా దారాలు విడుస్తూ దాన్ని చుట్టేసింది. చేప గిల గిల తన్నుకుంటూ దారాలను తెంపివేస్తూ వుంటే, మా అక్క మళ్ళీ బలమైన దారాలలో దాన్ని చుట్ట పెట్టేది. ఈ విధంగా చాలాసేపు యుద్ధం జరిగిన తర్వాత..."

"ఏం జరిగింది? మీ అక్క చివరికి దాన్ని పట్టుకొని చంపే సిందా?" విల్బర్ అడిగింది.

"విను మరి! అబ్బో! ఆ దెబ్బలాట మరచి పోదామన్నా మరపు రాదు. ఒక పక్కన ఒక్క రెక్క మాత్రం దారాల్లో చిక్కు వడిన చేప ప్రాణ భయంతో విపరీతంగా విసిరి కొడుతూన్న తోక నీరెండలో మిల మిల మెరుస్తూంది. దెబ్బ దెబ్బకి ఆ సాలెగూడు ఆ



చేప బరువుకి ప్రమాదకరంగా ఊగుతూంది. దానిలో కొన్ని దారాలు తెగి పోతున్నయి." పాలట్ కళ్ళకు కట్టినట్టు వర్ణిస్తూంది.

"ఆ చేప ఎంత బరువుందో?" విల్బర్ ఉబలాటంతో అడిగింది.

"ఏమో తెలియదు." అంది పాలట్. "మా అక్క ముందుకు వస్తూ, వెనక్కి తప్పుకుంటూ, మధ్య మధ్య ఒళ్ళు తెలియకుండా విసిరి కొడుతూన్న చేపతోక దెబ్బలుతింటూ, నాట్యం తొక్కుతున్నట్టు అడుగులు వేసుకుంటూ, అన్ని వైపులకూ తిరుగుతూ, కొత్త దారాలతో ఆ చేపను చుట్టి వేస్తూంది. మొట్ట మొదట దాని తోక చుట్టూ దారాలు

చుట్టింది. చేప విసిరికొట్టింది. మా అక్క ఆ దెబ్బ తప్పించుకోనడానికి పక్కకి తప్పుకొని, మళ్ళీ కుడి పక్కనించి ఇంకొక దారాల చుట్ట వేసింది. ఆ తర్వాత కుడి రెక్క కింద నుంచి ఇంకో చుట్ట చుట్టింది. ఆ పైన తలవేపుకి వెళ్ళి గట్టి దారాలతో తలచుట్టూ ఒక కట్టు వేసింది. ఇంతసేపూ మా అక్క గూడు ఆ చేప బరువుతో తెగ సాగుతూ ఉయ్యాల ఊగుతూనే ఉంది.

"చివరికి ఏమయింది చెప్పుమరి!" విల్బర్ ఆసక్తికి అంతులేదు.

"ఏం అవుతుంది? చేప ఓడిపోయింది. మా అక్క అది కదల్లే కుండా గట్టిగా దారాలతో చుట్ట బెట్టేసి చంపేసింది. తర్వాత అది బాగా తయారయిన తర్వాత మెల్లగా పది రోజుల పాటు కమ్మ కమ్మగా ఆరగించింది."

"బాగుంది. ఇంకో కథ చెప్పవ్?" విల్బర్ బతిమాలింది.

పోనీలే పాపం అనుకుని, షాలట్ మళ్లీ ఇంకో కథ మొదలు పెట్టింది. ఈ తడవ గగన విహారం చేయగల తన ఇంకో అక్క కథ చెప్పింది.

"గగన విహారం అంటే?" విల్బర్ అడిగింది.

"అంటే గాలి గుమ్మటంలో ఆకాశం మీద ఎగిరి పోవటం." షాలట్ వివరించింది. "ఆ అక్క తల కిందుగా నిలబడి బాగా పొడుగు పాటి దారాలు పైకి వదిలేది. ఆ దారాలన్నీ గాలి గుమ్మటం లాగ అయేదాకా అల్లా వదిలే సరికి, ఆ గుమ్మటంతో పాటుగా మా అక్క కూడా ఆ చల్ల గాలితో పైకి లేచి ఎగిరి పోయేది.

"నిజంగా గాలిలో ఎగిరిపోయే దంటావా? నువ్వు ఊరికే కథ కట్టి చెప్పేస్తున్నావా?" విల్బర్ నమ్మలేక పోయింది.

"లేదు విల్బర్! నిజంగా జరిగిన కథలే చెపుతున్నాను. మా

అక్కలు చాలా గొప్పవాళ్లు. అయినా, విల్బర్! నీకు నిద్రవేళయింది. పోయి పడుకో!" అంది షాలట్.

"అయితే మరి ఏదైనా పాట పాడు!" అంది విల్బర్, కళ్ళు మూసుకుంటూ.

షాలట్ జాలిపడి గడ్డిలోంచి బృందగానం ప్రారంభించిన కీచురాళ్ళ గొంతులతో శ్రుతిగలిపి చల్లని జోలపాట పాడింది. చీకట్లు చిక్కపడి గాదెనిండా కమ్ముకున్నయి. షాలట్ పాడుతూంది:

నిదురపోవోసి మా గారాల కూచీ!
బెదరకిక వదలి పోయినదిలే బూచీ!
మృదువైన గోమయపు
మెత్త పొత్తిళుల
సొద మరచి నిదురింపు
మెద నింపు కలల! నిదుర॥

పొదరింట రెల్లులో
పులుగు, చిటి కప్ప
పొగడు వేనోళ్ళ ఈ
భూ మాత గొప్ప! నిదుర॥

భయపు ఎల్లలు దాటి
వర జీవ కోటి
బయలు దేరెను నిదుర
వడవపై యాత్ర! నిదుర॥

విల్బర్ ఎప్పుడో నిద్ర పోయింది. పాట పూర్తికాగానే ఫెన్ మెల్లగా కళ్ళు తుడుచుకుంటూ లేచి ఇంటికి వెళ్ళింది.

15. డాక్టర్ డోరియన్

మర్నాడు శనివారం ఫెన్ వంటింట్లో నిలబడి తల్లి పంపు దగ్గిర కడిగి ఇస్తున్న గిన్నెలు, పళ్ళాలు తుడిచి పక్కన పెడుతూంది. ఆరబుల్ సతి మౌనంగా పని చేసుకుంటూంది. ఫెన్ అందరి పిల్లలలాగ బయటికి పోయి ఆడుకుంటే బాగుండుననీ, అస్తమానం జుకర్మన్ల పశువుల దొడ్లోకి పోయి అక్కడి జంతువుల్ని చూస్తూ కూచోటం మానితే బాగుండుననీ ఆమె ఆలోచన.

"షార్లెట్ అంత బాగా కథలు చెప్పటం ఇంకెవ్వరికీ చేతకాదమ్మా నిజంగా!" అంది ఫెన్ పాత్రలు తుడిచే తుండు గుడ్డతో పప్పు గిన్నె లోపల తుడుస్తూ.

"ఫెన్! నువ్వు ఊరికే పిచ్చి ఊహలు పెంచుకుంటున్నావ్! ఇది మానెయ్యాలి. సాలీడు కథలు చెప్పలేదని నీకు తెలియదూ?... సాలీడు మాట్లాడదని నీకు తెలుసు అవునా?"

"అవునులేగాని, షార్లెట్ ఇంచక్కగా మాట్లాడుతుందమ్మా! పాపం! మనలాగ గట్టిగా మాట్లాడలేదు. సన్నగా ఎంత ఇదిగా మాట్లాడుతుందనుకున్నావ్!" అంది ఫెన్.

"ఏం కథ చెప్పింది నీకు?" వాళ్ళమ్మ కోపంగా అడిగింది.

"ఏం కథా? - షార్లెట్కి అందమైన అక్క ఉండేదిట. ఆ అక్క పెద్ద గూడొకటి అల్లి ఆ గూట్లో ఒక చిన్న చేపను పట్టేసుకుందిట! ఎంత మంచి కథో చూశావా?"

"ఫెన్! నీకు క్రిమంగా మతిపోతూంది. సాలీడుగూట్లో చేప ఎల్లా పడుతుందే? పిచ్చిపిల్లా!" అంది ఆరబుల్‌సతి కొంచెం ఆందోళనతో. "అది జరిగేసంగతి కాదని నీకు తెలియదుటే! ఇవన్నీ నీ పిచ్చి ఊహాలు!"

"లేదమ్మా! నిజంగా కథే! షాలట్ ఎప్పుడూ అబద్ధాలు చెప్పదు తెలుసా? ఆ అందమైన అక్క ఓ చిన్న పిల్లకాల్వమీద అడ్డంగా గూడు అల్లేసిందిట. ఒక రోజున ఆమె తన గూట్లో పచారీలు చేస్తూంది. అప్పుడు ఏం జరిగిందో తెలుసా? ఆ కాలవనీళ్ళల్లోంచి ఒక చిన్న చేప గభాల్న పైకెగిరి ఆ గూటిదారాల్లో తగుల్కుంది. దాని ఒక రెక్క ఆ దారాల్లో చిక్కుబడింది. అమ్మా! అప్పుడుటా? ఆ చేప తోక ఇటూ అటూ కొట్టుకొంటూ గిలగిల తన్నుకుంటూంటే, ఆ తోక ఎండలో తళతళ మెరిసిపోయిందిటే! అప్పుడు ఆ సాలెగూడంతా ఆ చేప బరువుతో ఇటూ అటూ ఉయ్యాలలాగ ఎల్లా ఊగిపోతూందో నీకూ్కూడా కనిపిస్తూందా? షాలట్ అక్క మాత్రం భయపడకండా, ఆ చేప చుట్టూ తిరుగుతూ దారాలు వదులుతూ దాన్ని చుట్టేసింది. మధ్యలో దాని తలమీద చేప తోక దెబ్బలు ఎన్ని తగిలాయో తెలుసా? అయినా సరే భయపడకుండా, ఉపాయంగా పక్కకి తప్పుకుంటూ, డాన్సు చేస్తున్నట్టు ఇటూ అటూ పరుగెత్తుతూ తన దారాలతో దాన్ని కట్టి పారేస్తూంది. ..."

"ఫెన్!" అని అరిచింది తల్లి. "చాల్లే! ఇక మానెయ్యి నీ పిచ్చి ఊహాలు, పిచ్చికథలు!"

"లేదమ్మా! నా ఊహ అంటూ వేమిటి? నిజంగా జరిగిన కథమ్మా" అంది ఫెన్.

"ఇంతకీ చివరికి ఏం జరిగింది?" అడిగింది తల్లి, తనకు తెలియకుండానే కథలో ఆమెకి కూడా కుతూహలం కలిగి.

"చివరికి షాలట్ అక్క గెలిచింది తెలుసా? ఆ చేపని దారా లతో బాగా చుట్టబెట్టేసి, చంపేసి, అది తినడానికి వీలుగా తయారయిన తరువాత కొంచెం కొంచెంగా తినేసింది. మనలాగే సాలీడుకి కూడా తిండి కావాలిగా మరి!"

"ఔను కావాలి. కావలసిందే!" అంది అరబుల్‌సతి పరధ్యా నంగా.

"షాలట్‌కి ఇంకో అక్కకూడా ఉంది తెలుసా? ఆమె దారా లతో గాలిగుమ్మటాలు చేసి, వాటితో ఆకాశంలోకి ఎగిరిపోతుందిట. అసలు ఏం చేస్తుందో తెలుసా? తల కిందికిపెట్టి మన అవెరీలాగ మొగ్గేసి, అలాగే తలమీద నిలబడి సన్నటి దారాలు పైకి వదిలేస్తుం దిట. ఆదారాలు చాలాఅయిన తర్వాత అవన్నీ కలిసి గాలిగుమ్మటం లాగ అయిపోతయి. అప్పుడు చల్లగాలి వేస్తుందిగా! ఆ గాలిలో పైకి ఎగిరిపోతుంది. మనం కూడా అట్లా చేస్తే? అబ్బ! ఎంత బావుం టుందో! కాదే... అమ్మా?"

"ఔను. ఆ సంగతి నేను ఆలోచిస్తాగాని, ఫెన్! ఈవేళ నువ్వు అలా బైటికివెళ్ళి సాటిపిల్లలతో ఆడుకో తల్లీ! హోమర్ బాబాయి గారి దొడ్లోకి వెళ్ళకేం! నీ సావాసకత్తెల నెవరినైనా పిల్చుకుని హాయిగా ఆడుకో. అస్తమానం బాబాయిగారి పశువు లదొడ్లో అలా ఒంటరిగా కూచోకూడదు. తెలిసిందా?"

"ఒంటరిగా అంటున్నావేం? నేనెప్పుడూ అక్కడ ఒంటరిగా కూచుంటం లేదమ్మా! నా సావాసగాళ్ళంతా బాబాయిగారి దొడ్లోనే ఉన్నారు. వాళ్ళందరి మధ్యా అక్కడ ఉంటే ఎంత సరదాగా ఉంటుందనుకున్నావ్? నేను ఎప్పుడూ ఒంటరిగా కూచోనమ్మా!

కొంత సేపటికి ఫెన్ వెళ్ళిపోయింది. మెల్లగా జకర్మన్‌ల ఇంటి వేపే నడిచివెళ్ళింది. తల్లి మంచువానాపిడి తుడుస్తూంది. తుడుస్తు

న్నంత సేపూ ఫెన్ విషయమే ఆలోచిస్తూంది. ఇంత చిన్నపిల్లకి ఆ జంతువులంటే ఇంత ఇష్టం ఏర్పడటం లోకవిరుద్ధంగా ఉంది ఆమెకి. చివరికి, డాక్టర్ డోరియన్ దగ్గిరికి వెళ్ళి ఫెన్ విషయంలో ఆయన సలహా తీసుకోటం మంచిదని నిశ్చయించుకొంది. కారులో కూచుని ఊళ్ళో ఉన్న ఆయన ఆఫీసుకి వెళ్ళింది.

ఒత్తైన వంకులగడ్డం దువ్వుకుంటూ డాక్టర్ డోరియన్ ఆరబుల్ సతిని ఆహ్వానించి, సుఖమైన సోఫాలో కూచోమన్నాడు.

"మా ఫెన్ విషయంలో మీ సలహా తీసుకోవాలని వచ్చాను డాక్టరుగారూ! అది రోజూ ఎంతసేపైనా వాళ్ళ హోమర్ బాబాయి గారి పశువుల దొడ్లోనే కూచుంటుంది. దాని వాలకం మామూలు పిల్లల ధోరణిలో లేదు. ఆ పశువులదొడ్లో ఆ పంది వున్న ఆవరణకు ఒకమూలగా పాలుతీసే పాతపీటమీద అలాగే గంటలకొద్దీ ఆ జంతువులను చూస్తూ కూచుంటుంది. అలాగే చూస్తూ వింటూ కూచుంటుంది.

డాక్టర్ డోరియన్ పడకకుర్చీలో వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాడు.

"ఎంత అద్భుతంగా ఉంది! నిజంగా అక్కడ ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా ఉండి ఉండాలి. హోమర్ కి గొర్రెలుకూడా ఉన్నాయి కదూ?" అన్నాడు డాక్టరు.

"ఔను. అసలా పందిపిల్లని బుడ్డిపాలతో పెంచుకోమని వాళ్ళ నాన్న ఫెన్ కి అప్పగించి నప్పటినించీ ప్రారంభమయింది ఈ గొడవ. పందికి విల్బర్ అని పేరుపెట్టింది. తర్వాత వాళ్ళ హోమర్ బాబాయి ఆ పందిని కొన్నాడు అప్పటినించీ ఆ పందిదగ్గిర కూచుంటంకోసం ప్రరోజూ ఇది వాళ్ళింటికి పోక తప్పదు."

"ఆ పందిని గురించి ఈమధ్య చాలా విన్నాను. చాలా గొప్ప పండట?"

"ఆ సాలీడుగూటిలో రాసిన మాటలసంగతికూడా విన్నారా?" అంది ఫెన్‌తల్లి ఆత్రంగా.

"ఆఁ! విన్నాను."

"అది ఏమిటంటూరు? మీకేమైనా అర్థమయిందా?"

"ఏమిటి అర్థమయేది?"

"సాలీడు గూడులో అక్షరా లెలా వచ్చాయో మీకేమైనా బోధపడిందేమో అనుకుంటున్నాను."

"అదా? లేదు. నాకూ అర్థంకాలేదు. అయితే సాలీడు అసలు అంత పసందుగా గూడుఅల్లడం ఎల్లా నేర్చుకుందో కూడా నాకు అర్థంకాదు. ఆమాటలు కనపడినప్పుడు అంతా అదొకవింత అన్నారు. కాని, అసలు సాలీడుగూడే ఒకవింత అని ఎవరూ గుర్తించలేదు."

"మామూలు సాలీడుగూడులో పెద్ద వింతేముంది లెండి!" ఆరబుల్‌సతి అంది. "అయినా మీరు సాలీడుగూడు కూడా అలాంటి వింత అని ఎందుకంటున్నారో నాకు తెలియదు. సాలెగూడు మామూలుగా ఎక్కడ పడితే అక్కడ ఉంటుందేగద!"

"అలాంటి దొకటి అల్లడానికి ప్రయత్నించి చూడండి ఎప్పుడైనా ఒకసారి!" అన్నాడు డాక్టర్ డోరియన్ చిరునవ్వు నవ్వుతూ.



ఆరబుల్‌సతి ఆందోళనగా కుర్చీలో ఇటూ ఆటూ కదిలింది. "అది నావల్ల కాకపోవచ్చు కాని, నేను చక్కని లేసుపని చేయగలను. రకరకాల తువాళ్ళు, మేజోళ్ళు అల్లగలను."

"అవునమ్మా. నిజమే. కాని ఈ పనులన్నీ నువ్వు ఎవరిదగ్గిరో నేర్చుకున్నావు. అవునా?"

"ఔను. మా అమ్మ నేర్పింది."

"మరి సాలీడుకి ఎవరు నేర్పారు? చిన్న సాలీడు ఎవరూ నేర్ప కుండానే, ఎవరి సలహాల అవసరం లేకుండానే గూడు అల్లుతోంది. అది వింతకాదుటమ్మా?"

"అవును వింతే! నేను అంత దూరం ఆలోచించలేదు. అయినా ఆ అక్షరాలు ఆగూట్లోకి ఎల్లా వచ్చాయో నాకు ఆశ్చర్యంగానే ఉంది. అది నాకు అర్థంకాదు. మనకు అర్థంకాని విషయమంటే నాకు తల కాయి నెప్పి" అంది అరబుల్‌సతి.

"అది ఎవరికీ అర్థంకాదు," అంటూ నిట్టూర్చాడు డాక్టర్ డోరియన్. "నేను డాక్టర్‌ని. డాక్టర్లకి అన్నీ తెలుస్తయ్యనుకుంటారు. కాని, నాకు అర్థంకాని విషయాలు చాలా ఉన్నాయి. అయితే అందు కోసం నేను విచారిస్తూ కూచోను."

అరబుల్‌సతి కంగారుగా కదలింది. "డాక్టర్! ఆ జంతువులు ఒకదానితో ఒకటి మాట్లాడుకుంటున్నాయంటుంది ఫెన్. జంతువులు మాట్లాడుతాయని కూడా మీరు నమ్ముతారా?"

"నేను ఏజంతువూ మాట్లాడుతుండగా వినలేదు. అంతమాత్రాన ఏమీ చెప్పడానికి వీలులేదు. జంతువు లనేకం నాతో ఏవో మాటలు చెప్పి ఉండవచ్చు. అశ్రద్ధవల్ల నేను వాటిని గ్రహించలేకపోయి ఉండ వచ్చు. పెద్దవాళ్ళకన్న పిల్లలకు ఈశ్రద్ధ ఎక్కువ. జుకర్మన్‌ల దొడ్లో జంతువులు మాట్లాడుకుంటున్నాయని ఫెన్ చెప్పిందంటే, నమ్మడానికి నాకేమీ అభ్యంతరం లేదు. బహుశః మనుష్యులు మాటలు తగ్గిస్తే, జంతువులు ఇంకా ఎక్కువగా మాట్లాడతయ్యేమో! మొత్తంమీద మనుష్యులు అతిగా మాట్లాడతారని మాత్రం నా గట్టి నమ్మకం."

"అమ్మయ్య! ఫెన్‌ని గురించిన బెంగ తీరిపోయింది. అయితే ఇంతకీ అమ్మాయిని గురించి ఆందోళన పడవలసిందేమీ లేదంటారా?"

"పైకి కనిపించడం ఎలా కనిపిస్తూంది?"

"బాగానే కనిపిస్తూంది."

"ఆకలి ఉందా?"

"ఆ... దానికి ఎప్పుడూ ఆకలే."

"రాత్రిపూట నిద్ర బాగా పోతూందా?"

"ఆ!"

"అయితే, కంగారేం లేదు" అన్నాడు డాక్టర్.

"ఎప్పటికైనా అది పందిని, గొర్రెల్ని, బాతుల్ని, ఆ సాలీడుని గురించి ఆలోచించడం మాని, మామూలు ధోరణిలో పడుతుం దంటారా?"

"ఇప్పుడా పాప వయస్సెంత?"

"ఎనిమిదో ఏడు."

"సరి. బహుశః పెద్దదైనా ఆమెకు జంతువులంటే ఇష్టం ఉం టుంది. అయినా, జీవితమంతా జుకర్మన్‌ల పశువులదొడ్లోనే గడుపు తుం దనుకోను. మగపిల్లల విషయ మేమిటి? ఆ పిల్ల మగపిల్ల లెవరితో నైనా చనువుగా తిరుగుతుందా?"

"మాట్లాడకేం? హెన్రీ ఫుస్సీ అనే కుర్రవాడంటే దానికి ఇష్టం" అంది ఆరబుల్ సతి ఉత్సాహంగా.

డాక్టర్ డోరియన్ మళ్ళీ కళ్ళు మూసుకుని దీర్ఘాలోచనలో పడ్డాడు. "హెన్రీ ఫుస్సీ!" అని గొణిగాడు. "ఉఁహుఁ! చాలా చిత్రంగా ఉంది. ఏం లేదమ్మా! నువ్వు బెంగపడవలసిం దేమీ లేదు. ఫెన్‌ని ఆ పశువులదొడ్లో తనస్నేహితులతో కాలక్షేపం చెయ్యనియ్యి. సాలీడూ, పందీ హెన్రీ ఫుస్సీ పాటి ఉత్సాహం ఇవ్వలేక పోవు. ఎప్పుడో ఒకరోజున హెన్రీ ఫుస్సీ కూడా ఆమెను ఆకర్షించే ఒకమాట అంటాడని నేను జ్యోతిషం చెపుతున్నాను. పిల్లలు ఈడువచ్చిన కొద్దీ

చిత్రంగా మారిపోతూ ఉంటారు. ఆఁ! అన్నట్టు అవెరీ ఏమంటు న్నాడు?'' కళ్ళు పూర్తిగా తెరిచి అడిగాడు.

''అవెరీ కేం? వాడు మొదటినించీ బాగానే ఉన్నాడు. తగని అల్లరి చేస్తాడు. ఆ అడవిపొదల్లోకి పోతాడు. కందిరీగలచేత, తేనె టీగలచేత బాగా కుట్టించుకు వస్తాడు. కప్పల్ని, పాముల్ని పట్టు కొస్తాడు. ఇంట్లో వాడిచేతికి దొరికినవన్నీ పగలగొడతాడు. వాడిదేం బెంగ లేదు.''

''బాగుంది!'' అన్నాడు డాక్టర్.

ఆరబుల్ సతి లేచి డాక్టర్ డోరియన్‌కి నమస్కరించి, ఆయన సలహాలకు కృతజ్ఞత తెలిపింది. ఆమె ఇప్పుడు పెద్దబరువు దించివేసు కున్నట్టు కనిపిస్తూంది.

15. చిమ్మెటలు

గడ్డిలో చిమ్మెటలు సన్నగా రాగం తీస్తున్నయి. వెళ్ళి పోతూన్న వేసవికాలాన్ని గురించి దిగులుగా దీనంగా గానం చేస్తున్నయి: "వెనక పట్టిందోయి వెళ్ళిపోతోంది, వేసంగి వైభవం వాసి తరిగింది."

వేసవివైభవం శాశ్వతం కాదని లోకానికి చాటడం ఏమ బాధ్యత అనుకుంటాయి లాగుంది ఈ చిమ్మెట్లు. సంవత్సరం మొత్తం మీద చాలా హాయైన రోజుల్లో - అనగా వేసవి వెనకబట్టి, చల్లగా జల్లులు పడే రోజుల్లో కూడా ఈ చిమ్మెట్లు ఏవో విషాద గాథల్ని గురించీ, విపరిణామాలను గురించీ దీనంగా పాడతాయి!

చిమ్మెటల సంగీతం అందరికీ వినబడింది. మట్టిరోడ్డు మీద నడిచి పోతూన్న ఫెన్, అవెరీ విన్నారు. బడి తెరిచేరోజులు దగ్గిర కొచ్చేస్తున్నాయని జ్ఞాపకంవచ్చి వాళ్ళు ఓక్కమొగం వేశారు. చిట్టిబాతులు ఈ సంగీతం విని తమర్ని ఇంక ఎవరూ బాతుపిల్ల లనరని బడాయిగా నడుస్తున్నయి. షాలట్ విని జీవితంలో తనకిక ఆట్టే వ్యవధిలేదని గ్రహించింది. వంటింట్లో పనిచేసుకొంటూన్న జుకర్మన్ పిన్నికికూడా ఈ చిమ్మెటల సంగీతం వినిపించింది. ఆమెనూ ఏదో విచారం ఆవరించింది. "ఇంకో వేసవి గడచిపోయింది" అంటూ నిట్టూర్చించి. విల్బర్ కి బోను తయారుచేస్తూ లర్వీ ఈగానం విని, బంగాళాదుంపల్ని ఇక ఉంచకూడదు, తవ్వేసెయ్యా లనుకున్నాడు.

"వేసంగి వైభవం వాసి తరిగింది" - మళ్ళీ పాడినయి చిమ్మెటలు. "చలిరేల నెన్నింక చవిచూడ వలెనో! సెలవౌసంగుము పూల సిరుల వేసంగి!"

గొర్రెలు చిమ్మెటల సంగీతం విని, కంగారుగా తాము మేసే ఆ పచ్చికబయలు కంచెలోంచి దారిచేసుకొని బయటికి దూకి, రోడ్డు కడ్డంగా పోయి పొలంలో జొరబడినయి. మొగబాతు ఆ సందును కనిపెట్టి తానుకూడా సకుటుంబంగా బయటికి బయలుదేరింది. షికారుగా పళ్ళతోట దాకా వెళ్ళి అవి నేలమీద రాలిన ఆపిల్ పళ్ళు తింటున్నాయి. చిన్న మాపుల్ మొక్క చిమ్మెట్ల సంగీతం విని, ఆ గాభరాతో కంది కుంకుమరంగుకి తిరిగింది.

ప్రస్తుతం ఆ పశువులదొడ్డి అంతటికీ విల్బర్ ప్రధానమైన ఆకర్షణ. పుష్టికరమైన ఆహారం, అన్ని గంటల ప్రకారం ఏర్పాటు చేయడంతో విల్బర్‌లో గొప్పమార్పు వచ్చింది. విల్బర్ తనపంది అని చెప్పుకొనగల ఏ రైతయినా గర్వపడేటంత పెద్దగా అది ఎదిగింది. ఒకరోజున వందమంది వచ్చి, ఆ పందిఆవరణ చుట్టూ నిలబడి, చూసి చూసి, మెచ్చుకొని మెచ్చుకొని వెళ్ళారు షాలట్ తన గూటిమీద ,తేజస్వి' అని రాసింది. విల్బర్ ఆ బంగరురంగు ఎండలో హుందాగా నిలబడి, నిజంగా తేజస్విలాగే కనిపిస్తూంది. సాలీడుతో స్నేహం కలిసినప్పటినుంచీ విల్బర్ తనకు వస్తూన్న ప్రతిష్ఠ నిలబెట్టుకోటానికి శాయశక్తులా తంటాలు పడుతూంది. షాలట్ గూటిమీద "గొప్ప పంది" అని రాసినప్పుడు విల్బర్ గొప్పగా, గొప్పపంది లాగ కనబడటానికి తంటాలు పడింది షాలట్ గూటిలో "భీముడు" అని రాసినప్పుడు భయంకరంగా కనబడడానికి ప్రయత్నించింది. ఇప్పుడు సాలెగూటిలో "తేజస్వి" అని రాసివుంటే, తాను తేజస్సుతో మిలమిల లాడుతున్నట్టు కనిపించడానికి ప్రయత్నిస్తూంది.

తేజస్విగా కనపడడ మంటే మాటలా మరి! విల్బర్ మంచి పట్టుదలతో పనిచేస్తూంది. తల కొంచెంగా ఆడిస్తూ, రెప్పలారుస్తుంది. గట్టిగా గాలిపీలుస్తుంది. తనను చూడటానికి వచ్చినవారికి విసుగు

పుడుతూందని తోచినప్పుడు ఒక్కసారి పైకెగిరి గాలిలోనే వెనక్కి పిల్లిమొగ్గ వేసి, మళ్ళీ మామూలుగా నిలబడేది. దాంతో చిన్నా, పెద్దా అక్కడి జనమంతా సంతోషంతో కేరింతాలు కొడుతూ విల్బర్‌ని ప్రశంసించేవాళ్ళు. "ఎక్కడైనా చూశామా ఇలాంటి పందిని? నిజంగా ఇది తేజస్వి" అంటాడు విల్బర్ యజమాని జుకర్మన్ సగర్వంగా.

ఈ ప్రశంసలతో విల్బర్ తల తిరిగిపోయి మతిచెడిపోతుందేమో అని ఆ పశువులదొడ్లో విల్బర్ మిత్రులంతా ఆందోళన పడ్డారు. నిజానికి అలాంటి దేమీ జరగలేదు. విల్బర్ అణకువ గలది కీర్తి విల్బర్‌ని ధూర్తంగా చెయ్యలేదు. భవిష్యత్తుని గురించిన భయం ఇంకా పూర్తిగా తొలగలేదు. సాలీడు నిజంగా తన ప్రాణాలను కాపాడ గలుగుతుందని గట్టిగా నమ్మలేకుండా ఉంది. ఇప్పటికీ రాత్రివేళ అడపా తడపా విల్బర్‌కి పీడకల వస్తూనే ఉంది. కత్తులు, తుపాకులు పట్టుకొన్న మనుష్యులు తనను చంపడానికి వస్తున్నట్టు ఈమధ్య ఒక కల వచ్చింది. మామూలుగా విల్బర్ అలాంటి కలలను అప్పుడే మరిచిపోయేది. పగలస్తమానం సంతోషంగా, ధైర్యంగా ఉంటుంది విల్బర్‌కి ఉన్నంతమంది నిజమయిన స్నేహితులు ఎన్నడూ మరో పందికి ఉండి ఉండరు. ప్రపంచంలో మనస్సంతృప్తికి స్నేహమే అత్యంత అవసరమయిన వస్తువని అర్థమయింది. చిమ్మెట్ల సంగీతంకూడా విల్బర్‌కి అట్టే విచారం కలిగించలేదు. ఆ మండలంలో ఏటేట జరిగే తిరునాళ్ళ దగ్గిరికి వస్తూందని కూడా తెలుసు. ఆ ప్రయాణంకోసం ఎదురుచూస్తూంది. ఆ తిర్నాళ్ళలో జరిగే పశుప్రదర్శనంలో తాను నెగ్గి, ఏదైనా బహుమానం కూడా సంపాదించుకోగలిగిందా, ఆపైన యజమాని తన ప్రాణం తీయడని విల్బర్ అభిప్రాయం.

షార్లట్‌కి సొంతబెంగ లెన్నిఉన్నా, పాపం వాటిని గురించి ఎవరితోనూ చెప్పదు. ఒకరోజు విల్బర్ తిరునాళ్ళకి తన ప్రయాణాన్ని

గురించి అడిగింది షాలట్ ని, "నువ్వు కూడా వస్తావుగా నాతో?"

"ఏమో చెప్పలేను. ఆ తిర్నాళ్ళు నాకు చాలా గడ్డురోజుల్లో వస్తూంది. ఆ సమయంలో నేను ఇల్లు విడిచిపెట్టి రావటం మంచిది కాదు" అంది షాలట్.

"ఏం? అదేమిటి?" అంది విల్బర్.

"ఏమీ లేదు. గూటిని విడిచిపెట్టి రావటం నాకు ఇష్టంలేదు. పైగా ఇంకా చాలా గొడవలు వున్నయిలే!" అంది షాలట్.

"వీల్లేదు షాలట్! నువ్వు రావాలిసిందే. నువ్వు లేకుండా ఒంటరిగా ఆ తిరునాళ్ళకి నేను వెళ్ళలేను బాబూ! ఏమో నువ్వు రాకతప్పదు." అని మారాంచేసింది విల్బర్.

"వీల్లేదు. ఏం చెయ్యమన్నావ్? నేను ఇంటివద్దనే ఉండిపోయి కొంతపని చేసుకొనడానికి ప్రయత్నించాలి.

"ఏం పని?"

"గుడ్లు పెట్టాలి. ముందుగా గుడ్లసంచీ ఒకటి అల్లాలి దాని నిండా గుడ్లు పెట్టాలి. ఇంక వ్యవధిలేదు."

"నువ్వు గుడ్లుకూడా పెడతావా? నాకు చెప్పలేదేం షాలట్!" అంది విల్బర్ ఆశ్చర్యంగా.

"ఔను పెడతాను. నాకు చాలా రకాల ప్రజ్ఞలు ఉన్నయి."

"ప్రజ్ఞలు! అంటే? చాలా గుడ్లన్న మాట?"

"కాదు. నేను చాలారకాల పనులు చేయగలను అన్నమాట. దారాలు తీసి గూడు అల్లటమే కాక ఇంకా చాలా పనులు చేయగలనన్నమాట" అని వివరించింది షాలట్.

"ఏమో నాతోకూడా వచ్చేసెయ్; అక్కడే పెడుదువుగాని గుడ్లు. అది మరీ అద్భుతంగా ఉంటుంది. అవునా? ఏం షాలట్?" విల్బర్ విల్బర్ ఆత్రంగా అడిగింది

షాలట్ తనగూటిని ఒకతోపు తోసి, అది ఊగులాడుతూ ఉంటే సాలోచనగా చూస్తూంది. "నాకేం భయం లేదుగాని విల్బర్! గుడ్లు పెట్టటంలో వుండే కష్టం నీకు తెలియదు. అక్కడికి వస్తే నా స్వంత వ్యవహారాలకు, అక్కడి తిరునాళ్ళలో అధికారుల నియమాలకు సరిపడక పోవచ్చును. నేను గుడ్లు పెట్టటానికి సన్నాహాలు చేసుకుంటే, తిరునాళ్ళ సంగతి ఏమయినా సరే, పెట్టి తీరాలిసిందే. అయినా దానికోసం నువ్వు ఆందోళనపడకు. నువ్వు ఈ విచారం పెట్టుకుంటే బరువు తగ్గిపోతావ్! అందుచేత, ప్రస్తుతానికి ఇలా అనుకుందాం. నేను సాధ్యమైనంత వరకు తిరనాళ్ళకి రావటానికే ప్రయత్నిస్తాను," అంది.

"ఓ భలే బాగుంది షాలట్! నాకు తెలుసు నాకు నీ సహాయం బాగా అవుసర మయినప్పుడు నువ్వు నన్ను వదిలిపెట్టవని నాకు తెలుసులే! అంది విల్బర్.

ఆనాడంతా విల్బర్ గదిలోపలే గడ్డిలో పడుకుని సుఖంగా కాలక్షేపం చేసింది. షాలట్ కూడా విశ్రాంతి తీసుకుని, ఒక గొల్లభామను ఆరగించింది. తానింక విల్బర్‌కి ఎక్కువ కాలం సాయపడలేక పోవచ్చు ననుకుంది. ఇంక కొద్దిరోజుల్లో తాను తక్కిన పనులన్నీ వొదిలేసి గుడ్లుపెట్టు కొనడానికి చక్కని సంచీ ఒకటి తయారు చేసుకోవాలి!

16. తిరునాళ్ల ప్రయాణం

రేపు తిరునాళ్ళ అనగా, ఆరాత్రి అందరూ పెందరాడే నిద్రపోయారు. ఫెర్నూ, అవెరీ ఎనిమిదిగంటలకే పడుకున్నారు. తిరునాళ్ళలో పెద్ద రాకాసిచక్రం తిరుగుతూ తిరుగుతూ ఆగిపోయినట్టు, తానప్పుడు అన్నింటికన్న పైనఉన్న తొట్టెలో కూచుని ఉన్నట్టు కలగన్నాడు అవెరీ. రంగులరాట్నం ఎక్కి తిరుగుతూ ఉండగా మధ్యలో భయంవేసినట్టు ఫెర్నుకి కలవచ్చింది.

లర్వీ ఎనిమిదిన్నరకే నిద్రపోయాడు. తాను తిర్నాళ్ళలో కొయ్యబంతులతో గుడ్డపిల్లిని కొట్టగలిగినట్టు, మంచి 'నవాజో' కంబళీ పినకు బహుమతి వచ్చినట్టు కలగంటున్నాడు. జుకర్మన్ బాబాయి, తన్నీ కూడా తొమ్మిదింటికే నిద్రపోయారు.

జుకర్మన్‌సతి ఫ్రిజిడరీ పెట్టె బేరమాడుతున్నట్టు కలవరించింది. జుకర్మన్ విల్బర్‌ని గురించి కలగన్నాడు. విల్బర్ నూటపదహారడుగుల పొడుగునా, తొంభయిరెండు అడుగుల ఎత్తునా బ్రహ్మాండంగా ఎగిరి



నట్టూ, ఆ తిర్నాళ్ళలోని పశుప్రదర్శనంలో బహుమానాలన్నీ దానికే రాగా దాని వంటినిండా నీలపు రిబ్బన్లు ముడిపెట్టినట్టూ, చివరికి తోకకు కూడా ఒక నీలపురిబ్బను కట్టినట్టూ ఆయన కలగన్నాడు.

ఇక పశువులదొడ్లో ఉన్న మిగిలిన జంతువులన్నీ కూడా త్వరగానే నిద్రపోయినయి. ఒక్క షార్లట్ మాత్రమే మేల్కొని ఉంది. రేపే తిర్నాళ్ళ రోజు. విల్బర్ విజయయాత్రకు బయలుదేరేటప్పుడు చూడటంకోసం పెందరాడే లేవాలనే ఉత్సాహంతో మిగతా జంతువులన్నీ త్వరగా నిద్రపోయినయి. మర్నాడు తుంర్పు తెల్లవారుతూండగానే అంతా లేచారు. ఆరోజున ఎందుచేతనో కొంచెం వేడిగా ఉంది. రోడ్డు ఎగువను ఆరబుల్ గృహంలో ఫెన్ వేడినీళ్ళ బాల్చీని కష్టంమీద నీళ్ళగదిలోకి లాక్కుని స్పాంజిస్నానం చేసింది. ఆ తిర్నాళ్ళకి ఇంకా చాలామంది పిల్లలు వస్తారని ఫెన్‌కి తెలుసు. లోపలికి పోయి తన దుస్తులన్నింటిలోకీ అందమైన వాటితో ముస్తాబయింది. వాళ్ళమ్మ అవెరీ మెడవెనక గట్టిగా రాచి, తల తడిచేసి, బ్రష్షుపెట్టి పైకి దువ్వింది. అవెరీ లోపల శుభ్రమైన మట్టులాగూ తొడిగి, మెరిసే నీలంపంట్లాం, శుభ్రమైన చొక్కా తొడిగాడు. ఫెన్ తండ్రి దుస్తులు వేసుకుని, త్వరగా టిఫెన్ తినేసి, వాళ్ల పెద్దకారు బయటికి తీసి శుభ్రంగా తుడిచాడు. విల్బర్‌తో సహా అందరినీ ఆకారులోనే తిర్నాళ్లకు తీసుకువెళతా నన్నాడు.

అందరికంటె ముందే నిద్రలేచిన లర్వీ విల్బర్‌కోసం చేసిన బోనులో మెత్తగా గడ్డిపరిచి, ఆబోనుని ఎత్తి ఆపందిదొడ్లో పెట్టాడు. బోనంతటికీ ఆకుపచ్చరంగు వేసిఉంది. దానిపైన గుండ్రని బంగారు వన్నె అక్షరాల్లో-

"జుకర్మన్‌ల పేరుమోసిన పంది"

అని వ్రాసి ఉంది.

ఆరోజున షాలట్ తన గూడును అందంగా అలంకరించింది. విల్బర్ ఉదయాహారం మెల్లగా ఆరగించింది. అనుక్షణం తేజస్విలాగ కనిపించడానికి తంటాలు పడుతూంది.

ఇంతలో వంటింట్లోంచి జుకర్మన్ భార్య అరిచింది. "ఏమండీ! నేనాపందిని ఒకసారి శుభ్రంగా చల్లతో కడిగేద్దా మనుకొంటు న్నాను."

"దేంతో?" జుకర్మన్ రెట్టించాడు

"చల్లతోనండీ! మా అమ్మమ్మ వాళ్ల పంది మురికిగా ఉన్నప్పుడు చల్లపోసి కడిగేది. సమయానికి నాకామాట జ్ఞాపకం వచ్చింది."

"మన విల్బర్ మురిగ్గా లేదులే!" అన్నాడు జుకర్మన్ గర్వంగా.

"చెవుల మడతల్లోనూ అక్కడా మురికి ఉందిలెండి! లర్వీ గంజి పోసినప్పుడల్లా అది ఆచెవుల పక్కగా కారి, క్రమంగా ఆరిపోయి అంటలుకట్టింది. ఒకపక్కన కూడా కొంతమురికి ఉంది. పెంటలో పడుకున్నప్పుడు ఎప్పుడూ ఆవేపే పడుకుంటుంది లాగుంది."

"విల్బర్ శుభ్రమైన గడ్డిలో పడుకుంటుంది." జుకర్మన్ ఆమె తప్పు దిద్దాడు.

"ఏమైనా దానికి మురికి ఉంది. చల్లతో కడగక తప్పదు."

జుకర్మన్ నీరసంగా కూలబడి ఒకబిస్కట్ తీసుకుని కొరికాడు. ఆయనభార్య కట్టెలపాక వేపు వెళ్ళింది. మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు తనకోటు, రబ్బరుబూట్లు తొడుక్కుని, పెద్ద బాల్చీనిండా చల్ల, ఒక చిన్న కొయ్యపలక తీసుకొచ్చింది.

"ఎడిత్! నీకేం పిచ్చా?" మందలించబోయాడు జుకర్మన్.

ఆమె వినిపించుకోలేదు. ఇద్దరూ కలిసే పందిదొడ్డిలోకి వచ్చారు. జుకర్మన్‌పిన్ని ఒక్కక్షణం కూడా వృథాపోనీయకుండా, గభాల్న కర్రలుదాటి, విల్బర్ ఆవరణలోపలికి వెళ్ళి పని ప్రారంభించింది.

రెండు దోసిళ్ళ చల్ల విల్బర్ వీపుమీద పోసి, ఆ కొయ్యచెక్క పెట్టి చక్కగా మురికంతా పోయేటట్టు రుద్దటం మొదలు పెట్టింది. ఈ వినోదం చూడటానికి బాతులన్నీ చుట్టూ చేరినయి. వాటి వెంటనే గొర్రెలు, గొర్రెపిల్లలు కూడా వచ్చినయి. చివరికి టెంపుల్టన్ కూడా జాగ్రత్తగా ముట్టెమాత్రం బయటికి పెట్టి, విల్బర్ కి చల్లతో జరుగుతూన్న అభిషేకాన్ని చూస్తూంది. షాలట్ కూడా సంతోషంగా, పొడు

గాటి దారం వదిలి దానిమీదుగా బాగా కిందికి దిగి చూస్తూంది. విల్బర్ కదలకుండా నిలబడి కళ్ళుమూసుకుంది. చల్ల తన దవడమీదుగా కారిపోతూన్న సంగతి విల్బర్ కి తెలుస్తూంది. నోరు తెరిచింది. కొంత చల్ల నోట్లోకి కూడా పోయింది. పుల్లపుల్లగా, కమ్మకమ్మగా మంచి రుచిగా ఉంది. అక్కడితో కొత్తసత్తువ వచ్చింది. జుకర్మన్ భార్య ఆ అభిషేకం పూర్తిచేసి, తుడిచివేసిన తరువాత, అంత పరిశుభ్రమైన,

అందమైన పంది మరెక్కడా వుండబోదు అన్నట్టు మిలమిలలాడిపో తూంది విల్బర్. చర్మం అంతా తెల్లగా పట్టులాగ ఉంది. చెవుల చుట్టు పక్కలా, ముట్టే మాత్రం ఎర్రగా ఉన్నయి.

ఆ రోజున తమ దుస్తులన్నింట్లో మంచివి వేసుకోవాలనుకుంటూ జుకర్మన్ బాబాయీ, పిన్నీ ఇంట్లోకి పోయారు. లర్వీ గడ్డంచేసుకుని ఇస్త్రీచొక్కా వేసి, ముదురు ఎరుపురంగు నెక్టై కూడా కట్టుకోవా లనుకుంటూ వెళ్ళాడు. పశువులదొడ్లో ఆ జంతువులు తప్ప ఎవరూ లేరు.

బాతుపిల్ల లేడూ తల్లిచుట్టూ తిరుగుతున్నయి.

"అ-అ-అ-అమ్మా! న-న-న-నన్ను కూడా తీసుకెళ్ళవ్ తి-తి-తి-తిర్నాళ్ళకి?" అంది ఒక చిట్టిబాతు.

"న-న-న-నన్ను కూడా..." అంటూ తక్కిన బాతుపిల్లలన్నీ గలభా మొదలుపెట్టినయి.

"లేదర్రా! మ-మ-మనం హాయిగా య్-య్-య్-యింటి దగ్గిరే ఉంటాం. వ్-వ్-వ్-విల్బ రొక్కతే తిర్నాళ్ళకి వ్-వ్వె-వెళుతుంది" అంది బాతమ్మ.

షార్లట్ అందుకుని, "నేనుకూడా వెళుతున్నాను. విల్బర్తో పాటు తిర్నాళ్లకి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను. విల్బర్కి అక్కడ నా అవసరం వుండొచ్చు. అలాంటి తిర్నాళ్లలో ఎప్పుడేం జరుగు తుందో చెప్పలేం. కాస్త రాత కోత తెలిసిన వాళ్ళవరైనా ఒకళ్ళు వెంట ఉండటం మంచిది. నాతోపాటు టెంపుల్టన్ వస్తే బాగుంటుం దనుకుంటున్నాను. వార్తలు అందించడానికి, ఏదైనా పనిచెబితే చెయ్యడానికి నాకు టెంపుల్టన్ అవసరం ఉండొచ్చు" అంది సన్నని కంఠంతో.

"నేను రాను బాబూ! నేనిక్కడే ఉంటాను. ఈ తిర్నాళ్ళు గిర్నాళ్ళు అంటే నాకు తలకాయ నెప్పి!" అని గొణిగింది ఎలక.

"నువ్వెప్పుడైనా ఒక్క తిర్నాళ్లకైనా వెళ్ళి చూసి పడిస్తేగద! నిజంగా తిర్నాళ్లంటే ఎలకల పాలిటి స్వర్గం తెలుసా? తిర్నాళ్ళలో ఎక్కడపడితే అక్కడ తిండి, పిండివంటలు విచ్చలవిడిగా పారేస్తారు. అర్ధరాత్రి వేళ ఎలకలు చల్లగా వెళ్ళి తమ జన్మలో ఎన్నడూ ఎరగని రకరకాల వంటకాలన్నీ తెగతినొచ్చు. డేరాలలో, సత్రాలలో, కొట్లల్లో సమారాధన పందిళ్లలో ఎక్కడ పడితే అక్కడ తిండే తిండి!" అని నోరూరేటట్టు చెప్పింది, టెంపుల్టన్ స్వభావ మెరిగిన ముసలిగొర్రె.

టెంపుల్టన్ కళ్ళు ఎర్రగా మండిపోతున్నాయి.

"ఇదంతా నిజమేనా? నువ్వు మరీ కడుపు చెరువంత అయిపోయేటట్టు చెపుతున్నావ్! నిజమేనా ఇదంతా? నాకు రుచులన్నా, భోగాలన్నా ఇష్టం.నువ్వు చెప్పే మాటలు నాకు పిచ్చెత్తించేస్తున్నాయి."

"సందేహంగా ఉంటే పోనీ మానెయ్. నేను చెప్పింది మాత్రం అక్షరాలా నిజమని ఒక్కసారైనా అల్లాటింవి చూసొచ్చిన వాళ్లందరికీ తెలుస్తుంది. ఒక్కసారి వెళ్ళావా, ప్రతి తిర్నాళ్లకీ నువ్వే తయారవుతావ్! నువ్వు ఎన్నడూ కలలోకూడా చూసి యెరుగనంత మంచి తిండి! ప్రపంచంలో ఉండే అన్నిరకాల పిండివంటలూ, అన్నిరకాల తినుబండారాలూ అంతటా వెదజల్లి పారేసినట్టుంటాయి..."

"ఇంక చెప్పకమ్మా బాబూ! నేను భరించలేను. ఇంక మానెయ్! నే వెళుతున్నాలే. ఇంక చెప్పకు" అంది టెంపుల్టన్.

"సరే బాగుంది. ఇక ఆట్టే వ్యవధి లేదు. ఇంకా కొంచెం సేపటిలో విల్బర్‌ని ఆబోనులో ఎక్కిస్తారు. టెంపుల్టనూ, నేనూ ఇప్పుడే ఆబోనులో ప్రవేశించి, జాగ్రత్తగా దాక్కోవాలి," అంది షాలట్.

టెంపుల్టన్ క్షణం ఆలస్యం చేయకుండా చటుక్కున బోనులో దూరింది. లోపల రెండుకర్రలమధ్యచేరి, తానుకనపడకుండా ఇంతగడ్డి తనపైకి లాక్కుంది.

"సరే ఇక నావంతు వచ్చింది," అంటూ షాలట్ ఒక దారం వదులుతూ నేలమీదికి దిగింది. దిగి, బోనుపక్క చెక్కమీదుగా ఖడ్డీల మధ్యనించి లోపలప్రవేశించి, బోనుపై చెక్కలోఉన్న ఒక రంధ్రంలో దాక్కుంది.

ముసలిగొర్రె తలఊపింది. "ఆహా ఎంత సంరంభం!" ఆ బోను మీద "జుకర్మన్‌ల పేరుమోసిన పంది" అనటానికి బదులు, "జుకర్మన్‌ల పేరుమోసిన పంది, మరి ఇద్దరు ప్రచ్ఛన్న ప్రయాణీకులు" అని వ్రాయ వలసింది" అనుకుంది.

"అ-అ-అ-అల్లా చూడు! జ-జ-జ-జనం వచ్చేస్తున్నారు. మ-మ-మ-మాట్లాడకు!" అంది బాతు కంగారుగా.

శ్రీ ఆరబుల్ పెద్ద ట్రక్కును స్వయంగా డ్రైవ్‌చేస్తూ మెల్లగా తీసుకొస్తున్నాడు. లర్వీ, జుకర్మన్ దాని పక్కగా నడుస్తూ పశువుల దొడ్డివేపే వస్తున్నారు. ఫెన్నూ, అవెరీ లోపల బాడీలో నిలబడి పక్క నున్న చువ్వలు పట్టుకుని బయటికి చూస్తున్నారు.

"విల్బర్! ఒక్కమాట!" అంది ముసలి గొర్రె, పందిని చూసి తొందర తొందరగా. "వాళ్ళు నిన్ను బోనులో పెట్టటానికి ప్రయత్నించినప్పుడు, నువ్వు తేలికగా లోపలికివెళ్లకు. కొంతసేపు మారాం చెయ్యి. పందుల్ని పట్టుకొని తీసుకు వెళ్ళేటప్పుడు బాగా మారాం చెయ్యడం మామూలు! తెలిసిందా?" అంది.

"నేను మారాంచేస్తే మళ్ళీ నా ఒళ్లంతా మురికి మురికై పోతుంది బాబూ!" అంది విల్బర్.

"అయితే అయిందిలే! నే చెప్పినట్లు చెయ్యి. ఇటులాగి అటు

లాగి హారాం చెయ్యి! నువ్వు ఏమీ అల్లరిలేకుండా చల్లగా బోనులో జోరబడితే జుకర్మన్ నీకేదో మైకం కమ్మిందని అనుమాన పడవచ్చు. అసలు నిన్ను తిర్నాళ్లకు తీసుకువెళ్లడం మంచిదికాదని మానేస్తారేమో కూడా!" అంది గొర్రె.

టెంపుల్టన్ గడ్డిలోంచి ముట్టె ఇవతలికిపెట్టి చూస్తూంది. "నువ్వు ఎంత అల్లరి చేసుకున్నా సరేగాని నేను బోనులోపల వున్నానన్నమాట మాత్రం జ్ఞాపకం ఉంచుకో. నువ్వు నన్ను తొక్కినా, ముఖంమీద తన్నినా, బోనుకేసి నొక్కినా, ముట్టెపెట్టి కొట్టి, ఆఖరికి తోక విసిరినా నేను ఒప్పుకోను - తెలిసిందా? వాళ్ళు వచ్చి నిన్ను బలవంతంగా లోపలికి తోసినప్పుడు దయచేసి కాస్త కళ్ళు ఒళ్ళు దగ్గర వుంచుకొని మరీ మారాం చెయ్యి!"

"ఇక కట్టిపెట్టు టెంపుల్టన్!" అంది ముసలిగొర్రె. "ముందు నీ తలకాయ లోపలికి తీసుకో! వాళ్ళు వచ్చేస్తున్నారు. విల్బర్! బాగా చలాకీగా కనిపించు. షాలట్! జాగ్రత్తగా దాక్కో! ఏయ్! బాతు పిల్లల్లారా! మీరు కాస్త మేళం చెయ్యండి."

మోటారు ట్రక్కు మెల్లగా వెనక్కి నడుస్తూ, విల్బర్ ఆవరణ దగ్గిరికి వచ్చి ఆగింది. ఆరబుల్ ఇంజన్ ఆపి దిగి వెనక్కి వచ్చి, వెనక తలుపుల గడియతీసి తెరిచాడు. బాతులు సంతోషంగా అరుస్తున్నయి. ఫెన్ తల్లి కూడా కార్లోంచి దిగింది. ఫెన్, అవెరీ గభాల్న కిందికి దూకారు. అంతా ఆకర్ర కంచెపొడుగునా నిలబడి మిలమిలా మెరుస్తూన్న విల్బర్‌ని, ఆ అందమైన ఆకు పచ్చని బోనును చూసి ముచ్చట పడుతున్నారు. ఆ బోనులోపల అప్పటికే రెండు జీవాలు ఉన్నాయని మాత్రం ఎవరికీ తెలియదు.

"బలే గొప్ప పంది!" అంది ఫెన్నూ వాళ్ల అమ్మ. "నిజంగా 'భీము'డల్లేనే వుంది" అన్నాడు లర్వీ.

"కాదు 'తేజస్వి' 'తేజస్వి' అనాలి" అంది ఫెన్.

మొత్తం మీద ఇప్పుడు శుభ్రంగా మాత్రం వుంది. చల్లతో కడగడం చాలా మంచిదయింది" అంది ఫెన్ తల్లి.

ఆరబుల్ విల్బర్‌ని శ్రద్ధగా చూశాడు. "ఔను అద్భుతమైన పంది" అన్నాడు. "తల్లికి పుట్టిన పిల్లలన్నిటిలో ఇదే నాపిరకంగా పుట్టిందంటే నమ్మడానికి వీల్లేకుండా తయారయింది. హోమర్! ఈ పందిని చంపే రోజున మనకు రుచైన మాంసంతో, కొవ్వుతో మంచి విందు చేసుకుందాం."

ఈమాట వినగానే విల్బర్‌కి గుండె ఆగిపోయినంతపని అయింది. "నాకేదో మూర్ఛవస్తూన్నట్టుంది" అంది పక్కన నిలబడి చూస్తూన్న ముసలిగొర్రెతో.

"తల కిందికి వంచు. తలలోకి రక్తం బాగా ప్రవహిస్తే తగ్గిపోతుంది" అని రహస్యంగా చెప్పింది ముసలిగొర్రె.

విల్బర్ ముందు మోకాళ్ళ మీదికి వంగి తల నేలమీద ఆన్చింది. కళ్ళు మూసుకుంది. చలాకీ అంతా పోయింది.

"అదుగో చూశారా! విల్బర్ సొమ్మసిలి పోతోంది" అంది ఫెన్.

"ఇదుగో ఇలా చూడండి!" అని అరుస్తూ అవెరీ చేతులూ కాళ్ల మీద పాకుతూ బోనులో దూరి, "చూడండి - నేను పందిని, నేనే విల్బర్‌ని! చూడండి!" అంటూ అరిచాడు.

అవెరీ కాలు గడ్డిలో ఆ బోనులోపల ముడుచుకొని ఉన్న టెంపుల్టన్‌కి తగిలింది.

"అబ్బ! ఏమిటీ గోలంతా? ఈ పిల్లలు తగని అల్లరి వెధవలు! ఛీ అసలు నేనీ పనికి ఒప్పుకుంటమే తప్పయి పోయింది." విసుక్కుంది టెంపుల్టన్.

బోనులోఉన్న అవెరీనిచూసి, బాతులన్నీ సంతోషంగా అరవడం మొదలు పెట్టాయి.

"అవెరీ! ముందు నువ్వా బోనులోంచి బయటికి వస్తావా, రావా? మనిషి వేసా నువ్వు చెపుతూంటే?" మందలించింది అవెరీ తల్లి.

"కాదమ్మా! నేను పందిని!" అంటూ గడ్డిని గుప్పెళ్ళతో తీసి ఎగరవేస్తూ "ఓయింవ్, ఓయింవ్, ఓయింవ్!" అని పందిలాగ అరవడం మొదలు పెట్టాడు అవెరీ.

"నాన్నా! నాన్నా! మన కారు వెళ్ళిపోతూంది. కారు వెళ్ళిపోతూంది." ఫెన్ అరిచింది.

డ్రైవరు లేకుండా కారు పల్లంలోకి దొర్లిపోతూంది. ఆరబుల్ గబగబా పరిగెత్తి కారెక్కి డ్రైవరు స్థానంలో కూచుని బ్రేక్ లాగాడు. కారు ఆగిపోయింది. బాతుపిల్లలు సంతోషంతో గలభా చేసినయి. పాలట్ ముడుచుకుని అవెరీకి కంటపడకుండా ఆ చిల్లిలో ఒదిగి పోయింది.

"బయటికి రా ముందు!" అని కేక వేసింది ఫెన్ తల్లి. అవెరీ మోకాళ్ళమీద పాకుతూ, విల్బర్ కేసి కోపంగా చూస్తూ బోనులోంచి బయటికి వచ్చేశాడు. విల్బర్ మూర్ఛపోయింది.

"పంది ప్రాణం పోతుందేమో! నీళ్ళు చల్లండి, నీళ్ళు చల్లండి!" అని అరిచింది జుకర్మన్ పిన్ని.

"కాదు చల్ల చల్లండి!" అన్నాడు అవెరీ.

బాతులు మళ్ళీ కేరింతాలు ప్రారంభించినయి.

లర్వీ నీళ్ళు తీసుకు రావడం కోసం పరిగెత్తాడు. ఫెన్ కర్రి కంచెమీంచి దాటి పంది ఆవరణలోకి వెళ్ళి విల్బర్ పక్కన కూచుంది.

"ఎండ దెబ్బ కొట్టినట్టుంది. ఈ ఎండకి తట్టుకోలేక పోయింది." జుకర్మన్ సమర్థించాడు.



"అసలు చచ్చిపోయిందేమో బాబాయ్!" అన్నాడు అవెరీ.

"ఒరేయ్! నువ్వు ముందా పంది దొడ్లోంచి బయటికిరా!" తల్లి కోప్పడింది. అవెరీ తల్లి ఆజ్ఞననుసరించి బయటికి వచ్చి, ట్రక్కులో ఎక్కి వెనక పక్కకు వచ్చి నిలబడి చూస్తున్నాడు. ఇప్పుడందరికంటె అవెరీకే బాగా కనిపిస్తూంది. లర్వీ బాల్చీతో చన్నీళ్ళు తెచ్చి విల్బర్ మీద పోశాడు.

"నామీద కూడా కాసిని పొయ్యి. నాక్కూడా కొంచెం ఎండ కొట్టేసింది వెధవది!" అవెరీ అడిగాడు.

"నువ్వూరుకో అవెరీ! మాట్లాడకు!" కసిరింది ఫెన్. ఆ పిల్ల కళ్ళవెంట నీళ్ళు గిర్రున తిరిగినయి.

విల్బర్ ఆ చన్నీటి దెబ్బతో తేరుకుంది. మెల్లగాలేచి నిలబడింది. బాతులు సంతోషంతో కేరింతాలు కొట్టినయి.

"అదుగో లేచింది. ఇబ్బేమీ లేదనుకుంటాను" అన్నాడు ఆరబుల్.

"నాకు బలే ఆకలేస్తూంది. ఒక్క ఆపిల్ పండైనా పడేస్తే బావుణ్ను!" అన్నాడు అవెరీ.

"విల్బర్ ఇప్పుడు బాగానే ఉందిగా, పదండి! తిర్నాళ్ళకి వెళ్ళి పోదాం, పదండి. నాకు ఇంతక్కా ఎప్పుడు ఉయ్యాల చక్రం ఎక్కి ఊరుగుతానా అనిపిస్తూంది" అంది ఫెన్.

జుకర్మన్, అరబుల్, లర్వీ పందిని పట్టుకొని ఆ బోనులోకి తొయ్యడానికి ప్రయత్నించారు. విల్బర్ మొరాయించింది. వాళ్ళు ఎంత గట్టిగా లోపలికి తొయ్యడానికి ప్రయత్నిస్తే, తాను అంత గట్టిగా వెనక్కి నిగడదన్నుతూంది. అవెరీ ట్రక్కులోంచి కిందికి దూకి మళ్ళీ విల్బర్ దగ్గిరికి వచ్చాడు. విల్బర్ అటూ ఇటూ పోతుందిగాని బోను లోకి వెళ్ళడానికి మాత్రం ససేమిరా అని మొండికేసింది. "ఈ పందిలో లోపం ఏమీలేదు" అన్నాడు జుకర్మన్ సంతోషంగా, విల్బర్‌ని వెనక పట్టుకుని బలంకొద్దీ బోనులోకి గెంటుతూ. "అంతా ఒక్కసారి గట్టిగా నెట్టండి!" అని అరిచాడు.

ఎల్లాగయితేనేం అంతా సాయంపట్టి విల్బర్‌ని బోనులోకి నెట్టారు. బాతులు కేరింతాలు కొట్టినయి. విల్బర్ మళ్ళా బయటకి రాకుండా లర్వీ రెండు చెక్కలు అడ్డంగా పెట్టి మేకులు కొట్టేశాడు. తర్వాత వాళ్ళందరు సాయంపట్టి ఆ బోను పైకెత్తి ట్రక్కులోకి ఎక్కించారు. ఆ బోనులో గడ్డిలో దాక్కుని మరో ఎలక కూడా ఉందనీ, పై చెక్కలో ఒక చిల్లిలో దూరి ఒక పెద్ద గోధుమవన్నె సాలీడు ఉందనీ వాళ్ళెవరికీ తెలియదు. వాళ్ళకు కనిపిస్తూందల్లా పంది ఒక్కటే!

"అంతా ఎక్కారా?" అరబుల్ అరిచాడు. అరుస్తూనే తాను ముందు ఎక్కి డ్రైవరు సీట్లో కూచుని ఇంజను స్టార్టు చేశాడు. అడ

వాళ్ళిద్దరూ ముందరి సీట్లోనే ఎక్కారు. జుకర్మన్, లర్వీ, ఫెన్నీ, అవెరీ వెనక బాడీలో ఎక్కారు. ట్రిక్కు బయలు దేరింది. బాతు పిల్లలు మళ్ళీ మేళం మొదలు పెట్టినయి. అది విని పిల్లలిద్దరూ కేరింతాలు కొట్టారు. మెల్లగా పోతూన్న కారు మలుపు తిరిగింది.

17. మామయ్యా

వాళ్ళు తిరునాళ్ళ జరుగుతున్న చోటును సమీపించే సరికి దూరంనించీ బాండు, ఇతర సంగీత వాయిద్యాలు వినబడుతున్నాయి. పెద్ద తాటిచెట్టెత్తున ఉయ్యాల చక్రం గిర గిర తిరుగుతూంది. మునిసిపాలిటీ ఫైర్ ఇంజను వచ్చి అప్పుడే రోడ్డుమీద నీళ్ళు చల్లి పోయినట్టుంది. కమ్మని మట్టివాసన కొడుతూంది. కారు ఇంకా కొంచెం ముందుకి వెళ్ళేసరికి పిండివంటల వాసనలు, దారాలు కట్టి పైకెగరవేస్తూన్న రంగు రంగుల గాలి బుడగలూ కూడా ఎదు రయినయి. ఒక పక్కన ప్రత్యేకావరణలో గొర్రెలు అరుస్తున్నాయి. పెద్దగొంతుకతో లౌడ్‌స్పీకరులోంచి ఎవరో అరుస్తున్నారు. "దయ చేసివినండి! హెచ్ - 2439 నెంబరుగల పాంటియాక్ కారు యజ మాని ఎవరో దయచేసి, ఆ కారును బాణాసంచా దుకాణం ముందు నించి తీసుకు వెళ్లిపోవాలి!"

"మరి తిర్నాళ్ల ఖర్చుకి నాకేమన్నా డబ్బు ఇయ్యవులే అమ్మా!" ఫెన్ అడిగింది.

"నాక్కూడా!" వెంటనే అవెరీ అరిచాడు.

"నేను చక్రంమీద ఉన్న ముల్లు గిర్రున తిప్పానంటే, తిరిగి తిరిగి మంచి అదురుష్టం నెంబరు మీదికొచ్చి ఆగిపోతుంది. దాంతో నాకు మంచి బహుమతీ వచ్చేస్తుంది" అంది ఫెన్.

"నేను జెట్ విమానంకొని, వదిలిపెట్టానంటే అది బుర్రు మంటూ ఆకాశంలోకి వెళ్ళిపోయి నిజం విమానంతో ఢకీమని ఢీకొట్టి పడగొట్టేస్తుంది" అన్నాడు అవెరీ.

"నేనలాంటి పెద్ద గాలిబుడగ కొనుక్కుంటానమ్మా!" ఫెన్ అడిగింది.

"నేనో చాక్లెట్ కడ్డీ, చక్రం జీళ్ళు, ఐసుఫ్రూటు, ఇంకా ఇంకా చాలా కొనెయ్యాలి!" అవెరీ అందుకున్నాడు.

"పందిని కిందికి దింపేదాకా కాస్త ఊరుకోండర్రా!" అంది తల్లి.

"వద్దులే వాళ్ళని పోనియ్ - ఎప్పుడో ఏడాదికోసారి వస్తుంది తిర్నాళ్ళ" అంటూ వాళ్ళ నాన్న ఫెన్‌కి పదణాలు ఇచ్చాడు. అవెరీకి ఆరణాలు ఇచ్చాడు. "ఇక పొండి! ఆ డబ్బులే సాయంకాలం దాకా వాడుకోవాలి! పిచ్చి ఖర్చులు పెట్టి ఇప్పుడే తగలేసుకోకండి. జ్ఞాపకం ఉంచుకోండి. మధ్యాహ్నం పన్నెండు కొట్టేసరికి మన కారు దగ్గిరికి వచ్చేసెయ్యండి. అన్నాలుతిని మళ్ళీ పోదురుగాని! పిచ్చి పిచ్చి వన్నీ కొనుక్కు తినబోకండి! జబ్బుచేస్తుంది" అన్నాడు.

"ఆ చక్రంమీద, రంగుల రాట్నంమీద ఎక్కితే, గట్టిగా పట్టుకుని కూర్చోండి: రెండు చేతులతో గట్టిగా పట్టుకు కూర్చోండి. తెలిసిందా?" తల్లి హెచ్చరించింది.

"ఎక్కడైనా మ్మారు పడతారు జాగ్రత్తర్రా!" వాళ్ళ జుకర్మన్ పిన్ని అంది.

"బట్టలు మాపు కోకండి!" అంది మళ్ళీ తల్లి.

"జేబుదొంగలుంటారు డబ్బులు జాగ్రత్తర్రా!" తండ్రి హెచ్చరించాడు.

"గుర్రప్పందాల దగ్గిర గుర్రాలు పరుగెడుతూన్నప్పుడు ఇటూ అటూ పరిగెత్తకండి!" అంది జుకర్మన్‌సతి.

పిల్లలిద్దరూ గట్టిగా ఒకరిచెయ్యి ఒకరు పట్టుకుని ఆ పెద్దఉయ్యాల చక్రం వేపుకి, హుషారుగా వినవస్తూన్న సంగీతంలోకి, అస్తమానం



అన్నింటికీ అడ్డు చెపుతూండే తల్లి దండ్రులు వెంటరాని చోటికి, సొంతంగా ఇష్టం వచ్చినవన్నీ చూస్తూ, చేస్తూ తిరగటానికి వీలుండే వినోద జగత్తుకి పరిగెత్తారు. అమితానందంతో నృత్యంచేస్తూన్నట్టు గంతులువేస్తూ వెళ్ళారు. ఆరబుల్‌సతి వారివంకే చూస్తూ మౌనంగా నిలబడింది. కొంతసేపు అలాచూసి, ఒక్క నిట్టూర్పు విడిచింది. తరువాత ముక్కు చీదుకుంది.

"ఏం ఫర్వాలేదంటూరా?" అని అడిగింది.

"ఏమీ ఫర్వాలేదు. ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళను ఒంటరిగా విడిచిపెట్టాలిగద! ఇలాటి తిర్నాళ్ళలోనే మొట్టమొదట వదలడం మంచిది," అన్నాడు తండ్రి.

విల్బర్‌ని ట్రక్కులోంచి కిందికి దింపి, ఆ బోనులోంచి బయటికితీసి, దానికోసం అక్కడ ఏర్పాటు చేసి ఉంచిన ఆవరణలో పెడుతూండగా, చుట్టూ జనం పోగయారు. "జుకర్మన్‌ల పేరు మోసిన పంది" అని ఆ బోనుమీద రాసివున్న అక్షరాలు అంతా చదివారు. విల్బర్ సాధ్యమయినంత గొప్పగా కనిపించడానికి ప్రయత్నిస్తూంది. తన కొత్త వసతిస్థలం చాలా బాగుందనుకుంది. కిందంతా పచ్చగడ్డి పెరిగి ఉంది. ఎండ తగలకండా పైన పందిరి వేశారు.

పాలట్ సమయం చూసుకుని, బోనులోంచి బయటపడి, ఒక స్తంభం మీదుగా పాకి పందిరి కప్పులోకి చేరింది. అయినా ఎవరి కంటా పడలేదు.

పట్టపగలు బయటికి రావడం ఇష్టంలేక టెంపుల్టన్ ఆ బోనులో గడ్డిలోపలే నక్కి కూచుంది. జుకర్మన్ పాలపాడి పాలు తీసుకుపోయి విల్బర్ తొట్లో పోశాడు. విల్బర్ పడుకుంటానికి శుభ్రమైన ఎండు గడ్డి తెచ్చి పరిచాడు. తర్వాత తాను, తనభార్య, ఆరబుల్, ఆయన

ఫార్య పశువులపోటీకి వచ్చిన మంచి మంచి ఆవులను, ఇతర వస్తువులను చూసిరావటానికి వెళ్ళారు. జుకర్మన్ ముఖ్యంగా ట్రాక్టర్లు చూడాలనుకుంటున్నాడు. జుకర్మన్ సతి కూరలు, పళ్లు చెడిపోకుండా దాచుకునే ఫ్రిజిడరీపెట్టె కొనుక్కోవాలని తొందరపడుతూంది. లర్వీ స్నేహితుల్ని కలుసుకుని కులాసాగా తిరిగిరావడానికి వాడి దారిని వాడు పోయాడు.

వాళ్ళంతా వెళ్ళిపోయిన తర్వాత షాలట్ విల్బర్ని పిలిచి అంది. "విల్బర్! నాకు కనిపిస్తూన్న విషయాలన్నీ నీకు కనిపించక పోవడం ఎంతో మేలయింది."

"నీకు ఏం కనిపిస్తున్నాయి?" విల్బర్ అడిగింది.

"నీ దొడ్డి పక్క దొడ్డిలో పెద్ద పంది ఒకటి ఉంది. అది నీకంటె చాలా పెద్దది లాగుంది."

"దానికి నాకంటె ఈడు ఎక్కువ అయి ఉండొచ్చు. . ఆ టైములో ఎదిగిపోయి ఉంటుంది" అంది విల్బర్. అందేకాని ఒక పక్కన అప్పుడే కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఉండు. అసలు నేను బాగా కిందికిదిగి, దాన్ని దగ్గిరనుంచి చూసి వస్తానుండు" అంది షాలట్. అని, పందిరి లోపలిగడ మీదుగా పాకిపోయి, ఆ పక్క పంది ఆవరణలోకి వెళ్ళిన తరువాత, ఒక దారం వదిలి సరిగ్గా ఆ పెద్ద పంది ముట్టెకు ఎదురుగా కిందికి దిగింది.

దిగి, "నీ పేరేమిటయ్యా?" అని అడిగింది.

ఆ పంది తెల్లబోయి షాలట్ వంక వింతగా చూస్తూ "పేరేం లేదే... పోనీ 'మామయ్యా' అని పిలు!" అంది పెద్ద బొంగురు గొంతుకతో.

"బాగుంది!అలాగే!చూడు మామయ్యా! నువ్వెప్పుడు పుట్టావో చెప్పగలవా? పోయిన వసంత ఋతువులో పుట్టిన పందివా?"



"ఔను! వసంత ఋతువులోనే పుట్టాను. లేకపోతే నిన్నో మొన్నో పుట్టిన పురిటిపిల్ల ననుకున్నావా? పిన్నమ్మా! హా హ్హా హ్హా!" అని నవ్వింది సూమయ్యా పెద్ద రొద చేస్తూ.

"కొంచెం చమత్కారివి కూడా లాగున్నావే! బలే బాగుంది. నీతో పరిచయం కలగటం చాలా సంతోషంగా ఉంది. ఇంక నే వెళ్ళి వస్తా!" అని షాలట్ మెల్లగా మళ్ళీ కప్పుదాకా పాకిపోయి, విల్బర్ ఆవరణపైకి వచ్చేసింది.

"తాను కూడా వసంత ఋతువులోనే పుట్టానంది." అయితే ఏంలే! దాని రూపం మాత్రం ఏమీ బాగుండలేదు. చాలా చవకబారు పంది లాగుంది. పెద్ద గొంతుకతో అరుస్తుంది. నాసిరకం ఛలోక్తులు

విసురుతుంది. నీఅంత పరిశుభ్రంగానూ లేదు; పొంకంగానూ లేదు. ఆ మాట్లాడిన కాసేపట్లోనే నాకు ఆ పందంటే అసహ్యం కలిగింది. అయితే ఆ స్వరూపం, తూకం మూలంగా దానిమీద గెలవడం కొంచెం కష్టమేలాగుంది విల్బర్! కాని, నీకు నేనున్నాను గనుక ఫర్వా లేదులే!"

"నువ్వు మరి ఇక్కడ గూడు ఎప్పుడల్లుతావ్?" విల్బర్ అడిగింది.

"మరీ అలసటగా లేకపోతే ఈ వేళ రాత్రి అల్లేస్తా" అంది పాలట్. "ఈ మధ్య కాస్త పనిచేస్తే తగని అలసట కలుగుతూంది. వెనకటి ఓపిక లేదు. వయస్సు మళ్ళటంవల్ల ననుకుంటాను." ఇలా అని కొంచెం ఆయాసపడింది.

విల్బర్ తన ప్రాణ మిత్రంవేపు చూసింది. పాపం పాలట్ ఎంచేతో ఉబ్బినట్టు, బాగా అలసిపోయినట్టు కనిపించింది.

"నీకు వంట్లో బాగుండ లేదంటే నా కేమిటో బెంగగా, భయంగా ఉంది పాలట్! పోనీ గబగబా గూడు అల్లేసి, రెండు ఈగల్ని పట్టుకొని తినేసెయ్. మళ్ళీ బలం వస్తుందేమో!" అంది విల్బర్.

"రావచ్చు కానీ నాకిప్పుడు ఓపిక లేదు. పగలల్లా ఎడ తెగకుండా పని చేసినప్పుడు కూడా ఎన్నడూ ఇల్లా లేదు" అంది పాలట్. పందిరి కప్పునించి ఒక దారంమీద తల్లకిందులుగా వేళ్ళాడుతూ అల్లాగే కొంతసేపటికి పాలట్ నిద్రపోయింది. విల్బర్ అమితాందోళనపడుతూ ఒంటరిగా నిలబడివుంది.

ఆ ఉదయమంతా ఆ దారిన వచ్చేపోయే ప్రేక్షకులంతా విల్బర్ దొడ్డిదగ్గిర ఆగి, తదేకదృష్టితో కొంతసేపు విల్బర్‌ని చూసి, పట్టులాగ తెల్లగా ఉన్న దాని చర్మాన్ని, మెలితిరిగిన తోకను, ప్రసన్నంగా, చలాకీగా "తేజస్వి"గా కనిపించే దాని రూపాన్ని ప్రశంసించి పోతు

న్నారు. ఆ తరువాత వాళ్లు ఆ పక్కనే ఉన్న పెద్ద పంది 'మామయ్య' డొడ్డి దగ్గిరికి వెళ్ళి చూసేవారు. అందులో కొందరు ఆ "మామయ్య" ఒడ్డూ, పొడుగులను మెచ్చుకుంటూండటం విల్బర్ చెవిని పడింది. వాటిని వినిపించుకోకుండా వుండలేదు; విని ఆందోళన పడకుండా ఉండలేదు "పైగా తీరా ఈ సమయంలోనే పాలట్‌కి జబ్బు చేసె య్యాలా?...... నాఖర్మం కాకపోతే!" అనుకుంది.

ఆ రోజున ఉదయమంతా టెంపుల్టన్ ఆ గడ్డిలోపలే పడుకుని హాయిగా నిద్రపోయింది. ఎండ పేల్చి పేలాలు వేయిస్తూంది. పన్నెండు కొట్టేసరికి జుకర్మన్ దంపతులు, ఆరబుల్ దంపతులు ఆ పంది ఆవరణ దగ్గిరికి తిరిగివచ్చారు. నాలుగు నిమిషాలు పోయిన తర్వాత ఫెన్నూ, అవెరీ కనిపించారు. ఫెన్ చేతిలో కోతిబొమ్మ ఉంది. నోట్లో చాక్లెట్లు నములుతూ వస్తూంది. అవెరీ గాలిబుడగను దారంతో చేతికి కట్టుకుని జీళ్లు నములుతూ వస్తున్నాడు. పిల్లలందరూ ఎండకొట్టి, దుమ్ముకొట్టు కొని ఉన్నారు.

"ఇంత ఎండగా వుందేమిటివాళ?" అంది జుకర్మన్ పిన్ని.

"అవును-విపరీతంగా ఉక్కపోసేస్తూంది" అంటూ ఆరబుల్‌సతి ఫ్రిజిడరీ పెట్టెల కంపెనీ ప్రకటన కాగితం పట్టుకుని విసురుకోటం మొదలు పెట్టింది.

ఒక్కొక్కరే, అంతా వాళ్ళ మోటారు ట్రక్కులోకి ఎక్కారు. టిఫిన్ కారియర్లు బయటికి తీశారు. ఎండదెబ్బ అందరికీ బాగా తగిలి నట్టుంది. ఎవ్వరికీ ఆకలి ఉన్నట్టు కనిపించడం లేదు.

"ఇంతకీ - జడ్జీలు విల్బర్‌ని ఎప్పుడు వచ్చి చూస్తామన్నారు?" జుకర్మన్‌సతి అడిగింది.

"రేపుగాని రారంటున్నారు!" అన్నాడు జుకర్మన్.

ఇంతలో తాను గెలిచిన రెడ్ ఇండియన్ గొంగళీ ఒకటి చంకన బెట్టుకొని లర్వీ వస్తున్నాడు.

"బలే! అదే ఇప్పుడు కావలసింది. బావుంది! ఆ గొంగళీ ఇలా ఇచ్చేయ్!" అన్నాడు అవెరీ.

"అవును మంచి గొంగళే అంటున్నారు" అంటూ లర్వీ దాన్ని మడతవిప్పి ఎండ రాకుండా ట్రక్కు పక్కన తెరలాగ వేశాడు. పిల్లలిద్దరూ దాని నీడలో కూచుని, "బలే బాగుంది లర్వీ! నీ గొంగళీ" అన్నారు.

అంతా భోజనాలుచేసి, పడుకుని నిద్రకు పడ్డారు.

18. చల్లని సాయంకాలం

ఆ నాటి సాయంకాలం చల్లబడిన తర్వాత, తిర్నాళ్ళ సంరంభంలో నీడలు కొంచెం చిక్కబడిన తర్వాత టెంపుల్టన్ మెల్లగా బోనులోనుంచి బయటికి వచ్చి చుట్టూ తేరిపార చూసింది. విల్బర్ మెత్తని గడ్డి పరుపుమీద పడుకుని నిద్రపోతుంంది. షాలట్ గూడు అల్లుతూంది. టెంపుల్టన్ అతి సూక్ష్మమైన తన ముక్కుతో గాలిపీల్చి కమ్మని వాసన లెన్నింటినో పసిగట్టింది. తగని ఆకలిగా, తగని దాహంగా ఉంది. ఆహారాన్వేషణ యాత్రకు బయలు దేరడానికి నిశ్చయించుకుంది. ఇంక ఎవ్వరితోనూ ఏమీ మాట్లాడకుండా బయలుదేరింది.

"ఇంకో మంచిమాట ఏదైనా తెచ్చిపెట్టు నాకు," షాలట్ కేక వేసింది. చిట్ట చివరిసారిగా ఈ వేళ మా ఆట రాసేస్తాను."

ఎలక తనలో తానేదో గొణుక్కుంటూ, పక్కన నీడల్లో లీనమైపోయింది. ఎవరైనా సరే తనని బంట్రోతులా చూడటం టెంపుల్టన్‌కి ఇష్టంలేదు.

పగలంతా ఎండ వేపుకుతినడంవలన, చల్లని సాయంకాలం అందరికీ హాయిగా ఉంది. పెద్ద ఉయ్యాల చక్రంనిండా లైట్లు వెలిగించారు. ఆ దీపాలు ఆకాశమెత్తున పైకిలేచి, మళ్ళీ దిగుతూ ఉంటే ఆ చక్రం పగటి వేళకంటే ఇప్పుడు రెట్టింపు ఎత్తున వున్నట్టు కనిపిస్తూంది. దారిపొడుగునా రెండు పక్కలా లెక్కలేనన్ని దీపాలు వెలుగుతున్నాయి. జూదపు ఆటగాళ్ళ కేకలు, రంకెలు, రాటం చప్పుడు, గారడీ డేరావాళ్ళ ఆహ్వానాలు - అన్నీ కలిసి ఏదో మహా బృందగానం లాగా వినిపిస్తున్నాయి.

ఒక్క నిద్రపోయి లేవడంతో పిల్లలు మళ్ళీ తేరుకున్నారు. ఫెన్ స్నేహితుడు హెన్రీఫుస్సీని కలుసుకుంది. "ఉయ్యాల చక్రంమీద మన మిద్దరం తిరుగుదాం వస్తావా?" పిలిచాడు ఫుస్సీ. ఇద్దరికీ తానే టిక్కట్లు కూడా కొనుక్కు వచ్చాడు. అందుచేత ఫెన్‌కి ఖర్చుకూడా తప్పింది. అరబుల్ సతి నక్షత్రమయమైన ఆకాశంవంక చూసేసరికి, తన ముద్దుల కూతురు హెన్రీఫుస్సీతో ఆ పెద్ద చక్రంలోని ఒక ఉయ్యాలలో కూచుని, ఇంకా పైకి పోతూ ఉండటం చూసింది. ఫెన్ ముఖంలోని ఆ ఆనందరేఖ చూసి తల్లి సంతోషానికి మేరలేదు. తల ఊపి, "నాతల్లి, నాతల్లి... హెన్రీఫుస్సీతో... ఆహా! చక్కని చుక్కల్లాగున్నారు!" అనుకుంది.

టెంపుల్టన్ కనపడకుండా ఎక్కడికో ఉడాయించింది. పందుల దొడ్డికి వెనక వున్న గడ్డి మైదానంలో మడిచివున్న పత్రిక ఒకటి పడి వుండటం చూసింది. దానిలోపల ఎవరో తాము తినగామిగిలిన భోజన పదార్థాలు చుట్టబెట్టి పారేశారు. వేయించిన పంది మాంసపుముక్కలు, సగం తిన్న వెన్న పొట్లం, ఉడకబెట్టిన గట్టి గుడ్డులో కొంత భాగం, నాలుగు ఆపిల్ పండు ముక్కలు, ఇంకా ఏవేవో దొరికినయి. ఎలుక ఆ పొట్లంలోకిదూరి, స్విష్టకృతుగా అన్నీ తింది. ఆ తర్వాత ఆ పేపర్లో ఒక ముక్క చింపింది. చుట్టలాగ చుట్టింది. నోటకరచుకుని విల్బర్ దొడ్డివేపు బయలుదేరింది.

టెంపుల్టన్ ఆ పత్రికచుట్ట నోటకరచుకుని తిరిగి వచ్చేసరికల్లా షాలట్ గూడు అల్లడం దాదాపు పూర్తిచేసేసింది. గూడు మధ్యలో మాత్రం కొంచెం జాగా విడిచి పెట్టింది. ఆ సమయంలో పంది దొడ్డి దగ్గిర నిర్జనంగా ఉంది. ఆ ఎలుక, సాలీడు, పంది తప్ప ఇంకెవ్వరూ లేరు.

"మంచిమాట తెచ్చావా? ఏదీ! ఇయ్యి. ఇక నేను రాయ బోయేది ఇదే కట్టకడపటి మాట!"

"ఇదుగో!" అంటూ టెంపుల్టన్ ఆ పత్రిక కాగితం చుట్ట విప్పి చూపించింది.

"దాంట్లో ఏముంది? కాస్త నువ్వే చదివి వినిపించాలి నాకు!" అంది షాలట్.

"వినయశోభి" అని వ్రాసి వుంది," అంది టెంపుల్టన్.

"వినయశోభి" ఔను. దానికి రెండర్థాలు. ఒకటి గర్వంలేనిదని. రెండోది - నిరాడంబరంగా, అందంగా ఉండేదని. రెండు విధాలా తగిన బిరుదు. విల్బర్‌కి గర్వంలేదు. మామయ్యలాగా పెద్ద ఆర్భాటం గానూ వుండదు." అంది షాలట్.

"ఏం నీకు నచ్చినట్టేనా? అస్తమానం ఈ పత్రికల కోసం వెతుకుతూ కూచోటానికి నాకు వీల్లేదు. సరదాగా తిర్నాళ్ళు చూస్తూ, హాయిగా గడపాలని వచ్చాగాని, అస్తమానం మీకు పత్రికలు చేరేస్తూ, కూచోడానికి రాలేదు" అంది ఎలక.

"నువ్వు చాలా సహాయం చేశావ్ పాపం! పో ఇంక పరుగెత్తు! తిర్నాళ్ళలో ఇంకా చూడవలసిన దేమైనా ఉంటే చూసిరా!" అంది షాలట్.

ఎలక సగర్వంగా నవ్వుతూ అంది, "ఇవాళ రాత్రి నేను చాలా జల్సా చెయ్యాలి. ఈ తిర్నాళ్ళ నిజంగా ఎలక పాలిటి స్వర్గంలాగే ఉంది. మన ముసలిగొర్రె చెప్పినమాట నిజంగా నిజమేస్మా! అబ్బ! ఏమితిండి! ఏమిపిండి వంటలు! ఏమిరుచులు! ఏమిపానకాలు! ఎక్కడ చూసినా దాక్కుంటానికి, దొంగతిళ్ళు తినడానికి కావలసినంత వీలు! 'వినయశోభి' విల్బర్‌గారూ! వస్తాను మరి! వ్యాపోల్లల్లే ముసలమ్మ గారూ? షాలట్! నాకు సెలవిస్తారా? నేను జన్మంతా మరిచి పోని రాత్రి ఇది!" అంటూనే ఆ నీడలలో జారిపోయింది.

షార్లట్ పని ప్రారంభించింది. ఇప్పుడు బాగా చీకటిగావుంది. దూరాన బాణసంచా కాల్చడం మొదలు పెట్టారు. ఆకాశంనిండా అగ్నిగోళాలను విరజిమ్మే తారాజువ్వలు ఒకటి వెంట ఒకటి వదులుతున్నారు. ఆరబుల్ దంపతులు, జుకర్మన్ దంపతులు, లర్వీ బజారునించి తిరిగి వచ్చారు. షార్లట్ గూడు అల్లిక పూర్తిచేసింది. 'వినయశీలి' అనే అక్షరాలు మధ్యలో చక్కగా అల్లింది. ఆ చీకట్లో అక్షరాలు ఎవరికీ కనిపించలేదు. అంతా సంతోషంగా అలసి పోయి ఉన్నారు.



ఫెర్నూ, అవెరీ ట్రక్కులో ఎక్కి పడుకున్నారు. ఆ రెడ్ ఇండియన్ కంబళీ పైకిలాక్కుని కప్పుకున్నారు. లర్వీ ఇంకో సంచెడు శుభ్రమైన గడ్డితెచ్చి విల్బర్ కి పక్క వేశాడు. ఆరబుల్ దగ్గిరికివెళ్ళి విల్బర్ ని తట్టాడు. "ఇంక మేం ఇంటికి పోవాలి. రేపు మళ్ళీ కలుసుకుందాం. ఏం?" అని స్నేహితుడికి చెప్పినట్టు విల్బర్ కి చెప్పాడు.

పెద్ద వాళ్ళంతా ట్రక్కులో ఎక్కారు. ఇంజను స్టార్టయిన చప్పుడు, ట్రక్కు మెల్లగా వెళ్ళిపోతున్న చప్పుడు విల్బర్ వింది.

వెంట షాలట్ లేకపోతే వాళ్ళంతా తన్ను ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళిపోయినందుకు బెంగపెట్టుకునేదే! షాలట్ పక్కన ఉంటే విల్బర్‌కి ఒంటరిగా ఉన్నట్టు అనిపించదు. దూరాన రంగులరాట్నం దగ్గిర గ్రామఫోన్ సంగీతం ఇంకా వినిపిస్తూంది.

నిద్రపోయే ముందు షాలట్‌ని పలకరించింది. "షాలట్! మళ్ళీ ఒక్కసారి ఆ జోలపాట పాడవూ?" గారాబంగా అడిగింది.

"ఈవేళ రాత్రికాదు. ఇప్పుడు చాలా అలిసిపోయి ఉన్నాను" అంది.

ఆమె కంఠస్వరం ఆ గూటినించి వస్తూన్నట్టు వినిపించడంలేదు.

"ఎక్కడున్నావ్ షాలట్? కనిపించడంలేదు. నీ గూట్లోనే వున్నావా?" అని అడిగింది విల్బర్.

"ఇక్కడ వెనకవేపు మూల ఉన్నాను," అంది షాలట్.

"ఎప్పుడూ గూడు విడిచి పెట్టి పోనిదానివి, ఎందుకల్లా దూరంగా వెళ్ళిపోయావ్?"

"ఈ వేళ రాత్రి విడిచి పెట్టవలసి వచ్చింది."

విల్బర్ కళ్ళు మూసుకుంది. కొంతసేపటికి "షాలట్! వచ్చే శీతకాలం జుకర్మన్ నిజంగా నన్ను చంపెయ్యకండా, ప్రాణాలతో బతకనిస్తాడంటావా? నిజంగా నీకా నమ్మకం ఉందా?" అని అడిగింది.

"తప్పకుండా! నువ్వు పేరుమోసిన గొప్పపందివి. ముప్పాతిక మూడుపాళ్ళు రేపు నీకో బహుమతి కూడా రావచ్చు. దాంతో ఈ దేశం అంతటికీ నీ సంగతి తెలిసిపోతుంది. అలాంటి పందికి యజమాని అంటే జుకర్మన్‌కి ఎంతో గొప్ప. విల్బర్ నీకు వచ్చిన భయంలేదు. నువ్వేమీ కంగారు పడకు. నువ్వసలు చావే లేకండా బతికి ఉంటావేమో! ఎవరికి తెలుసు? ఇంక నిద్రపో!"

కొంతసేపటి వరకు సడీ, చప్పుడూ లేదు. మళ్ళీ విల్బర్ గొంతు.

"షార్లట్! ఇంతకీ అక్కడ నువ్వేం చేస్తున్నావ్?"

"ఏదో చేస్తున్నాలే! చిన్న పని ఏదో చేస్తున్నాలే!"

"నాకోసమే ఇంకేదైనా చేస్తున్నావా?"

"లేదు. ఇది నాకోసం. ఒక మార్పుకోసం" అంది షార్లట్.

"అదేమిటో నాక్కూడా చెప్పవ్?" విల్బర్ ప్రార్థించింది.

"పొద్దున్నే చెపుతాలే! తూరుపు తెల తెలవారుతున్నప్పుడు, గూళ్ళలో పిట్టలు కిల కిల లారంభించినప్పుడు, ఆవులు మెడ గొలుసులు గల గల లాడించేటప్పుడు, కోడి పుంజులు గొంతులు సాగదీసి కూసేటప్పుడు, ఆకాశం మీద చుక్కలు ఒక్కొక్కటే మలగిపోతున్నప్పుడు, రోడ్డు మీద మళ్ళీ కార్ల మోతలు మొదలైనప్పుడు లేచి కళ్ళు తెరిచి పైకి చూడు. నీ కొక వింత వస్తువు చూపిస్తా. నా ప్రజ్ఞంతా వినియోగించి తయారు చేస్తున్న వస్తువది." అంది షార్లట్.

షార్లట్ చెపుతూనే ఉంది. విల్బర్ ఎప్పుడో నిద్రపోయింది. సుఖంగా గాఢ నిద్ర పోతూందని దాని శ్వాసనుబట్టి షార్లట్ గ్రహించింది.

అక్కడికి కొన్ని మైళ్ళ దూరాన, ఆరబుల్ గృహంలో మగ వాళ్ళందరూ వంటింట్లో భోజనాల బల్లచుట్టూ కూచుని, డబ్బాలో నిల్వచేసిన పీచ్ పళ్ళ ముక్కలు తింటూ, ఆ రోజున వాళ్ళు చూసిన వింతల్నీ, విశేషాలనీ గురించి మాట్లాడుకుంటున్నారు. మేడ మీద అవెరీ అప్పుడే గాఢ నిద్రలో ఉన్నాడు. ఫెన్‌ని పక్కమీద పడుకో బెట్టి నిద్రపుచ్చుతూంది వాళ్ళమ్మ.

"తిర్నాళ్ళలో బాగా సరదాగా ఉందా?" అంది కూతురుని ముద్దు పెట్టుకుంటూ.

ఫెన్ తల ఊపింది. "నేను పుట్టిన దగ్గిర నించీ ఎన్నడూ ఒక్కడా ఎరగననుకో అంత సరదా! ఇంచక్కా ఉందమ్మా!"

"ఔను. తిర్నాళ్ళలో పిల్లలకి అలాగే ఉంటుంది" అంది వాళ్ళమ్మ.

19. గుడ్ల సంచీ

మరు నాడు తూర్పు తెల్లవారుతూంది. చెట్లలో పిట్టలు కిల కిల లాడటం మొదలయింది. ఆవులు మెడగోలుసులు గల గల లాడిస్తున్నయి. కోడిపుంజు గొంతు నిక్కబెట్టుకొని కూస్తూంది. రోడ్డుమీద కార్లమోతలు ప్రారంభమయినయి. విల్బర్ కి మెలకువ వచ్చింది. వెంటనే షాలట్ కోసం చూసింది. తన దొడ్డికి పైగా వెనకవేపు మూల పందిరి కప్పు కంటుకొని ఉంది షాలట్. కదలికా, మెదలికా లేదు. ఎనిమిది కాళ్లూ విప్పారి వున్నాయి. ఆ ఒక్క రాత్రిలో బాగా చిక్కిపోయినట్టు కనిపిస్తూంది. ఆమె పక్కగా అక్కడే ఒక గమత్తైన వస్తువేదో ఉంది. అది ఒక రకమైన సంచిలాగ, పట్టుపురుగు గూడులాగ ఉంది. పీచ్ పళ్ళరంగులో సన్నని నూలు దారపు బంతి లాగుంది.

"మేలుకునే ఉన్నావా షాలట్?" మెల్లగా అడిగింది.

"ఆఁ" అంది షాలట్.

"అదేమిటి ఏదో సంచి లాగుంది? నువ్వే అల్లావా?"

"ఔను. రాత్రి తెల్లవార్లూ చేసిన పని అదే!" అంది షాలట్ అమిత నీరసంగా.

"అది నువ్వు ఆడుకుంటానికా?"

"ఆడుకుంటమా? కాదు విల్బర్. అది నేను గుడ్లుపెట్టే సంచీ. అదే నా జీవిత పరమార్థం."

"అంటే ఏమిటో నాకు తెలియడంలేదు" అంది విల్బర్.

"ఆది సంస్కృతం మాటలే. అంటే నేను ఈ జీవితంలో చేయవలసిన ముఖ్యమైన పని అన్నమాట. ఇదే నేను చేసిన పనులన్నిటిలోకీ అద్భుతమైనది కూడాను." పాలట్ వివరించింది.

"అందులో ఏం ఉన్నయి? గుడ్లు ఉన్నయ్యా?"

"ఔను. మొత్తం ఐదువందల పథ్నాలుగు గుడ్లు ఉన్నయి." అంది పాలట్.

"అబ్బ! ఐదువందల పథ్నాలుగు గుడ్లే? నువు కోసేస్తున్నావు," అంది విల్బర్ నమ్మలేక.



"లేదు విల్బర్! నేను వాటి నన్నింటినీ లెక్క పెట్టాను. ఊరికే లెక్కపెట్టడం మొదలుపెట్టి, మనస్సుకి ఏదో పని ఉండటం మంచిదని అలాగే చివరిదాకా లెక్కపెట్టాను."

"బలే అందంగా ఉంది పాలట్! నీ గుడ్లసంచీ." అంది విల్బర్, తనే దాన్ని అల్లినంత సంతోషంగా.

"ఔను. అందంగానే ఉంది. చాలా గట్టిగా ఉందనికూడా నేను పూచీ ఇవ్వగలను. నాలోని మంచి గట్టి దారాలతో దాన్ని అల్లాను.

ఎంత వర్షంకురిసినా ఒక్క చుక్క నీరు లోపలికి దిగదు. లోపలవున్న గుడ్లు పొడిగా వెచ్చగా ఉంటయి." అంది షాలట్.

"...షాలట్! నీకు నిజంగా ఐదువందల పధ్నాలుగు బిడ్డలు పుట్టబోతున్నా రంటావా?" మళ్ళీ ప్రశ్నించింది బద్ధకంగా విల్బర్.

"ఔను... అయితే వచ్చే వసంత ఋతువులోగా ఈ సంచీ ఏమీ ప్రమాదం కలగకండా ఉండాలి. అంది షాలట్. షాలట్ స్వరం చాలా విచారంగా వినిపించింది విల్బర్ కి.

"అంత విచారంగా, నీరసంగా మాట్లాడుతున్నావేం? ఇదంత నీకు ఎంతో సంతోషం కలిగిస్తుందని నే ననుకుంటూంటే!"

"ఏమీలేదు. నువ్వు నా సంగతి అట్టే ఆలోచించకు. నాలో ఇంక అట్టే శక్తి లేదు. నా పిల్లలను నేను చూడను. నా విచారాని కారణం అదే అనుకుంటాను."

"నువ్వు నీ పిల్లలని చూడలేక పోవడమంటే? నాకర్థంకాలేదు నువ్వూ చూస్తావు. మన మందరం చూస్తాం. వచ్చే వసంత ఋతువులో ఐదువందల పసి సాలీడులు మన గాదినిండా, పశువుల దొడ్డినిండ పరుగెత్తుతూ ఉంటం చూస్తామన్నమాట. మన బాతులు కూడా మళ్ళీ గుడ్లుపెట్టి పిల్లల్ని చేస్తయి. గొర్రెలు కూడా పిల్లల్ని పెడతయి..."

"పెట్టొచ్చు. కాని, నేను ఈ వేళ రాత్రి పడిన శ్రమంత ఫలవంతమవడం నేను చూడలేనులే! నాకు వంట్లో ఏమీ బాగుండ లేదు. నీకు నిజం చెప్పేస్తున్నాను. నాకు అంత్యకాలం సమీపిస్తున్నట్టు కనిపిస్తూంది."

విల్బర్ కి అంత్యకాలం అంటే అర్థంకాలేదు. దాని అర్థం చెప్ప మని షాలట్ ని అడిగి విసిగించడం విల్బర్ కి ఇష్టంలేదు. కాని, ఈ విషయం తన మనస్సుకి చాలా ఆందోళన కలిగిస్తున్నందువల్ల అడగక తప్పలేదు.

"అంత్యకాలం అంటే ఏమిటి షాలట్?"

"అంటే నాకు పనిచేసే శక్తి తగ్గిపోయి ముసలితనం వస్తూం దన్నమాట. ఇక నేను మామూలు సాలీడుని కాను. ముసలి సాలీడును. కాని, విల్బర్! నాకోసం నీవు అనవసరంగా బెంగపెట్టుకోటం నాకిష్టంలేదు. ఇవాళ నీ జీవితంలో గొప్పరోజు. అదుగో! నా గూడు చూడు. ఆ మంచుబొట్లతో అద్భుతంగా లేదూ?"

షాలట్ అల్లిన గూడు ఆనాడుదయం ఉన్నంత అందంగా, అద్భుతంగా ఎన్నడూలేదు. దారాలన్నింటిపైన డజన్లకొలది మంచు బొట్లు వరసగా ముత్యాలలాగ మెరుస్తున్నయి. తూర్పువేపు నించి సూర్యకాంతి దాని మీదపడి స్పష్టంగా, స్ఫుటంగా కనిపించేటట్టు చేస్తున్నది. ఇంకొక గంట, రెండు గంటలు గడిస్తే - ఆ దారిన జనం గుంపులు గుంపులుగా రావడం మొదలవుతుంది. అంతా వచ్చి నిలబడి ఆ సాలెగూడుని చూసి మెచ్చుకొని, దానిమీద రాసి ఉన్న అక్షరాలు



చదివి, విల్బర్ ని తేరిపారజూసి, అద్భుతమైన ఆ ప్రకృతి వైపరీత్యానికి ఆశ్చర్య పడతారు.

విల్బర్ ఆ సాలె గూడును చూస్తూండగా, పొడుగు పాటి మీసాలు, వాడిఅయిన ముక్కు ప్రత్యక్షమయినయి. మెల్లగా టెంపుల్టన్ శరీరాన్ని ఈడ్చుకుంటూ ఎలాగో విల్బర్ ఆవరణలోకి వచ్చి ఒక మూలగా పడుకుంది.

"నేను వచ్చేశాను" - అంది బొంగురు గొంతుతో. "ఓహో! ఏమి రాత్రి!"

ఆ ఎలక ఉబ్బి మామూలుకి రెట్టింపయి, దాని పొట్ట గుండ్రంగా, చిన్న కుండంత అయింది.

"ఏమి అద్భుతమైన రాత్రి!" పూడిపోయిన గొంతుకతో మళ్ళీ అంది; "ఏమి విందులు! ఏమి తిళ్ళు! ఏమి తాగుళ్ళు! తినలేక పొట్టలు చెక్కలయి పోయినయి. నేను ఒక విందులో మొత్తం పది మంది వదలి పెట్టిన వన్నీ తినేశాను. నా జన్మలో ఎక్కడా అన్నేసి రుచిగల వస్తువులు వదిలేసుకునే సన్నాసుల్ని చూళ్ళేదు. ఒకటీ చెడిపోకుండా అన్నీ ఫస్టుగా ఉన్నయి. అబ్బ! ఏం చెప్పను! ఆ తిండిని వర్ణించటం నాతరం కాదంటే!"

"ఛీ పో! నీకు సిగ్గూ ఎగ్గూ లేదు! నీది కడుపా చెరువా? ఈ దెబ్బతో నీకు పెద్ద అజీర్ణం పట్టుకుంటే తప్ప నీకు బుద్ధిరాదు." అని చివాట్లేసింది షార్లట్.

"నా కడుపుకి ఏమీ ఫర్వాలేదులే! అందులో ఎన్నయినా పట్టించే సెయ్యొచ్చు!... ఇంతకీ, ఈ విషయం మీకు తెలిసిందా? ఈ దుర్వార్త నేనే మీకు చెప్పాలా? ఈ పక్క ఆవరణలో వుందే, తన పేరు 'మామయ్యా' అంటుందే - ఆ పందిదొడ్డికి ముందు నీలపురంగు పీలిక ఒకటి కట్టారు! అంటే ఏమిటో తెలుసా? దానికి మొద

ుహుమతీ వచ్చేసిందన్నమాట. విల్బర్! ఇంక నీ పని పట్టిదే అనుకుం
ాను. ఇక నువ్వు హాయిగా నిద్రపోవచ్చు. నీ మెడలో బంగారు
ుతకం కట్టడానికి ఇంక ఎవ్వరూరారు. ఆ మాటల్లా ఉంచు. జుకర్మాన్
ాడా నిన్నింక మనుగుడుపు పెండ్లి కొడుకుని మేపినట్లు మేపడు.
పైగా, ఎప్పుడో పంది మాంసం మీద మనస్సు మళ్ళినప్పుడు కత్తి
ాగా నూరుకుని నీ దగ్గిరికే వస్తాడు. సిద్ధంగా ఉండు."

"టెంపుల్టన్! నీ వాడుడు కట్టిపెట్టు: నీకు తిండెక్కువయింది.
ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తున్నట్టు లేదు. దాని మాట
ేమీ లెక్కచేయకు విల్బర్!" అంది షాలట్.

ఆ ఎలక చెప్పిన మాటలను గురించి ఆలోచించకుండా ఉండ
ానికి ప్రయత్నిస్తూంది విల్బర్. అసలా విషయం మార్చేసెయ్య
ానికి నిశ్చయించుకుంది.

"టెంపుల్టన్! నువ్వెంతో మైకంలో లేకపోతే, షాలట్ అల్లిన
గుడ్లసంచీ చూసి ఉండేదానివి. షాలట్ పిల్లలతల్లి కాబోతూంది.
ఐదువందల పధ్నాలుగు పిల్లల తల్లి. ఆ సంచిలో ఇప్పుడు ఐదువందల
పధ్నాలుగు గుడ్లు ఉన్నయి. తెలిసిందా?"

"ఔనా? నిజంగా ఉన్నయ్యా?" టెంపుల్టన్ అడిగింది, ఆ సంచీ
ంక అనుమానంగా చూస్తూ.

"ఔను - ఉన్నయి." అని నిట్టూర్చింది షాలట్.

"భలే! షాలట్! భలే! ఈవేళరాత్రి అద్భుతమైనది!" అంటూనే
ళ్ళుమూసుకుని, గాఢ నిద్రలో మునిగిపోయింది. అప్పటికి దాని పీడ
రగడయి నందుకు విల్బరూ, షాలట్టూ సంతోషించారు.

తొమ్మిది గంటలకల్లా ఆరబుల్ ట్రక్కు తిర్నాళ్ళ బజారులో
శువుల ప్రదర్శనంలోకి వచ్చి, విల్బర్ ఆవరణ దగ్గిర ఆగింది.
క్కాకక్కళ్ళ అంతా కిందికి దిగారు.

"అదుగోనర్రోయ్! షాలట్ మళ్ళీ ఇక్కడో గూడల్లేసింది, చూశారా? అదిగో ఆ అక్షరాలు చదవండి!" అని పట్టరాని సంతోష సంతోషం కేక పెట్టింది ఫెన్.

పిల్లలు పెద్దలు అంతా వరసగా నిలబడి ఆ అక్షరాలు చదువుతున్నారు.

"వినయశోభ" అని జుకర్మన్ చదవేశాడు. 'విల్బర్‌కి సరిగ్గా తగిన బిరుదు! అవునా?" అన్నాడు సంతోషంగా.

ఆ సాలెగూటి వింత మళ్ళీ జరిగినందుకు, ఈ తడవ ఈ తిర్నాళ్ల మధ్యలో జరిగినందుకూ అంతా అపరిమితంగా సంతోషిస్తున్నారు. విల్బర్ ప్రేమమయ నేత్రాలతో వారి ముఖాలవంక చూస్తూంది. వినయం, కృతజ్ఞత వెల్లడిస్తూంది. ఫెన్ షాలట్‌ని చూసింది. లర్వీ గబగబా మోటారు ట్రక్కులో కెక్కి ఒక బాల్చీ గంజి తెచ్చి విల్బర్ కొయ్యతొట్టెలో పోశాడు. విల్బర్ ఆ గంజి తాగుతూంది. లర్వీ తన రెండు చేతుల్తో మెల్లగా దాని వీపు దువ్వుతున్నాడు.

"ఇదిగో ఇలా చూడండర్రో!" అంటూ ఇంతలో అవేరీ ఒక్క కేక పెట్టాడు. పెడుతూనే 'మామయ్య' దొడ్డి ముందు కర్రకు కట్టి ఉన్న నీలపు పట్టుపీలిక చూపించాడు. "ఈ పందికి మొదటి బహుమతి వచ్చేసింది అప్పుడే!" అన్నాడు. జుకర్మన్ దంపతులు, ఆరబుల్ దంపతులు ఆ నీలపు పీలిక చూశారు. జుకర్మన్ పిన్ని ఏడవటం మొదలు పెట్టింది. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. అంతా ఆ పీలికవంకే చూస్తున్నారు. తర్వాత వాళ్ళ చూపులు 'మామయ్య' మీదికి మళ్ళినయి. మళ్ళీ ఆ నీలపు పీలికవంక చూశారు. లర్వీ జేబులోనుంచి ఒక పెద్ద చేతిగుడ్డ తీసి గట్టిగా దాంట్లోకి చీదాడు. ఆ శబ్దంవిని ఆ చుట్టుపక్కల రెండు ఫర్లాంగుల దూరంలో వున్న వాళ్ళంతా అటు తిరిగి చూశారు.

"నాకేమన్నా డబ్బులిస్తావా? అమ్మా! ఒక్కసారి నేనా దుకాణాల బజారుకి వెళ్ళొచ్చేస్తానే?" ఫెన్ అడిగింది.

"ఇప్పుడెక్కడికీ వద్దు. ఇక్కడే వుండు!" అంది వాళ్ళమ్మ గట్టిగా. ఫెన్‌కి కళ్ళ నీళ్ళు తిరిగాయి.

"అంతా ఏడుపులు మొదలు పెట్టారేమిటి?" అన్నాడు జుకర్మన్ బాబాయి. "పదండి - పసులు చూసుకోవాలి! ఎడిత్! ఏదీ ఆ చల్ల బాల్చి తీసుకురా!" అన్నాడు.

శ్రీమతి జుకర్మన్ వెళ్ళి చల్ల బాల్చిని ట్రిక్కులోనుంచి దింపి తీసుకు వచ్చింది.

"ఇది అభిషేక సమయం" అన్నాడు జుకర్మన్ నవ్వుతూ. ఆయన, ఆయనభార్య, అవెరీ విల్బర్ ఆవరణలోకి దిగారు. అవెరీ మెల్లగా ఆ చల్లను విల్బర్ తలమీద, వీపుమీద పోస్తున్నాడు. ఆ చల్ల దవడల మీదనించి, పక్కలనించి కారుతూ ఉంటే, జుకర్మన్, ఆయన భార్య, విల్బర్ ఒళ్ళంతా బాగా తోమారు. ఆ దారిని పోయేవాళ్ళంతా అక్కడ ఆగి చూస్తున్నారు. కొంచెం సేపటిలో పెద్ద గుంపు పోగయింది. విల్బర్ శరీరం నున్నగా, తెల్లగా నిగ నిగ లాడుతూంది. ఉదయ సూర్యుని అరుణ కిరణాలు విల్బర్ చెవుల్లోనుంచి దూసుకు పోతున్నయి.

"పక్క దొడ్లో పంది అంత పెద్దది కాదుకాని, ఇది అంతకన్న శుభ్రంగా,అందంగా మాత్రం వున్నది అదీ నాకు నచ్చిన యిసయం!" అన్నాడొక ఆసామి.

"ఆ ముక్కే సరీసుగా నాకూ తోసింది బావా! సెప్పొద్దూ?" అన్నాడు, పక్క ఆసామి.

"దీని వినయం, వివేకం కూడా దాని దగ్గిర ఉన్నట్టు లేవు" అంది ఒక స్త్రీ, ఆ సాలెగూడు మీది మాట చదివి.

మొత్తం మీద అక్కడికి వచ్చిన ప్రతి వ్యక్తి విల్బర్‌ని గురించి ఏదో మంచి మాట అనకుండా పోవటంలేదు. అంతా విల్బర్‌ని ప్రశం సిస్తున్నారు. షాలట్‌ని తలచినవారు లేరు.

అకస్మాత్తుగా లౌడ్‌స్పీకర్లో ఇల్లా వినిపించింది:

"దయచేసి శ్రద్ధగా వినండి! శ్రీ జుకర్మన్ తమ పేరు మోసిన పందిని గ్రాండ్ స్టాండ్‌కి ఎదురుగా వున్న బహుమాన నిర్ణాయకుల ఆవరణలోకి తీసుకు రావాలని కోరుతున్నారు. ఇంక ఇరవై నిమిషా లలో అక్కడ ఒక ప్రత్యేక బహుమాన ప్రదానం జరుగుతుంది. ప్రేక్షకులంతా అక్కడికి రావచ్చు. అయ్యా! జుకర్మన్‌గారూ! దయచేసి వెంటనే మీ పందిని బోనులో ఎక్కించి తీసుకు వచ్చి బహుమాన నిర్ణాయకుల ఎదట హాజరు పెట్టండి!"

ఈ హెచ్చరిక అనంతరం కొన్ని క్షణాల వరకు జుకర్మన్ దంపతులుగాని, ఆరబుల్ కుటుంబంగాని ఏమీ మాట్లాడలేదు; కదల లేదు.

తర్వాత అవెరీ గుప్పెడు గడ్డితీసి పైకి గాలిలోకి ఎత్తుగా విసు రుతూ, పెద్ద కేక పెట్టాడు. ఆ గడ్డి ఫెన్ తలనిండా పడింది. శ్రీ జుకర్మన్ శ్రీమతి జుకర్మన్‌ని కౌగిలించుకున్నాడు. శ్రీ ఆరబుల్ శ్రీమతి ఆరబుల్ చేతిని ముద్దు పెట్టుకున్నాడు. అవెరీ విల్బర్‌ని ముద్దుపెట్టుకున్నాడు. లర్వీ అందరితో కరచాలనం చేస్తున్నాడు. ఫెన్ తల్లిని కౌగిలించుకుంది. అవెరీ ఫెన్‌ని కౌగిలించుకున్నాడు. శ్రీమతి ఆరబుల్ శ్రీమతి జుకర్మన్‌ని కౌగిలించుకుంది.

షాలట్ ఆ పందిరి కప్పు నీడలో ఎక్కడో కనిపించకుండా ఒదిగి పడుకుంది. ఆమె ముందు కాళ్ళు గుడ్ల సంచీని చుట్టుకొని ఉన్నాయి. ఆమె హృదయం ఎప్పటంత దృఢంగా స్పందించడంలేదు. అలిసిపోయినట్టు, బాగా వార్ధక్యం వచ్చేసినట్టు కనిపిస్తూంది. చివరికి

విల్బర్ ప్రాణాన్ని కాపాడగల్గాననే సంతృప్తి ఆమెకు కలిగింది. ఆమె ఆత్మకు శాంతి కలిగింది.

"ఇంక వ్యవధిలేదు, లర్వీ! ఎదీ ఆ బోనిల్లా సాయం పట్టు!" అన్నాడు జుకర్మన్.

"నాకు ఇంకా కాసిని డబ్బులియ్యవే అమ్మా!" ఫెన్ అడిగింది.

"ఆగవే! ఇక్కడంతా అడావిడిగా వుంటే, కనపడటంలే?" తల్లి విసుక్కుంది.

"ఆ చల్ల కూజా కూడా కార్లో పెట్టు." ఆరబుల్ ఆజ్ఞాపించాడు. అవెరీ గబ గబా పోయి కూజా పట్టుకొచ్చాడు.

"నా జుట్టు అణిగి ఉందా?" జుకర్మన్ సతి అడిగింది.

"వో! భేషుగ్గా వుం"దన్నాడు జుకర్మన్, లర్వీతో పాటుగా బోను ఎత్తి విల్బర్ దగ్గిరికి తీసుకొస్తూ.

"బాగానే ఉంది. మీ రసలు నా జుట్టుకేసి చూడనైనా చూస్తేగా!" సణిగింది జుకర్మన్ సతి.

"నువ్వు బాగానే వున్నావులే! కొంచెంసేపు వూరుకో ఎడిత్!" ఆరబుల్ సతి కోప్పడింది.

ఈ గొడవతో గడ్డిలోదూరి నిద్రపోతూన్న టెంప్లటన్‌కి మెలకువ వచ్చింది. అసలు ఏం జరుగుతున్నదీ దానికి అర్థం కాలేదు. అయితే విల్బర్‌ని మళ్ళీ బోనులోకి ఎక్కించటానికి ప్రయత్నిస్తున్నారని గ్రహించగానే తాను కూడా అందులో దూరాలని మాత్రం నిశ్చయించుకుంది. సమయంకోసం చూస్తూంది. అందరూ ఇంకోవేపు చూస్తూన్న సమయం కనిపెట్టి క్షణంలో బోనులో దూరి, గడ్డి కప్పేసుకుంది.

"సరే - అన్నీ సరిగ్గానే ఉన్నయ్. రండర్రా! ఒక చెయ్యి వెయ్యండి!" అన్నాడు జుకర్మన్. ఆయన, ఆరబుల్, లర్వీ, అవెరీ

సాయంపట్టి ఆ బోను ఎత్తి ఆ పందిదొడ్డి కంచెదాటించి, తీసుకుపోయి ట్రక్కులో పెట్టారు. ఫెన్ ఎగిరి గంతేసి, ఎక్కి ఆ బోను మీద కూచుంది. ఫెన్ తలలో ఇంకా రెండు గడ్డిపరకలు అలాగే ఉన్నయి. ఆ ఉత్సాహంలో, ఆ తన్మయత్వంలో ఫెన్ చాలా అందంగా కనిపిస్తూంది. ఆరబుల్ కారు స్టార్టు చేశాడు. అంతా ఎక్కారు. కారు మెల్లగా బహుమాన నిర్ణాయకులు ఉన్న ఆవరణలోకి వెళ్ళింది.

కారు పెద్ద ఉయ్యాలచక్రం పక్కగా వెళుతున్నప్పుడు ఫెన్ పైకి చూసింది. తాను హెన్రీఫుస్సీతో పాటుగా ఆ పైన ఉన్న తొట్టెలో కూచుని అక్కణ్ణించి ఇదంతా చూస్తూ వుంటే ఎంత బాగుండేదో అనుకుంది.

20. విజయోత్సాహం

"ఇప్పుడొక ముఖ్యమైన ప్రకటన చేయబోతున్నాం. దయచేసి సావధానంగా వినండి!" అంటూ లౌడ్ స్పీకర్‌లో ఒక బొంగురు గొంతు గర్జిస్తూంది; "ఈ తిరునాళ్ళ సందర్భంలో ఇక్కడ ఏర్పాటు చేసిన పశుప్రదర్శన నిర్వాహక వర్గంవారు శ్రీ హోమర్ జుకర్మన్‌గారినీ, వారి పేరుమోసిన పందినీ ఇప్పుడు మీకు చూపిస్తారు. అసాధారణమైన ఆ పందిని తీసుకు వస్తూన్న మోటారు ట్రక్కు ఇంక కొన్ని క్షణాల్లో ఈ పశుప్రదర్శనం ఆవరణ మధ్యకు వస్తూంది. దారిలో నిలబడి ఉన్న ప్రేక్షకులంతా దయచేసి పక్కకి ఒత్తిగిలి, ఆ ట్రక్కు త్వరగా లోపలికి రావటానికి దారి ఇవ్వవలసినదిగా ప్రార్థన. ఇంక కొంచెం సేపటిలో ఆ పందిని ప్రదర్శనం ఆవరణంలో బహుమాన నిర్ణాయక వలయం మధ్య దించుతారు. అప్పుడా పందికి ప్రత్యేక బహుమాన ప్రదానం జరుగుతుంది. దయచేసి ప్రేక్షకులంతా పక్కకి తప్పుకుని ట్రక్కుకి దారివ్వాలి!"

ఈ ప్రకటన వినేసరికి విల్బర్‌కి వణుకు పట్టుకుంది. మనస్సులో సంతోషంగానే వుందిగాని, ఎందుకో తల తిరిగి పోతూంది. ఆ ట్రక్కు మెల్లగా వస్తూంది. జనం ఇసక వేస్తే రాలకుండా దాని చుట్టూ మూగారు. ఆ గందరగోళంలో ఎవరు కారు క్రింద పడతారో అని ఆరబుల్ కారు చాలా జాగ్రత్తగా నడుపుతున్నాడు. చివరికి కారు బహుమాన నిర్ణాయకుల వలయంలోకి వచ్చింది. అవెరీ కిందికి దూకి, వెనక పక్క నున్న తలుపు తెరిచాడు.

"అబ్బ! నాకు చచ్చేటంత భయంగా వుంది. ఈ వందల కొద్దీ మంది జనం కళ్ళన్నీ మన్నే చూసేస్తున్నయి." అన్నాడు.

"పడిశాప్! సంతోషంగా కనబడు! ఏముంది? ఇదంతా ఓ తమాషా!" అంది ఆరబుల్ సతి.

"ఆ పందిని దయచేసి త్వరగా కిందికి దింపాలి!" లౌడ్ స్పీకర్ లో బొంగురు గొంతు ఉరిమింది.

"అబ్బాయిలూ! కాస్త చెయ్యి వెయ్యండోయ్!" అన్నాడు జుకర్మన్. గుంపులోనుంచి కూడా కొందరు గబగబా ముందుకి వచ్చి విల్బర్ బోను దింపడానికి సాయపడుతున్నారు. అందరిలోకీ అవెరీ సందడి హెచ్చుగా ఉంది.

"అవెరీ! చొక్కా పంట్లాం లోపలికి దోపుకుని బెల్టు గట్టిగా బిగించుకో ముందు! పంట్లాం జారిపోతూంది." అంది జుకర్మన్ పిన్ని.

"ఇప్పుడు నాకు తీరుబళ్ళేదు!" అన్నాడు అవెరీ విసుగ్గా.

"అదుగో నేవ్! హెన్రీ కూడా వచ్చాడు!" అంది ఫెన్ తల్లికి చూపిస్తూ.

"అరవకు. అల్లా చేతులు పెట్టి చూపించ కూడదు." తల్లి కసిరింది.

"నాక్కొంచెం డబ్బు ఇయ్యవుటే అమ్మా! పెద్ద చక్రంలో మళ్ళీ ఓసారి ఎక్కి తిరుగుదాం అన్నాడే, హెన్రీ. పాపం తన డబ్బంతా ఖర్చు పెట్టేశాడు తెలుసా?" ఫెన్ అడిగింది.

ఆరబుల్ సతి చేతిసంచి జిప్ లాగి, ఆరణాలు చిల్లరతీసి, "ఇదుగో తీసుకుపో! ఎక్కడైనా మారుపడి పోయేవు. జాగ్రత్త! తర్వాత మన పంది' పందిరి దగ్గిరికి వచ్చేసెయ్!" అని హెచ్చరించి ఇచ్చింది.

ఫెన్ డబ్బులు చేతులో పడగానే హెన్రీ ఉన్న వేపు పరిగెత్తింది. వాళ్ళిద్దరూ గుంపులోనుంచి దూసుకు పోయారు.

"అదుగో! జుకర్మన్‌గారి పేరు మోసిన పందిని బోనులోనుంచి బయటికి తీస్తున్నారు. దయచేసి నిశ్శబ్దంగా నిలబడి వినండి!" లౌడ్ స్పీకరు మళ్ళీ అరిచింది.

బోనులో వెనుక పక్కన గడ్డి కింద దాగి ఉన్న టెంప్లటన్ "అబ్బ! ఏమిటిదంతా? దిక్కు మాలినగోల!" అనుకుంది.

పంది పందిరికప్పులో షార్లట్ ఒక్కతే ఒంటరిగా, సడీచప్పుడూ లేకుండా ఒదిగిపడుకుంది. ఆ సాలీడు ముందరి కాళ్ళు రెండూ గుడ్ల సంచిని కౌగిలించు కున్నట్టు ఉన్నాయి. లౌడ్ స్పీకర్లు చెపుతూ వున్న మాటలన్నీ షార్లట్‌కి వినిపిస్తున్నయి. ఆమాటలా మెకి ప్రాణంపోసినయి. తను పడిన కష్టం ఫలిస్తూన్న సమయం అది

విల్బర్ బోనులోనుంచి బయటికి వచ్చేసరికి చుట్టూ మూగిన జనమంతా ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు. జుకర్మన్ తన టోపీ తీసి కృతజ్ఞతా సూచకంగా తల వంచాడు. లర్వీ పంట్లాం జేబులో నుంచి పెద్ద జేబురుమాలొకటి తీసి, మెడమీద చెమట తుడుచుకున్నాడు. అవెరీ విల్బర్ పక్కన ఆ తొట్టెలోనే మోకాళ్ళమీద నిలబడి, మెల్లగా దాని వీపుమీద తడుతున్నాడు. ఆరబుల్ సతి, జుకర్మన్ సతి కారు పక్కన నిలబడి ఉన్నారు.

"సోదర సోదరీమణులారా! అదుగో శ్రీ హోమర్ జుకర్మన్ గారి పేరుమోసిన పంది ఇప్పుడు మీ ఎదుట ఉంది. ఈ గొప్ప పంది కీర్తి ఈ ప్రపంచంలో నలుమూలలకి పాకిపోయిందనీ, ఈ పందిని చూడడానికి ఎంతోమంది మన రాష్ట్రానికి వచ్చి పోతున్నారనీ మీకు తెలుసు. ఈ విధంగా మన రాష్ట్రానికి యాత్రికులవల్ల వచ్చే ఆదాయం కూడా బాగా పెరిగింది. ఈ పంది సామాన్యమైనది గాదని గత వసంత ఋతువులో జుకర్మన్‌ల పశువులదొడ్లో ఒక సాలీడు తన గూడు మీద స్పష్టంగా వ్రాసిన సంగతి మీ అందరికీ జ్ఞాపకం ఉందనుకుంటాను. ఆ

వింత, ఆ ప్రకృతి వైపరీత్యం ఎల్లా జరిగిందో ఇంత వరకు ఎవరూ వివరించి చెప్పలేక పోయారు. ఎందరో విజ్ఞానులు, పండితులు వచ్చి ఆ వింతను చూశారు ఎవరూ ఏమీ చెప్పలేక పోయారు. అది ఏదో దివ్యశక్తి వల్ల జరిగినపని అని మాత్రమే మనకు తెలుసు. ఇది మన అందరికీ నిజంగా గర్వకారణమైన సంఘటన. ఆ సాలీడు గూటిలో స్పష్టంగా వ్రాసినట్లు - నిజంగా ఇది "గొప్ప పంది."

విల్బర్ కి తగని సిగ్గుగా ఉంది. కదలకుండా నిలబడి, సాధ్యమయినంత గొప్పగా కనబడటానికి ప్రయత్నిస్తూంది.

"అద్భుతమైన ఈ పంది,..." మళ్ళీ లౌడ్ స్పీకర్ ఉపన్యాసం. "...నిజంగా భీముడు లాంటిదే! సోదర సోదరీమణులారా! ఒక్కసారి దాని వంక చూడండి. ఎంత నున్నగా, తెల్లగా, ఎక్కడా మరకగాని, మచ్చగాని లేని ఆ చర్మం, ఆరోగ్యకరమైన చింత చివురు రంగు చెవులు, అందమైన ఆ ముట్టె చూడండి!"

"అదంతా నీ చల్ల కడుగు మహత్తు!" అంది ఆరబుల్ సతి జకర్మన్ సతితో.

"విలక్షణమైన ఈ జంతువులోని అపురూపమైన తేజస్సును మనం ముఖ్యంగా గమనించాలి. అప్పుడు ఆ సాలీడు రాసిన 'తేజస్వి" అన్న సందేశానికి అర్థం చక్కగా మనకు బోధపడుతుంది. ఈ అక్షరాలు, ఈ సందేశాలు అక్కడికి ఎలా వచ్చాయి? ఆ సాలీడే రాసిందంటానికి ఎంత మాత్రం వీలులేదు. సాలీడుకి తన గూడు అల్లుకొనటంలో చాలా నేర్పు ఉండవచ్చు. కాని సాలీడుకి చదువు రావటం, రాయ గలగటం అసంభవం!

"అవునౌను! అసంభవం!" అనుకొంది షార్లట్ తనలో తాను.

"సోదర సోదరీమణులారా!" మళ్ళీ అందుకొంది లౌడ్ స్పీకర్.

"విలువైన మీ కాలాన్ని ఇంక నేను వ్యర్థం చెయ్యదలచుకో లేదు. "వినయశోభి", "తేజస్వి", అయిన "భీముడు" లాంటి ఈ "గొప్ప పంది" మన ఈ తిర్నాళ్ళకు ఎక్కడెక్కడి నించో చాలామంది ప్రేక్షకుల్ని ఆకర్షించినందుకు మన ప్రశంసా చిహ్నంగా ఈ పందికి ఈ మాటలన్నీ చెక్కిన ఒక అందమైన కంచుపతకాన్నీ, ఈ పందియొక్క యజమాని అయిన శ్రీ జుకర్మన్‌గారికి ఇరవైఐదు డాలర్లు (సుమారు నూటపదహారు రూపాయలు) ప్రత్యేక బహుమానం ఈ తిరునాళ్ళ నిర్వాహకవర్గం తరఫున మేము వారికి సంతోషంగా బహూకరిస్తున్నాము."

తనను గురించిన ఈ దీర్ఘోపన్యాసం విన్నకొద్దీ విల్బర్ తల తిరగడం క్రమంగా ఎక్కువయింది. ఉపన్యాసం చివర మళ్ళీ జనమంతా చప్పట్లు కొట్టి సంతోషంగా కేకలు వేయడం మొదలు పెట్టేసరికి విల్బర్ స్మృతి తప్పి పడిపోయింది.

"ఏం? ఏం జరిగింది?" లౌడ్‌స్పీకర్ అడుగుతూంది; "ఏమిటి జుకర్మన్‌గారూ! మీ పంది పడిపోయిందేం?"

ఆవేరీ విల్బర్ తలదగ్గిర కూచుని దాన్ని చేత్తో మెల్లగా తడుతున్నాడు. జుకర్మన్ కంగారుగా చుట్టూ తిరుగుతున్నాడు. తన హాట్ తీసి విల్బర్‌కి విసురుతున్నాడు.

"ఏమీ లేదండి...... ఏమీ లేదు. అప్పుడప్పుడు ఇల్లా పడిపోతూ ఉంటుంది లెండి. దానికి తగనిసిగ్గు. పొగడ్తలు అట్టే సహించలేదు," అన్నాడు

"ఏమో! చచ్చిపోయిన పందికి మాత్రం బహుమానం ఇవ్వడానికి వీల్లేదు. ఇంతవరకెప్పుడూ అల్లాంటిది జరగలేదు." లౌడ్‌స్పీకరు ఖచ్చితంగా చెప్పేసింది.



"అబ్బే! లేదండి. చావలేదు. స్పృహ తప్పి పడిపోయిందంతే! మనస్సు చాలా మెత్తన. తేలికగా ఇట్టే ఆవేశ పడిపోతుంది. లర్వీ! ఆరిగెత్తు! నీళ్ళు తీసుకురా!" జుకర్మన్ కంగారుగా అన్నాడు.

లర్వీ ఆ బహుమాన నిర్ణాయకుల వలయంనించి ఒక్క గంతు పెట్టి గుంపులో కలిసిపోయాడు.

టెంపుల్టన్ తల గడ్డిలోనుంచి బయటికి పెట్టి తొంగి చూసింది. విల్బర్ తోక తనకు అందుబాటులో ఉండటం చూసింది. ఒక్క వంకర నవ్వు నవ్వింది. "దీనికి మందు నాకు తెలుసు" అనుకుంది. బోనులో నుంచి బయటికి వచ్చి విల్బర్ తోక గట్టిగా కొరికింది. ఆ నెప్పితో విల్బర్ కి తిరిగి స్మృతి వచ్చి లేచి నిలబడింది.

"ఉ...ఫ్!" అని నిట్టూర్చింది.

"లేచింది! లేచింది-భలే! భలే పంది. గొప్ప పంది!" మళ్ళీ జనం పొగిడేస్తున్నారు. అంతా సంతోషంగా కేకలు పెడుతున్నారు. జుకర్మన్ ఆనందానికి అంతే లేదు. పెద్ద బరువు దించేసినట్టు నిశ్వసించాడు.

టెంప్ల్టన్‌ని మాత్రం ఎవరూ చూడలేదు. పాపం! ఆ ఎలుక సమయానికి వచ్చి సహాయపడింది.

ఆ పైన, బహుమాన నిర్ణాయకులలో ఒకరు బహుమతులతో సహా ఆ వలయంలోకి వచ్చారు. పది డాలర్ల నోట్లు రెండూ, ఐదు డాలర్ల నోటు ఒకటీ ఆయన జుకర్మన్‌కి ఇచ్చాడు. కంచు పతకం తీసి ఒక రిబ్బన్‌తో విల్బర్ మెడలో కట్టాడు. జుకర్మన్‌తో కరచాలనం చేశాడు. విల్బర్ సంతోషం, సిగ్గూ పట్టలేకుండా ఉంది. అవెరీ చెయ్యి ఊపాడు. బహుమాన ప్రదాత అవెరీతో కూడా కరచాలనం చేశాడు. చుట్టూ జనం సంతోషంగా చప్పట్లుకొట్టి కోలాహలం చేశారు. ఒక ఫొటోగ్రాఫర్ వచ్చి విల్బర్‌ని ఫొటో తీశాడు.

జుకర్మన్‌దంపతులు, ఆరబుల్ కుటుంబం-అంతా ఏదో అపూర్వమైన ఆనందంలో మునిగి తేలుతున్నారు. జుకర్మన్ జీవితంలో ఇది అద్భుతమైన సంఘటన. అంతమంది జనంమధ్య బహుమానం పొందడం

అంటే మాటలుకాదు. అంత గాఢమైన ఆనందం కలిగించేది మరోటి లేదు.

విల్బర్‌ని మళ్ళీ బోనులోకి ఎక్కిస్తూ ఉండగా లర్వీ నీళ్ళబాల్చీ పుచ్చుకుని జనంలోనుంచి దారిచేసుకుంటూ వస్తున్నాడు. వాడి చూపులు ఆందోళనతో మెలికలు తిరుగుతున్నయి. వస్తూనే ఒక్క-క్షణమైనా వృథాచేయకుండా ఆ బాల్చీడు నీళ్ళూ విల్బర్‌మీద కుమ్మరించాడు. ఆ కంగారులో గురితప్పి ఆ నీళ్ళు చింది జుకర్మన్ మీద, అవెరీ మీద పడినయి. వాళ్ళ బట్టలన్నీ ఇంచుమించు పూర్తిగా తడిసి పోయినయి.

"లర్వీ! ఏమిటీ పని? నీకేం మతిపోయిందా? పందిలేచి శుభ్రంగా ఉంటే కనిపించటం లేదూ?" జుకర్మన్ కసిరాడు.

"నీళ్ళట్టుకు రమ్మన్నారు గదుండీ!" లర్వీ నసిగాడు.

"నా నెత్తిన పొయ్యమని కూడా అన్నానా?" జుకర్మన్ కసిరాడు. జనమంతా పెద్ద పెట్టున నవ్వారు. చివరికి- జుకర్మన్ కూడా నవ్వక తప్పలేదు. అవెరీకి బట్టలన్నీ తడిసిపోవటం సరదాగానే ఉంది. సర్కస్‌లో హాస్యగాడిలా అభినయించటం మొదలు పెట్టాడు. తను జల్లుస్నానం చేస్తున్నట్టు నటిస్తూ. ముఖం రకరకాలుగా తిప్పుతూ, చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తున్నాడు. అబద్ధాల సబ్బుబిళ్ళతో చేతులు రుద్దుకున్నాడు. ఉత్తుత్తి తుండుగుడ్డతో ముఖం, చేతులు తుడుచుకుంటున్నాడు.

"అవెరీ! ఏమిటా పిచ్చికళలు? కట్టిపెడతావా, కట్టిపెట్టవా?" తల్లి కసిరింది.

జనానికి మాత్రం ఇదంతా తమాషాగానే ఉంది. వాళ్ళంతా హర్షధ్వానాలు చేస్తూ అవెరీని ప్రోత్సహించారు. సర్కసులోలాగ మధ్యవలయంలో నిలబడి హాస్యగాడిలాగ నటించటం వాడికి బాగా

సరదాగా ఉంది. బాల్చీలో ఇంకా కాసిని నీళ్ళు మిగిలి ఉండటం చూసి, అవెరీ బాల్చీ ఎత్తి తన నెత్తిన గుమ్మరించుకుని ముఖం నానా వంకరలు తిప్పాడు. చుట్టూ గాలరీలలో వున్న పిల్లలందరూ సంతోషంతో కేరింతాలు కొడుతూ, అవెరీని ప్రశంసించారు.

చివరికి అంతా సద్దుమణిగింది. విల్బర్ బోను మళ్ళీ ట్రక్కులోకి ఎక్కించారు. తల్లి వచ్చి అవెరీని ఆ వలయంలోనుంచి బయటికి లాక్కుని పోయి, వాడి బట్టలు ఆరటానికి పీలుగా ముందు సీట్లో కూచోబెట్టింది (శ్రీ) అరబుల్ నడుపుతూన్న ట్రక్కు మళ్ళీ మెల్లగా పందుల పందిరివేపుగా పాకిపోయింది. అవెరీ తడిలాగూ కింద కారులో సీటుమీద పెద్ద తడిమచ్చ ఏర్పడింది.

21. చివరి రోజు

షార్లట్, విల్బర్ మాత్రం ఒంటరిగామిగిలారు జుకర్మన్, ఆరబుల్ ల కుటుంబాల్లోనివాళ్ళందరూ ఫెన్ ని వెతక డానికి వెళ్ళారు. టెంపుల్టన్ అప్పుడే నిద్రకు పడింది. ఆ విజయోత్సవ సంరంభంతో, ఆందోళనతో హైరాన పడిపోయిన విల్బర్ విశ్రాంతి తీసుకుంటూంది. బహుమాన పతకం ఇంకా విల్బర్ మెడలోనే వేళ్ళాడుతూంది. ఓరగాచూస్తే ఆ పతకం విల్బర్ కికూడా కనిపిస్తూంది.

"షార్లట్!" కొంత సేపటికి విల్బర్ పిలిచింది. "నువ్వేం మాట్లాడకుండా అల్లా ఉన్నావేం?"

"మెదలకుండా కూచోటమే నాకు ఇష్టం!" షార్లట్ అంది. "అసలు ఎప్పుడూ మౌనంగా, ప్రశాంతంగా ఉండటమే నాకు ఇష్టం."

"ఔననుకో! అయినా ఇవాళ మరీ ఎల్లాగో ఉన్నట్టున్నావు! వంట్లో బాగా కులాసాగా ఉందా?"

"కొంచెం అలసటగా ఉంది. అయినా ఫర్వాలేదు. ప్రశాంతం గానే ఉంది. ఈ వేళ పొద్దున నీకు జరిగిన సమ్మానం ఒక విధంగా నాకూ గొప్ప విజయం. అయి పోయింది - ఇక నీ బతుకును గురించి బెంగలేదు. నువ్వు నిర్భయంగా, నిశ్చింతగా బతకవచ్చు విల్బర్! ఇంక నీకు వచ్చిన హాని ఏమీ లేదు. చలికాలం వస్తుంది. పగటి పొద్దు క్రమంగా తక్కువయి పోతుంది. చెట్లమీది ఆకులన్నీ పండిపోయి, రాలిపోతయి. క్రిస్మస్ పండగ వస్తుంది. మంచు బాగా కురుస్తుంది. ఆ చల్లని రోజుల్లో, తెల్లని మంచుతో కలకల్లాడే అందమైన ప్రపంచంలో నువ్వు హాయిగా బతకవచ్చు. ఇక జుకర్మన్ కి నువ్వొక ఇల వేల్పువి. ఇక నిన్ను ఎవ్వరూ ఏమీ చెయ్యరు. క్రమంగా శీతాకాలం

గడిచి పోతుంది. మళ్ళీ పగటి పొద్దు సాగుతుంది. గడ్డి బీడులోని చెరువులో మంచంతా కరిగిపోతుంది. కోకిలమ్మలు మేలుకొని, గొంతులు సవరించుకొని పాడటం మొదలు పెడతాయి. కప్పలు బయటికి వస్తాయి. మళ్ళీ వెచ్చని గాలులు వీస్తాయి. విల్బర్! ఆ అందమైన దృశ్యాలూ, ధ్వనులూ, సువాసనలూ, సుందరమైన ఈ ప్రపంచం-సుఖమైన ఆ రోజులు నువ్వు హాయిగా అనుభవించవచ్చు..."

షార్లట్ ఆగిపోయింది. ఒక్క క్షణం గడిచింది. విల్బర్ కళ్ళల్లో నీరు తిరిగింది. "షార్లట్! మొదట నిన్ను చూసిన రోజున నువ్వు వట్టి క్రూరురాలవనీ, ఇతర ప్రాణుల రక్తం తాగి బతికేదానివనీ అనుకున్నాను. అబ్బ! నే నెంత బుద్ధిలేని దాన్ని!"

ఆ ఆవేశం పొంగు కొంచెం తగ్గిన తరువాత విల్బర్ మళ్ళీ మొదలు పెట్టింది. "నాకోసం నువ్వింత పని ఎందుకు చేశావ్? షార్లట్! నిజంగా, ఇంత ఉపకారానికి నేను తగను. నేను నీకు ఎన్నడూ రవ్వంత కూడా సాయం చెయ్యలేదు."

"నువ్వు నా స్నేహితుడివి కాదూ! అంతకంటె ఇంకేం కావాలి? నువ్వంటే నాకు ఇష్టం. ఇన్నిసార్లు నీకోసం గూడు అల్లటానికి అదే కారణం. నిజానికి జీవితమంటే ఏముంది విల్బర్? పుట్టాం. కొద్దికాలం బతుకుతాం. చచ్చిపోతాం. సాలీడు జీవితమంతా వల అల్లటంతో, ఈగల్ని పట్టి తినడంతో వ్యర్థంగా గడిచిపోతుంది. నీకి సహాయం చేయటమే నా జీవితంలో రవంత విశేషం. అంతకన్న ఏముంది? ఏమిటో? ఆ మంచి చెబ్బరలన్నీ భగవంతుకే తెలియాలి."

"బావుంది!" అంది విల్బర్. "నాకు ఉపన్యాసాలు చెప్పటంరాదు షార్లట్! అసలు నాకన్ని మాటలేరావు. నిజంగా నువ్వు నన్ను రక్షించావు. నీకోసం నా ప్రాణమయినా సరే ఇచ్చేస్తాను షార్లట్! నిజంగా ఇచ్చేస్తాను."

"ఔను. నాకు తెలుసు నీ మనసు. చాలా సంతోషం!"

"షాలట్!" విల్బర్ అంది. "మనం ఇక మళ్ళీ ఇంటికెళ్ళిపోతాం. తిర్నాళ్ళ అయిపోవచ్చిందిట. మళ్ళీ మన దొడ్లోకి, మన బాతులు గొర్రెలుదగ్గిరికి వెళ్ళిపోతాం గద! అక్కడ భలే సరదాగా ఉంటుంది గదూ షాలట్?"

ఒక క్షణం షాలట్ మాట్లాడలేదు. తర్వాత సన్నని గొంతుకతో విల్బర్ కి వినపడీ వినపడనంత నీరసంగా జవాబు చెప్పింది. "నే నింక ఆ పశువులదొడ్డికి రాను విల్బర్!"

విల్బర్ ఉలిక్కిపడి లేచి నుంచుంది. "ఏమిటీ? మాతో ఇంటికి రావూ? ఏమిటి షాలట్! అట్లా మాట్లాడుతున్నావ్?" అని అరిచింది.

"నా పని అయిపోయింది. ఇక ఒకటి, రెండు రోజుల్లో నేను ప్రాణం వదలేస్తాను. ఈ పందిరి దిగి నీ బోనులోకి రావటానికి కూడా నాకు ఓపిక లేదు. అసలు కిందకి దిగేటప్పుడు వదలటానికి నాలో ఇక దారంకూడా లేదనుకుంటాను"

ఈ మాటలు విని విల్బర్ ఆందోళనతో, విచారంతో కూలబడి పోయింది. వెక్కి వెక్కి శరీరం అంతా కదిలిపోయేటట్లు ఏడుపు ప్రారంభించింది. కిందపడి దొర్లుతూ నిట్టూరుస్తూంది. "షాలట్! నువ్వు నా ప్రాణ స్నేహితురాలివి!" అంది వెక్కి వెక్కి ఏడుస్తూనే.

"ఇక్కడ రభస చేయకూడదు. గొడవ చెయ్యకు విల్బర్! లే! అలా కిందపడి కొట్టుకోకూడదు. తప్పు!"

"ఈ ఏడుపు నేను ఆపుకోలేను. ఏమయినా సరే నిన్నిక్కడ ఒంటరిగా విడిచిపెట్టి నేను వెళ్ళను. నేనూ ఇక్కడే ఉండి పోతాను." అంది విల్బర్, లేచి నుంచుని గబగబా.

"అవ్యక్తంగా మాట్లాడకు నువ్విక్కడ వుండటానికి వీల్లేదు. జుకర్మన్, ఆరబుల్, లర్వీ - వాళ్ళందరూ ఇంక కొంచెం సేపటిలో

వచ్చేస్తారు. నిన్ను బోనులో ఎక్కించి తీసుకుపోతారు. కాకపోయినా, నువ్విక్కడ ఉంటాననటం వట్టి తెలివితక్కువ. ఇక్కడ నీకు ఎవ్వరూ మేత పెట్టరు. తిర్నాళ్ళ అయిపోతే, ఈ స్థలమంతా పాడు పడినట్టు ఉంటుంది."

విల్బర్ ఆందోళన మరీ ఎక్కువయింది. అమితాందోళనతో ఆ దొడ్లోనే గిరగిర తిరగటం మొదలు పెట్టింది. అకస్మాత్తుగా విల్బర్ బుర్రలోకి ఒక ఆలోచన వచ్చింది. షాలట్ గుడ్లసంచీ సంగతీ, అందులో ఉన్న ఐదువందల పద్నాలుగు పిల్ల సాలీళ్ళ సంగతీ జ్ఞాపకం వచ్చింది. వచ్చే వసంత ఋతువులో అవన్నీ గుడ్లలోనుంచి బయటికి వస్తాయి. షాలట్ తనతోపాటు జుకర్మన్ పశువుల సావిడిలోకి రాలేకపోతే, కనీసం షాలట్ పిల్లల్ని అయినా తాను తీసుకుపోవాలి!

విల్బర్ తన పందిరి ముందుకి పరిగెత్తుకొచ్చింది. ముందు కాళ్ళు పై అడ్డకర్ర మీద పెట్టి, చుట్టు పక్కల పార చూసింది. జుకర్మన్, ఆరబుల్ నడిచివస్తూ దూరాన కనిపించారు.. ఇక వ్యవధి లేదు. వెంటనే సన్నాహం చేసుకోవాలి.

"టెంపుల్టన్ ఏదీ?" అరిచింది.

"ఆ మూల గడ్డిలో పడుకుని నిద్రపోతూంది." అంది షాలట్.

విల్బర్ అటు పరిగెత్తి, బలమైన తన ముట్టెని ఎలక పొట్టకిందికి దూర్చి దాన్ని పైకి ఎగరేసింది. "టెంపుల్టన్ లే!" అని అరిచింది.

గాఢనిద్ర పోతూన్న ఆ ఎలక్కి మొదట ఏమీ అర్థంకాలేదు తరవాత తగని కోపం వచ్చింది.

"ఏమిటీ మోట సరసాలు?" అని కసిరింది. "నేను కాసేపు పడుకో కూడదేం? ఏమిటీ దౌర్జన్యం? నిద్రపోతున్న దాన్ని అమాంతంగా ముట్టెతో పైకి ఎగరేస్తావ్?"

"కొంచెం నే చెప్పేమాటలు విను!" విల్బర్ ప్రారంభించింది; "మన పాలట్ కి చాలా జబ్బుగా ఉంది తెలుసా? ఇంక ఆట్టేసేపు బతకదుట! మనతో కూడా జుకర్మన్ సావిడిలోకి రాలేదుట! అంత నీరసంగా ఉంది. పాలట్ గుడ్లసంచీ అయినా తీసుకుపోవాలి మనం. అది ఆ పైన ఉంది. నాకు అందదు. నువ్వు దాన్ని తీసుకురావాలి. లే! అరుగో వాళ్ళంతా వచ్చేస్తున్నారు. ఇంక టైం లేదు. నీకు పుణ్యముంటుంది, టెంపుల్టన్! దయచేసి ఎక్కు. ఆ పందిరిగడకు అంటుకొని ఉన్న ఆ సంచీ జాగ్రత్తగా ఊడతీసి తీసుకురా!"

ఎలక బారెడు బెత్తెడు పొడుగున ఆవలించింది. మీసాలు సవరించుకుంది. పైనున్న గుడ్లసంచీ వేపు చూసింది. విసుగుతో అంది-రిమళ్ళీ ఈ ముసలి టెంపుల్టనే కావాలి అన్నింటికీ! 'టెంపుల్టన్ ఇది చెయ్యి!' 'టెంపుల్టన్ అది చెయ్యి!' 'టెంపుల్టన్ దయచేసి ఒక పాత పత్రికముక్క తెచ్చిపెట్టు!' 'టెంపుల్టన్ నేను గూడు అల్లాలి గట్టితాడు ఉంటే పట్టుకురా!' అంటూ ఆజ్ఞలు! వెధవాజ్ఞలు! నా ప్రాణం తీసేస్తున్నావు."

"లేదు టెంపుల్టన్! ఆలస్యం చెయ్యకు. అరుగో చూడు-వాళ్ళు వచ్చేస్తున్నారు. టెంపుల్టన్! టెంపుల్టన్!"

టెంపుల్టన్ కి చీమ కుట్టినట్టు కూడా లేదు. విల్బర్ అన్న మాటలన్నీ అల్లాగే మళ్ళీ అంటూంది వెక్కిరిస్తున్నట్టు.

"ఆలస్యం చెయ్యకు టెంపుల్టన్! టెంపుల్టన్! టెంపుల్టన్!..." "నీకీ సాయాలన్నీ చేస్తే నాకేంలాభమో, నానోట్లో వచ్చిపడేదేమిటో ముందు చెప్పు! ఎన్ని చేసినా ఎవరూ నన్ను గురించి ఒక్క మంచి మాటైనా అనరు. అందరికీ వేళాకోళమే. అంతా చాటు మాటున చెవులు కొరుక్కునే వాళ్ళే. అంతా తిట్టేవాళ్ళే. ఎలకను గురించి ఎవ్వరూ ఒక్క మంచి మాట కూడా అనకూడదేం?"

"టెంపుల్టన్!" విల్బర్ నిరాశతో అరిచింది. "నువ్వు మాట్లాట్టం మానేసి, పని మొదలు పెట్టకపోతే అంతా నాశనమవుతుంది. నేను కూడా గుండె ఆగి, చచ్చిపోతాను. లే! దయచేసి పైకి ఎక్కు!"

టెంపుల్టన్ మళ్ళీ ఆ గడ్డిలో వెల్లకిలా పడుకుంది. బద్ధకంగా ముందరికాళ్ళు తలవెనక పెట్టుకుని, వెనకకాళ్ళు నీటుగా మెలిక వేసుకుంది.

"ఏమిటీ? గుండె ఆగి చచ్చిపోతావ్? అబ్బ! నాకొచ్చింది ఈ పాడు గోలంతా. ఎప్పుడు ప్రాణంమీదికొచ్చినా నామీద కొచ్చి పడతారు. అయినా నామూలంగా గుండె ఆగి చచ్చిపోవటమే! వట్టిది. టెంపుల్టన్‌ని అంతగా లెక్కచేసే వాళ్ళెవరూ లేరు! నాకు తెలుసు."

"లే లే! టెంపుల్టన్! చిలిపితనంగా మాట్లాడకు లే!" అంది విల్బర్.

టెంపుల్టన్ ఒక్క వెకిలి నవ్వు నవ్వి, కదలకుండా పడుకుంది. "కాస్త జ్ఞాపకం చేసుకో! ఆ చెత్త సామాను గదికి అన్నిసార్లు తిరిగింది ఎవరు? ఈ పనికి మాలిన టెంపుల్టనేనా? ఆ కుళ్ళు గుడ్డుతో ఆ అల్లరి పిల్లాడు అవెరీని బెదరగొట్టి షార్లెట్ ప్రాణం కాపాడిందెవరు? ఈ టెంపుల్టనేనా? అసలు ఈ వేళ పొద్దున్న, నువ్వు చచ్చిపోయినట్టు పడిపోతే అంతా నవ్వుతూ ఉంటే సమయానికి వచ్చి, నీ తోక కొరికి నిన్ను లేపిందెవరు? ఈ టెంపుల్టనేనా? నాకీ వెధవ బట్రోతు పని అంటే ఎంత విసుగ్గా ఉందో ఎప్పుడైనా ఆలోచించావా? నేనేమ నుకుంటున్నావు! ఏ పని అయినా చెప్పగానే చేసి పారేసే ఎలా బట్రోతునా నేను?".

విల్బర్‌కి భయం వేస్తూంది. వాళ్ళంతా వచ్చేస్తున్నారు. ఎలా ఎంత బతిమాలినా వినడంలేదు. టెంపుల్టన్‌కి తిండి అంటే తగని ఇష్టమనే సంగతి అదృష్ట వశాత్తు సమయానికి జ్ఞాపకం వచ్చింది.

"టెంపుల్టన్! ఒట్టు పెట్టుకుని చెపుతున్నాను. నువ్వా పాలట్ గుడ్లసంచీ తెచ్చిఇస్తే లర్వీ నాకు తెచ్చిపెట్టే మేతలో రోజూ నువ్వు కడుపునిండా తిన్న తర్వాత, మిగిలినదే నేను తింటాను. నా తొట్టెలో తెచ్చిపోసే ప్రతి వస్తువులోను నీకు ఇష్టమైనంత నువ్వు తృప్తిగా తినేసేదాకా నేను దాన్ని ముట్టుకోను. సరా?" అంది విల్బర్.

వెల్లకిలా పడుకుని వున్న టెంపుల్టన్ లేచి నిలబడింది. "నిజంగా ఆ మాటమీద నిలబడతావా?" నిగ్గతీసింది.



"దేముడు తోడుగా ప్రమాణంచేసి చెపుతున్నాను."

"అయితే ఖాయం!" అంది ఎలక. అంటూనే గోడదగ్గిరికి వెళ్ళి పైకి పాకడం మొదలు పెట్టింది. కిందటి రాత్రి తిన్న తిండితో ఉబ్బిపోయిన పొట్ట ఇంకా తియ్యలేదు ముక్కుతూ, మూలుగుతూ, సణుగుకుంటూ మెల్లగా పందిరి కప్పుదాకా పాకింది. అక్కణ్ణించి పక్కకి పాకి గుడ్లసంచీ దగ్గిరికి చేరింది పాలట్ పక్కకు తప్పుకుంది.

పాలట్ పని అయిపోతూంది. కొంచెం ఒత్తిగిల్లడానికి మాత్రమే ఆమెలో రవంత ఓపిక మిగిలింది. టెంపుల్టన్ పొడుగ్గా, అసహ్యంగా ఉన్న పళ్ళు బయటపెట్టి ఆ గుడ్లసంచీని పందిరి గడలకు కట్టి ఉంచిన దారాలను కొరికేస్తూంది. కిందనించి విల్బర్ ఆమెవేపే రెప్ప వెయ్యకుండా చూస్తూంది.

"జాగ్రత్త! చాలా జాగ్రత్తగా తియ్యాలి. ఆ గుడ్లల్లో ఒక్క దానికి కూడా దెబ్బ తగలటానికి వీల్లేదు."

"కింద నుంచుని కబుర్లు చెప్పటం కాదు. ఎంత కష్టమో తెలుసా?" అంటూనే టెంపుల్టన్ ఆ దారాలన్నింటినీ కొరికేసి, జాగ్రత్తగా ఆ సంచీని నోట కరుచుకుని కిందికి దిగి వచ్చింది. సంచీని తెచ్చి తన ముందు ఉంచగానే విల్బర్ పెద్ద బరువు దింపి వేసినట్టు నిట్టూర్చింది.

"చాలా సాయంజేశావ్ టెంపుల్టన్! నీ మేలు జన్మలో మరిచిపోను." అంది.

"నీ ఒట్టు నేనూ మరిచి పోనులే!" అంది టెంపుల్టన్, పళ్ళు కొరుక్కుంటూ. "నా పళ్ళన్నీ పెద్ద దారపు చుట్ట నమిలినట్టు అయిపోయినయి. సరేగాని, ఇంక మనం ఇంటికి వెళ్ళిపోతాంగా?"

టెంపుల్టన్ బోనులో దూరి గడ్డిలో దాక్కుంది. సరిగ్గా సమయానికి కనబడకుండా మాయమయింది. అదే క్షణంలో లర్వీ, జాన్ ఆరబుల్, జుకర్మన్ అక్కడికి వచ్చేశారు. వారి వెనకనే ఆరబుల్ సతి, జుకర్మన్ సతి, అవెరీ, ఫెన్ వచ్చారు. ఆ గుడ్లసంచీని ఎల్లా తీసుకుపోవలసినదీ విల్బర్ అప్పటికే నిశ్చయం చేసింది. అసలు ఒక్కటే ఉపాయం ఉంది. ఆ సంచీని జాగ్రత్తగా నోటిలోకి తీసుకుని, నాలిక పైన పెట్టుకుని అల్లాగే పట్టుకుంది. ఆ సంచీ చాలా గట్టిదనీ, వానలో తడిసినా చుక్క నీరు కూడా లోపలికి దిగదనీ పాలట్ చెప్పినమాట

విల్బర్ కి జ్ఞాపకం ఉంది. ఆ సంచీని నాలికమీద పెట్టుకుంటే, నాలిక కొంచెం తిమ్మిరిగా గమ్మత్తుగా ఉండి, నోట నీరూరటం మొదలు పెట్టింది. నోటితో ఏమీ మాట్లాడటానికి వీల్లేదు అప్పుడే తనను బోనులోకి ఎక్కించేస్తున్నారు. షాలట్ వంక చూసి, రెప్పలార్చింది. అదే షాలట్ కి తన కడసారి కృతజ్ఞతాభివందనం. అంతకన్న తానప్పుడు చేయగలిగింది లేదు. తన పిల్లలు భద్రంగా వుంటాయని షాలట్ కి తెలుసు.

"సుఖంగా బతుకు. వెళ్ళిరా!" అంది బలవంతాన ప్రాణమంతా గొంతుకలోకి తెచ్చుకొని, ముందుకాలెత్తి ఊపుతూ అభివాదనం చేసింది.

ఆ పైన షాలట్ ఇక కదలలేదు. మెదల్లేదు. మరునాడు పెద్ద చక్రాన్ని ఊడతీసేస్తూన్నప్పుడు, పందెపు గుర్రాల్ని లారీలలోకి ఎక్కిస్తున్నప్పుడు, వినోదపు ఆటలవాళ్ళు సామాన్లు మూటలు కట్టుకుని తమ బళ్ళమీద వేసుకుని బయలుదేరుతున్నప్పుడు షాలట్ ప్రాణం వదిలింది.

మరి కొంత సేపటికి ఆ తిరునాళ్ళ స్థలమంతా పాడుపడి, నిర్జన స్థలం అయిపోయింది. ఆ పాకలలోగాని, పందిళ్ళలోగాని జనం ఒక్క పిట్ట కనిపించడం లేదు. ఎక్కడ చూసినా పగిలిన సీసాలు, బిరడాలు, చెత్తచెదారం పోగులుపడి ఉన్నాయి. ఆ తిర్నాళ్ళకు వచ్చి జలసా చేసి పోయిన వేలాది జనంలో ఒక్కరికీ ఆ తిరునాళ్ళ అంతటిలో చాలా అద్భుతమైన పాత్ర నిర్వహించింది ఒక చిన్న సాలీడు అని తెలియదు. ఆ సాలీడు చనిపోయేటప్పుడు అక్కడ ఎవ్వరూ లేరు.

22. వసంత వాయువులు

అయింది విల్బర్ మళ్ళీ స్వస్థానానికి ఆ పశువుల దొడ్లోకి తనకు ప్రియమైన పెంటదిబ్బ మీదికి చేరుకుంది. ఈ ఘన రాగమనంలో చాలా విశేషం వుంది విల్బర్ మెడలో ఇప్పటికి గొప్ప గౌరవ చిహ్నం కట్టి ఉంది. నోట్లో ఒక సాలీడు గుడ్ల సంచీ ఉంది. 'స్వస్థలం లాంటి చోటు ఎక్కడా ఉండదు' అనుకుంది విల్బర్, షాలట్ కి పుట్టిన 514 పిల్లలను భద్రంగా ఒక మూల, ప్రమాదంలేని చోట ఉంచుతూ. పశువులదొడ్లో మంచి వాసనలు వస్తున్నయి. స్నేహితులయిన గొర్రెలు, బాతులు పోటీలో గెలుపొందివిల్బర్ తిరిగి వచ్చినందుకు చాలా సంతోషించినయి.

పిల్ల బాతులు పెద్ద పెట్టున అల్లరిచేస్తూ, విల్బర్ కి అఖండమైన స్వాగత మిచ్చినయి.

"స-స-స-సంతోషం!" అనీ, "బ-బ-బ-భలే! వ్-వ్-వ్-విల్బర్!" అనీ బృందగానం చేస్తూ గంతులేసినయి.

విల్బర్ మెడలోని పతకం నిప్పి, చూడవచ్చే వారం దరికీ కనిపించేటట్టు జుకర్మన్ ఆ పందిదొడ్డి గోడమీద ఒక మేకుకి తగిలించాడు. విల్బర్ కూడా కావాలనుకున్నప్పుడల్లా దాన్ని చూసుకోవచ్చు.

ఆ పైన విల్బర్ కి రోజులు సుఖంగా గడచి పోతున్నయి. విల్బర్ ఎత్తుగా, బొద్దుగా ఎదిగింది. తనని చంపివేస్తారన్న భయం ఇప్పుడు లేదు. ఇక తాను బతికినంత కాలం జుకర్మన్ తనను హాయిగా పోషిస్తాడని విల్బర్ కి తెలుసు. షాలట్ తరచు జ్ఞాపకం వస్తూంది విల్బర్ కి. శిథిలమైపోయిన ఆమె గూడు తాలూకు కొన్ని

దారాలు ఇంకా ఆ ద్వారబంధం మూల వేళ్ళాడు తున్నాయి. రోజూ ఎప్పుడో ఒకప్పుడు చినిగిపోయిన ఆ సాలెగూణ్ణి అలాగే నిలబడి చూస్తూ ఉండిపోయేది విల్బర్. అలాంటప్పుడు గొంతులో ఏదో ఉండపెట్టి నట్టుండేది. అంత ప్రేమగల, అంత నమ్మకమైన, అంత తెలివితేటలు గల స్నేహితురాలు ప్రపంచంలో ఎక్కడా, ఎవరికీ దొరకదు!

క్రమంగా పగటిపొద్దు కురుచ అవుతూంది. లర్వీ తోటలోనుంచి గుమ్మిడి కాయలు, పందిరి దోసకాయలు కోసుకొచ్చి, పశువుల కొట్టులో నేలమీద ఒక మూలగా పేర్చాడు. ఆపుల్ చెట్లకు రంగులు మారిపోతున్నాయి. గాలికి కొమ్మలు కదిలినప్పుడల్లా ఆకులు కుప్పలు తెప్పలుగా రాలిపోతున్నాయి. బీడులో ఉన్న అడవి ఆపిల్ చెట్ల కింద ఎర్రటి చిన్న పళ్ళు ఎప్పుడు చూసినా ఒత్తుగా రాలిపడి ఉంటున్నాయి. వచ్చే పోయేటప్పుడు గొర్రెలు, బాతులు వాటిని కొరుకుతున్నాయి. రాత్రిపూట నక్కలు వచ్చి వాటిని వాసన చూస్తున్నాయి. క్రిస్మస్ పండగకి ముందు ఒక రోజున మంచు కరుళ్ళు కరుళ్ళుగా కురవటం మొదలు పెట్టింది. అల్లా మంచు కురవటం విల్బర్ ఎన్నడూ చూడలేదు. తెల్లవారగానే లేచి, తన ఆవరణలో పేరుకున్న తెల్లని మంచుని ముట్టెతో కుళ్ళగించటం మొదలు పెట్టింది. అదో తమాషాగా, సరదాగా ఉంది. అలాంటి మంచు మీద జారిపోయే బండీని ఈడ్చుకుంటూ ఫెర్నా, అవెరీ వచ్చారు. సందులోనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి, మంచుతో తెల్లగా నున్నగా ఉన్న మైదానంలోకి పోయారు.

"ఈ మంచులో ఆడటమే నాకు అన్నిటికన్న సరదాగా, తమాషాగా ఉంటుంది." అవెరీ అన్నాడు.

"అన్నింటికంటె తమాషాగా, సరదాగా ఎప్పుడుంటుందో చెప్పనా? తిర్నాళ్ళలో ఆ పెద్ద చక్రంమీద పై ఉయ్యాల్లో హెన్రీ

పక్కన కూచుని ఉన్నప్పుడు, హెన్రీ ఆ ఉయ్యాలని ఊపినప్పుడు, ఎంతో దూరం కొన్ని మైళ్ళ దూరందాకా మనకు కనపడుతున్నప్పుడు అల్లా ఉంటుంది. అంత సరదాగా ఏదీ ఉండదు తెలుసా?" అంది ఫెన్.

"ఏడిసినట్టే ఉంది! నువ్వింకా ఆ తిర్నాళ్ళ చక్రం సంగతే ఆలోచిస్తున్నా వన్నమాట. అప్పుడే ఎన్నో వారాలు అయిపోయినా, ఇంకా నీకు అదే గొడవ!" అవెరీ విసుగ్గా అన్నాడు.

"బానా! నిజమే! ఎప్పుడూ అదే ఆలోచిస్తాను. ఏం తప్పా?" అంది ఫెన్ తన చెవిమీద పడిన మంచు తుడిచివేసుకుంటూ.

క్రిస్మస్ పండుగ వెళ్ళిన తరువాత ధర్మామీటర్‌లో పాదరసం సున్నాదాకా తిరిగిపోయింది. చలి విపరీత మయిపోయింది. గడ్డి బీడంతా దట్టంగా మంచుకురిసి తెల్లని పరుపు పరచినట్టుంది. ఆవులన్నీ ఇప్పుడు ఇంచుమించు పగలూ, రాత్రీ కూడా పాకలోనే ఉంటున్నాయి. ఎండ బాగా కాస్తున్న రోజున ఎప్పుడో కాసేపు మాత్రం బయటికి వచ్చి గడ్డిమేటి దగ్గర మేస్తూ ఉంటయి. గొర్రెలు కూడా పశువులకొట్టు గోడపక్కకి వచ్చి నిలబడుతున్నయి. దాహంవేసినప్పుడల్లా నేలమీది పిండి మంచు ఇంత తినేస్తున్నయి. బాతు లెప్పుడూ పశువుల కొట్టును వదలిపెట్టి పోవటంలేదు. జుకర్మన్ బాబాయి, స్వయంగా పనికట్టుకుని గింజలూ గట్రా తీసుకొచ్చి వాటిని మేపుతున్నాడు. "బ బ భ భలే! భలే! భలే!" అని గోలగా అరుస్తూ అవి ఆ గింజలు తింటూంటాయి.

టెంపుల్టన్ శీతకాలంలో ఎప్పుడూ ఇంటిలోపలేగాని, బయటికి రావటం మామూలులేదు. విల్బర్ తొట్టె కిందవున్న దాని కన్నంలో ఇప్పుడు మంచుతో చచ్చేటంత చలిగా ఉంటోంది. అందుచేత ఇప్పుడు

పశువులకొట్లో ధాన్యంబస్తాల పక్కగా తవ్వుకున్న కన్నం తన శీత కాలపు మకాంగా చేసుకుంది. ఆ కన్నంలో కూడా వెచ్చగా ఉండటానికి దాని చుట్టూ ఇన్ని పాత పత్రికల ముక్కలు, గుడ్డ పీలికలు తీసుకొచ్చి కుక్కింది. ఎక్కడే చిన్న వస్తువు కనిపించినా తెచ్చి జాగ్రత్తగా దాంట్లో దాస్తుంది. రోజుకి మూడుసార్లు మాత్రం విల్బర్ దగ్గిరికి తప్పకుండా వెళుతుంది. ఆ మూడుసార్లూ సరీగ్గా లర్వీ విల్బర్ కి



మేత పెట్టే వేళలు. విల్బర్ తన వాగ్దానం ప్రకారం ముందుగా టెంపుల్టన్ నే కడుపునిండా తిననిస్తూంది. టెంపుల్టన్ గొంతులో ఇంక ఒక్క మెతుక్కి కూడా సందు లేకుండా పోయిన తర్వాత, మిగిలిందే విల్బర్ తింటూంది. అమితమైన తిండితో ఆ ఎలక తెగబలిసి, పంది కొక్కంత అయింది.

సాలీళ్ళు కూడా బయటికి పాకి వస్తూ, అలాగే తనకు నమస్కారం చేసినయి. ఆ మూసూ ఆ సంచీ చుట్టూ తిరుగుతూ తమ నూతన ప్రపంచాన్వేషణ ప్రారంభించాయి. తరువాత మరి మూడు చిట్టి సాలీళ్ళు, ఆపైన ఎనిమిది, తరువాత పది, క్రమంగా షాలట్ సంతానమంతా గుడ్లలోనుంచి బయటికి వచ్చేసింది.

విల్బర్ సంతోషానికి అంతులేదు. ఆనందం పట్టలేక అరవటం మొదలు పెట్టింది గిరగిర తిరుగుతూ, ఆ పెంట కుప్పమీద మట్టిని ముట్టెతో కుళ్ళగించి గాలిలోకి చిమ్ముతూ నానా హంగామా చేసింది. గాలిలోకి ఎగిరి వెనక్కి పిల్లిమంత్రం వేసింది. మళ్ళీ వచ్చి షాలట్ సంతానం ముందు మోకాటి తండా వేసి కూచుంది.

"రండమ్మా, రండి!" అంది.

మొదట బైటికివచ్చిన సాలీడు-"ఎవరండీ మీరు? నమస్కారం!" అంది. కాని దాని కంఠస్వరం మరీ సన్నగా ఉండటంవల్ల విల్బర్ కి సరిగ్గా వినిపించలేదు.

"నేనా? నేను మీ అమ్మ షాలట్ స్నేహితుణ్ణి. మీరంతా బయటికి వచ్చినందుకు చాలా సంతోషం. మీరంతా కులాసాగా వున్నారా అమ్మా? అన్నీ సరిగ్గా వున్నయ్యా?" అంది.

ఆ చిట్టి సాలీళ్ళన్నీ ముందుకాళ్ళు ఊపుతూ విల్బర్ కి నమస్కరించినయి. తనను చూసి అవన్నీ కూడా చాలా సంతోషిస్తున్నట్టు వాటి కదలికలను బట్టి విల్బర్ గ్రహించింది.

"మీకు ఏం కావాలి? నేను మీకు చేయవలసిన సాయంపమైనా ఉంటే చెప్పండి!"

ఆ చిట్టిసాలీళ్ళు ఏమీ అక్కరలేదన్నట్టు ముందువేపు కుడికాళ్ళు అడ్డంగా ఊపినయి. కొన్ని రోజులపాటు, కొన్ని రాత్రులపాటు అవన్నీ అక్కడే అటూ ఇటూ, పైకీ, కిందికీ పాకుతూ, మధ్య మధ్య

విల్బర్‌ని చూసి సంతోషంగా కాళ్ళూపుతూ, తమ వెనుక సన్నని దారాలు వదులుతూ, గృహనిర్మాణానికి స్థలాలు వెతుక్కుంటూ ఉండిపోయినయి. డజన్లు, డజన్లుగా, కుప్పలు తెప్పలుగా కదులుతూన్న ఆ పిల్ల సాలీళ్ళను లెక్క పెట్టటం అసంభవం అనుకుంది విల్బర్. కాని, తనకి వందల కొలది చిట్టి స్నేహితులు అమరి వందుకు మాత్రం అమితంగా ఆనందిస్తూంది ఆ సాలీళ్ళన్నీ గబగబా ఎదిగి పోయినయి. ఎదిగి ధనియపు గింజలంతేసి అయినయి. అక్కడే ఆ గుడ్లసంచీ చుట్టూ చిన్న చిన్న గూళ్ళు అల్లటం ప్రారంభించినయి.

ఒక రోజున పొద్దున జుకర్మన్ వచ్చి ఆ ధాన్యపు కొట్టుకి ఉత్తరపు వేపున ఉన్న ఒక తలుపు తీశాడు. దాంతో ఆ ద్వారంలోనుంచి వెచ్చని గాలి రంయి మంటూ వీచటం మొదలు పెట్టింది. ఆ గాలితో పాటు తడినేల సుగంధం, సరుగుతోటలలో వాసనలూ, ఇతర వసంత ఋతు పరిమళాలూ గప్పున కొట్టు కొచ్చినయి. ఈగాలి చిట్టి సాలీళ్లకి ఎంతో సంతోషం కలిగించింది. ఒక సాలీడు కంచెలో అడ్డంగా ఉన్న కర్రమీద కెక్కింది.

ఆ పైన - విల్బర్‌కి అమితాశ్చర్యం కలిగించిన ఒక చిత్రం జరిగింది. ఆ సాలీడు తలకిందులుగా నిలబడి వెనక నించి దారాలు వదలడం మొదలు పెట్టింది. ఆ దారాలు గాలిలో పైకి ఎగురుతున్నయి. విల్బర్ చూస్తూ ఉండగానే ఆ దారాల గుమ్మటంతోపాటు ఆ చిట్టి సాలీడు గాలిలో ఎగిరి పోతూంది.

పోతూ పోతూ, "మరి నాకు సెలవు! నమస్కారం!" అంది విల్బర్ వంక చూసి, ముందుకా లాడిస్తూ.

"ఆగాగు! ఎక్కడికల్లా వెళ్ళిపోతున్నావ్?" విల్బర్ ఆదుర్దాగా ప్రశ్నించింది.

కాని, అప్పటికే ఆ సాలీడు రంయ్యిమని వీస్తూన్న గాలిలో కనుచూపు మేర దాటి పోయింది. తర్వాత, అల్లాగే ఇంకో సాలీడు ఆ పెట్టెమీద కెక్కింది. తలకిందులుగా నిలబడి దారాల గుమ్మటం తయారు చేసుకుని ఎగిరిపోయింది. అల్లాగే ఇంకోటి, ఇంకోటి... గాలిలో ఎక్కడ చూసినా ఈ సాలీళ్ళ గాలి గుమ్మటాలే కనిపిస్తున్నాయి.



విల్బర్ కి ఏమీ తోచలేదు. షాలట్ పిల్లలంతా వెళ్ళిపోతున్నారు.

"రండమ్మా! వెళ్ళకండి!" అని అరిచింది.

"సెలవు! నమస్కారం! సెలవు! నమస్కారం!" అని సన్నగా తీగ గొంతులతో అరుస్తూ ఆ పిల్ల సాలీళ్ళు ఎగిరిపోతూనే ఉన్నాయి.

చివరికి ఒక చిన్న సాలీడు మాత్రం కొంచెం నిదానించి, విల్బర్ తో మాట్లాడింది. "ఈ వెచ్చని గాలిలోనే మేం వెళ్ళిపోవాలి.

గాలి గుమ్మటాల్తో ప్రయాణం చెయ్యటం మా కందరికీ తెలుసు. మేం ప్రపంచంలోకి ఎగిరిపోయి గూళ్ళు కట్టుకోటానికి మంచి చోట్లు వెతుక్కుంటానికి ఇదే మంచి సమయం. అంచేత వెళ్ళిపోతున్నాం."

"ఎక్కడికని ఎగిరిపోతా రల్లాగ?" విల్బర్ అడిగింది.

"ఈ గాలి ఎక్కడికి తీసుకుపోతే అక్కడికి. కొందరం బాగా దూరం వెళ్ళొచ్చు. కొందరం ఇక్కడే దగ్గర్లో ఎక్కడో ఆగిపోవచ్చు. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం - ఎక్కడైనా పోగలం!" అంది ఆ చిట్టి సాలీడు.

"అంతా వెళ్ళిపోతున్నారా? అందర్నీ వెళ్ళిపోనివ్వను. నన్ను ఒంటరిగా వదిలేసి అంతా వెళ్ళిపోవటానికి నే నొప్పుకోను. మీరంతా ఇలా నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోవటం మీ అమ్మకు ఎంత మాత్రం ఇష్టం ఉండదు తెలుసా?"

గాలిలో చుట్టూ ఎక్కడ చూసినా దారాల గుమ్మటాలే! పొగ మంచు కురుస్తున్నట్టు కనిపిస్తూంది. డజన్లకొద్దీ దారాల బెలూనులు పైకి లేస్తున్నయి. గాలిలో గిరగిర తిరుగుతూ గాలి వాలున దూర దూరంగా ఎగిరి పోతున్నయి. "సెలవు! సెలవు! సెలవు!" అంటూన్న సన్నని గొంతులు మాత్రం విల్బర్ కి ఎడతెగకుండా వినిపిస్తున్నయి. విల్బర్ ఇక ఆ దృశ్యం చూడలేకపోయింది. విచారంతో నేలకు వాలిపోయి కళ్ళుమూసుకుంది. షార్లట్ పిల్లలంతా తనను విడిచిపెట్టి వెళ్ళిపోవటం, తనపాలిటి మహా ప్రళయంలాగ ఉంది విల్బర్ కి దాంతో, వెక్కి వెక్కి ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

నిద్ర లేచేసరికి సాయంకాలం పొద్దు బాగా వాటారిపోయింది. లేచి, గుడ్లసంచీ వంక చూసింది. ఖాళీగా ఉంది. గాలిలోకి చూసింది. గుమ్మటాలన్నీ మాయమయినయి. మత్తుగా ద్వారబంధం వేపు నడి

చింది. షాలట్‌ను గురించే ఆలోచిస్తూ అక్కడ నిలబడి ఉండగా ఏదో సన్నని కంఠస్వరం వినిపించింది.

"నమస్కారం! నే నిక్కడే ఉన్నాను!" అంటున్నారెవరో.

"నేనూ ఇక్కడే వున్నాను." అలాంటిదే ఇంకో కంఠం.

"నేను ఈ మూల వున్నాను." మూడో కంఠం.



"మేము ముగ్గురం ఇక్కడే వున్నాం. ఈ స్థలం మాకు చాలా వచ్చింది. నువ్వంటే కూడా మాకు ఎంతో ఇష్టం." మూడు కంఠాలూ కలిసి అన్నాయి.

విల్బర్ పైకి చూసింది. ఆ ద్వారబంధం పైన ఆ మూల ఒకటి, ఈ మూల ఒకటి, మధ్యగా ఒకటి-మూడు చిన్న చిన్న సాలెగూళ్ళు

తయారవుతున్నయి. ఒక్కొక్క దానిలో పాంలట్ పిల్లలలో ఒక్కొక్కతె చకచకా అల్లకం పని సాగిస్తూంది.

"అంటే - మీరు ముగ్గురూ ఇక్కడే నాదగ్గిరే ఉండిపోవటానికి నిశ్చయించుకున్నారన్న మాటేగా! మీ ముగ్గురు చిట్టి స్నేహితులూ ఇక్కడ నాకు మిగిలారన్న మాటేగా?" విల్బర్ అడిగింది.

"ఔను, అన్నమాటే!" అన్నాయి సాలీళ్ళు మూడూ.

"మీ ముగ్గురి పేర్లూ ఏమిటమ్మా చెప్పండి!" విల్బర్ సంతోషంతో వణికిపోతూ అడిగింది.

"నువ్వల్లా ఎందుకువణుకుతునన్నావో ముందరచెప్పు! తర్వాత నా పేరు చెపుతాను." అంది ఒక సాలీడు.

"సంతోషంగా... బాగా సంతోషంగా వున్నప్పుడు నాకిలాగే వణుకు వస్తుంది." అంది విల్బర్.

"అయితే, నా పేరేమిటో తెలుసా? సంతోషం." "మా అమ్మ పేరులో మధ్య పొడి అక్షరం ఏమిటో చెబుతావా?" మధ్య సాలీడు అడిగింది.

"'ఎ' అని జ్ఞాపకం." అంది విల్బర్.

"అయితే నా పేరు 'ఎరేనియం' "- అంది సాలీడు.

"మరి నా పేరో?" మూడో సాలీడు అడిగింది. "నాకు నువ్వే ఏదైనా మంచి పేరు చూసి పెట్టు. అట్టే పొడుగ్గా లేకుండా, తేలిగ్గా, నాజూగ్గా వుండే పేరేదైనా పెట్టు!"

విల్బర్ గట్టిగా ఆలోచించి, "నెల్లీ" అంది.

"బాగుంది. ఆ పేరు నాకు ఎంతో సరదాగా ఉంది. నువ్వు నన్ను 'నెల్లీ!' అనే పిలు." సంతోషంగా గబగబా చుట్టూ దారం అల్లుతూ అంది మూడో సాలీడు.

విల్బర్ హృదయంలో ఆనందం పొంగి పొర్లిపోతూంది. అతి
నైన ఈ సందర్భంలో తానొక చిన్న ఉపన్యాసం చెయ్యడం
అని భావించి, ఇలా మొదలు పెట్టింది:

యమైన సంతోషం! ప్రియమైన ఎరేనియా! ప్రియమైన
వుల దొడ్డిలో అందరి తరఫునా మీ ముగ్గురికీ హృదయ
ఐన స్వాగతం! మీరు ముగ్గురూ గూళ్ళు అల్లుకోటానికి అతి
పవిత్రమైన, ప్రసిద్ధమైన చోటు ఎంచుకున్నారు. మీ తల్లికీ, నాకూ
ప్రాణ స్నేహమనీ, ఆమె నా ప్రాణాన్ని కాపాడినదనీ మీకు తెలియ
పరచటం నా ధర్మం అనుకుంటాను. మీ తల్లి ఎంతో తెలివైనది.
ఎంతో అందమైనది. పాపం! చిట్టచివరి వరకూ నాకోసం ఎంతో శ్రమ
పడింది మీ అమ్మ. ఆమెను నేను జన్మలో మరచిపోలేను. ఆమె పిల్లల
యిన మీకోసం నేను ఏమి చేయవలసి వచ్చినా చేస్తాను. నేను మీకు
శాశ్వతమైన స్నేహితుణ్ణి!"

"నేనూ నీతో శాశ్వతంగా స్నేహంగా ఉంటాను". అంది
సంతోషం.

"నేనూ అంతే!" అంది ఎరేనియా.

"నేను కూడా!" అంది, అప్పుడే తన గూడులో ఒక చిన్న
ఈగను పట్టుకున్న నెల్లీ.

విల్బర్ జీవితంలో అది అత్యంతానందకరమైన దినం. అలాంటి
ఆనందకరమైన, ప్రశాంతమైన దినాలు ఆ పైన చాలా వస్తున్నయి.

అలాగే క్రమంగా నెలలు, సంవత్సరాలు గడుస్తున్నయి.
విల్బర్‌కి స్నేహితుల లోపం లేదు. ఫెన్ మాత్రం ఇప్పుడు రోజూ
అక్కడికి రావటం మానేసింది. పెద్దదవుతూ ఉండటంవల్ల చిన్నతనపు
ఆటలు, సరదాలు తగ్గించేసుకోవలసి వచ్చింది. ఆ పందిదొడ్డి పక్కన
పాత పాలపీట మీద కూచుని గంటల కొద్దిసేపు ఆలోచించటానికి

ఆమెకిప్పుడు తీరుబడిలేదు. షాలట్ కూతుళ్ళూ, మనమరాళ్ళు
మనమరాళ్ళూ మాత్రం ఏటేట ఆ ద్వారబంధంపైన గూ
అల్లుతూనేఉన్నాయి. ప్రతి వసంతఋతువులోనూ అక్కడ
పుడుతున్నాయి. గతించి పోయిన సాలీళ్ళ స్థానం ఆ
పుట్టిన వాట్లో చాలా భాగం దూర ప్రాంతాలకు ఎగి
రెండో, మూడో మాత్రం అక్కడే ఆగిపోయి, ఆ
పైన గూళ్ళు కట్టుకొని ఉంటున్నాయి.

శ్రీ జుకర్మన్ ఆపైన విల్బర్‌ని జీవితం పొడుగునా ఎంతో ప్రేమతో చూసేవాడు. ఆయన స్నేహితులూ, సరదాగల వాళ్ళూ, అడపా దడపా వచ్చి విల్బర్‌ని చూసిపోతూ ఉండేవాళ్ళు. విల్బర్ విజయం పొందిన ఏడాది జరిగిన అద్భుత సంఘటనలు, ఆ సాలెగూడు మీద కనిపించిన సందేశాలు ఎవ్వరూ మరిచిపోలేరు. ఆ పశువులదొడ్లో రాత్రులు, పగళ్ళు, వేసవులు, శీతకాలాలు, వసంతఋతువులు, శరదృతువులు అన్నీ సుఖంగా గడిచిపోతున్నాయి. నిశ్చింతగా బతకటానికి ఇంత హాయి అయిన చోటు మరోటిలేదు అనుకునేది విల్బర్. వెచ్చని ఈ పాక, ఎప్పుడూ సరదాగా, సందడిగా తిరిగే ఈ బాతులు, బాగా మారిపోయే ఋతువులు, వెచ్చని ఎండ, పిచ్చికల గుంపులు, ఎలకలకు కన్నాలు, ఒకేరకమైన పెద్ద గొర్రెల మంద, స్నేహమంటే పడిచచ్చే సాలీళ్ళు, పెంట పరిమళం... అంతా అమితానందంగా ఉంటూంది,

షాలట్‌ని మాత్రం మరిచిపోలేదు విల్బర్. ఆమె పిల్లలను, మనుమరాళ్ళను ఎంతగా ప్రేమించినా, విల్బర్ హృదయంలో షాలట్ సంపాదించుకున్న ప్రియతమమైన స్థానం మరెవరికీ లభ్యం; కాలేదు. షాలట్‌కి సాటిలేదు. నిజమైన స్నేహితులు దొరకటం కష్టం' గొప్ప రాతలు రాయగల మహా ప్రతిభావంతుల స్నేహం దొరకటం మరీ కష్టం! షాలట్‌లో ఈ రెండూ ఉన్నాయి!

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక	
పుస్తకం సంఖ్య	TPLA127B189
పుస్తకం పేరు	సాలీడు సందేశం
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	207
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	1,2,197,198
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Bannu
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	haseema
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good